
'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల : ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 326

శుక్రవారం 16-2-2018

ఫ్యామిలీలో...

నేను శక్తి సాక్షి

పవరు హత్య

పరువు హత్యల గురించి విన్నాం.
ఈ 'పవరు హత్య' ఏంటి?!
పెళ్లిలో ఎంపిక చేసుకుంటారు.
అక్కడ పరువు హత్యలు జరుగుతున్నాయి.
పవర్‌లో ఎన్నుకుంటారు. అక్కడ పవర్ హత్యలు జరుగుతున్నాయి.
ఒక దళిత మహిళా సర్పంచ్ పవర్‌పై జరిగిన హత్య ఇది. చట్టం కూడా చూస్తూ కూర్చున్న కథ ఇది!

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ప్రత్యేక హోదా ఎందుకు రాదో చూద్దాం..

కలసిరండి బాబూ!

మాతో పాటు మీ పార్టీ ఎంపీలతో కూడా రాజీనామా చేయించండి

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పిలుపు

- ప్యాకేజీ అడగడం మాని హోదా పోరాటంలో కలసి రండి
- కేంద్రం ఎలా ఇవ్వదో చూద్దాం.. హోదాయే ఏపీ ఊపిరి
- రాష్ట్రానికి పరిశ్రమలు, యువతకు ఉద్యోగాలు వస్తాయి
- హోదా సాధించేవరకు మా పోరాటం ఆగదు
- మహిళల ఆత్మీయ సమ్మేళనంలో ప్రతిపక్షనేత స్పష్టీకరణ

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి:

ఎంపీల రాజీనామాల నిర్ణయంతో ప్రత్యేక హోదా ఉద్యమాన్ని మరో దశకు తీసుకువెళ్లిన వైఎస్సార్‌సీపీ అధినేత, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారంనాడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మరో సంచలన సవాల్ విసిరారు. 'మా ఎంపీలు రాజీనామా చేస్తున్నారు వారితోపాటు మీ ఎంపీల చేత కూడా రాజీనామా చేయించండి' అని పిలుపునిచ్చారు. ఐదుకోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్ష అయిన ప్రత్యేక హోదా కోసం వైఎస్ జగన్ మొదటి నుంచీ అనేక రూపాలలో పోరాడుతున్న సంగతి తెల్సిందే. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ప్రజా సంకల్ప పాదయాత్రలో ఉన్న జగన్ గురువారం ఉదయగిరి నియోజకవర్గంలోని రేణమాల గ్రామంలో జరిగిన మహిళల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఒక విద్యార్థిని అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ జగన్ పై విధంగా పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా సాధన కోసం కృషి చేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతో కలసి నడిచేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందా? అని ప్రశ్నించారు. ప్రత్యేకహోదా ఆంధ్రప్రదేశ్‌కు ఊపిరి వంటిదని, దానిని సాధించే వరకు తమ పోరాటం ఆగదని జగన్ స్పష్టం చేశారు.

రాజీనామాలు చేద్దాం రండి..

'చంద్రబాబు గారూ, మిమ్మల్ని ఒక్కటే అడుగుతున్నా. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో పాటు తెలుగుదేశం

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రమంతటా టీడీపీ నేతల దాష్టీకాలే

- మహిళలకు భద్రత లేకుండా పోయింది
- మనందరి ప్రభుత్వం రాగానే అన్నివిధాలా ఆదుకుంటాం
- ఉదయగిరి నియోజకవర్గం రేణమాలలో జరిగిన మహిళల ఆత్మీయ సమ్మేళనంలో ప్రతిపక్ష నేత జగన్

6 లో

టీడీపీలో గందరగోళం!

- ఆత్మరక్షణలో పడిపోయి.. తత్తరపాటుతో లీకులు...
- మార్చి 5న టీడీపీ కేంద్రమంత్రులు రాజీనామా చేస్తారన్న మంత్రి ఆది
- గంట తిరగకుండానే యూటర్న్
- అది తన వ్యక్తిగత అభిప్రాయమని వివరణ




సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా సాధించడానికి తమ పార్టీ ఎంపీలతో పాటు టీడీపీ ఎంపీలు కూడా రాజీనామా చేయడానికి ముందుకు రావాలని ప్రతిపక్ష నేత జగన్‌మోహనరెడ్డి చేసిన సవాల్ అధికార తెలుగుదేశం పార్టీని మరింత ఆత్మరక్షణలో పడేసింది. పార్టీలో తీవ్ర గందరగోళాన్ని సృష్టించింది. టీడీపీ ఎంపీలు కూడా రాజీనామా చేస్తే ప్రత్యేక హోదా ఎందుకు రాదో చూద్దామని, ఇందుకు చంద్రబాబు ముందుకు రావాలని ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి సవాల్ విసిరారు. దీంతో తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం


మిగతా 2వ పేజీలో ▶

లీకుల్లో కూడా ప్యాకేజీపై మోజు

- ప్రత్యేక హోదా ప్రస్తావన లేకుండా లీకులు
- హోదా ఆకాంక్షను నీరుగార్చే ప్రయత్నం
- చంద్రబాబు తీరుపై విమర్శల వెల్లువ

2 లో

పవన్ మనోడే..



- టీడీపీ నేతలతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- జాగ్రత్తగా మాట్లాడండి.. విమర్శలు చేయొద్దు
- జేఎఫ్‌సీ వల్ల ఇబ్బంది లేదు
- నేను కేంద్రానికి భయపడడం లేదు... కేసులంటే లెక్కలేదు
- కేంద్రంతో గొడవలు పెట్టుకునే ఆలోచన లేదు
- ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయండి
- త్వరలో కీలక నిర్ణయాలు

18 లో

దీక్షగా 'ఆయుష్మాన్ భారత్'

ప్రధాని మోదీ - 5లో



5,100 కోట్ల ఆస్తుల స్వాధీనం

'నీరవ్ మోదీ' ఘరానా మోసం కేసులో ఈడీ కొరడా

వజ్రాభరణాల వ్యాపారి నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంకుతో పాటు ఇతర బ్యాంకుల్ని రూ. 11,400 కోట్ల మేర మోసగించిన కేసులో దర్యాప్తును సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లు ముమ్మరం చేశాయి. భారతదేశ చరిత్రలో అతి పెద్ద బ్యాంకు కుంభకోణంగా పేర్కొంటున్న ఈ కేసులో నీరవ్ మోదీకి చెందిన దుకాణాలు, ఇళ్లు, కార్యాలయాలపై గురువారం ఈడీ దాడులు నిర్వహించి రూ. 5,100 కోట్ల విలువైన వజ్రాలు, ఆభరణాలు, బంగారాన్ని సీజ్ చేసింది.

5 లో

బేరానికి బెజవాడ రైల్వే స్టేషన్

రీ డెవలప్‌మెంట్‌కు రైల్వేశాఖ నిర్ణయం



- 45 ఏళ్ల లీజుకు గత ఏడాది స్విస్ ఛాలెంజ్ విధానంలో టెండర్లు
- 99 ఏళ్ల పాటు లీజు గడువు పెంచాలన్న బిడ్డర్లు
- లీజు ప్రతిపాదనలు సవరించాలని రైల్వే బోర్డుకు నివేదిక
- లీజు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

18 లో



అమెరికాలో

కాల్పుల మోత

17 మంది విద్యార్థులను కాల్చి చంపిన ఉన్మాది

ఫ్లోరిడాలోని హైస్కూల్‌లో ఘాతుకం

- వివరాలు 5లో

బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు కట్టుబడి ఉన్నారా?

ఆరు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ప్రశ్న



- మార్చి 31లోగా అఫిడవిట్ దాఖలుకు ఆదేశం
- పోలవరం ప్రాజెక్టుపై ఒడిశా ప్రభుత్వం పిటిషన్
- ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నారని ఆక్షేపణ
- తదుపరి విచారణ ఏప్రిల్ 17కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: జస్టిస్ ఆర్.ఎస్.బచావత్ నేతృత్వంలోని గోదావరి నదీ జలాల వివాద పరిష్కార ట్రిబ్యునల్ 1980లో జారీ చేసిన అవార్డుకు కట్టుబడి ఉన్నారా? లేదా? అనే దానిపై ఆరు రాష్ట్రాలు అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, ట్రిబ్యునల్ అవార్డులో ఉన్న ఒప్పందాల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపిస్తూ ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టులో 2007లో ఒరిజినల్ సూట్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్

మిగతా 16వ పేజీలో ▶

తేలకుండానే ముగిసింది

- జల వివాదాలపై తెలుగు రాష్ట్రాలతో కేంద్రం చర్చలు విఫలం
- కృష్ణా బోర్డు పరిధిని నిర్ణయించడంపై కుదరని ఏకాభిప్రాయం

16 లో

@ysjagan

ప్రత్యేక హోదా కోసం రాష్ట్ర ఎంపీలందరూ రాజీనామా చేయాలి

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ట్వీట్



సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా సాధన కోసం రాష్ట్ర ఎంపీలందరూ తప్పనిసరిగా రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ట్వీటర్‌లో ట్వీట్ చేశారు. 'స్వలాభాపేక్ష ఉండాల్సిన సమయం కాదు ఇది. రాష్ట్ర అభ్యున్నతి కోసం అందరూ గట్టిగా నిలబడాలి. మన హక్కు అయిన ప్రత్యేక హోదా కోసం రాష్ట్రానికి చెందిన ప్రతి ఎంపీ రాజీనామా చేయాలి. చంద్రబాబూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలా మీ ఎంపీలతో కూడా రాజీనామా చేయిస్తారా? లేక ఎప్పటిలాగానే ప్రత్యేక ప్యాకేజీ పేరుతో రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడతారా?' అని వైఎస్ జగన్ ప్రశ్నించారు.

YS Jagan Mohan Reddy
@ysjagan

Now is not the time to be partisan, but to take a stand & put Andhra Pradesh first. To secure our rightful demand of SCS, every MP from AP must resign. @ncbn follow YSRCP's lead & make your MPs resign! Or will you continue to sell AP's interest for a so-called 'special package'?

లీకుల్లో కూడా ప్యాకేజీపై మోజు

చంద్రబాబు తీరుపై విమర్శల వెల్లువ • ప్రత్యేక హోదా ప్రస్తావన లేకుండా లీకులు

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదాపై రాష్ట్రమంతా చర్చ జరుగుతోంది. సంజీవని వంటి హోదాకు పాతరేసి ప్యాకేజీ ముసుగులో జరుగుతున్న అన్యాయంపై యువతలో ఆవేశం కట్టలు తెంచుకుంటోంది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు తమ స్వార్థ ప్రయోజనాల కోసం హోదాను ఫణంగా పెట్టడంపై ఆగ్రహ జ్వాలలు రగులుతున్నాయి. ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్‌సీపీ అధినేత, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ ఎంపీలు తమ పదవులను కూడా తృణ ప్రాయంగా త్యజించడానికి సంసిద్ధమయ్యారు. ఇంత జరుగుతున్నా తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు మాత్రం ప్రత్యేక ప్యాకేజీపై మమకారాన్ని వదులుకోవడం లేదు. ఐదు కోట్లమంది ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక హోదా కోసం జరుగుతున్న పోరాటానికి మద్దతునివ్వాల్సింది పోయి ఆ పోరాటాన్ని నీరుగార్చేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని అధికార పార్టీ నుంచి వస్తున్న లీకు వార్తలు రుజువు చేస్తున్నాయి. లీకుల్లో కూడా ప్యాకేజీపై మోజును వదులుకోవడం లేదని అర్థమౌతున్నదని విశ్లేషకులంటున్నారు. ప్రత్యేక హోదా కోసం రాష్ట్రమంతా రగిలిపోతున్న నేపథ్యంలో పార్టీ ముఖ్యులతో సుదీర్ఘంగా సమన్వయ కమిటీ సమావేశాలు జరుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ సమావేశాల తర్వాత ఒక్క ముక్క కూడా మాట్లాడడం లేదు. పార్టీ నేతలతో గానీ, మంత్రులతో గానీ తాము ఎందుకు ఆ సమావేశాలు జరిపామో, ప్రత్యేక హోదాపై తమ వైఖరి ఏమిటో చెప్పించడం లేదు. కానీ మీడియాకు లీకుల మీద లీకులు పంచిపెడుతున్నారు. ఆ లీకుల్లో కూడా ఆయన కేంద్రం ఇస్తున్న ప్రత్యేక ప్యాకేజీ చాలా గొప్పదని, అందుకే తాను ఒప్పుకున్నానని చెబుతున్నారు. కేటాయింపులపై పోరాటం కొనసాగిస్తామని, అదే సమయంలో కేంద్రంతో గొడవలు పెట్టుకునే ఆలోచన లేదని కూడా లీకులిస్తున్నారు. ప్రత్యేక హోదా ప్రస్తావన ఎక్కడా లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా వ్యవహరించకుండా లీకు వార్తలతో ఇలా తప్పుదోవ పట్టించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హోదా ప్రాముఖ్యత తెలియబట్టేగా..

ప్రత్యేక హోదా ప్రాముఖ్యత ఏమిటో చంద్రబాబుకు బాగా తెలుసు. అందుకే ఆయన తిరుపతి సభలో నాటి ప్రధాని అభ్యర్థి మోదీ సమక్షంలో మాట్లాడుతూ ప్రత్యేక హోదా పదేళ్లు సరిపోదని, పదిహేనేళ్లు కావాలని డిమాండ్ చేశారు. ఒక పరిశ్రమ రావాలంటే ఐదేళ్లు పడుతుందని, ఈలోగా హోదా పోతే ఆ పరిశ్రమ ఇబ్బందుల్లో పడుతుందని అందుకే పదిహేనేళ్లు కావాలని కోరారు. తమ కూటమి వస్తే ప్రత్యేక హోదా పదిహేనేళ్లు ఉంటుందన్నట్లు ప్రజలకు వాగ్దానాలు చేశారు. వెంకయ్య కూడా నాడు రాజ్యసభలో మాట్లాడుతూ హోదా ఐదేళ్లు సరిపోదు పదేళ్లు కావాలన్నారు. పరిశ్రమ పెట్టడానికే మూడునాలుగేళ్లు పడుతుందని, ఐదేళ్లకే హోదా పోతే ఆ పరిశ్రమ మనుగడ కష్టమని వాదించారు. హోదా ప్రాముఖ్యత తెలుసు కాబట్టే నాడు చంద్రబాబు, వెంకయ్య అంతలా డిమాండ్ చేశారు. హోదా ఉంటే ప్రత్యేక ఇన్సెంటివ్‌లు, పన్ను రాయితీలు ఉంటాయి. ఎవరైనా పరిశ్రమ నెలకొల్పడానికి ముందుకొస్తారు. ఎవరినీ దేబిరించనక్కరలేకుండానే పరిశ్రమలు తరలివస్తాయి. ఉద్యోగాలు లభిస్తాయి. ప్యాకేజీలో పరిశ్రమలకు రాయితీలెక్కడుంటాయి? పన్ను ఉపశమనా లెక్కడుంటాయి? ఇవన్నీ చంద్రబాబుకు తెలుసు.

ప్యాకేజీపై మోజెందుకంటే..

అసలు ప్రత్యేక హోదాతో వచ్చే లాభాలను ఎవరూ గణించి చెప్పలేరు. ఎన్ని పరిశ్రమలు తరలి వస్తాయో, ఎన్ని ఉద్యోగాలు వస్తాయో, ఆర్థిక రంగం ఎంతలా అభివృద్ధి చెందుతుందో ఎవరూ లెక్కలేసి చెప్పలేరు. ప్యాకేజీలెన్నైనా ప్రత్యేక హోదాకు సాటిరావన్న సంగతి చంద్రబాబుకూ బాగా తెలుసు. తెలిసినా ప్యాకేజీపై ఆయనకు ఎందుకు అంత మోజు? ప్యాకేజీ అయితే డబ్బులొస్తాయి. కమీషన్లు దండుకోవచ్చు. ఈ స్వార్థ చింతనతోనే ఆయన ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షను కాలరాస్తున్నారని, రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని, విద్యార్థులు, నిరుద్యోగుల భవితవ్యాన్ని నులిమేస్తున్నారని విమర్శకులంటున్నారు. అందుకే లీకుల్లో కూడా ప్రత్యేక హోదా ప్రస్తావన లేకుండా ప్రత్యేక ఆర్థిక సాయం గురించే మాట్లాడుతున్నారని, తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదాను ఫణంగా పెట్టారని వారు పేర్కొంటున్నారు.

కలసిరండి బాబూ...

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ ఎంపీలందరూ.. ఏపీకి చెందిన మొత్తం 25 మంది ఎంపీలూ మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తే అప్పుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్రం ఎక్కడకు పోతుందో చూద్దాం' అని జగన్ వ్యాఖ్యానించారు. 'ఇప్పటికైనా మీరు ప్రత్యేక ప్యాకేజీ అన్న దానిని పక్కనపెట్టండి. మోసపూరిత ప్యాకేజీ కోసమో.. అర్థ రూపాయి, రూపాయి తగ్గింది, ఇవ్వండి అని అడగడం కోసమో ప్రయత్నాలు మాని ప్రత్యేక హోదా సాధించడం కోసం ముందుకు రండి' అని చంద్రబాబుకు ఆయన పిలుపునిచ్చారు. 'ఈ వేళ మీ నోటి వెంట వచ్చిన మాటలతోనైనా చంద్రబాబును గట్టిగా డిమాండ్ చేస్తూ అడుగుతున్నాను. మీ అందరి తరపున అడుగుతున్నా. ఇప్పటికైనా ఆయనకు జ్ఞానోదయం అవుతుందేమో..కాస్తోకూస్తో ముందుకొస్తారేమో ఆశిద్దాం' అని సమ్మేళనానికి హాజరైన మహిళలతో జగన్ పేర్కొన్నారు.

ప్యాకేజీ కోసం హోదాను అమ్మేస్తారా..?

రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తేనే పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉద్యోగాలు వస్తాయని జగన్ స్పష్టం చేశారు. హోదా అన్నది బిక్షం వేసినట్టు ఇచ్చేది కాదని.. ఆ రోజు పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీ అని, హోదా ఇస్తామన్న హామీతోనే రాష్ట్రాన్ని విడగొట్టారని గుర్తు చేశారు. 'విభజన చట్టం చేసే రోజు పార్లమెంట్‌లో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ఫ్యాక్టరీ పెట్టడానికే మూడేళ్లు పడుతుందని.. హోదా ఐదేళ్లు ఏమి సరిపోతుంది, పదేళ్లు కావాలని అడిగారు. చంద్రబాబు కూడా హోదా ఐదేళ్లు, పదేళ్లు కాదు 15 ఏళ్లు కావాలని అడిగారు.. హోదా సంజీవని అని ఆరోజు చెప్పారు. ఇవాళ మాత్రం చంద్రబాబు ప్యాకేజీ కోసం, లంచాలు, కమీషన్లు తీసుకోవడం కోసం హోదాను పూర్తిగా అమ్మేసిన పరిస్థితి కనిపిస్తోంది' అని జగన్ దుయ్యబట్టారు. 'అందుకే హోదా మన హక్కు ప్యాకేజీ కోసం మోసం చేయొద్దు చంద్రబాబూ అని గట్టిగా నినాదమిచ్చాం. హోదా మా హక్కు ప్యాకేజీ మాకొద్దు అన్న నినాదంతోనే పోరాటం చేస్తాం. ఆ పోరాటంలో భాగంగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల చివరి రోజు వరకు హోదా కోసం వీరోచితంగా పోరాటం చేస్తారు. వైఎస్సార్‌సీపీ చెందిన ప్రతి ఒక్కరూ రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద మార్చి 1న ధర్నా నిర్వహిస్తారు. మార్చి 3న పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్లు నేను పాదయాత్ర చేస్తున్న ప్రదేశానికి వస్తారు. అక్కడి నుంచి నేను వారందరినీ జెండా ఊపి ఢిల్లీకి పంపుతాను.' అని జగన్ వివరించారు. 'పార్టీ నేతలంతా మార్చి 5న పార్లమెంటు వద్ద ధర్నా చేస్తారు. ఆ తర్వాత మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకూ పార్లమెంటులో మన ఎంపీలు హోదా కోసం పోరాటం చేస్తారు. ఫలితం లేకపోతే పార్లమెంటు సమావేశాల చివరి రోజైన ఏప్రిల్ 6న లోక్‌సభ స్థానాలకు రాజీనామా చేసి ఆ రాజీనామాలను వారి మొఖాన కొట్టి మన రాష్టానికి తిరిగి వస్తారు' అని జగన్ స్పష్టంచేశారు.

నేడు కావేరిపై సుప్రీం కోర్టు తీర్పు

సాక్షి, బెంగళూరు: కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య సుదీర్ఘకాలంగా నెలకొన్న కావేరి జలాల అంశంపై శుక్రవారం సుప్రీం కోర్టు తీర్పు వెలువరించే అవకాశం ఉంది. 2007, ఫిబ్రవరి 5వ తేదీన కావేరి నది నీటి పంపకాల సమస్యపై కావేరి నీటి వివాదాల ట్రిబ్యునల్ తీర్పును వెలువరించింది. దీన్ని సవాల్ చేస్తూ గతంలో కర్ణాటక, తమిళనాడు, కేరళ సుప్రీంను ఆశ్రయించాయి. సమస్యపై సుదీర్ఘ విచారణ జరిపిన సుప్రీం కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించే అవకాశం ఉంది.

విభజన సమస్యలపై ఢిల్లీలో భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన సమస్యలపై ఈ నెల 21న కేంద్ర హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో కీలక భేటీ జరగనున్నట్టు తెలిసింది. ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో జరిగే ఈ సమావేశానికి రెండు రాష్ట్రాల అధికారులు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం- 2014 అమలులో తలెత్తుతున్న ప్రధాన సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. అలాగే ఈ చట్టంలో ఉన్న షెడ్యూల్ 9 , 10, 12లోని అంశాలపై సమావేశం చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. విద్యుత్ ఉద్యోగుల విభజన, ప్రభుత్వ భవనాల అప్పగింత తదితర అంశాలపై కూడా దృష్టిసారించనున్నట్టు తెలిసింది.

స్పీకర్ ఫార్మాట్‌లోనే రాజీనామా



- వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి
- ఉప ఎన్నికలతో ప్రత్యేకహోదా అవసరాన్ని చాటి చెపుతాం
- మరోసారి చంద్రబాబు రెండునాల్కల ధోరణి
- కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నారు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా తమ పార్టీ ఎంపీలు రాజీనామాకు సిద్ధపడ్డారని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి పునరుద్ఘాటించారు. స్పీకర్ ఫార్మాట్‌లోనే తాము రాజీనామాలు సమర్పిస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా సాధన కోసం రాజీలేని పోరాటం చేసేందుకు తమ నేత వైఎస్ జగన్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని యావత్ రాష్ట్రం స్వాగతిస్తోందని తెలిపారు. వివక్షతో కళ్లు మూసుకుపోయిన టీడీపీ వక్ర భాష్యాలు చెబుతోందని ధ్వజమెత్తారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా ఎదుర్కొనే సత్తా తమకుందని, పార్టీ ఫిరాయించిన ఎంపీలు, ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లే ధైర్యం చంద్రబాబుకు ఉందా? అని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... తాము 14 నెలల ముందే పార్లమెంట్‌కు రాజీనామా చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఉప ఎన్నికల ద్వారానే ప్రత్యేక హోదా అవసరమని ప్రజాభీష్టాన్ని కేంద్రానికి తెలిపేలా చేస్తామని చెప్పారు.

ఇది రెండు నాల్కల ధోరణి కాదా బాబూ!

చంద్రబాబు మళ్లీ తన రెండు నాల్కల సిద్ధాంతాన్ని తెరమీదకు తెచ్చారని మిథున్ విమర్శించారు. ప్రత్యేక హోదాను మేనిఫెస్టోలో పెట్టిన ఆయన ఎవరి ఆమోదంతో ప్యాకేజీకి అంగీకరించారో చెప్పాలని నిలదీశారు. నా వల్లే తెలంగాణ ఏర్పడిందని చెప్పిన వ్యక్తి ఏపీలో మాత్రం అన్యాయం జరిగిందంటూ మొసలి కన్నీరు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర బడ్జెట్ చాలా బాగుందని, ఎక్కువ నిధులు సాధించిందీ మనమేనని చెప్పిన విషయాన్ని మరిచిపోయారా? అని ప్రశ్నించారు. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టి 15 రోజులైనా ఆయన నోరెత్తకపోతే కాంగ్రెస్‌కు పట్టిన గతే టీడీపీకి, ఆయన మిత్రపక్షానికి పడుతుందని హెచ్చరించారు. రాజధాని వ్యవహారాల్లో బీజేపీ, టీడీపీ మధ్య పంపకాల్లో తేడాలు వచ్చాయేమో అన్న సందేహం వెలిబుచ్చారు. కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నారని విమర్శించారు.

హోదాకోసం గొంగళి పురుగునైనా ముద్దాడుతాం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పోరాడే ఎవరితోనైనా కలసి నడిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మిథున్ చెప్పారు. అవసరమైతే గొంగళి పురుగైనా ముద్దాడతామన్నారు. హోదా కోసం తాము రాజీనామాలకు సిద్ధపడితే టీడీపీ రాద్ధాంతం చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. కేసుల భయంతోనే చంద్రబాబు కేంద్రానికి లొంగిపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో లక్షల కోట్ల అవినీతి జరిగిందని, పట్టిసీమ, రాజధాని నిర్మాణాల్లో జరిగిన అవినీతిని కాగ్ బయటకు తెచ్చిందని చెప్పారు. హోదా రాకపోవడానికి టీడీపీ, బీజేపీ ఇద్దరూ దోషులేనని మిథున్ విమర్శించారు.

టీడీపీలో గందరగోళం!

▶ మొదటి పేజీ తరువాయి

తత్తరపాటుకు గురైంది. ఈ సవాల్‌పై ఎలా స్పందించాలో అర్థం కాక గందరగోళం సృష్టించడానికి ప్రయత్నించింది. పార్టీ సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన చంద్రబాబు నాయుడు ఆ సమావేశం పూర్తయ్యాక విలేకరులతో మాట్లాడలేదు. పైగా పార్టీ సమన్వయ సమావేశంలో చర్చించిన విషయాలను పార్టీ నేతల ద్వారా కూడా విలేకరులకు చెప్పించలేదు. కేవలం లీకులను ఇప్పించారు. ఆ లీకుల్లో కూడా పవన్ కళ్యాణ్‌ను పార్టీ నేతలు విమర్శించవద్దని, పవన్ మనోడేనని అన్నట్లుగా లీకులు ఇప్పించారు.

జగన్‌ను తిట్టించబోయి తామే బొక్కబోర్లా..

జగన్ సవాల్ విసిరిన నేపథ్యంలో మంత్రి ఆదినారాయణ రెడ్డి చేత విలేకరుల సమావేశం పెట్టించి వ్యక్తిగత దుర్భాషలతో సమస్యను పక్కదోవ పట్టించడం కోసం అధికార తెలుగుదేశం పార్టీ వేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. జగన్‌పై విమర్శలు ఎక్కుపెట్టిన ఆదినారాయణరెడ్డిపై విలేకరులు ప్రశ్నల వర్షం కురిపించారు. కేంద్రానికి ఇంకా ఎన్ని రోజులు గడువు ఇస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఏప్రిల్ 6న రాజీనామాలు చేయబోతున్న విషయాన్ని విలేకరులు మంత్రి దృష్టికి తీసుకురాగా కేంద్రం నుంచి స్పష్టత రాకపోతే మార్చి5నే టీడీపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు రాజీనామా చేస్తారని ఆది ప్రకటించారు. అంతేకాదు పొత్తుకు అదే ఆఖరు రోజు అవుతుందని కూడా వ్యాఖ్యానించారు. ఇప్పటికే 19 అంశాలు కేంద్రం ముందుంచామని, వాటిలో ఒక్కటి చేయకపోయినా అదే పొత్తుకు చివరి రోజు అని మంత్రి వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్ తన ఎంపీల రాజీనామాలు చేయించడానికి ముందే తమ పార్టీ రాజీనామాలు చేయిస్తామని ప్రకటించారు. రాజీనామాల విషయంలో జగన్ కంటే టీడీపీదే ప్రీ షెడ్యూల్(ముందస్తు నిర్ణయం) అన్నారు. ఆయనది ఏప్రిల్ ఆరు డెడ్‌లైన్ అయితే మాది మార్చ్ ఐదు డెడ్‌లైన్ అని చెప్పారు. కేంద్రం చెప్పినదానికి, చేసిన దానికి పొంతనలేదని, కేంద్ర బడ్జెట్‌లో అనుకున్న మేరకు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపులు జరగలేదని అన్నారు. ఆదినారాయణరెడ్డి చెబుతున్న విషయాలను చానళ్లు ప్రముఖంగా ప్రసారం చేశాయి. అయితే జగన్‌ను తిట్టాల్సింది పోయి రాజీనామాల గురించి మాట్లాడడం, అది మీడియాలో ప్రముఖంగా ప్రసారం కావడంతో అధినేత చంద్రబాబు కంగుతిన్నారు. అందుకే గంట తిరక్కుండానే మంత్రి ఆది చేత అదే చోట మళ్లీ విలేకరుల సమావేశం పెట్టించి వివరణ ఇప్పించారు. మంత్రుల రాజీనామా అనేది తన వ్యక్తిగత అభిప్రాయమని మంత్రి చేత చెప్పించారు. అలా జరుగుతుందని తాననుకుంటున్నానని ఆది అన్నారు. అలాగే తెలుగుదేశం ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ చేత కూడా హడావిడిగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయించి ఆదినారాయణ చేసిన ప్రకటన ఆయన వ్యక్తిగత అభిప్రాయం అని చెప్పించారు. తెలుగుదేశం పార్టీలో ఎంత గందరగోళం నెలకొందో దీనినిబట్టి అర్థమౌతోందని విశ్లేషకులంటున్నారు.

పోలీస్‌స్టేషన్ పైనుంచి పడి వ్యక్తి మృతి

- పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదం?
- ఘటనపై మృతుడి భార్య అనుమానం

తిరుపతి క్రైం : తిరుపతిలోని ఈస్ట్ పోలీస్‌స్టేషన్ భవనం పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ సబ్ డివిజనల్ డీఎస్పీ మునిరామయ్య తెలిపిన వివరాల ప్రకారం..



నాగరాజు మృతదేహం


ఎస్టీవీ నగర్‌లో బుధవారం రాత్రి ఓ వ్యక్తి తాగి గొడవ చేస్తున్నాడని, కత్తితో బెదిరిస్తున్నాడని అదే ప్రాంతానికి చెందిన తులసీరాం అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మద్యం తాగి.. చేతిలో కత్తి, సుత్తి ఉన్న మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి నాగరాజు (45)ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో నాగరాజు రెండోసారి మూత్ర విసర్జనకు వెళ్లాడు. 3వ అంతస్థులోని బాత్‌రూం నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. పైప్ పట్టుకుని కిందకు దిగుతుండగా కాలుజారి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. నిందితుడిని రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఫిర్యాదుదారులపై మృతుడి భార్య అనుమానం

ఇదిలా ఉంటే, మృతుడి భార్య పూజా కథనం మరోలా ఉంది. తన భర్తకు ఓ కుటుంబంతో వివాదం ఉందని.. వాళ్ల కోళ్ల అపహరణ విషయంలో గొడవపడ్డారని చెప్పింది. దీంతో తన భర్త మద్యం మత్తులో కత్తి తీసుకుని ఫిర్యాదు చేసిన వారిని బెదిరించేందుకు వెళ్లాడని వివరించింది. తన భర్త ఆస్పత్రిలో ఉన్నట్లు పోలీసులు ఉదయం తెలిపారని.. అక్కడికి వెళ్లి చూడగా నాగరాజు మృతిచెంది ఉన్నాడని రోదిస్తూ చెప్పింది. తన భర్త మీద ఫిర్యాదు చేసిన వారిపై తనకు అనుమానం ఉందని ఆమె ఆరోపించింది. దీనిపై డీఎస్పీ మాట్లాడుతూ.. పోస్టుమార్టమ్ రిపోర్టు వచ్చాక నిజానిజాలు నిగ్గుతేలుస్తామన్నారు. పోలీసుల నిర్లక్ష్యం ఉంటే బాధ్యులను వదిలేదిలేదన్నారు.



మా చేతులు ఖాళీల్లేవ్!
నువ్వే సర్జరీ అయ్యేవరకూ అలా పట్టుకో...!



88వ రోజు

15-02-2018, గురువారం
తూర్పుపాళెం క్రాస్,
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

'టెట్' నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు ఎందుకు చేయలేకపోయారు?

ఈ రోజు ఉదయం ఆదిమూర్తిపురం దాటాక మహిళా కూలీలు కలిశారు. వాళ్లల్లో మస్తాన్‌బీ అనే కూలీ.. గుండె గొంతుకలోంచి తన్నుకొస్తున్న బాధను నా ముందుంచింది. భర్త చనిపోయి మూడేళ్లయిందట. ముగ్గురు పిల్లలను తన రెక్కల కష్టంతో పోషిస్తోందట. పొద్దంతా కష్టపడితే వచ్చే కూలి రూ.150 యేనట. 'ఎలా బతకాలయ్యా..' అంటూ బావురుమంది. పింఛన్ అయినా ఇస్తారేమోనని అధికారులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయానని చెప్పింది. ఇలాంటి కన్నీటి గాథనే బీబీజాన్ అనే మరో అక్కా చెప్పింది. ఆమెకూ భర్త చనిపోయాడట. తాగుడుకు బానిసైన ఆమె ఇద్దరు కొడుకులూ భార్యలకు చిల్లిగవ్వ కూడా ఇవ్వరట. 'ఏంటీ పాపం' అని అడిగితే.. ఎముకలిరిగే వరకూ కొడుతున్నారని నిస్సహాయంగా చెప్పుకొంది. మా జీవితాల్లో ఈ మద్యం చిచ్చురేపుతోందని పుట్టెడు దుఃఖంతో చెప్పింది. ఊరూరా అక్కచెల్లెమ్మల కన్నీరు ఏరులై పారుతున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేకపోవడం నిజంగా విచారకరం. తమ ఈతిబాధలకు మనందరి ప్రభుత్వంలో తప్పకుండా పరిష్కారం లభిస్తుందనే నమ్మకం అక్కచెల్లెమ్మల్లో కనిపిస్తోంది.

కొండాపురం గ్రామంలో పద్మజ అనే చెల్లెమ్మ కలిసింది. ఆమె టెట్ పరీక్షకు ప్రిపేర్ అవుతోందట. 'సార్.. ఈ పరీక్ష విధానమే బాగాలేదు. ఆన్‌లైన్ పద్ధతిలో ఎగ్జామ్ అన్నారు. పల్లెటూరి వాళ్లం.. దానికెలా ప్రిపేర్ అవ్వాలో కూడా అర్థం కావడం లేదు. పరీక్ష నిర్వహణ ఓ ప్రయివేటు సంస్థకి ఇచ్చారట. నాకిప్పుడు ఎగ్జామ్ సెంటర్ ఈ జిల్లాలో కాకుండా ఎక్కడో తిరువూరులో వేశారు. అదెక్కడుందో కూడా నాకు తెలీదు. ఈ పరీక్ష ప్రకటన వచ్చినప్పటి నుంచి అంతా గందరగోళమే. మాలో చాలా మందికి ఆన్‌లైన్ విధానం అలవాటు లేదు. అందరికీ ఒకే ప్రశ్నాపత్రం కాదట.. కొందరికి సులభమైన, మరికొందరికి కష్టతరమైన ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది' అంటూ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మార్కుల్ని డీఎస్సీలో 20శాతం కలుపుతారట. భయంగా ఉంది.. అంటూ టెట్ కష్టాల్ని ఏకరవుపెట్టింది.

ప్రతి జిల్లా నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సంవత్సరాల తరబడి టెట్ ఎగ్జామ్ పెట్టింది లేదు. తీరా ఇప్పుడు పెడుతున్నారనుకుంటే.. అది పూర్తి గందరగోళ పరిస్థితులకు దారితీస్తోంది. అడ్డగోలు నిర్ణయాల వల్ల అభాసుపాలవుతోంది. పరీక్ష నిర్వహణ కాంట్రాక్టు ఇచ్చిన ప్రయివేటు సంస్థకు ఆ సామర్థ్యం, అనుభవం ఉన్నాయా.. లేదా.. అని ఆలోచించాల్సిన అవసరం లేదా? కావాల్సినవాళ్లకో, కాసులకు కక్కుర్తిపడో ఎవరికి పడితే వారికి కాంట్రాక్టు ఇచ్చేస్తే.. ఇన్ని లక్షల మంది పడే ఇబ్బందికి ఏమని సమాధానం చెబుతారు? అసలు ప్రయివేటు వాళ్లకు కాంట్రాక్టు ఇవ్వడం సమంజసమేనా? లక్షల మంది రాసే పరీక్షలో ఆన్‌లైన్ వంటి కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు దానికి కావాల్సిన ముందస్తు కసరత్తు చేయాలి కదా? అభ్యర్థులకు విస్తృతమైన అవగాహన కల్పించి వారిలోని అపోహలను, భయాందోళనలను తొలగించాల్సిన అవసరం లేదా? అందరికీ ఒకే ప్రశ్నాపత్రం ఇవ్వకపోతే.. సమన్యాయం జరుగుతుందని ఆశించగలమా? నాలుగున్నర లక్షల మంది దరఖాస్తు చేసుకున్న పరీక్ష నిర్వహణలో పకడ్బందీ ఏర్పాట్లు ఎందుకు చేయలేకపోయారు? ఏ జిల్లా వారికి ఆ జిల్లాలో పరీక్ష కేంద్రాలను కేటాయించకుండా, ఆ మూల నుంచి ఈ మూలకు విసిరేసినట్లుగా వందల మైళ్ల దూరంలో సెంటర్లు కేటాయించారట. పొరుగు రాష్ట్రాల్లో సైతం సెంటర్లు వేశారట. పరీక్ష రాసేవారికి.. ముఖ్యంగా మహిళలకు, దివ్యాంగులకు ఎంత ఇబ్బందో కనీస ఆలోచనన్నా చేయరా? ఈ పరీక్ష కోసం కోట్లాది రూపాయలు ఫీజులుగా వసూలు చేసి, పరీక్ష నిర్వహణలో సరైన ఏర్పాట్లు చేయకుండా గందరగోళం సృష్టించడం సిగ్గుచేటైన విషయం కాదా? కొన్ని లక్షల మంది జీవితాలకు సంబంధించిన పరీక్ష ఇంత లోపభూయిష్టంగా జరపబూనుకోవడం రాష్ట్రంలోని నిరుద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం కాదా?

వైఎస్. జగన్.

పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

సాక్షి, అమరావతి: పలువురు డిప్యూటీ కలెక్టర్లనుబదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మచిలీపట్నం పట్టణాభివృద్ధి సంస్థ (ముడా) కార్యదర్శిగా పనిచేస్తున్న హెచ్.సుబ్బరాజును అనంతపురం జేసీ–2గా బదిలీ చేసింది. ప్రస్తుతం అనంతపురం జేసీ–2గా పనిచేస్తున్న సయ్యద్ ఖాజా మొహిద్దీన్‌ను రాష్ట్ర శాసనమండలి చైర్మన్‌కు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా బదిలీ చేసింది. అలాగే సీసీఎల్ఏలో సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్.వి.సుబ్బలక్ష్మి తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)గా బదిలీ అయ్యారు. శాప్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న వి.సుబ్బారావు, సీఆర్‌డీఏలో డిప్యూటీ కలెక్టరుగా ఉన్న కేఈ సాధన, విశాఖలో ఆర్అండ్‌బీ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న ఎ.సుబ్బరాజులు సీసీఎల్ఏలో సహాయ కార్యదర్శులుగా బదిలీ అయ్యారు. సీసీఎల్ఏలో ఉన్న ఖాళీల్లో వీరిని నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న ఎ.ప్రభావతిని ముడా కార్యదర్శిగా బదిలీ చేశారు.

యథావిధిగానే టెట్ నిర్వహణ

- అధికారులతో మంత్రి గంటా సమీక్ష
- ఇతర రాష్ట్రాల్లో కేటాయించిన అభ్యర్థులకు తిరిగి ఆప్షన్ ఇచ్చుకునే అవకాశం.. వారికి మార్చి 2న పరీక్ష

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను యథావిధిగా ఈ నెల 21 నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహిస్తామని మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అభ్యర్థులు ఐచ్ఛికంగా సూచించిన సెంటర్లు కాకుండా ఇతర రాష్ట్రాల్లో కేటాయించడం, హాల్ టికెట్లలో తప్పులు ఇతర అంశాలపై విద్యాశాఖ అధికారులతో గురువారం సమీక్షించారు. ఇతర రాష్ట్రాల్లో సెంటర్లు ఎందుకు కేటాయించారని ప్రశ్నించారు. కొన్ని జిల్లాల్లో తక్కువ పరీక్ష కేంద్రాలు, తక్కువ ఆన్‌లైన్ కంప్యూటర్ సీటింగ్ కెపాసిటీ వుండటం వల్లే ఇలా జరిగిందని అధికారులు వివరించారు. మొత్తం 4,46,833 మంది అభ్యర్థుల్లో ఇతర రాష్ట్రాల్లో సెంటర్లను కేటాయించిన అభ్యర్థులు 15,605 (3.5 శాతం) మంది ఉన్నారని వీరికి ఇప్పటికే ఆప్షన్ మార్చుకొనే సదుపాయం కల్పించామని అధికారులు తెలిపారు. ఇప్పటికే 9,518 (61 శాతం) అభ్యర్థులు తిరిగి ఆప్షన్స్ ఇచ్చారని, మరో 6,087 మంది శుక్రవారం సాయంత్రం కల్లా ఆప్షన్ ఇచ్చినట్లయితే వారికి కూడా మన రాష్ట్రంలోనే సెంటర్లు కేటాయిస్తామని తెలిపారు. 805 మంది అభ్యర్థులకు వారు కోరిన ఆప్షన్స్ ప్రకారం కాకుండా వేరే పరీక్షా కేంద్రాలు కేటాయించారు. వీరికి కూడా తిరిగి ఆప్షన్ కోరుకునే అవకాశం ఇచ్చామని అధికారులు చెప్పారు. ఆప్షన్స్ తిరిగి ఇచ్చిన అభ్యర్థులకు మార్చి 2న పరీక్ష నిర్వహిస్తామన్నారు.

సందేహాల కోసం సంప్రదించాల్సిన నంబర్లు
9505619127, 9505780616, 9505853627, 9885604333, 9701376243

85 శాతం హాల్ టికెట్లు డౌన్ లోడ్

టెట్‌కు మొత్తం 4,46,833 మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు 3,83,204 (85.76 శాతం) అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్ లోడ్ చేసుకున్నారని మంత్రి గంటా తెలిపారు. సగటున రోజుకు 52 వేల మంది టెట్ పరీక్ష రాయనున్నారని, ప్రతి సెషన్ కు 26 వేల మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారని మంత్రి తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కమీషనర్ కార్యాలయంలో ఇప్పటికే హెల్ప్ డెస్క్ లు నిర్వహిస్తున్నామని, వీటికి అదనంగా మరో రెండు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ఏప్రిల్ 14న రజనీ కొత్త పార్టీ!

సాక్షి, చెన్నై: రాజకీయ పార్టీకి సంబంధించిన ఏర్పాట్లలో బిజీగా ఉన్న రజనీ ఏప్రిల్ 14న తమిళ కొత్త సంవత్సరాది (ఉగాది)న పార్టీ ప్రకటన చేయవచ్చని సమాచారం. ఈ పరిస్థితుల్లో బుధవారం నుంచి మూడు రోజుల పాటు రజనీ మక్కల్ మండ్రం నిర్వాహకుల సమావేశాలు చెన్నైలో జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రజనీకాంత్ ఏప్రిల్‌లో తమిళనాడు పర్యటనకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

చింతమనేనిని అనర్హుడిగా ప్రకటించాలి

వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కేసుల్లో ఇరుక్కుని శిక్షపడిన పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను తక్షణమే అనర్హుడిగా ప్రకటించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పేర్ని వెంకటేశ్వరరావు (నాని) డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాటాడారు. సుదీర్ఘ అనుభం ఉందని చెప్పుకునే చంద్రబాబుకు జైలుశిక్ష పడిన ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించాలని తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజా ప్రాతినిథ్య చట్టం–1951 ప్రకారం రెండేళ్లు, అంతకన్నా ఎక్కువ శిక్ష పడిన ప్రజాప్రతినిధిని పదవిలో కొనసాగించకూడదని పేర్ని గుర్తుచేశారు. ఈ విషయమై శాసనసభ వ్యవహారాల కార్యదర్శి స్పందించి చింతమనేనిని అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తీర్పు వెలువడి 48 గంటలు దాటినా ప్రభుత్వం, శాసనసభ కార్యదర్శి స్పందించకపోవడం శోచనీయమన్నారు. ముఖేష్ అంబానీకి గుడ్ గవర్నెన్స్, స్మార్ట్ గవర్నెన్స్, గురించి చెప్పిన చంద్రబాబు.. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో కరెంట్ లేక సెల్‌ఫోన్ వెలుతురులో ఆపరేషన్ చేసిన సంగతిని కూడా చెప్పుంటే బాగుండేదని ఎద్దేవా చేశారు.

నేడే అర్చకుల 'ఆత్మావలోకన సదస్సు'

- ప్రారంభించనున్న విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- కనీస వేతనాలు, సంక్షేమ నిధి కోసం అర్చకుల డిమాండ్



తిరుపతి పెద్ద గంగమ్మ ఆలయం వద్ద నిరసన తెలియజేస్తున్న అర్చకులు (ఫైల్)

సాక్షి, అమరావతి, తిరుపతి: అర్థాకలితోనే నిత్యం భగవంతుడి సేవలో నిమగ్నమవుతున్న అర్చక స్వాములు సర్కారుపై సమరశంఖం పూరించారు. అర్చకులకు కనీస వేతనాలు చెల్లించాలంటూ శుక్రవారం విజయవాడలోని గొల్లపూడిలో 'ఆత్మావలోకన సదస్సు' నిర్వహిస్తున్నారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ఈ సదస్సును ప్రారంభిస్తారు.

జీవో ఇచ్చినా అమలేది?

ఆలయాల వ్యయాల్లో తొలిపద్దు కింద అర్చకుల వేతనాలను పరిగణనలోకి తీసుకుంటామంటూ 2017 ఫిబ్రవరిలో ఇచ్చిన జీవో నెం.76 ఇంతవరకు అమల్లోకి రాకపోవడంపై అర్చకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణా తరహాలో పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్రంలో దాదాపు 1.10 లక్షల మంది అర్చక స్వాములున్నారు. వీరిలో అత్యధికులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలు మాత్రమే నామమాత్రంగా వేతనం అందుతోంది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినా వివక్ష చూపటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. '1987 దేవదాయ చట్టం అర్చక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. రాష్ట్రంలోని వేలాది దేవాలయాల్లో అర్చకులకు జీతాలు ఇవ్వకున్నా లోకకళ్యాణం కోసం అప్పులు చేసి మరీ ధూప దీప నైవేద్యాలను నిర్వహిస్తున్నారు' అని ఏపీ అర్చక సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దింటి రాంబాబు పేర్కొన్నారు.

అర్చకుల ప్రధాన డిమాండ్లు

- తెలంగాణా ప్రభుత్వం 2015 నుంచి అర్చకుల కోసం అమలు చేస్తున్న పీఆర్‌సీని ఏపీలోనూ అమలు చేయాలి.
- అర్చక సంక్షేమ నిధి ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయించాలి.
- అన్ని ఆలయాల అర్చకులకు ఒకే పే స్కేల్ ప్రకారం చెల్లించాలి.
- కాంట్రాక్ట్ అర్చకులందరినీ పర్మినెంట్ చేసి హెల్త్‌కార్డులు ఇవ్వాలి.
- ధూపదీప నైవేద్య పథకం కింద ఆలయానికి రూ.6 వేలు చొప్పున ఇవ్వాలి.

మానేపల్లిలో బోళ్లకు అంత్యక్రియలు

రాష్ట్ర మంత్రులు కామినేని, జవహర్ హాజరు



బోళ్ల భౌతికకాయానికి గౌరవ వందనం చేసి గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

పి.గన్నవరం: కేంద్ర మాజీ మంత్రి, ఆంధ్రా షుగర్స్ సంస్థ చైర్మన్ బోళ్ల బులిరామయ్య పార్థివదేహానికి తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరం మండలంలోని మానేపల్లి గ్రామంలో గురువారం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పల్లిపాలెం వద్ద వశిష్ట నదీపాయ ఒడ్డున బులిరామయ్య భౌతిక కాయానికి ఆయన తనయుడు రమేష్‌బాబు అంతిమ సంస్కారాలను నిర్వహించారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామయ్య పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వెంకటరాయపురంలోని స్వగృహం వద్ద బుధవారం తుదిశ్వాస విడిచిన విషయం విదితమే. గురువారం ప్రత్యేక వాహనంలో ఆయన భౌతికదేహాన్ని స్వస్థలమైన తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నం అగ్రహారం గ్రామానికి తీసుకొచ్చారు. ప్రజల సందర్శనార్థం కొద్దిసేపు అక్కడి ఉంచి అనంతరం మానేపల్లిలోని శ్మశానవాటికకు తరలించారు. కార్యక్రమంలో మంత్రులు కామినేని శ్రీనివాస్, కేఎస్ జవహర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్యేలు పులపర్తి నారాయణమూర్తి, ఆరుమిల్లి రాధాకృష్ణ, బూరుగపల్లి శేషారావు, మాజీ ఎంపీలు బుచ్చి మహేశ్వరరావు, కావూరి సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరీదేవి, మానేపల్లి అయ్యాజీ వేమా, బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

శుక్రవారం, ఫిబ్రవరి, 16

మరో కుంభకోణం!

లలిత్ మోదీ, విజయ్ మాల్యా లాంటివాళ్లు వేల కోట్లు ఎగేసి దేశం విడిచి పారిపోయాక అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామనుకుంటూ భ్రమల్లో కూరుకుపోయిన బ్యాంకింగ్ రంగానికి మరో వ్యాపారి నీరవ్ మోదీ ఝలక్ ఇచ్చాడు. స్టేట్ బ్యాంకు తర్వాత రెండో అతి పెద్ద బ్యాంకు అయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కి జంకూగొంకూ లేకుండా రూ. 11,300 కోట్లకు కుచ్చుటోపీ పెట్టి అచ్చం లలిత్, మాల్యాల తరహాలోనే సకుటుంబ సమేతంగా దేశం నుంచి నిష్క్రమించాడు. రూ. 280 కోట్ల మేర మోసం జరిగిందన్న ఫిర్యాదు కాస్తా పట్టుమని పదిరోజులు గడవకుండానే రూ. 11,300 కోట్లకు ఎగబాకింది. ఇది ఇక్కడితో ఆగుతుందో, మరింతగా పెరుగుతుందో చూడాల్సి ఉంది. చెమటోడ్చి సంపాదిస్తున్న డబ్బుల్లో కొంత మొత్తాన్ని ముమ్ముందు పనికొస్తుందన్న ఆశతో మధ్య, దిగువతరగతి జనం దాచుకుంటున్నారు. అలాంటివారినుంచి ఏదో ఒక పేరుతో బ్యాంకులు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. కానీ ఇలాంటి మోసగాళ్లకు మాత్రం సునాయాసంగా దోచిపెడుతున్నాయి. ఈ వ్యవహారంలో ఒక్క పంజాబ్ నేషనల్ బ్యాంకు మాత్రమే కాదు...యూనియన్ బ్యాంకు, అలహాబాద్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు సహా విదేశీ, స్వదేశీ బ్యాంకులు 30 వరకూ మునిగిపోయినట్టు చెబుతున్నారు.

చూడటానికి ఒకరిద్దరు ఉద్యోగులు ఓ పద్ధతి ప్రకారం, ఎవరూ గుర్తించలేని విధంగా చేసినట్టు కనబడుతున్నా పీఎన్‌బీకి సారథ్యం వహిస్తున్నవారు... దాన్నుంచి జారీ అయినట్టు చెబుతున్న లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్‌వోయూ)ల విశ్వసనీయత ఎంతో తేల్చుకోకుండా రుణాలిచ్చిన ఇతర బ్యాంకులు... వీటి కార్యకలాపాలను పర్యవేక్షించాల్సిన రిజర్వ్‌బ్యాంకు తమ బాధ్యతనుంచి తప్పించుకోలేవు. అలాగే కేంద్ర ప్రభుత్వంలోని సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో (సీఈఐబీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) వంటి వివిధ పర్యవేక్షణా సంస్థల సమర్థత సైతం ప్రశ్నార్థకమవుతోంది. నిజానికి నీరవ్ మోదీ మోసం ఇప్పటికిప్పుడు మొదలైందేమీ కాదు. 2010 నుంచి ఏడేళ్లుగా ఇదంతా సాగుతోంది. పైగా నీరవ్ మోదీపై ప్రధాని కార్యాలయం (పీఎంఓ)కు 2015లోనే ఫిర్యాదు చేసినా దిక్కూ మొక్కూ లేకపోయిందని మొదటిగా దీన్ని బయటపెట్టిన వ్యక్తి చెబుతున్నాడు. అదే నిజమైతే పబ్లిక్ రంగ సంస్థల డబ్బు ఎలా పోతున్నా, ఎటు పోతున్నా ఎవరికీ పట్టడం లేదని బోధపడుతుంది.

నీరవ్ మోదీ ఈ దేశంలో మొదటి మోసగాడు కాదు. చెప్పాలంటే లలిత్‌మోదీ కన్నా, విజయ్‌మాల్యాకన్నా చాలా ముందే బ్యాంకుల్ని వివిధ మార్గాల్లో ముంచిన మోసగాళ్లున్నారు. కానీ ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఇలా ఎంతమంది, ఎన్నిసార్లు మోసగిస్తున్నా బ్యాంకింగ్ వ్యవస్థకు జవాబుదారీతనం అలవాటు చేయాలని ప్రభుత్వాలు అనుకోలేదు. గతంలో యూపీఏ ప్రభుత్వమైనా, ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వమైనా మోసాలు బయటపడినప్పుడు ఏదో ఒకటి చెప్పి తప్పించుకోవడం తప్ప దిద్దుబాటు చర్యలు తీసుకోలేదని, బ్యాంకులు సైతం తమ వ్యవస్థలను చక్కదిద్దుకోవడానికి సిద్ధపడలేదని అర్థమవుతుంది. డబ్బుతో వ్యాపారం చేసే సంస్థలకు ఆ డబ్బు ఎన్ని రూపాల్లో లోపలకు వస్తుందో, మరెన్ని రూపాల్లో బయటికి పోతుందో తెలుస్తుంది. అటువంటప్పుడు బయటికి పోయే మార్గాల్లో ఏఏ దశల్లో మోసం జరగడానికి ఆస్కారం ఉన్నదో, వాటి నివారణకు ఎలాంటి తనిఖీలు అవసరమో, ఆ తనిఖీలు నిర్వహించేవారిపై పర్యవేక్షణ ఏవిధంగా ఉండాలో నిర్ధారించుకోవడం కష్టం కాదు. ఇప్పుడు నీరవ్ చేసిన మోసం లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్ఓయూ)లకు సంబంధించింది. ఒక బ్యాంకు ఎల్ఓయూ జారీ చేసిందంటే అర్థం ఆ పత్రాన్ని సమర్పించిన వ్యక్తి తీర్చాల్సిన సొమ్ముకు పూచీ పడతామని అర్థం. ఈ ఎల్ఓయూలు అంతర్జాతీయ బ్యాంకింగ్ లావాదేవీల్లో వినియోగిస్తారు. తగిన మొత్తంలో ఆస్తుల్ని బ్యాంకుకు హామీగా చూపితే తప్ప ఇలాంటి ఎల్ఓయూలు జారీ కావు. ఈ లావాదేవీల్లో ఎల్ఓయూ జారీ చేసిన బ్యాంకు, దాన్ని స్వీకరిస్తున్న బ్యాంకు, సరుకు దిగుమతి చేసుకుంటున్న సంస్థ, దానిద్వారా లబ్ధిపొందుతున్న సంస్థ ఉంటాయి. ఇలా ఏడేళ్లపాటు నాలుగు చోట్ల జరిగే లావాదేవీల్లో ఏ ఒక్కచోటా మోసం బయటపడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. సాధారణ పౌరులు ఖాతా ప్రారంభించాలన్నా అనేక రకాలైన తనిఖీలుంటాయి. ఆధార్ కార్డుతోసహా సవాలక్ష పత్రాలను అడుగుతారు. కానీ పీఎన్‌బీ నుంచి దొంగచాటుగా జారీ అయిన ఎల్ఓయూలను నీరవ్ అండ్ కో పలు స్వదేశీ, విదేశీ బ్యాంకుల్లో దాఖలు చేసి భారీ మొత్తంలో దోచుకున్నారు. పైగా తమపై ఫిర్యాదు వెళ్తుందని, తమ మోసం బట్టబయలవుతుందని ముందే ఉప్పంది నీరవ్ మోదీ, ఆయన భార్య, నీరవ్ సోదరుడు, వారి వ్యాపార భాగస్వామి పరారయ్యారు. ఇందులో నీరవ్ ఒక్కడే ఈ దేశ పౌరుడు. ఆయన భార్య అమీకి అమెరికా పౌరసత్వం, సోదరుడు నిషాల్‌కు బెల్జియం పౌరసత్వం ఉన్నాయి. ఈ నలుగురినీ ఇక్కడికి రప్పించడం అంత సులభం కాదని లలిత్, మాల్యా కేసుల్ని గమనిస్తేనే బోధపడుతుంది.

బ్యాంకులు ఇలా మోసపోయి కష్టాల్లో ఉన్నాయని గమనించి వచ్చే రెండేళ్లలో వాటికి రూ. 2.11 లక్షల కోట్లు సమకూర్చడానికి నిరుడు అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ద్రవ్యలోటు పరిమితుల్ని దాటకుండానే ఈపని చేస్తామని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అప్పట్లో చెప్పారు. మొన్న డిసెంబర్‌లో కేంద్రం రూ. 7,577 కోట్లు విడుదల చేసింది కూడా. మరో లక్ష కోట్ల రూపాయల్ని మార్చినాటికి సమకూరుస్తామని గత నెలలో జైట్లీ ప్రకటించారు. బ్యాంకులు మోసగాళ్లకు ఇచ్చి నష్టపోతున్న డబ్బయినా, ఆ లోటు భర్తీకి కేంద్రం తిరిగి ఆ బ్యాంకులకు ఇస్తున్నదైనా ప్రజాధనమే. అడ్డూ ఆపూ లేకుండా ఎన్నాళ్లిలా జనం సొమ్ము హారతి కర్పూరం చేస్తారో ప్రభుత్వమూ, బ్యాంకులూ చెప్పాలి. పాత్రధారులు బయటపడ్డారు సరే... వెనకున్న సూత్రధారుల కూపీ లాగాలి. అన్ని విషయాలనూ ప్రజలముందుంచాలి.



నిజాయితీ ఉన్నవారిని సవాలక్ష ప్రశ్నలతో వేధించడం. నిజాయితీ ఏ కోశానా లేని వారికి అప్పనంగా రుణాలు ఇవ్వడమే బ్యాంకింగ్ కార్యకలాపాల సారాంశం.

– బాబ్ హోప్
అమెరికన్ నటుడు, కమెడియన్

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి శు.పాడ్యమి రా.3.12 వరకు, తదుపరి విదియ, నక్షత్రం ధనిష్ఠ ఉ.9.04 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం సా.4.50 నుంచి 6.34 వరకు, దుర్ముహూర్తం ఉ.8.46 నుంచి 9.33 వరకు, తదుపరి ప.12.35 నుంచి 1.21 వరకు, అమృతఘడియలు తె.3.30 నుంచి 4.35 వరకు.


సూర్యోదయం	: 6.31	12.00 వరకు
సూర్యాస్తమయం	: 5.57	యమగండం :
రాహుకాలం :		ప.3.00 నుంచి
ఉ.10.30 నుంచి		4.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	: 5.29	మగ్రీబ్	: 6.18
జొహర్	: 12.30	ఇషా	: 7.31
అసర్	: 4.41		

ఘోరం.. చదువుల సారం



యోగేంద్ర యాదవ్

ఇప్పుడు వాస్తవంగా ఎదురవుతున్న సమస్య విద్యా ప్రమాణాల స్థాయి. మన పాఠశాలలు అందిస్తున్న విద్య స్థాయి అత్యంత నిరాశాజనకంగా ఉన్నదని ఆ నివేదిక వెల్లడించింది. 14–18 సంవత్సరాల మధ్య వయస్కులైన బాలబాలికలు తమ మాతృభాషలో ఉన్న వచనాన్ని కూడా చదవలేకపోతున్నారు. నిజానికి మాతృభాషలో ఉన్న వాక్యాలను చదవగలిగే సామర్థ్యం వారికి ఎనిమిదేళ్లు నిండే సరికే రావాలి. ఈ సర్వే పరిధిని బట్టి 57 శాతం బాలబాలికలు ప్రాథమిక అంకగణితంలో లెక్క కూడా పరిష్కరించలేకపోతున్నారు. అంటే 591ని 4తో భాగహారం కూడా చేయలేకపోతున్నారు.

దేశంలో విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో విశదీకరించే పెద్ద నివేదికలు రెండు గడచిన మాసంలో వెలువడ్డాయి. ఇందులో ఒకటి అధికారికమైనది కాగా, రెండోది అనధికారిక నివేదిక. ఈ రెండూ కూడా ఇప్పుడు బోధిస్తున్న విద్య దేశానికి ఏమి ఇస్తున్నదో ఒక సమగ్ర చిత్రాన్ని మన కళ్ల ముందు రూపు కట్టిస్తాయి. పాఠశాలల్లో బోధించే వివిధ పాఠ్యాంశాల నుంచి పిల్లలు ఏం నేర్చుకున్నారు అనే విషయాన్ని అధికారిక నివేదిక వివరించింది. పిల్లలు ఏం చదువుకున్నప్పటికీ వాళ్ల సామర్థ్యం ఏపాటిది అనే విషయానికి అనధికారిక నివేదిక అద్దం పట్టింది. మరేదైనా ఇతర దేశంలో ఎక్కడైనా సరే, ఈ నివేదిక వ్యవహారం పత్రికలలో పతాకశీర్షికగా చోటు దక్కించుకునేది. భవిష్యత్తును గురించి లోతుగా ఆలోచించే మరే ఇతర దేశంలో అయినా ఇలాంటి సర్వేలను విశ్లేషిస్తూ పుంఖానుపుంఖాలుగా వార్తలు వెలువడేవే కూడా. ఇండియాలో తప్ప మరెక్కడైనా అయితే ఈ అంశం మీద గంటల తరబడి టీవీ చానళ్లలో చర్చలు జరిగేవి. కానీ ఇంకా విడుదలకు నోచుకోని ఒక సినిమా గురించీ, ఒక కల్పిత పాత్రను గురించీ చర్చించడానికి మాత్రం మనకు బోలెడు సమయం ఉంటుంది. కానీ భావి భారత పౌరుల శ్రేయస్సు కోసం చర్చించేందుకు మనకు సమయం ఉండదు. భారతీయులం మాత్రమే ఇలా వ్యవహరించగలం.

విద్య నాణ్యతా ప్రమాణాలే లక్ష్యంగా

విద్య స్థితిగతుల వార్షిక నివేదిక –2017 (ఏఎస్ఆర్) పేరుతో వెలువడినది–అనధికారిక సర్వే. దీనిని ప్రఖ్యాత ప్రభుత్వేతర సంస్థ 'ప్రాథమ్' విడుదల చేసింది. గ్రామీణ ప్రాంతాలలో విద్యా ప్రమాణాలలోని లోటుపాట్లను అందరి దృష్టికి తీసుకువెళ్లే ఉద్దేశంతో ప్రాథమ్ దశాబ్దకాలంగా ఇలాంటి నివేదికలను విడుదల చేస్తున్నది. ఈసారి వెలువరించిన నివేదిక మరీ ప్రత్యేకమైనది. దీనికి 'మూలసూత్రాలకు ఆవల' అని పేరు పెట్టారు. 14–18 సంవత్సరాల మధ్య వయసు ఉన్న విద్యార్థులు విద్యను ఆకళింపు చేసుకుంటున్న స్థాయిల మీద ఈ నివేదిక ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. దేశంలోని 24 రాష్ట్రాలలో ఒక్కొక్క జిల్లా వంతున సర్వే కోసం ఎంచుకున్నారు. యువతీయువకులను ప్రశ్నలను అడిగేందుకు మొత్తం 23,000 ఇళ్లను ఎంపిక చేశారు. పకడ్బందీగా రూపొందించిన ఈ సర్వే కొంతమేర అందరి దృష్టిని ఆకర్షించింది. అయితే సర్వే ఉద్దేశం విద్యలో నాణ్యతా ప్రమాణాలు కాబట్టి ప్రశ్నలు అందుకు తగ్గట్టు కొన్ని తేలికగా ఉన్నాయి.

రెండవది, అంటే అధికారిక సర్వే విద్యా పరిశోధన, శిక్షణ జాతీయ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) విడుదల చేసినది. ఎంతో ప్రతిష్ఠ ఉన్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఇది. అంటే జాతీయ స్థాయిలో విద్య సాధించిన విజయాల మీద నివేదిక. ఈ సర్వే చాలా విషయాలలో విస్తృత స్థాయిలో ఉంటుంది. ఇది దేశంలోని 701 జిల్లాలను తన పరిధిలోకి తీసుకున్న నివేదిక. లక్షా పదివేల పాఠశాలలు, 21 లక్షల విద్యార్థుల విద్యా ప్రమాణాలను గురించి వివరించింది. ఈ సర్వేకు ఉన్న విలువ ఏమిటంటే, ఇది చాలా విశ్వసనీయమైన గణాంకాలను అందిస్తుంది. అయితే చాలా కీలకాంశాలు గ్రాఫ్‌లు, పట్టికల వెనుక అందీఅందకుండా ఉంటాయి. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ సర్వే జాతీయ నివేదికను వెల్లడించరాదని ఎన్‌సీఈఆర్‌టీ భావించింది. ఇప్పుడు మనకు లభ్యమైన సర్వేలు కేవలం జిల్లా స్థాయికి సంబంధించినవే. ఒక్కొక్క జిల్లాకు సంబంధించి 12 నివేదికలు ఉంటాయి. ఇవి చదవడం కొంచెం కష్టమే.



నిరాశాజనకమైన విద్య

మనందరం భావిస్తున్నట్టే పిల్లలు పాఠశాలలో చేరడం ఇప్పుడు విద్యారంగాన్ని వేధిస్తున్న పెద్ద సమస్య కాదని విద్య స్థితిగతుల వార్షిక నివేదిక –2017 కూడా పేర్కొన్నది. ఎందుకంటే ప్రస్తుతం పాఠశాలలో చేరకుండా ఉండిపోయిన పిల్లలు 14 శాతమే. ఇప్పుడు వాస్తవంగా ఎదురవుతున్న సమస్య విద్యా ప్రమాణాల స్థాయి. మన పాఠశాలలు అందిస్తున్న విద్య స్థాయి అత్యంత నిరాశాజనకంగా ఉన్నదని ఆ నివేదిక వెల్లడించింది. 14–18 సంవత్సరాల మధ్య వయస్కులైన బాలబాలికలు తమ మాతృభాషలో ఉన్న వచనాన్ని కూడా చదవలేకపోతున్నారు. నిజానికి మాతృభాషలో ఉన్న వాక్యాలను చదవగలిగే సామర్థ్యం వారికి ఎనిమిదేళ్లు నిండేసరికే రావాలి. ఈ సర్వే పరిధిని బట్టి 57 శాతం బాలబాలికలు ప్రాథమిక అంకగణితంలో లెక్క కూడా పరిష్కరించలేకపోతున్నారు. అంటే 591ని 4తో భాగహారం కూడా చేయలేకపోతున్నారు. ఇందులో చాలామంది పాఠశాలలో కొద్దిపాటి ఇంగ్లిష్‌ను కూడా చదువుకుంటున్నారు. కానీ వారిలో దాదాపు సగం మంది 'వాటీజ్ ది టైమ్' వంటి సులభమైన వాక్యాలను కూడా చదవలేకపోతున్నారు.

ఆ వయసు పిల్లలు వాళ్ల వాళ్ల పాఠశాలల్లో నేర్చుకున్న దానిని బట్టి దేశానికి ఏమి ఇవ్వగలరో ఒక్కసారి పరిశీలిద్దాం. ఇది కూడా మనకున్న నమ్మకం స్థాయిని ఏ మాత్రం పెంచేదిగా లేదు.

డబ్బులు కూడా లెక్కపెట్టలేరు

పాఠశాలలకు వెళుతున్న ఆ వయసు పిల్లల్లో కనీసం నాలుగో వంతు మంది డబ్బులు లెక్కపెట్టలేరు. 40 శాతం మంది చేతి గడియారం చూసి సమయం ఎంతయిందో చెప్పలేరు. 60 శాతం మంది సమయం, పొడవు వెడల్పులను గణించి చెప్పలేరు. ఏదైనా ఒక ప్యాకెట్ మీద రాసిన నిబంధనలను చదవలేనివాళ్లు 46 శాతం ఉన్నారు. వీరంతా పాఠశాలలకు వెళ్లిన విద్యావంతులని చెప్పుకోదగినవారే. 36 శాతం మందికి మార్కెట్ అంచనాలు తెలియవు. ఇంకా ఆశ్చర్యం, భారత దేశ పటం చూపించి మీ రాష్ట్రం ఎక్కడుందో గుర్తించమంటే గుర్తించలేని వారు 58 శాతం ఉన్నారు.

ఇంకా విశ్వసనీయమైన సర్వేను డీకోడ్ చేసి పరిశీలిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి. కానీ ప్రాథమిక విషయాలే మనలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ సర్వే చూసిన తరువాత వివిధ కాలాలలో వివిధ స్థాయిలలోని విద్యార్థులను గురించి బేరీజు వేసి చూడడానికి ఈ సర్వే మనకు అవకాశం ఇస్తుంది. కానీ ఇందులో వినిపించే ఒక శుభవార్త కూడా ఉంది. సాధించడం అనే అంశానికి సంబంధించి బాలబాలికల మధ్య అంతరం గణనీయంగా తగ్గింది. ఆ మాటకొస్తే కొన్ని పాఠ్యాంశాలకు సంబంధించి బాలుర కంటే బాలికలే ముందంజలో ఉన్నారని కూడా చెప్పాలి. పట్టణ–గ్రామీణ ప్రాంతాల పాఠశాలలు; ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు– అభివృద్ధి చెందిన వర్గాలకు చెందిన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు నడుమ అంతరం మాత్రం చాలా హెచ్చుగా కనిపిస్తోంది. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య అంతరం కూడా ఎక్కువగానే ఉంది. ఈసారి వచ్చిన జాతీయ స్థాయి సాధన సర్వేలో బాగా కలవరపెట్టే అంశం విద్యా ప్రమాణాలలో దారుణమైన పతనం.

గ్రామీణ ప్రాంత పాఠశాలలను చూస్తే చాలు

నిజానికి ఈ సర్వేలు వెల్లడిస్తున్న అంశాలు దేశానికి కొత్తేమీ కావు. దేశంలోని సాధారణ పాఠశాలల స్థితిగతులను గురించి అవగాహన ఉన్నవారు ఈ సర్వే ఫలితాలను చూసి దిగ్భ్రాంతిని వ్యక్తం చేయడం కూడా జరగదు. ముఖ్యంగా గ్రామీణ భారతంలోని పాఠశాలలను చూస్తే అసలు ఆశ్చర్యం కలగదు. కానీ ఈ సర్వేల ఫలితాలు మన పాఠశాల విధానంలోని లోటుపాట్లకు అద్దం పడుతున్నాయని మాత్రం చెప్పవచ్చు. ఈ దుస్థితి నుంచి చదువును రక్షించుకోవడానికి జిల్లా స్థాయిలో తీసుకోవలసిన చర్యల గురించి ఈ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. అయితే నిజంగా వేసుకోవలసిన ప్రశ్న ఒకటి ఉంది. ఇదంతా ఎవరు వింటారు? విద్యాభివృద్ధి గురించి పెద్ద పెద్ద ప్రకటనలు చేస్తూ, బడ్జెట్‌లో మాత్రం అరకొరగా కేటాయింపులు చేసే చోట ఈ ప్రశ్నకు ఆశాజనకమైన సమాధానాన్ని ఆశించడం సాధ్యం కాదు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల తరువాత పరిస్థితి ఇది. విద్యను ఒక హక్కుగా ప్రకటించుకున్నాక కూడా నాసిరకం విద్యతోనే తరం తరువాత తరం పాఠశాలల ప్రాంగణాలను వీడి వస్తున్నాయి. ఆపరేషన్ బ్లాక్‌బోర్డ్ సహా, ఎన్నో కమిషన్లు మన విద్యారంగాన్ని క్షాళన చేయడానికి ఉద్దేశించినవే. కానీ ఫలితం మాత్రం ఆశాజనకంగా లేదని ఈ తాజా సర్వేలు నిర్ద్వంద్వంగా వెల్లడిస్తున్నాయి. భావి భారతదేశం తరగతి గదులలోనే రూపుదిద్దుకుంటుందన్న వాస్తవం గ్రహించడానికి మన రాజకీయ నాయకత్వానికి ఇంకా ఎంత సమయం కావాలో తెలియడం లేదు. విద్యారంగానికి కేటాయింపులు తక్కువగా చేయడమే కాదు, ఆ మంత్రిత్వ శాఖలను కూడా సరైన వ్యక్తులకు అప్పగించడం లేదు. సరైన వ్యక్తులు వచ్చినప్పటికీ విద్యను ఖర్చుగా పరిగణించే వాతావరణం ఎక్కువగా కనిపించడం వల్ల వారు చేయగలిగింది కూడా చేయలేకపోతున్నారు. భారత్ కీర్తి పతాక అంతర్జాతీయంగా రెపరెపలాడుతున్నదని చెబుతున్న నాయకత్వం గ్రామీణ భారతంలోని విద్య స్థితిగతులను పట్టించుకొనకపోతే; బడుగు వర్గాలకు, ఉన్నత వర్గాలకు మధ్య విద్యాపరమైన అంతరాలు తొలగకపోతే ఎదురయ్యే పరిణామాలు దేశ భవిష్యత్తును మసకబారుస్తాయి.

వ్యాసకర్త స్వరాజ్ అభియాన్, జైకిసాన్ సంస్థల్లో సభ్యులు । 98688 88986

సమాచార నిరాకరణ నేరం

సమాచార చట్టం వచ్చి 13 ఏళ్లు దాటుతున్నా ఇంకా సెక్షన్ 8 ని దుర్వినియోగం చేయడం దురదృష్టకరం. ఆరోపణలకు గురైన ఉద్యోగి తప్పిదాన్ని రుజువు చేయడానికి ముందు ఆరోపణలకు సంబంధించిన వివరాలు అతనికి పూర్తిగా ఇవ్వడం న్యాయం.

విశ్లేషణ




మాడభూషి శ్రీధర్

సమాచార అధికారుల అసంబద్ధ సమాధానాలతో సెక్షన్ 8 నియమాలను ఎడా పెడా దుర్వినియోగం చేస్తున్నారు. ఎంక్వయిరీ నడుస్తున్నదన్న కారణంగా కోరిన సమాచారం నిరాకరించడానికి వీల్లేదని, వెల్లడి చేయడం వల్ల ఎంక్వయిరీలో ప్రతిబంధకం ఏర్పడుతుందని రుజువు చేయగలిగినప్పుడే సమాచారం నిరాకరించడం సాధ్యమని సెక్షన్ 8(1) హెచ్ వివరిస్తున్నది. కాని ఆ సెక్షన్ పేరును వాడుకుని నిరాకరిస్తూ ఉన్నారు. కోర్టులో కేసు పెండింగ్, పోలీసులు, ఇతర సంఘాలు దర్యాప్తు చేస్తున్నాయని, నేర నిర్ధారణ జరుగుతున్నదంటూ సమాచారం నిరాకరించడం చట్టవిరుద్ధం.

2007వ సంవత్సరంలో భగత్ సింగ్ వర్సెస్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్ అండ్ అదర్స్ కేసులో కేవలం దర్యాప్తు ప్రక్రియ అమలులో ఉన్నంత మాత్రాన అది సమాచార నిరాకరణకు కారణం కాబోదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఏ అథారిటీ అయితే ఆ కారణంపైన సమాచారాన్ని నిరాకరిస్తున్నదో, ఆ అధికారి సమాచారాన్ని ఇస్తే దర్యాప్తు ప్రక్రియ కుంటుపడుతుందనడానికి సంతృప్తికరమైన కారణాన్ని చూపవలసి ఉంటుంది. పరిశోధనా ప్రక్రియను దెబ్బతీస్తుందనే అభిప్రాయానికి రావడానికి తగిన సాక్ష్యం కూడా ఉండాలి. లేకపోతే సమాచారం ఇవ్వకుండా ఆపడానికి సెక్షన్ 8(1)(హెచ్) నియమం ఒక స్వర్గధామంగా ఉపయోగపడుతుందని హైకోర్టు ఆక్షేపించింది. శ్రీ సత్యారాయణన్ వర్సెస్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేసులో సీఐసీ 2011 నాటి ఉత్తర్వులో ఇటువంటి ఆదేశాన్నే వెలువరించింది. పి. శివకుమార్ వర్సెస్ సిండికేట్ బ్యాంక్ కేసులో కూడా 2012లో ఇచ్చిన తీర్పులో కేంద్ర సమాచార కమిషన్ ఆర్టీఐ చట్టం సెక్షన్ 8(1) (హెచ్)లో పేర్కొన్న పదాలను వివరిస్తూ, దర్యాప్తు పెండింగ్‌లో ఉంటే సమాచారం ఇవ్వకూడదనేదే పార్లమెంటు ఉద్దేశమయితే ఆ విధంగానే పదాలు రచించేదని ప్రత్యేకంగా దర్యాప్తునకు ప్రతిబంధకంగా కనిపించే సమాచారాన్ని మాత్రమే వెల్లడించవద్దని చెప్పి ఉండేది కాదని పేర్కొన్నది.

తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నప్పటికీ దానికి సంబంధించిన పత్రాల ప్రతులు అడిగితే ఇవ్వలేదని శ్రీనివాసులు సమాచార కమిషన్ ముందు అప్పీలులో విన్నవించారు. తనపై దర్యాప్తు జరిపిన తరువాత నివేదిక ప్రతి తనకే ఇవ్వలేదని, దర్యాప్తు పూర్తయిన తరువాత కూడా తనకు కావలసిన కాగితాలు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. ప్రతి దానికీ సెక్షన్ 8 కింద మినహాయింపు క్లాజులను చూపిస్తారే కాని ఏ నియమం ప్రకారం, ఏ కారణాల వల్ల సమాచారం నిరాకరించారో వివరించకపోవడం జన సమాచార అధికారులు చేసే ప్రధానమైన పొరపాటు. సమాచార చట్టం వచ్చి 13 ఏళ్లు దాటుతున్నా ఇంకా సెక్షన్ 8ని దుర్వినియోగం చేయడం దురదృష్టకరం. ఆరోపణలకు గురైన ఉద్యోగి తప్పిదాన్ని రుజువు చేయడానికి ముందు ఆరోపణలకు సంబంధించిన వివరాలు అతనికి పూర్తిగా ఇవ్వడం న్యాయం. తాను నేరస్తుడు కాదని రుజువు చేసుకోవడానికి, చెప్పుకునేందుకు పూర్తి అవకాశం ఇవ్వాల్సిందే. ఆ అవకాశం ఇవ్వకపోతే సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన కింద ఆ దర్యాప్తు గానీ, దానిపై ఆధారపడి తీసుకున్న చర్య గానీ చెల్లకుండా పోతాయి. అనుమతి తీసుకోకుండా విధులకు హాజరు కాలేదన్నది ఆరోపణ అయితే అందుకు



కావలసిన హాజరీ వివరాలు నిందితుడికి ఇవ్వవలసి ఉంటుంది. సమాచార అధికారిగా ఉండవలసిన సీపీఐఓ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ పదవిలో తొమ్మిదేళ్లనుంచి ఉంటూ పై అధికారులతో కుమ్మక్కయి సమాచార దరఖాస్తులను పూర్తిగా నిరాకరిస్తున్నారని, వీరి ఆధ్వర్యంలో సమాచార చట్టం పూర్తిగా దెబ్బతింటున్నదని ఆరోపించారు దరఖాస్తుదారుడు. ప్రజాసంబంధ అధికారి డీఎస్ పాటిల్‌పై జరిమానా ఎందుకు విధించకూడదో కారణాలు తెలియజేయాలని నోటీసు జారీ చేసింది. అతని హాజరీకి సంబంధించిన రికార్డులను 15 రోజుల్లో ఇవ్వాలని కూడా ఆదేశించింది.

శ్రీనివాసులుకి 10.12.2015 నాడు సమాధానం ఇచ్చామని, 2014–15 నాటి హాజరీ రిజిస్టర్‌లను పరిశీలించడానికి రావచ్చునని అతనికి అవకాశం ఇచ్చామని తన వివరణలో డీఎస్ పాటిల్ (మాజీ సీపీఐఓ) వివరించారు. 21.06.2017 నాడు కమిషన్ ఉత్తర్వులు వచ్చిన తరువాత పూర్తి సమాచారం ఇచ్చామని చెప్పారు.

పై అధికారిని ధిక్కరించినందున శ్రీనివాసులు పైన రూల్ 16 కింద క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు నోటీసు జారీ చేసి దర్యాప్తు చేపట్టామనీ, విచారణలో ఆరోపణలు రుజువై ఇంక్రిమెంట్‌ను మూడేళ్లపాటు నిలిపివేయాలని నిర్ణయించారని వివరించారు. శ్రీనివాసులు మొదటి అప్పీలు తిరస్కరించిన తరువాత అతనిపై దర్యాప్తు పూర్తయి ఇంక్రిమెంట్ నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నారని సీపీఐఓ పాటిల్ చెప్పారు. కేవలం కోర్టులో సవాలు చేయడానికి మాత్రమే ఈ పత్రాలు అడుగుతున్నాడని, కనుక ముందుగా సమాచారం ఇవ్వలేదని వివరించారు. సీపీఐఓ మరో వాదం లేవదీశారు. తనపై విచారణకు సంబంధించిన సమాచారం అడుగుతూ ఉంటే అది మూడో వ్యక్తి సమాచారం కాబట్టి సెక్షన్ 11 ప్రకారం తాను సమాచారం ఇవ్వలేదని చెప్పారు.

అయితే సీపీఐఓ అది ఏ మూడోవ్యక్తి సమాచారమో తెలియజేయలేదు. ఆ వ్యక్తిని సంప్రదించారో లేదో తెలియదు. తనపై క్రమశిక్షణా చర్యల వివరాలు అడిగితే అది మూడో వ్యక్తి సమాచారం ఏ విధంగా అవుతుందో చెప్పలేకపోయారు. హాజరీ పట్టిక విచారణకు సంబంధించిన వివరాలు ఇవ్వవలసినవే. ఆ పత్రాలు అతని కోర్టు వివాదానికి అవసరమో కాదో పూర్తిగా తెలుసుకోకుండా, కోర్టుకు కేసును తీసుకువెళ్తాడు కనుక అడిగిన సమాచారం ఇవ్వబోమనడం మరొక తప్పు.

మొత్తానికి సమాచారాన్ని అన్యాయంగా నిరాకరించారని తేలింది. అందుకు బాధ్యుడైన సీపీఐఓ డీఎస్ పాటిల్ పైన సమాచార హక్కు చట్టం 20 కింద 25 వేల రూపాయల జరిమానా విధిస్తూ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. (CIC/BS/A/2016/000955 ఎం. శ్రీనివాసులు వర్సెస్ పోస్టల్ డిపార్ట్ మెంట్. కేసులో 18.1.2018 నాటి ఆదేశం ఆధారంగా).

వ్యాసకర్త కేంద్ర సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

అకాడమీ సిగలో కొత్త కాంతి

తెలుగు భాషా కమిటీ కార్యవర్గ సభ్యులుగా, కమిటీ కన్వీనర్‌గా ప్రజా కవి, బహు పురస్కృత, బహు కావ్య రచయిత కె. శివారెడ్డి ఎన్నిక కావడం తెలుగు సాహిత్య వికాసానికి మంచి పరిణామం.


సందర్భం



రామతీర్థ

సాహిత్య అకాడమీ కొత్త కార్యవర్గం ఏర్పడగా, అధ్యక్ష హోదా ఈసారి 1998 తరువాత తిరిగి, కన్నడ దేశానికి దక్కింది. 1998లో యు.ఆర్ అనంత మూర్తి తరువాత, ప్రస్తుతం ఫిబ్రవరి పన్నెండున సాహిత్య అకాడమీ అధ్యక్ష పదవికి ప్రముఖ సాహితీ వేత్త, ఎనభయ్యేళ్ళ చంద్రశేఖర కంబర్ ఎంపిక అయ్యారు. 1964 వరకూ జవహర్‌లాల్ నెహ్రూ దేశ ప్రధాని అయినందుకు కాకుండా, ఆయన స్వయానా రచయిత, సాహిత్య వేత్త కావడం మూలాన అకాడెమీ అధ్యక్ష పదవిలో కొనసాగారు.

అటుపై సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్, సునీతి కుమార్ చటర్జి, కె.ఆర్ శ్రీనివాస అయ్యంగార్, (రెండు సార్లు) ఉమాశంకర్ జోషి, బీరేంద్ర కుమార్ భట్టాచార్య, యు.ఆర్. అనంత మూర్తి, రమాకాంత్ రథ్, గోపిచంద్ నారంగ్, సునీల్ గంగోపాధ్యాయ్ (పదవిలో మరణం) విశ్వనాథ్ ప్రసాద్ తివారీ నిర్వహించగా, 2018 నుంచి 2022 వరకూ ఈ జాతీయ సంస్థ అధ్యక్ష పదవిలో చంద్రశేఖర్ కంబర్ బాధ్యతలు నిర్వహిస్తారు.



కంబర్ ప్రఖ్యాత రచయిత, జానపద గేయ కర్త, సినిమా దర్శకులు కావడం, బహు కళా రంగాల్లో అనుభవం ఉన్న వ్యక్తి, సాహిత్య అకాడమీకి తగు దిశా దర్శనం చేయగలరు అన్న ఆశాభావం నలుదిశలా వ్యక్తం అవుతున్నది. హంపి లోని కన్నడ విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతిగా, ఉత్తర కన్నడ మాండలికం తన కవితలు, నాటకాలు, ఇతర రచనల్లో సృజనాత్మకంగా ఉపయోగించిన సాహిత్యవేత్తగా మంచి గుర్తింపు ఉన్నవారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకి, కర్ణాటక నాటక అకాడమీకి కూడా వారు ఉన్నత పదవులని నిర్వహించారు. షికాగో విశ్వ విద్యాలయంలో కొంత కాలం బోధన తరువాత, తాను బెంగళూర్ విశ్వ విద్యాలయంలో రెండు దశాబ్దాలకు పైగా ఆచార్య వృత్తిలో ఉన్నారు.

ఇరవై అయిదు నాటకాలు, పదకొండు సంపుటాల కవిత్వం, అయిదు నవలలు, పదహారు పరిశోధనలు వారి నిరంతర సాహిత్య కృషిలో భాగంగా వెలుగు చూశాయి. జానపద కళా రంగం, విద్యా, సాహిత్య అంశాల పైన పలు రచనలు వెలువరించారు. వీరి నాటకాలు భారతీయ భాషలు, అలాగే ఆంగ్లంలోకి కూడా అనువాదం జరిగాయి. కర్ణాటక రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల కోసం వీరు కొన్ని డాక్యుమెంటరీలు కూడా నిర్మించారు.

సాహిత్య అకాడమీ అవార్డులతో పాటు, జ్ఞాన్ పీఠ, కబీర్ సమ్మాన్, కాళిదాస్ సమ్మాన్, మొదలయిన పురస్కారాలు పొందినవారు. ఫుల్‌బ్రైట్ స్కాలర్‌గా, సాహిత్య పరిశోధకులు కూడా. దక్షిణ భారతీయ సాహిత్య రంగం, మరింత ప్రాధాన్యత సంతరించుకుని, తన ప్రతిష్ఠను పెంపొందించుకోగలదని ఆశిద్దాము.

అలాగే తెలుగు భాషా కమిటీ కార్యవర్గ సభ్యులుగా, కమిటీ కన్వీనర్‌గా ఆధునిక కవిత్వ చేతనతో ఎన్నో సంపుటాలు వెలువరించిన ప్రజల కవి, ప్రముఖ కవి, బహు పురస్కృత కె. శివారెడ్డి ఎన్నిక కావడం మంచి పరిణామం. తెలుగు భాషకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు గల నిధులను రెండు రాష్ట్రాల లోనూ సముచితంగా వినియోగించడంలో మేలైన పాత్ర పోషించాలని ఆశిద్దాం.

తెలుగు ప్రాంతాల్లో జరగకుండా పోతున్న ప్రతిష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, అలాగే, దక్షిణ భారతీయ సాహిత్య సమ్మేళనం వంటి అనేక ప్రాతిపదికలు పరిశీలనలో ఉండి పోయాయి. ముఖ్యంగా అనువాద ప్రణాళిక విస్తరించి, నిర్ణీతంగా, తెలుగు సాహిత్య రచనలు భారతీయ భాషల్లోకి, ఆంగ్లంలోకి వెళ్ళేలా, కొత్త కమిటీ ఆలోచనలు చేయాలి.

అందుకు తగు పరిణతి, అంతర్జాతీయ దృక్పథం, ప్రగతిశీల స్వభావం, బహుళ సాంస్కృతిక చైతన్యం కలిగిన శివారెడ్డి వంటి కన్వీనర్ వలన తెలుగు సాహిత్య సంఘం, తన ప్రతిష్ఠ, దేశ భాషల్లో పెంపొందేలా, వీరి నేతృత్వంలో పని చేస్తుందని ఆశించవచ్చును. సాహిత్య రంగంలో కొత్త కమిటీ జాతీయంగా, భాషీయంగా ఏర్పాటు అయిన ఈ సందర్భంలో జాతి తరపున శుభాకాంక్షలు.

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత
మొబైల్ : 98492 00385

5,100 కోట్ల రూపాయల ఆస్తుల స్వాధీనం

11,400 కోట్ల నీరవ్ మోదీ ఘరానా మోసం కేసులో ఈడీ కొరడా

- 17 చోట్ల ఈడీ సోదాలు.. భారీగా వజ్రాలు, ఆభరణాలు, బంగారం జప్తు
- జనవరిలోనే విదేశాలకు ఉడాయించిన నీరవ్ కుటుంబం
- నీరవ్ పాస్‌పోర్టు రద్దు చేయాలని సీబీఐ, ఈడీ లేఖ

ముంబై:

యావద్దేశాన్ని నివ్వెరపరుస్తూ వజ్రాభరణాల వ్యాపారి నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంకుతో పాటు ఇతర బ్యాంకుల్ని రూ. 11,400 కోట్ల మేర మోసగించిన కేసులో దర్యాప్తును సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ)లు ముమ్మరం చేశాయి. భారతదేశ చరిత్రలో అతి పెద్ద బ్యాంకు కుంభకోణంగా పేర్కొంటున్న ఈ కేసులో గురువారం ఈడీ భారీ మొత్తంలో ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంది. కేసులో ప్రధాన సూత్రధారుడైన బిలియనీర్, ఆభరణాల డిజైనర్ నీరవ్ మోదీకి చెందిన దుకాణాలు, ఇళ్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహించి రూ. 5,100 కోట్ల విలువైన వజ్రాలు, ఆభరణాలు, బంగారాన్ని సీజ్ చేసింది. బ్యాంకులకు వేల కోట్లు కుచ్చుటోపీ పెట్టి విదేశాలకు ఉడాయించిన విజయ్ మాల్యా తరహాలోనే.. ఈ కేసులో నిందితులుగా ఉన్న మోదీ, సోదరుడు నిశాల్, భార్య అమీ, వ్యాపార భాగస్వామి మోహుల్ చోక్సీలు కూడా కుంభకోణం బయటపడక ముందే విదేశాలకు ఉడాయించారు. ఈ ఏడాది జనవరి చివరి వారంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) సీబీఐకి ఫిర్యాదు చేయగా.. జనవరి మొదటి వారంలోనే నిందితులంతా దేశం నుంచి జారుకున్నారు. నీరవ్ ఇతరులు కలిసి తమ అధికారులతో కుమ్మక్కై ముంబై బ్రాంచీలో రూ. 280 కోట్ల మేర మోసగించారని జనవరి 29న సీబీఐని పీఎన్‌బీ ఆశ్రయించింది. అయితే ఈ కుంభకోణం విలువ మొత్తంగా రూ. 11,400 కోట్ల పైనే ఉంటుందని ఫిబ్రవరి 13న మరో ఫిర్యాదు చేసింది.

ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, జైపూర్‌లో తనిఖీలు

సీబీఐ ఎఫ్ఐఆర్, పీఎన్‌బీ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన ఈడీ 17 ప్రాంతాల్లో గురువారం సోదాలు నిర్వహించింది. కుర్లాలోని నీరవ్ మోదీ నివాసం, కాలాఘోడాలోని నగల దుకాణం, బాంద్రా, లోయర్ పరేల్‌లోని కంపెనీ కార్యాలయాలు, సూరత్‌లో మూడు చోట్ల, ఢిల్లీలోని చాణక్యపురి, డిఫెన్స్ కాలనీ షోరూంలతో పాటు హైదరాబాద్, జైపూర్‌లో కూడా తనిఖీలు కొనసాగాయి. ముంబైలో నీరవ్, ఇతర నిందితులకు చెందిన ఆస్తుల్ని జప్తు చేశామని, అతని పాస్‌పోర్టును రద్దు చేయాలని విదేశాంగ శాఖను కోరతామని ఈడీ అధికారులు తెలిపారు. మోదీ పాస్‌పోర్టును రద్దు చేయాలని సీబీఐ కూడా ఇప్పటికే కోరింది. తనిఖీల్లో రూ. 5,100 కోట్ల విలువైన వజ్రాలు, ఆభరణాలు, బంగారం సీజ్ చేశామని, రూ. 11,400 కోట్ల అక్రమాలపై విచారణ పరిధి ఉంటుందని ఈడీ తెలిపింది.

150 ఎల్‌వోయూ అందజేసిన బ్యాంకు

రూ.11,400 కోట్ల మేర అక్రమ లావాదేవీలు నెరిపేందుకు నీరవ్ మోదీతోపాటు అతని కుటుంబసభ్యులు వాడుకున్న 150 ఎల్‌వోయూ(లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్)లను గురువారం సీబీఐకి అందజేసినట్లు పీఎన్‌బీ తెలిపింది. నీరవ్ మోదీతో పాటు ఈ కేసులో ఉన్న మిగతా వారితో కుమ్మక్కైన తమ అధికారులు అక్రమంగా జారీ చేసిన 150 ఎల్‌వోయూలను ఇప్పటి వరకు కనుగొన్నామని పేర్కొంది. ఈ ఎల్‌వోయూలను హాంకాంగ్‌లో పనిచేస్తున్న అలహాబాద్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు శాఖలకు జారీ చేసినట్లు సీబీఐకి తెలిపింది. 2017లో పీఎన్‌బీని రూ. 280.70 కోట్ల మేర మోసగించారన్న ఆరోపణలపై భారతీయ కుబేరుల్లో ఒకరిగా ఫోర్బ్స్ జాబితాలో నిలిచిన మోదీ, అతని సోదరుడు నిశాల్, భార్య అమి, వ్యాపార భాగస్వామి మోహుల్ చినుభాయ్ చోక్సీ, డైమండ్ ఆర్ అజ్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్స్‌కి చెందిన అందరు భాగస్వాములతో పాటు ఇద్దరు బ్యాంకు అధికారులు గోకుల్ నాథ్ శెట్టీ(రిటైర్డ్), మనోజ్ ఖారత్‌ల పేర్లను ఎఫ్ఐఆర్‌లో సీబీఐ చేర్చింది. ముంబై బ్రాంచ్‌కు చెందిన పీఎన్‌బీ సిబ్బంది నీరజ్ అండ్ కోకు తప్పుడు 'లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్ఓయూ)'ల జారీచేయగా, ఈ ఎల్ఓయూతో విదేశాల్లో భారతీయ బ్యాంకుల నుంచి రుణాలు పొందారనేది ప్రధాన ఆరోపణ. థర్డ్ పార్టీకి తమ ఖాతాదారుడు చెల్లించాల్సిన మొత్తానికి హామీనిస్తూ బ్యాంకులు ఈ ఎల్ఓయూలు జారీచేస్తుంటాయి. వీటిని హామీగా పెట్టుకుని విదేశాల్లోని బ్యాంకు శాఖలు రుణాలిస్తాయి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు తదితర 30 బ్యాంకుల నుంచి వీరు రూ. 11,400 వేల కోట్లకు పైగా రుణాలు పొందినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

ఎవరినీ వదిలిపెట్టం: ఆర్థిక శాఖ

పీఎన్‌బీని మోసగించిన కేసులో నిందితుల ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంటామని, ఎవరినీ వదిలి పెట్టమని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. 'ఇది ఒక్క బ్రాంచ్‌కు సంబంధించిన అంశం, ఈ కేసు ప్రభావం ఇతర బ్యాంకులకు వ్యాపించే అవకాశం లేదు' అని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ చెప్పారు. పీఎన్‌బీ వద్ద తగినన్ని నిధులు ఉన్నాయని అందువల్ల ఎలాంటి సమస్య ఉండదన్నారు.

'చోటా మోదీ' అనడంపై బీజేపీ అభ్యంతరం

ఈ కేసులో ఎంతటి వారినైనా దర్యాప్తు సంస్థలు వదిలిపెట్టవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రధానిపై చేస్తోన్న ఆరోపణల్లో వాస్తవం లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ చెప్పారు. నీరవ్ మోదీని కాంగ్రెస్ పార్టీ 'చోటా మోదీ' అని ప్రస్తావించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఈ కుంభకోణం 2011లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ప్రారంభమైంది. నీరవ్ వ్యాపార భాగస్వామి చోక్సీకి ఎవరి ఆశీర్వాదాలు ఉన్నాయి? 2011–13 మధ్యలో చోక్సీ సంస్థ గీతాంజలి జెమ్స్ ఆదాయం రెండింతలైంది' అని పేర్కొన్నారు. కుంభకోణం తమ ప్రభుత్వ హయాంలో బట్టబయలైందని, చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దావోస్‌కు ప్రధాని మోదీతో పాటు వెళ్లిన ప్రతినిధుల బృందంలో నీరవ్ లేడని, ఆయన సొంతంగానే దావోస్ వెళ్లారని ప్రసాద్ వెల్లడించారు.



ఢిల్లీలో నీరవ్ మోదీకి చెందిన వజ్రాభరణాల షోరూమ్

నీరవ్ దేశాన్ని దోచుకున్న మార్గాలివే: రాహుల్

ఈ భారీ కుంభకోణం గురించి చెప్పడమే తప్ప.. అడ్డుకునేందుకు మోదీ ప్రభుత్వం ఏమీ చేయలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీటర్‌లో స్పందిస్తూ.. 'దేశాన్ని నీరవ్ మోదీ దోచుకున్న మార్గాలివి.. 1. ప్రధాని మోదీని కౌగిలించుకోవడం 2. దావోస్‌లో మోదీతో కలిసి కనిపించడం తన పలుకుబడితో.. ఏ. రూ. 12, వేల కోట్ల దోపిడీ.. బీ. మాల్యా కేసులో లాగానే ప్రభుత్వం మరోవైపు చూస్తుండగా దేశం నుంచి జారుకున్నారు' అని ట్వీట్ చేశారు. మరోవైపు ప్రధాని మోదీతో పాటు దావోస్ వెళ్లిన వ్యాపార ప్రతినిధి బృందంలో నీరవ్ మోదీ ఉన్న ఫొటోను కాంగ్రెస్ విడుదల చేసింది. దేశం విడిచిపోయేలా నీరవ్ మోదీని ముందుగానే అప్రమత్తం చేశారా? అని కాంగ్రెస్ ప్రతినిధి సూర్జేవాలా ప్రశ్నించారు.

వదిలేది లేదు: పీఎన్‌బీ సీఎండీ

నీరవ్ మోదీ కుంభకోణం కేసులో తప్పుచేసిన వారు ఎంతటి సీనియర్లయినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని పీఎన్‌బీ సీఎండీ సునీల్ మెహతా స్పష్టం చేశారు. ఇది కేవలం ముంబైలోని ఒక్క శాఖకు మాత్రమే పరిమితమైన ఉదంతమని, మిగతా వాటికి విస్తరించినది కాదని ఆయన తెలిపారు. స్కామ్‌కి సంబంధించిన నిధులను నీరవ్ మోదీ చెల్లిస్తానంటున్నా.. ఇప్పటిదాకా స్పష్టమైన ఆఫర్ ఏదీ చేయలేదని మెహతా తెలిపారు. నీరవ్ నిర్మాణాత్మకమైన ప్రణాళికేదీ ప్రకటించలేదని, ఏవేవో అస్పష్టమైన ఆఫర్లు చేస్తున్నారని ఆయన చెప్పారు.




మింగేశారు.. మాయమయ్యారు

లలిత్ మోదీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) చైర్మన్‌గా పేరుప్రఖ్యాతులు గడించిన లలిత్ మోదీ, 2011లో నిబంధనలకు విరుద్ధంగా కొచ్చి టస్కర్స్ జట్టు యాజమాన్యం వివరాలను బయటపెట్టాడు. దీంతో బీసీసీఐ మోదీకి షోకాజ్ నోటీసులు జారీచేయడంతో పాటు ఐపీఎల్ బాధ్యతల నుంచి తప్పించింది. కుటుంబ సభ్యుల్ని చంపేస్తామని బెదిరింపులు రావడంతో చివరికి అదే ఏడాది మోదీ లండన్‌కు పారిపోయాడు.

విజయ్ మాల్యా: లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.9,000 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టి బ్రిటన్‌కు చెక్కేశాడు. మాల్యాను దేశం దాటి వెళ్లకుండా అడ్డుకోవాలని బ్యాంకులు 2016, మార్చిలో సుప్రీంకోర్టును ఆశ్రయించక ముందే ఆయన విదేశాలకు వెళ్లిపోయాడు.

దీపక్ తల్వార్: పన్ను ఎగవేతకు స్వర్గధామాలుగా మారిన దేశాల్లో వందల కోట్లు అందుకున్నారని ఆరోపిస్తూ కార్పొరేట్ కన్సల్టెంట్ దీపక్ తల్వార్‌పై ఐటీ శాఖ ఐదు కేసులు నమోదుచేసింది. యూపీఏ ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల సాయంతో దీపక్ కొన్ని విమానయాన సంస్థలకు ఆయాచిత లబ్ధి చేకూర్చాడని ఐటీశాఖ పేర్కొంది. కేసులు నమోదుకాకముందే దీపక్ యూఏఈకి పారిపోయాడు.

ఇటీవల దావోస్ సదస్సులో గ్రూపు ఫొటోలో ప్రధాని మోదీతో నీరవ్(వృత్తంలో). ఈడీ సోదాల్లో స్వాధీనం చేసుకున్న వజ్రాలు, ఆభరణాలు

జనవరిలోనే అందరూ పరార్

ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీ ఈ ఏడాది జనవరి 1నే విదేశాలకు పారిపోయినట్లు సీబీఐ గుర్తించింది. మరోవైపు జనవరి 23న దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో భారతీయ సీఈవోలతో ప్రధాని మోదీ దిగిన గ్రూప్ ఫొటోలో నీరవ్ కనిపించారు. ఈ నేపథ్యంలో అతను స్విట్జర్లాండ్‌లోనే ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఇక బెల్జియం పౌరుడైన నీరవ్ సోదరుడు నిశాల్ జనవరి 1న దేశం విడిచి పారిపోగా.. అమెరికా పౌరురాలైన మోదీ భార్య అమి, వ్యాపార భాగస్వామి, గీతాంజలి జ్యూయెలరీ ప్రమోటర్ మోహుల్ చోక్సీలు జనవరి 6న విదేశాలకు చెక్కేశారు. సీబీఐ కేసు అనంతరం జనవరి 29న వీరిపై లుకౌట్ నోటీసులు జారీచేశారు.

బెంగళూరులో భవనం కూలి ముగ్గురి మృతి



సాక్షి, బెంగళూరు: బెంగళూరులో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ముగ్గురు ప్రాణాలు కోల్పోగా ఏడుగురు గాయపడ్డారు. నగరంలోని కసవనహళ్లిలో రఫిక్ అనే వ్యక్తికి చెందిన ఐదంతస్తుల భవనాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కృష్ణారెడ్డి అనే కాంట్రాక్టర్ నిర్మిస్తున్నాడు. గురువారం సాయంత్రం భవనం ఓ వైపు అకస్మాత్తుగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన మరో ఏడుగురిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో భవనంలో 20 మంది దాకా పనిచేస్తున్నట్లు సమాచారం. శిథిలాల కింద మరింత మంది చిక్కుకుపోయి ఉంటారనే అనుమానంతో గాలింపు కొనసాగిస్తున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

తత్కాల్ టికెట్లపై వంద శాతం రీఫండ్

న్యూఢిల్లీ: తత్కాల్ ప్రయాణికులకు రైల్వేశాఖ గురువారం శుభవార్త తెలిపింది. తత్కాల్ కింద బుక్‌చేసుకున్న టికెట్లపై 100 శాతం రీఫండ్‌ను అందించనున్నట్లు రైల్వేశాఖ వెల్లడించింది. ఈ–టికెట్లతో పాటు కౌంటర్‌లో తీసుకున్న టికెట్లకు కూడా రీఫండ్ వర్తిస్తుందని పేర్కొంది. కింద పేర్కొన్న ఐదు సందర్భాల్లో టికెట్ ధర మొత్తాన్ని ప్రయాణికులకు తిరిగి చెల్లిస్తామంది. 1) ఒకవేళ రైలు రాక మూడు గంటలు అంతకన్నా ఎక్కువ ఆలస్యమైనప్పుడు 2) రైలును దారి మళ్లించినప్పుడు, 3) రైలును దారి మళ్లించినతర్వాత ప్రయాణికులు ట్రైన్ ఎక్కాల్సిన స్టేషన్ లేదా దిగాల్సిన స్టేషన్ లేదా రెండూ కొత్త మార్గంలో లేకపోతే, 4) ప్రయాణికులు ఎక్కాల్సిన కోచ్‌ను రైలుకు అనుసంధానించకపోతే, అధికారులు ప్రయాణికులకు ప్రత్యామ్నాయం కల్పించనప్పుడు, 5) రైలులో రిజర్వేషన్ చేసుకున్నదానికి బదులుగా లోయర్ క్లాస్‌లో ప్రయాణించేందుకు ప్రజలు ఇష్టపడకపోతే(ఒకవేళ ప్రయాణికులు ఇందుకు అంగీకరిస్తే రెండు టికెట్లకు మధ్య ఉన్న తేడాను రైల్వేశాఖ ఆ ప్రయాణికుడికి చెల్లిస్తుంది).

గుజరాత్‌లో రేషన్ బియ్యం అందట్లేదు

ప్రధాని మోదీ సోదరుడు ప్రహ్లాద్ ఆరోపణ

అహ్మదాబాద్: సాఫ్ట్‌వేర్ లోపాల కారణంగా గుజరాత్ పేద ప్రజలకు చౌకబియ్యం అందడం లేదని ప్రధాని మోదీ సోదరుడు, రేషన్ దుకాణదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రహ్లాద్ మోదీ సంచలన ఆరోపణ చేశారు. జాతీయ ఆహార భద్రత చట్టం కింద గుజరాత్‌లోని దాదాపు 17వేల రేషన్ దుకాణాల్లో 'మా అన్నపూర్ణ యోజన' పేరుతో రేషన్ బియ్యాన్ని అందజేస్తున్నారు. ఈ రేషన్ దుకాణాలన్నీ ఈ–ఎఫ్‌పీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా సెంట్రల్ డాటాబేస్‌తో అనుసంధానమై ఉన్నాయి. దీంతో లబ్ధిదారు తప్పనిసరిగా ఆధార్ వివరాలు, వేలిముద్ర ఇవ్వాలి. లేకుంటే రేషన్ బియ్యం రాదు. చాలా దుకాణాల్లో సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవటంతో లబ్ధిదారులు ఒట్టి చేతుల్తో వెళ్తున్నారని ప్రహ్లాద్ చెప్పారు.

రాష్ట్రాల వారీగానే పొత్తులు: సురవరం

న్యూఢిల్లీ: బీజేపీని ఓడించటంతోపాటు లౌకిక ప్రజాస్వామ్య పార్టీలతో జట్టుకట్టే విషయంలో రాష్ట్రాల వారీగానే పొత్తులు పెట్టుకోనున్నట్లు సీపీఐ తెలిపింది. ఆయా రాష్ట్రాల్లో ప్రత్యేక పరిస్థితులను బట్టి, వైఖరి మార్చుకుంటామని గురువారం విడుదల చేసిన రాజకీయ తీర్మానంలో పేర్కొంది. బీజేపీని గద్దె దించటమే తమ ఏకైక లక్ష్యమని స్పష్టం చేసింది. ఫాసిస్ట్ శక్తులపై పోరాడేందుకు లౌకిక రాజకీయ శక్తులను ప్రజా సంఘాలను కూడగడతామని పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. సీపీఎం, సీపీఐ మధ్య సమస్యలుంటే పరిష్కరించుకుంటామన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోబోమని సీపీఎం గతంలోనే తేల్చిచెప్పింది.

దీక్షగా 'ఆయుష్మాన్ భారత్'

అరుణాచల్‌ప్రదేశ్ బహిరంగ సభలో ప్రధాని మోదీ

ఇటానగర్: సుమారు 50 కోట్ల మందికి ఆరోగ్య రక్షణ కల్పించే 'ఆయుష్మాన్ భారత్ యోజన'ను ప్రభుత్వం దీక్షగా చేపడుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమమైన ఈ పథకంతో ఆరోగ్య రంగంలో సమూల మార్పులు వస్తాయన్నారు. మోదీ గురువారం అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో టోమో రీబా ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ మెడికల్ సైన్సెస్ భవనానికి శంకుస్థాపన చేశాక నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. 'ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల పరిమితిలో ఆరోగ్య రక్షణ కల్పించే వ్యవస్థను దేశంలో ప్రవేశపెట్టేందుకు ఇదే తగిన సమయం' అని అన్నారు.

అరుణాచల్ పర్యటనపై చైనా నిరసన

ప్రధాని మోదీ అరుణాచల్‌లో పర్యటించడాన్ని చైనా తప్పు పట్టింది. ఆ భూభాగం తమ అధీనంలోని దక్షిణ టిబెట్‌లో భాగమని పునరుద్ఘాటించింది. సరిహద్దు వివాదాన్ని సంక్లిష్టం చేసేలా వ్యవహరించొద్దని భారత్‌కు సూచించింది. మోదీ పర్యటనపై భారత్‌కు దౌత్య మార్గాల్లో తీవ్ర నిరసన తెలుపుతామని చైనా విదేశాంగ అధికార ప్రతినిధి షువాంగ్




చెప్పారు. సరిహద్దు సమస్యలపై చైనా వైఖరి స్పష్టంగా ఉందన్నారు.

రైల్వేలో జంబో జాబ్ మేళా

న్యూఢిల్లీ: పదో తరగతి, ఐటీఐ పూర్తిచేసిన ఉద్యోగార్థులకు ఇది నిజంగా తీపి కబురే. గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో ఒకేసారి సుమారు 90 వేల ఉద్యోగాల భర్తీకి రైల్వే శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇందులో లోకోపైలట్లు, టెక్నీషియన్ పోస్టులు సహా ఇతర దిగువ స్థాయి ఉద్యోగాలున్నాయి. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఈ దరఖాస్తులను స్వీకరిస్తారు. ఫిట్టర్, క్రేన్ డ్రైవర్, బ్లాక్‌స్మిత్, కార్పెంటర్‌లతో కూడిన గ్రూప్ సీ లెవల్ 2 పోస్టులకు 18–28 ఏళ్ల మధ్యనున్న వారు అర్హులు. ట్రాక్‌మెన్లు, హెల్పర్, గేట్‌మెన్లతో కూడిన గ్రూప్ సీ లెవల్ 1(గతంలో గ్రూప్ డీగా వ్యవహరించేవారు)కు వయోపరి



మితిని 18–31 ఏళ్లుగా నిర్ధారించారు. గ్రూప్ సీ లెవల్ 2 పోస్టులకు దరఖాస్తులను మార్చి 5 వరకు, గ్రూప్ సీ లెవల్ 1 పోస్టులకు మార్చి 12 వరకు స్వీకరిస్తారు. ఏప్రిల్ / మేలో ఆన్‌లైన్‌లో రాత పరీక్ష నిర్వహించే వీలుంది. రాత పరీక్ష, దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఏసీ స్లీపర్ తరగతిలో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పిస్తారు.


జాకబ్ జుమా


రామాఫోసా

జాకబ్ జుమా రాజీనామా

దక్షిణాఫ్రికా నూతన అధ్యక్షుడిగా రామాఫోసా

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా ఎట్టకేలకు తన పదవికి రాజీనామా చేశారు. దీంతో అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ), జుమాకు మధ్య ఏర్పడిన ప్రతిష్టంభనకు తెరపడింది. ఆయన రాజీనామా చేయకపోతే ప్రతిపక్ష పార్టీలతో కలసి పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం పెట్టి జుమాను గద్దె దించాలని అధికార పార్టీ భావించడం తెల్సిందే. ఏఎన్‌సీ జాతీయ నాయకత్వం మూడు రోజుల పాటు జరిపిన చర్చల్లో జుమా రాజీనామా చేయాల్సిందిగా కోరింది. అందుకు ఆయన నిరాకరిస్తూ వచ్చారు. అనూహ్యంగా బుధవారం రాత్రి మీడియా సమావేశం ఏర్పాటు చేసి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు జుమా ప్రకటించారు. దీంతో 9 ఏళ్ల జుమా పాలనకు తెరపడింది. దాదాపు 30 నిమిషాల పాటు ఆయన ప్రసంగించారు. కాగా, బుధవారం ఓ టీవీ చానల్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అసలు తాను రాజీనామా చేసేందుకు పార్టీ నాయకత్వం ఎలాంటి కారణాలను తనకు చూపలేదని చెప్పారు. అధ్యక్ష స్థానంలో సిరిల్ రామాఫోసాను కూర్చోబెట్టాలని ఏఎన్‌సీ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన వ్యతిరేకించారు. జాకబ్ జుమా రాజీనామా నేపథ్యంలో దక్షిణాఫ్రికా నూతన అధ్యక్షుడిగా ప్రస్తుత ఉపాధ్యక్షుడు సిరిల్ రామాఫోసా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన పార్లమెంటు సమావేశంలో ఆయన ఎన్నికైనట్లు ప్రకటన వెలువడింది. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 65 ఏళ్ల రామాఫోసా రెండు నెలల కిందటే ఎన్నికయ్యారు.

నేపాల్ ప్రధానిగా ఓలీ

కఠ్మాండు: హిమాలయ దేశమైన నేపాల్‌కు 41వ ప్రధానిగా ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. మహారాజ్‌గంజ్‌లోని శీతల్ నివాస్‌లో అధ్యక్షురాలు బిద్యా దేవీ ఓలీ చేత ప్రమాణం చేయించారు. ఓలీ ఇంతకుముందు 2015 అక్టోబర్ నుంచి 2016, ఆగస్టు 3 వరకూ నేపాల్ ప్రధానిగా పనిచేశారు. ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో ఓలీకి చెందిన సీపీఎన్–యూఎంఎల్, ప్రచండ నేతృత్వంలోని సీపీఎన్–మావోయిస్ట్ సెంటర్ 174 సీట్లు గెలిచింది.

కక్షగట్టి కాల్పులు..

అమెరికా హైస్కూల్లో బహిష్కృత విద్యార్థి ఘాతుకం

17 మంది ఊచకోత ● ఫ్లోరిడాలోని పార్క్‌లాండ్‌లో దారుణం

వాషింగ్టన్: అమెరికా మరోసారి తుపాకీ మోతకు ఉలిక్కిపడింది. 19 ఏళ్ల మాజీ విద్యార్థి తాను చదివిన పాఠశాలలోనే విచ్చలవిడిగా కాల్పులకు దిగి 17 మందిని పొట్టన బెట్టుకున్నాడు. ఓ భారతీయ విద్యార్థి సహా మరో 15 మందిని గాయపరిచాడు. ఫ్లోరిడా రాష్ట్రంలో పార్క్‌లాండ్ నగరంలోని మేజరీ స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్‌లో బుధవారం ఈ దారుణం జరిగింది. నిందితుడు నికోలస్ క్రూజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఏడాది అమెరికాలోని ఓ పాఠశాలలో కాల్పులు జరగడం ఇది 18వ సారి కావడం గమనార్హం. క్రమశిక్షణారాహిత్యానికి గతేడాది స్కూల్ నుంచి బహిష్కరణకు గురైన క్రూజ్ కక్షగట్టి మరీ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. అతని సోషల్ మీడియా అకౌంట్లలో హింసను ప్రేరేపించే చిత్రాలున్నాయని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఎఫ్‌బీఐ అధికారుల సాయంతో స్థానిక పోలీసులు విచారణను ముమ్మరం చేశారు.

అలారం లాగి..అలజడి సృష్టించి..: గ్యాస్ ముసుగు, స్మోక్ గ్రెనేడ్‌లు ధరించి, ఏఆర్–15 తుపాకీని వెంట తెచ్చుకున్న క్రూజ్ ముందుగా ఫైర్ అలారంను లాగి పాఠశాలలో అలజడి సృష్టించాడు. భయంతో విద్యార్థులు, సిబ్బంది బయటకు పరుగులు పెడుతుండగా విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. దీంతో 12 మంది అక్కడికక్కడే చనిపోయారు. మృతుల్లో విద్యార్థులు ఎందరు ఉన్నారన్నది తెలియరాలేదు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 15 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఆ స్కూల్‌లో ఇండో–అమెరికన్ విద్యార్థుల సంఖ్య ఎక్కువే అని తెలిసింది. షూటింగ్‌కు పాల్పడే ముందు క్రూజ్ తన సామాజిక మాధ్యమాల అకౌంట్లలో రెచ్చగొట్టే సందేశాలు అప్‌లోడ్ చేశాడని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. అతని వద్ద చాలా తుపాకీ మేగజీన్లు కూడా ఉన్నాయని తెలిపారు. కాల్పులు ముగిసిన వెంటనే అతన్ని అదుపులోకి తీసుకుని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. తన మాజీ ప్రియురాలి కొత్త బాయ్‌ఫ్రెండ్‌తో గొడవకు దిగినందుకు క్రూజ్‌ను స్కూల్ నుంచి బహిష్కరించినట్లు మీడియాలో వార్తలొచ్చాయి.


కాల్పులు ముగిశాక స్కూల్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు. (ఇన్‌సెట్‌లో) క్రూజ్

అభద్రంగా ఉన్నామని భావించొద్దు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాఠశాలలో కాల్పుల ఘటనపై విస్మయం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపిన ట్రంప్..పిల్లలు, ఉపాధ్యాయులెవరూ కూడా అమెరికా పాఠశాలలో అభద్రంగా ఉన్నామని భావించొద్దని అన్నారు. నిందితుడి మానసిక ఆరోగ్యంపై సందేహం వ్యక్తం చేశారు. 'ఇది అమెరికాలో విషాదకర దినం. బాధితుల కోసం ఇండో–అమెరికన్లందరం ప్రార్థిస్తున్నాం' అని కాల్పుల్లో గాయపడిన భారత విద్యార్థి తండ్రి స్నేహితుడు శేఖర్ రెడ్డి అన్నారు. 31 వేల జనాభా ఉన్న పార్క్‌లాండ్‌కు 2016లో అత్యంత సురక్షితమైన పట్టణంగా గుర్తింపు దక్కడం గమనార్హం.


రేణమాలలో మహిళల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న జగన్

రాష్ట్రమంతటా టీడీపీ నేతల దాష్టీకాలే

- మహిళలకు భద్రత లేకుండా పోయింది
- మనందరి ప్రభుత్వం రాగానే అన్నివిధాలా ఆదుకుంటాం
- మూడు దశల్లో మద్యం లేకుండా చేస్తాం
- మహిళా సదస్సులో ప్రతిపక్ష నేత జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో నాలుగేళ్లుగా మహిళలకు భద్రత లేకుండా పోయిందని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అండతో టీడీపీ నేతల అరాచకాలకు అడ్డే లేకుండా పోయిందని మండిపడ్డారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా గురువారం 88వ రోజు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని రెణమాలలో మహిళల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. పెందుర్తిలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అండదండలతో ఆయన అనుచరులు దళిత మహిళ బట్టలు ఊడదీయించి కొట్టి.. భూములు లాక్కోవడం దారుణం అన్నారు. అలాంటి వారిపై కూడా కేసులు పెట్టని పరిస్థితిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోరాడాల్సి వచ్చిందన్నారు. రోజా అక్కడికి వెళ్లి ధర్నా చేస్తే తప్ప కేసులు నమోదు కాని పరిస్థితి అన్నారు. పెందుర్తితో పాటు చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో కూడా ఒక అక్కను బట్టలు ఊడతీసి, దారుణంగా కొట్టి, అది సోషల్ మీడియాలో చూపించే అన్యాయమై పరిస్థితి ఈ రాష్ట్రంలో ప్రజలు చూస్తున్నారన్నారు. ఇసుక దోపిడీని అడ్డుకున్న మహిళా ఎమ్మార్వో వనజాక్షిని టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని జుట్టుపట్టుకొని ఈడ్చినప్పుడు ఆ పెద్దమనిషి (చంద్రబాబు) ఆనాడు జైలులో పెట్టేందుకు ధైర్యం చేయకపోవడం వల్లే ఈ రోజు రాష్ట్రంలో మరే మహిళకూ రక్షణలేని పరిస్థితి నెలకొందని నిప్పులు చెరిగారు. ఈ సమ్మేళనంలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఇళ్ల మధ్య బెల్ట్ షాపులతో అక్కచెల్లెమ్మల ఇక్కట్లు

''పాదయాత్రలో చాలా మంది అక్కచెల్లెమ్మలు మద్యం బెల్ట్‌షాపుల గురించి నాతో చెప్పుకున్నారు. తొలి సంతకంలోనే బెల్ట్‌షాపులను తీసేస్తానని ఎన్నికల ప్రణాళికలో పెట్టారు. ఎన్నికలు అయిపోయాయి. ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. నాలుగేళ్లు గడిచిపోయాయి. కానీ బెల్ట్‌షాపులు రద్దయ్యాయా? (లేదు.. లేదు.. అని జనం కేకలు) బాబు హైటెక్ పాలన ఏ స్థాయిలో ఉందంటే, ఒక ఫోను చేస్తే ఇంటికే మద్యం తీసుకొచ్చి ఇస్తే పరిస్థితి ఉంది. మనందరి ప్రభుత్వం రాగానే మూడు దశల్లో మద్యం మీద యుద్ధం ప్రకటిస్తాం. తిరిగి 2024లో ఎన్నికలు వచ్చే నాటికి మద్యాన్ని పూర్తిగా తీసేసిన తర్వాతే మీదగ్గరకు వచ్చి ఓట్లు అడుగుతాను.

అందరినీ మోసం చేశారు..

మా ఇంటి మహాలక్ష్మీ పథకం అని పుట్టబోయే బిడ్డ గురించి ఇచ్చిన హామీ పైనా చంద్రబాబు మోసం చేశారు. రైతులకు పూర్తిగా రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశారు. పొదుపు సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తానని ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు. రేపు దేవుడి దయతో, మీ అందరి ఆశీర్వాదంతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల నాటికి పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు ఎంత రుణం ఉంటుందో ఆ మొత్తాన్ని నాలుగు దఫాలుగా వారి చేతికే అందజేస్తాం. సున్నా వడ్డీకే రుణాలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

ఆ తండ్రి బాధ విని నా కళ్లలో నీళ్లు తిరిగాయి..

ఇంజినీరింగ్ ఫీజు ఏటా లక్ష దాకా ఉంటే ఈ ప్రభుత్వం రూ.30 లేదా రూ.35 వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ముష్టివేసినట్టు ఇస్తోంది. మిగిలిన డబ్బులు పేద పిల్లల తల్లిదండ్రులు ఎలా కట్టుకోగలరు? నిన్న(బుధవారం) పాదయాత్రలో ఓ విద్యార్థి తల్లిదండ్రులు నా దగ్గరకు వచ్చి బోరున ఏడ్చారు. పేదరికంలో ఉన్న తమను ఫీజు డబ్బులు అడగలేక, సతమతమవుతూ కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని వారు వివరించినప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి. అందుకే చెబుతున్నా.. మీ పిల్లలు ఎంత వరకు చదువుతారో.. అందుకు ఎన్ని లక్షలు ఖర్చు అయినా మన ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇస్తున్నా. పిల్లల హాస్టల్ ఖర్చుక ఏటా రూ. 20 వేలు ఇస్తాం. చిన్న పిల్లలను బడికి పంపినందుకు ప్రతి తల్లికీ ఏటా రూ.15 వేలు ఇస్తాం. మనందరి ప్రభుత్వం రాగానే ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించి ఇస్తాం. ఆ ఇల్లు అక్కచెల్లెమ్మల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేయిస్తాం. అవ్వాతాతలకు రూ.2 వేలు పింఛన్ ఇస్తాం. పింఛన్ వయసును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 45 ఏళ్లకే పింఛన్ ఇస్తాం'' అని జగన్ హామీ ఇచ్చారు.


రేణమాలలో మహిళల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వైఎస్ జగన్, వేదికపై పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్యే రోజా, పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ, ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు

చంద్రబాబు పాలన అంతం.. మహిళ పంతం

ఎమ్మెల్యే ఆర్కే రోజా



ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : మహిళలకు రక్షణ కొరవడిన ఈ చంద్రబాబు ప్రభుత్వ పాలన అంతానికి రాష్ట్ర మహిళలు పంతం పట్టాలని ఎమ్మెల్యే ఆర్కే రోజా పిలుపునిచ్చారు. రేణమాలలో గురువారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలోని గుజ్జర్లపల్లి గ్రామంలో టీడీపీ కుటుంబాలు ఓ మహిళను వివస్త్రను చేసి కొట్టడమే కాకుండా, ఆ దృశ్యాలు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారంటే చంద్రబాబు పాలనలో ఎలాంటి పరిస్థితి ఉందో అంతా ఆలోచించాలన్నారు. చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను అరాచక ప్రదేశ్‌గా మార్చారని దుయ్యబట్టారు. అన్నపూర్ణగా పిలబడే ఆంధ్రప్రదేశ్‌లో ఆడవారి ఆక్రందనలే వినిపిస్తున్నాయని తెలిపారు. ప్రత్యేక హోదా కోసం నాలుగేళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్న నాయకుడు వైఎస్ జగన్ అని అన్నారు. హోదాను బిచ్చంలా అడుక్కునే పరిస్థితి తెచ్చింది బాబు కాదా? అని ప్రశ్నించారు.



■ **సుజాతమ్మ:** ఉపాధి హామీ పథకం కింద కొంత, రైతులు కొంత మొత్తంతో వ్యవసాయ పనులు కూలీలతో చేయించుకునేలా చర్యలు తీసుకోవాలి.

జగన్: మంచి సలహా.. అయితే ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. పనులు లేనప్పుడు పేదవారికి పనులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకం తెచ్చారు. రైతుల పనులకు 'ఉపాధి' పథకాన్ని ఎలా అనుసంధానం చేయాలనే విషయమై కేంద్రంతో మాట్లాడుతాం. కచ్చితంగా ప్రయత్నం చేస్తాం. ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి ఆ గ్రామంలో పది మందికి ఉద్యోగాలిస్తాం. ఇందులో సగం మంది మహిళలకూ అవకాశం ఇస్తాం. ఏ ప్రభుత్వ పథకమైనా 72 గంటల్లో వచ్చేలా చేస్తాం. ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పని ఉండదు.



■ **హుస్సేన్ బీ:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశామని పించను రాకుండా చేశారు. మరుగుదొడ్డి కూడా రాకుండా చేశారు. రాజశేఖరరెడి సీఎంగా ఉన్నప్పుడు ఫించను వచ్చేది. ఇప్పుడు రావడం లేదు.

జగన్: దగ్గరకు వచ్చాం అమ్మా.. కొంచెం ఓపిక పట్టండి. తప్పకుండా న్యాయం చేస్తాం.



■ **రాధిక:** ఇప్పుడు ఐదేళ్ల కొకసారి డీఎస్సీ నిర్వహిస్తున్నారు.. మీరు అధికారంలోకి వచ్చాక రెండేళ్ల కొకసారైనా డీఎస్సీ నిర్వహించాలన్నా..

జగన్ : రెండేళ్లకొకసారి కాదమ్మా. సంవత్సరానికొకసారి డీఎస్సీ పరీక్ష జరగాలి. దాని కోసం క్యాలెండర్ విడుదల చేస్తాం. గవర్నర్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న లక్షా 42 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. దీనికి తోడు గ్రామ సచివాలయం ద్వారా మరో లక్షా 50 వేల ఉద్యోగాలు మీ గ్రామంలో వారికే ఇచ్చేటట్టు చేస్తా. ఈవాళ పరిశ్రమ పెట్టే ప్రతి చోట స్థానికులకు కాకుండా వేరే రాష్ట్రాల వారికి ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి ఉంది. మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని మొదటి సమావేశాల్లోనే కొత్త చట్టం తెస్తాం. హోదా కూడా సాధించుకోగలిగితే రాష్ట్రంలో ఉద్యోగాల విప్లవం వస్తుంది. ప్రతి జిల్లా హైదరాబాద్‌లా మారి మనందరికీ మేలు జరుగుతుంది.

నేడు ప్రకాశం జిల్లాలోకి ప్రజా సంకల్ప యాత్ర

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర శుక్రవారం ప్రకాశం జిల్లాలోకి ప్రవేశిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రజాసంకల్ప యాత్ర కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో గత నెల 23వ తేదీన ప్రారంభమైన పాదయాత్ర ఈనెల 15వ తేదీతో ఆ జిల్లాలో ముగిసిందని, 16వ తేదీన ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గం లింగసముద్రం మండలంలోని కొత్తపేటలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. నెల్లూరు జిల్లాలో 20 రోజుల పాటు 266.5 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగిందని వివరించారు. వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం వద్ద పాదయాత్ర 1000 కిలోమీటర్ల మైలు రాయిని అధిగమించడాన్ని పురస్కరించుకుని అక్కడ వేలాది మంది జగన్ వెంట అడుగులు వేసి 'వాక్‌విత్ జగన్' అనే కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ప్రకాశం జిల్లాలోని 9 నియోజకవర్గాల్లో సుమారు 250 కిలోమీటర్ల మేర పాదయాత్ర జరుగుతుందన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర 88వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,193.7
కిలో మీటర్లు

88వ రోజు
నడిచిన దూరం
12
కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8.00 గంటలకు కొండాపురం మండలం జంగాలపల్లి

ముగింపు: సా. 5 గంటలకు తూర్పుపాలెం క్రాస్ రోడ్డు

ముఖ్యాంశాలు: జంగాలపల్లి, ఆదిమూర్తిపురం, తూర్పు ఎర్రబల్లి క్రాస్, తూర్పుపాలెం క్రాస్‌లలో ప్రజలతో మమేకం
- కొండాపురంలో పార్టీ జెండా ఆవిష్కరణ
- రేణమాలలో మహిళలతో ముఖాముఖి

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గంటలకు తూర్పుపాలెం క్రాస్

ముఖ్యాంశాలు: ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గం లింగసముద్రం మండలం కొత్తపేట గ్రామంలోకి పాదయాత్ర ప్రవేశం
- పెంట్రాల, వాకమల్లవారి పాలెం, బలిజ పాలెం, తిమ్మారెడ్డిపాలెం క్రాస్, వెంగళాపురం, అమ్మపాలెం క్రాస్, బంగారక్కపాలెం క్రాస్ గ్రామాల్లో ప్రజలతో మమేకం
- కొత్తపేట, లింగసముద్రం, రామకృష్ణాపురం గ్రామాల్లో పార్టీ జెండాల ఆవిష్కరణ


సైదాపురం వద్ద విజయ సంకల్ప స్థూపాన్ని ఆవిష్కరించి ముందుకు సాగుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్, చిత్రంలో ఎంపీలు మేకపాటి, వరప్రసాద్, పార్టీ నేతలు


గూడూరులో జరిగిన బహిరంగ సభలో అశేషజనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్


కొవ్వూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని

సింహపురి గడ్డపై

వెల్లువెత్తిన అభిమానం

- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ముగిసిన జగన్ పాదయాత్ర
- జనం బ్రహ్మరథం.. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం
- 10 బహిరంగ సభలు.. 5 సదస్సులు
- 9 నియోజకవర్గాలు.. 142 గ్రామాల్లోని ప్రజలతో మమేకం
- ఊళ్లకు ఊళ్లే తరలి వచ్చి సంఘీభావం
- జనం దృష్టిలో మరింత ఎత్తుకు ఎదిగిన ప్రతిపక్ష నేత
- కీలక ప్రకటనలతో రాజకీయ వర్గాల్లో చర్చ
- నేటి నుంచి ప్రకాశం జిల్లాలో కొనసాగనున్న ప్రజా సంకల్ప యాత్ర


ఆత్మకూరు నియోజకవర్గం సంగం బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్


కావలి నియోజకవర్గం బోడగుడిపాడు బహిరంగ సభలో అశేషజనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

మహిళా చైతన్యానికి మారుపేరు, సారా రక్కసిని తరిమి కొట్టిన ధీర వనితలకు పురిటిగడ్డ అయిన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 20 రోజులుగా సాగించిన ప్రజా సంకల్ప యాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. జిల్లా ప్రజల ఆదరాభిమానాలు యాత్రలో అడుగడుగునా కనిపించాయి. జిల్లాకు దక్షిణాన మొదలైన పాదయాత్ర కోస్తా, మాగాణి, మెట్ట, ప్రాంతాలనే తేడా లేకుండా పడమట ప్రాంతానికి వెళ్లే కొద్దీ రోజురోజుకూ జనాదరణ పెరిగింది. లక్షలాది మంది జనం జననేత యాత్రలో పాల్గొని ఆయన అడుగులో అడుగు వేసి తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువకులు... ఇలా ఒకరేమిటి అన్ని వర్గాల వారూ కదం తొక్కి జగన్ వెంట నడిచారు. జగన్‌ను చూడాలని, ఆయనతో మాట కలపాలని ఊళ్లకు ఊళ్లే పాదయాత్ర సాగిన ప్రాంతానికి తరలి వచ్చాయి. తీరప్రాంత నియోజకవర్గమైన సూళ్లూరుపేటలో జగన్ వెంట భారీ జనసందోహం కదిలి రావడం ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. అటు నుంచి గూడూరు, వెంకటగిరి, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో పాదయాత్ర సాగినపుడు వైఎస్సార్ కాంగ్రెస్ మరింతగా బలపడేలా పలు సానుకూల పరిణామాలు చోటు చేసుకున్నాయి. యాత్రకు వస్తున్న జనాన్ని చూసి విస్తుపోవడం రాజకీయ వర్గాల వంతైతే, ఈ పరిణామాలు రాగల భారీ మార్పునకు సంకేతంగా నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. జగన్ యాత్రకు వస్తున్న ఆదరణ వైఎస్సార్ కాంగ్రెస్ వర్గాల్లో కూడా ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింప జేసింది. జనవరి 23వ తేదీన జిల్లాలో ప్రవేశించిన జగన్ 266.5 కిలోమీటర్ల మేర 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 14 మండలాల మీదుగా 142 గ్రామాలను స్పృశిస్తూ ముందుకు సాగారు. 10 భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. చేనేత, యాదవ, ఆర్య వైశ్య, ముస్లిం మైనారిటీలు, మహిళ వర్గాల ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొని వారి సమస్యలను ఓపిగ్గా ఆలకించి పరిష్కారానికి హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆయా వర్గాల అభ్యున్నతికి ఏం చేస్తే బాగుంటుందన్న అంశంపై వచ్చిన సూచనలు, సలహాలను సానుకూలంగా స్వీకరించారు.

అన్ని కులాలకూ కార్పొరేషన్ల ప్రకటనపై ప్రశంసలు

అధికారంలోకి రాగానే కమ్మ, రెడ్డి, క్షత్రియ (రాజు) కులాలతో పాటు దాదాపు అన్ని కులాల వారికీ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తానని జగన్ చేసిన సంచలన ప్రకటన సర్వత్రా చర్చనీయాంశం అయింది. 'పేదరికానికి కులం లేదు.. మతం లేదు.. వర్గం లేదు.. అన్ని కులాల్లోనూ పేదలున్నారు. ఆ పేద కుటుంబాల్లో విద్యార్థులున్నారు. కనుక కులాలన్నింటికీ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తా'నని జగన్ చేసిన ప్రకటన విమర్శకుల నుంచి సైతం ప్రశంసలందుకుంది. యాదవులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆ కులానికి కూడా ఓ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి వారి అభిమానాన్ని చూరగొన్నారు. పేద రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేయించుకునే పథకాన్ని ప్రవేశ పెడతానని పొదలకూరు బహిరంగ సభలో ప్రకటించి లక్షలాది మంది రైతులు.. ముఖ్యంగా మెట్ట ప్రాంతంలో ఉన్న వారి ప్రశంసలు అందుకున్నారు. జగన్ అధికారంలోకి వస్తే తప్పకుండా తమను ఆదుకుంటారన్న నమ్మకాన్ని వారిలో కలిగించడంలో కృతకృత్యులయ్యారు. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని వర్గాల వారూ.. జగన్‌కు ఒక్కసారి అవకాశం ఇద్దామన్న నిర్ణయానికి వచ్చారు.


వెంకటగిరి నియోజకవర్గం కలిచేడు వద్ద చేనేతల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

బహిరంగ సభలకు పోటెత్తిన జనం

పాదయాత్రలో తన వద్దకు వచ్చిన వేలాది మంది సమస్యలను జగన్ ఓపికగా విన్నారు. పింఛన్లు రాలేదని కొందరు, ఆరోగ్య సమస్యలతో మరికొందరు, జన్మభూమి కమిటీలు చేస్తున్న అన్యాయాలపై ఇంకొందరు, రుణ మాఫీ జరగలేదని డ్వాక్రా అక్కచెల్లెమ్మలు, తాము మోసపోయామని అన్నదాతలు.. ఇలా అన్ని వర్గాల వారూ తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఆరోగ్య సమస్యలపై వినతులు వెల్లువలా సాగాయి. వాటికి పరిష్కారాలను కూడా ఆయన సూచిస్తూ ముందుకు సాగారు. వరి పంట మొదలు.. పొగాకు వరకు అన్ని ప్రధాన పంటల రైతులు జననేతను కలిసి సమస్యల్ని విన్నవించారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే బహిరంగ సభల్లో జనం పోటెత్తడం మరో ఎత్తు. ఎర్రటి ఎండలో జగన్ కోసం జనం గంటల తరబడి నిరీక్షించారు. ఇక ఆత్మీయ సమ్మేళనాలకు హాజరైన వారు నీరాజనం పలికారు. రేణమాల వద్ద ఏర్పాటు చేసిన మహిళా ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన వారు కేరింతలతో స్వాగతం పలికారు. ఆర్య వైశ్య, ముస్లిం సమ్మేళనాలు ఆయా వర్గాల్లో మరింతగా భరోసా నింపాయి. వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం వద్ద పాదయాత్ర 1000 కి.మీ. మైలురాయిని అధిగమించింది. ఈ సందర్భంగా జననేత విజయ సంకల్ప స్థూపాన్ని ఆవిష్కరించారు. విభజన సమయంలో కీలకమైన హామీగా ఇచ్చిన ప్రత్యేక హోదా ఏప్రిల్ 5వ తేదీలోగా ఇవ్వకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీలు ఏప్రిల్ 6వ తేదీన రాజీనామాలు చేయబోతున్నారని జగన్ కలిగిరి సభలో చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో సంచలనం రేపింది. గురువారం మహిళా సమ్మేళనంలో.. టీడీపీ ఎంపీలు కూడా రాజీనామా చేసి బయటకు వస్తే కేంద్రంపై ఒత్తిడి పెరిగి ప్రత్యేక హోదా వస్తుందని చెప్పడాన్ని అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా మారటం పార్టీకి బాగా మేలు చేసింది. చాలా నియోజకవర్గాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్లు, నియోజకవర్గ స్థాయి టీడీపీ నేతలు, కాంగ్రెస్‌లో క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న వారూ పార్టీలో చేరడం రాగల రాజకీయ మార్పులకు సంకేతాలుగా ఉన్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.


సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్


నెల్లూరు రూరల్ నియోజకవర్గం సౌత్ మోపూరు బహిరంగసభలో అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న జగన్


సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడిపేటలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



ఆర్థిక సూచికల కన్నా, మాతాశిశు ఆరోగ్య సూచికలే దేశం అభివృద్ధి సరిగ్గా చెబుతాయి.

- హర్జిత్ గిల్, ముఖ్య కార్యనిర్వాహక అధికారి, ఫిలిప్స్ కొరియా లిమిటెడ్

పవరు హత్య

సర్పంచ్ ఇంటికి పాలుపోస్తే 500 జరిమానా!
ఆ ఇంట్లో వాళ్లతో మాట్లాడితే జరిమానా!
సర్పంచ్ భర్త బండిమీద ఎక్కితే జరిమానా!
వాళ్ల పొలంలోనికి ట్రాక్టర్ తోలితే జరిమానా!

పరువు హత్యల గురించి విన్నాం.
ఈ 'పవరు హత్య' ఏంటి?!
పెళ్లిలో ఎంపిక చేసుకుంటారు.
అక్కడ పరువు హత్యలు జరుగుతున్నాయి.
పవర్‌లో ఎన్నుకుంటారు.
అక్కడ పవర్ హత్యలు జరుగుతున్నాయి.
ఒక దళిత మహిళా సర్పంచ్ పవర్‌పై
జరిగిన హత్య ఇది.
చట్టం కూడా చూస్తూ కూర్చున్న కథ ఇది!

చెట్టు స్త్రీలాంటిది.
బీడులోంచి కూడా శక్తిని లాగి, నీడను ఇస్తుంది!
అలాంటి చెట్టును ఏ ఊరు కోరుకోదు?
ఏ ఊరు ఆ చెట్టును మోడువారుస్తుంది?
ఏ ఊరు తన కాళ్లను తానే గొడ్డలితో నరుక్కుంటుంది?

అలాంటి ఊరు ఉండదు.
ఉంటే.. అది మూర్ఖత్వమే.
కాదు.. కాదు.. వివక్ష.
వృక్షాన్ని కూడా నిలవనివ్వకుండా
పడగొట్టేయాలనుకునే వివక్ష!



గ్రామ పంచాయతీ వైపు విసురుగా వెళ్లాడు గ్రామ పెద్ద. ''అరేయ్ ఆ కుర్చీ తేరా..'' పాలేరుని గదిమి అతను తెచ్చిన కుర్చీలో దర్జాగా కూర్చున్నాడు. పంచాయతీ సెక్రటరీని పిలిచి చెప్పాడు. ''ఇక నుంచి ఏ ఫైల్ మీదా సర్పంచ్ సంతకం తీసుకోవద్దు. ఆమె ఏ కార్యక్రమాలకీ హాజరు కాకూడదు. ఆమె ఇంటికెవ్వరూ వెళ్లకూడదు. ఆమెతో ఎవ్వరూ మాట్లాడకూడదు. ఆమె భర్త బండి మీద కూడా ఎవరూ ఎక్కకూడదు..'' హుకుం జారీ చేసి, కుర్చీలోంచి లేచి వెళ్లిపోయాడు ఆ గ్రామపెద్ద.

స్త్రీ.. ఆపై దళిత స్త్రీ

నిజానికి ఆ గ్రామ సర్పంచి మమత. పంచాయతీలో ఆమె నిర్ణయం ప్రకారమే అన్నీ జరగాలి. ఏ సభ జరిగినా, ఏ మీటింగ్ పెట్టినా ఆమె ఉండి తీరాలి. అలాంటిది.. సర్పంచిగా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనప్పటి నుంచీ గ్రామంలోని అగ్రవర్ణాలవారి నుండి వివక్ష మొదలైంది. దానికి కారణం.. మమత కుటుంబీకుల భూమిపై పెద్దవాళ్ల కన్ను పడటం. దానిని సొంతం చేసుకునేందుకు వారంతా కలిసి మమత కుటుంబంపై వేధింపులు మొదలుపెట్టారు.

పైగా.. ఏకగ్రీవ ఎన్నిక!

భర్త ఎం.పి.పి.గా పని చేసినా, మమత పదవ తరగతి వరకు చదువుకోవడంతో కాస్తో కూస్తో పాలనా వ్యవహారాలను అర్థం చేసుకోగలిగింది. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైంది. లోకల్‌గా 'పెద్దవాళ్ల' మాట విన్నంత వరకూ ఆమెకు ఏ ఇబ్బందీ కలగలేదు. అయితే మమత కుటుంబానికి చెందిన భూమిని తమకు రాసివ్వాలనీ, అదెప్పుడో ఆమె తాత ముత్తాతలు తమకు అమ్మేశారనీ మమతను, ఆమె భర్త శ్రీనివాస్‌నీ బలవంతపెట్టారు ఊరి అగ్రవర్ణ పెద్దలు. చప్పుడు చెయ్యకుండా భూమిని అమ్మేసినట్టు సంతకం పెట్టాలని కూడా నయానా భయానా చెప్పి చూశారు. 'సర్పంచి ఆడమనిషే కదా, మేం చెపితే వినదా' అన్నది వాళ్ల ధీమా!

గ్రామ బహిష్కారం

భార్యాభర్తలిద్దరూ లొంగకపోవడంతో వాళ్ల అహంకారం బుసలు కొట్టింది. ఆడ సర్పంచినే చెప్పుచేతల్లో పెట్టుకోలేకపోతే, రేప్పొద్దున తమ పెద్దరికాన్ని ఎవరు గౌరవిస్తారు? ఊళ్లో పరువు పోదా? ఏదో ఒకటి చేసి వాళ్లని దారికి తేవాలని అనుకున్నారు పెద్దలు. ఆ రాత్రి అంతా కూర్చొని... సర్పంచిని గ్రామం నుంచి బహిష్కరించాలని నిర్ణయించారు. అలా నిజామాబాద్ జిల్లా, ఆర్మూరు దగ్గరలోని మిండోరా మండలం, బుస్సాపూర్ గ్రామ సర్పంచ్ జక్కుల మమతను వెలివేశారన్న విషయం చుట్టుపక్కల గ్రామాల్లో గుప్పుమంది.

ఒక్కొక్కరూ దూరం అయ్యారు

''ఆ పదకొండెకరాలు మావేనని సంతకం పెట్టండి. అంతవరకు మిమ్మల్ని గ్రామం నుంచి వెలేస్తున్నాం. ఎవ్వరూ మీతోని మాట్లాడరు. మీరు ఎవ్వరిళ్లకెళ్లొద్దు. మా కట్టుబాటు ధిక్కరిస్తే జరిమానా కట్టాల్సిందే'' అన్న ఆ ఊరి పెద్ద హెచ్చరిక గుర్తొచ్చింది మమతకి. పొలం దున్నాలని ట్రాక్టర్ మాట్లాడితే రాత్రి వస్తానని చెప్పిన వ్యక్తి పొద్దున్నే ఫోన్ చేస్తే ''నువ్విచ్చే దానికన్నా నీకు ట్రాక్టర్ తోలితే మాకయ్యే ఖర్చే ఎక్కువ'' అన్నప్పుడు కానీ తనకు అర్థం కాలేదు.. అతను జరిమానాకు భయపడుతున్నాడని. మమతని భోజనానికి పిలిచినందుకు ఆ పిలిచిన కుటుంబంపై కూడా జరిమానా విధించారు.

ఫిర్యాదు చేసినా.. చర్యల్లేవు!

సమానత్వం, రాజ్యాంగం అని పెద్ద పెద్ద మాటలు చెపుతారు. కానీ ఇక్కడేం జరుగుతోంది? భర్తను నెమ్మదిగా పిలిచి చెప్పింది మమత. ''పోలీసు కంప్లైంట్ ఇద్దాం'' అని. 2018 జనవరి 7వ తేదీన స్టేషన్‌కి వెళ్లి కంప్లైంట్ చేశారు వెలివేత మీద. పాలు కూడా పోయనివ్వడం లేదనీ, పాలుపోసే అతణ్ణి బెదిరించి మాన్పించారని ఫిర్యాదు చేశారు భార్యాభర్తలిద్దరూ. జనవరి 11న ఆర్డీవో, ఏసీపీ సహా వచ్చి గ్రామసభ పెట్టారు. మహిళా సర్పంచ్ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేసినట్టు ఒప్పుకున్నారు పెద్దవాళ్లంతా. అది కుల నిర్ణయం అన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కానీ ఇంతవరకు దోషులపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

స్త్రీలు రాజ్యాధికారంలో భాగం కాకూడదా?



ఇది రాజ్యాంగ విరుద్ధం. భారతీయ సమాజంలో కొనసాగుతోన్న వివిధ వివక్షల్లో మహిళల అణచివేత తీవ్రంగా పరిణమిస్తోంది. పురుషాధిపత్య భావజాలం కారణంగానే ఈ అమానుషాలు కొనసాగుతున్నాయి. రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులను కూడా పురుషాధిపత్య పెత్తందారీ సమాజం కాలరాసి, స్త్రీలను అణచివేస్తోంది.

- పి. శంకర్, ప్రెసిడెంట్, దళిత బహుజన ఫ్రంట్, తెలంగాణ

తక్కువ కులపోల్లని చిన్నచూపే కదా..!



ఇప్పటికి నెలదాటింది. ఇంత వరకు దోషులపై చర్య తీసుకోలేదు. ఒక ఆడ మనిషి సర్పంచ్‌గా ఉండబట్టేగదా ఇట్ల జేస్తుండ్రు. అదే మగ సర్పంచ్ అయితే ఇట్ల జేస్తరా? దీనిపైన కంప్లైంట్ ఇస్తే డీఎస్పీ గూడ వచ్చి వెలివేసింది నిజమేనని జెప్పిండ్రు. ఎఫ్ఐఆర్ గూడ అయ్యింది. అయిన గూడ వాళ్లపైన ఏమీ చర్యలు దీసుకోలే. దీనికెవ్వరు సమాధానం జెప్తరు? ఇదంతా ఒక ఆడామె ఏం జెయ్యలేదనేగదా? లేకుంటే తక్కువకులపోల్లని చిన్నచూపేగదా?

- మమత, బుస్సాపూర్ గ్రామ సర్పంచ్

ఇవ్వరు.. ఇచ్చినా ఉండనివ్వరు!

అవమానమిది. స్త్రీల రాజకీయ సాధికారతను గురించి గొప్పలు చెప్పే రాజ్యాధినేతలు సైతం తలలు దించుకోవాల్సిన ఘటన ఇది. ఏం చేస్తున్నారు పాలకులు? గ్రామసభలో అది నిజమని తేలినా ఎందుకు ఇంకా చర్యలు తీసుకోరు? అంటే నిర్లక్ష్యం. వాళ్లు దళితులన్న నిర్లక్ష్యం. మామూలుగానే మహిళలను రాజకీయాల్లోనికి రానివ్వరు. ఇక దళిత సర్పంచిని వేధించకుండా ఉంటారా? 33 శాతం మహిళా రిజర్వేషన్ అంటారు. కానీ ఇంత వరకు అది చట్టంగా రాలేదు. రిజర్వేషన్లు ఇచ్చిన చోటేమో ఇలా దౌర్జన్యం చేస్తారు. దీనికి ఒకటే పరిష్కారం... దామాషా ప్రాతినిధ్యం. ఓట్ల శాతాన్ని బట్టి సీట్లనివ్వడం.



- కె.లలిత, సమాజిక కార్యకర్త, 'యుగాంతర్' సంస్థ డైరెక్టర్

చెట్టు నీడ

ఎంగిలి పండు రుచి

తల్లి మనసు కొద్దిగా నొచ్చుకుంది. కానీ దాన్ని బయటపడనీయకుండా ఉంచేందుకు ప్రయత్నించింది.

ఇంట్లో రెండు యాపిల్స్ ఉన్నాయి. చిట్టిపాప రెండింటినీ తన చిన్న చేతుల్లో పట్టుకుంది. 'బుజ్జీ, అమ్మకో యాపిల్ ఇవ్వవా?' గారాబంగా అడిగింది తల్లి.

వెంటనే చిన్నారి తన ఎడమ చేతిలోని యాపిల్‌ను కొరికింది.

తల్లి కూతురినే గమనిస్తూవుంది. కుడిచేతిలోది తనకు ఇస్తుందేమో అనుకుంది.

కానీ ఆ వెంటనే కుడిచేతిలోని యాపిల్‌ను కూడా కొరికింది చిన్నారి.

రెండూ ఎంగిలి చేయకపోతేనేం! తల్లి మనసు కొద్దిగా నొచ్చుకుంది. కానీ దాన్ని బయటపడనీయకుండా ఉంచేందుకు ప్రయత్నించింది. ఎంత చిన్న పిల్లకయినా అది తగిన గుణం కాదనుకుంది.

కానీ వెంటనే పాప–

'అమ్మా, ఈ కుడి చేతిలోది తీసుకో. ఇది దీనికన్నా తియ్యగా ఉంది' అంటూ ఎడమచేతి వైపు చూపిస్తూ తన కుడిచేతిని ముందుకు చాచింది.

అమ్మ సంభ్రమానికి గురైంది. తన చిన్నారి యాపిల్‌లాంటి చెంపలపై ముద్దులు పెట్టకుండా ఉండలేకపోయింది.

మనమే ఆశ్చర్యపోయేలా జీవితం ఒక్కోసారి ప్రేమను పంచుతూవుంటుంది. అప్పుడు మనం నొచ్చుకున్నవన్నీ గాలికి ఎగిరిపోతాయి.

లవ్ డిటెక్టర్

అతడి ప్రేమ నిజమేనా?



ప్రేమిస్తున్నామంటూ మీ వెంటపడే వారికి మీ మీద ఉన్నది నిజమైన ప్రేమ అవునో, కాదో ల్యాబొరేటరీ సాక్షిగా తేల్చేసేందుకు కొత్త తరహా వైద్య పరీక్ష ఒకటి 2028 నాటికల్లా అందుబాటులోకి రానుందట! ఇలాంటి పరీక్ష అందుబాటులోకి వచ్చేస్తే ప్రపంచంలో నకిలీ ప్రేమలు, ప్రేమ పేరిట మోసాలు మటుమాయం కాగలవని ప్రేమైక జీవులంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అచ్చంగా ప్రేమలో పడిన వారి మెదడులో 'నానో పెప్టైడ్స్' అనే రసాయనాలు ఉత్పత్తవుతాయని, వీటి జాడను కనుగొనేందుకు ఎలాంటి రక్తపరీక్షలు అక్కర్లేదని, చాలా తేలికగా నిర్వహించే ఎంఆర్ఐ తరహా స్కానింగ్ పరీక్షతో ఇవి ఉత్పత్తవుతున్నదీ, లేనిదీ ఇట్టే తేల్చేయవచ్చని కాలిఫోర్నియాకు చెందిన డాక్టర్ ఫ్రెడ్ నోర్ అనే న్యూరో సైంటిస్ట్ చెబుతున్నారు. వాలెంటైన్స్ డే రోజున తాను రచించిన 'ట్రూ లవ్: లవ్ ఎక్స్‌ప్లెయిన్డ్ బై సైన్స్' అనే పుస్తకాన్ని విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఒక వ్యక్తి మెదడులో 'నానో పెప్టైడ్స్' అధిక మోతాదులో లేకుంటే, ఆ వ్యక్తి వ్యక్తం చేస్తున్న ప్రేమ సిసలైనది కాదని, సిసలైన ప్రేమను గుర్తించడానికి అధిక మోతాదులో ఉత్పత్తయ్యే 'నానో పెప్టైడ్స్' మాత్రమే ఏకైక నిదర్శనమని డాక్టర్ నోర్ చెబుతున్నారు.

రెప్పపాటు

ప్రియా.. ప్రియా.. చంపొద్దే!



కన్ను కుట్టి
- పక్క పేజీలో

సోషల్ మీడియా ఎప్పుడు ఎవర్ని సెలబ్రిటీని చేస్తుందో ఊహించలేం! త్రిస్సూర్‌లో బీకాం ఫస్ట్ యర్ చదువుతున్న మలయాళీ అమ్మాయి ప్రియా ప్రకాష్ వారియర్ ఇప్పుడు లేటెస్ట్ సెలబ్రిటీ! ఈ క్షణమో, మరుక్షణమో ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్య 30 లక్షలకు చేరుకోబోతోంది! అసలు ప్రియ 87వ పోస్టింగ్ దగ్గరే ఆమె ఫాలోవర్లు సుమారు 20 లక్షల ఎనభై వేలు! ఇది మామూలు విషయమేం కాదు. జాతీయ అవార్డు గ్రహీత, మలయాళీ మూవీ స్టార్ మోహన్‌లాల్‌కి కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో వెనుక ఇంతమంది అనుచరుల్లేరు. 7 లక్షల 14 వేల దగ్గర వాళ్ల అడుగులు ఆగిపోయాయి. అది కూడా ఆయన 2015లో నెట్‌లోకి ప్రవేశిస్తే.. ఇప్పటికి ఇంతమంది అయ్యారు.

మరో మలయాళీ స్టార్ మమ్ముట్టి తనయుడు, యువ నటుడు దుల్కర్ సల్మాన్‌కి కేరళలోనే కాకుండా, తమిళనాడులోనూ పెద్ద ఫాలోయింగ్ ఉంది. తెలుగు, హిందీ చిత్రాల్లో కూడా హీరోగా చేస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇప్పటివరకు అతడి ఫాలోవర్స్ 10 లక్షల 90 వేలు. అతడి పోస్టింగ్స్ 150.

బాహుబలి తర్వాత అనుష్కాశెట్టి ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్ 20 లక్షలకు పెరిగారు. అయితే 463 వరకు ఆమె పోస్టింగ్‌లు ఉన్నాయి. ఆ మాత్రానికి ఈ మాత్రం ఫాలోయింగ్ ఎటూ ఉంటుంది. పైగా అనుష్క బిగ్ స్టార్.

త్రిష పదిహేనేళ్లుగా ఇండస్ట్రీలోఉన్నారు. తెలుగు, తమిళ్, హిందీ చిత్రాలలో నటించారు. మలయాళంలో తొలిసారి ఆమె నటించిన 'హే జ్యూడ్' కొద్దిరోజుల క్రితమే విడుదలైంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఫాలోవర్‌లు పది లక్షల 50 వేల మంది.

ఇక మోడల్ మిలింద్ సోమన్.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎప్పుడూ కుప్పలు తెప్పలుగా ఫొటోగ్రాఫ్స్‌ని అప్‌లోడ్ చేస్తుంటాడు. ఆయన ఫాలోవర్లు 2 లక్షల 49 వేల మంది.



ప్రియా ప్రకాష్ వారియర్ : పాటలోని క్లిప్పింగ్స్

ఆయన పోస్ట్‌లు 488.

తమిళ్ బిగ్‌బాస్ ఫేమ్ 'ఓవియా'.. ఆ 'షో'లో ఉన్నంత కాలం ఆమె ఇన్‌స్టాగ్రామ్ గ్రాఫ్ పెరుగుతూనే ఉంది. లక్షా 54 వేల మంది ఓవియాను ఫాలో అయ్యారు.

వీళ్లందరిదీ ఫాలోవర్‌ల సంఖ్య తక్కువేం కాదు కానీ.. ప్రియ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్క 24 గంటల్లోనే 6 లక్షల 6 వేల మంది ఫాలోవర్లు వచ్చి చేరడం రికార్డ్ అయింది.

ఇలా ఇంత తక్కువ టైమ్‌లో ఫాలోవర్స్‌ని రాబట్టుకున్న వారిలో అమెరికన్ టీవీ స్టార్, మోడల్ కైలీ జెన్నర్ (8 లక్షల 6 వేలు), ఫుట్‌బాల్ క్రీడాకారుడు క్రిస్టియానో రొనాల్డో (6 లక్షల 50 వేలు) తర్వాత ప్రియే కావడం సెన్సేషన్ అయింది. ఇదంతా కూడా 'ఒరు ఆదార్ లవ్' అనే.. ఇంకా విడుదల కాని సినిమాలోని చిన్న లవ్ సీన్‌లో ప్రియ 'కన్నుగీటే' సీన్ కారణంగానే. ఇంటర్నెట్‌లో ఆ సన్నివేశం నిర్విరామంగా షేర్ అవుతూనే ఉంది, ప్రియ ఫాలోవర్‌ల సంఖ్యను పెంచుతూనే ఉంది. ప్రియ తొలి చిత్రం ఇది. ప్రస్తుతం ఆమె త్రిస్సూర్‌లోని 'విమల కాలేజ్'లో చదువుతోంది.



అమలాపాల్

మలయాళీ నటి అమలాపాల్ మలయాళంలో, తమిళంలో, తెలుగులో కూడా బాగా పాపులర్. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్‌లు పది లక్షల 20 వేలు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్టులు 323.

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా..! నేను నెలరోజుల క్రితం ఒక అమ్మాయిని చూశాను. తను నాకు బాగా నచ్చింది. దాంతో తన పేరు, అలాగే బాయ్ ఫ్రెండ్ ఉన్నాడా లేడా అని ఎంక్వైరీ చేశాను. ఎవరికీ కమిట్ కాలేదట. అలాగే తన పర్సనల్ బయో కూడా తెలుసుకున్నా. అయితే తను రెండు రోజుల నుంచి కాలేజ్‌కి రావడం లేదు. మనసుకి చాలా కష్టంగా ఉంది. తనతో మాట్లాడాలనిపిస్తోంది. కానీ ఒకపక్క భయంగా ఉంది. ఎఫ్‌బిలో రిక్వెస్ట్ పెట్టాను బట్ నో రెస్పాన్స్. అసలు ఇది ప్రేమా లేక ఆకర్షణా? తెలియడంలేదు. కానీ తనని నేను నిజంగా ఇష్టపడుతున్నా. తనకి ప్రపోజ్ చెయ్యాలని ఉంది. మీ సలహా ఏంటన్నయ్యా?

– సాహిత్

పర్సనల్ బయో కనుక్కున్నానంటున్నావు....
'అయితే ఏం చెయ్యాలి సార్?'
ఇంటి కెళ్లి...
'నాన్న తన్నితే..?'
ట్రై చెయ్యాలి.
'అన్న ఇరగదీస్తే...?'
రిక్వెస్ట్ చెయ్యాలి.
'అమ్మ కళ్లల్లో కారం జల్లితే..?'
ఏంటి నీలూ ఇంత వయొలెంట్‌గా ఆలోచిస్తున్నావు?
ప్రేమించేవాడు భయపడడా?
'కీడెంచి మేలెంచమన్నారు కదా సార్???'
'ఒళ్లంతా హూనమయ్యాకా లవ్ డాక్టర్ ముందే చెప్పలేదని మీ మీద హత్యా నేరం మోపితే నేనేం కావాలి సార్? అందుకే.. ముందు చూపుతో హెచ్చరిస్తున్నా సార్!'
విన్నావా.. సాహిత్ బయోలు కనుక్కుంటే, కమిట్ అయ్యిందో లేదో తెలుసుకుంటే.. సరిపోదు. బీ కేర్‌ఫుల్..!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

కాచుకో సుడోకు

		6		4				7
	1		2		9			5
	5		3		8			1
3	6		7			8	1	
7	8						9	2
	9	4			3		7	6
6			1		2		4	
2			6		4		5	
5				3		2		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

1	6	2	9	8	3	5	4	7
3	8	5	4	6	7	2	9	1
4	7	9	1	5	2	8	3	6
2	4	8	3	9	6	1	7	5
5	3	6	2	7	1	9	8	4
9	1	7	8	4	5	3	6	2
6	2	3	7	1	8	4	5	9
8	5	4	6	2	9	7	1	3
7	9	1	5	3	4	6	2	8

మంచి సినిమా చూశాం అంటారు


● సందీప్ కిషన్

''రియల్ లైఫ్‌లో నేను మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగా. కానీ.. 'మనసుకు నచ్చింది' సినిమాలో సూరజ్ పాత్రలో హై క్లాస్ అబ్బాయిగా కనిపిస్తా. నాకు అలాంటి స్నేహితులు ఉండటంతో సూరజ్‌గా సులభంగా నటించగలిగా'' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరో హీరోయిన్లుగా మంజుల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మనసుకు నచ్చింది'. సంజయ్ స్వరూప్, పి.కిరణ్ నిర్మించిన ఈ సినిమా ఈ రోజు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మీడియాతో మాట్లాడుతూ– ''మంజుల గారు చెప్పిన కథ వినగానే చాలా ఎగ్జైట్ అయ్యా. ప్రతి సన్నివేశం చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. నాకు చెప్పిన కథని మంజులగారు అలాగే తెరపైకి తీసుకురావడం గ్రేట్. ఇదొక ఫీల్ గుడ్ మూవీ. మనం మిస్సవుతున్న చిన్న చిన్న సంతోషాలని ఈ కథ గుర్తు చేస్తుంది. ఇటీవల నా సినిమాల్లో వినోదం మిస్ అవడంతో ప్రేక్షకులు సరిగ్గా ఆదరించలేదు. 'మనసుకు నచ్చింది'లో ఫన్ ఉంటుంది. రియలిస్టిక్ పెర్ఫార్మెన్స్ నేనిప్పటి వరకూ చేయ లేదు. ఈ చిత్రంలో చేశా. పిల్లల నుంచి పెద్దల వరకూ.. ముఖ్యంగా పిల్లలకీ, మహిళలకి మా సినిమా బాగా నచ్చుతుంది. ఓ మంచి సినిమా చూశామనే భావన అన్ని వర్గాల ప్రేక్షకులకు కలుగుతుంది'' అన్నారు. ప్రస్తుతం కునాల్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. ఆ తర్వాత నందిని పులి అనే లేడీ డైరెక్టర్‌తో లవ్‌స్టోరీ, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో సినిమాలు చేయనున్నా'' అన్నారు.

బషీద్ వల్ల నాకే ఎక్కువ నష్టం

''సీవీ కుమార్ స్వీయదర్శకత్వంలో నిర్మించిన 'మాయవన్' సినిమా తమిళంలో సూపర్ హిట్ అయింది. ఆ సినిమాని నిర్మాత ఎస్.కె. బషీద్ తెలుగులో 'ప్రాజెక్ట్ జెడ్' పేరుతో విడుదల చేశారు. ఆ సినిమాకి నేను తెలుగు డబ్బింగ్ చెప్పలేదని, దాంతో నష్టపోయానని ఆయన ఆరోపిస్తున్నారు. రామానాయుడు స్టూడియోలో నేను డబ్బింగ్ చెప్పా. సీవీ కుమార్‌గారికి బషీద్ పూర్తి డబ్బులు చెల్లించలేదు. దాంతో ఆయన డబ్బింగ్ వెర్షన్ ఇవ్వలేదు. కానీ బషీద్ సెన్సార్ ప్రింట్‌నే రిలీజ్ చేయడంతో ఫ్లాప్ అయింది. ఆ రకంగా బషీద్ వల్ల నాకే ఎక్కువ నష్టం. తమిళంలో హిట్ అయిన ఓ సినిమాని తెలుగులో చంపేశాడు బషీద్'' అని సందీప్ కిషన్ అన్నారు.

అందుకే నిర్మాతగా మారా!


● నానీ

''తెలుగులో కొత్త సినిమాలు, కొత్త కథలు రావడం లేదని అందరూ అంటున్నారు. నేనూ అలా అనుకోవడం ఎందుకు? మార్పు నా నుంచే మొదలవ్వాలి. నేనే ముందుగా చేస్తే బాగుంటుంది కదా? అనుకొని 'అ' చిత్రం తీశా'' అని హీరో నాని అన్నారు. కాజల్ అగర్వాల్, నిత్యా మీనన్, రెజీనా, ఈషా, అవసరాల శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'అ'. ప్రశాంత్ వర్మను దర్శకునిగా పరిచయం చేస్తూ వాల్ పోస్టర్ సినిమా పతాకంపై హీరో నాని సమర్పణలో టి. ప్రశాంతి నిర్మించిన ఈ సినిమా ఈరోజు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాని పంచుకున్న విశేషాలు..

- ప్రశాంత్ వర్మ చెప్పిన కథ చాలా వైవిధ్యంగా ఉంది. తనకు నిర్మాతలు లేరని నేనే ఇద్దరు ముగ్గురు నిర్మాతలకు కథ వినమని చెప్పా. కానీ కమర్షియల్ సినిమాలు తీస్తున్న వారు ఇలాంటి కథ తీసేందుకు ముందుకు రారు. అటువంటప్పుడు ప్రశాంత్‌ని ఎందుకు నిరుత్సాహపరచడం. పైగా కథ వైవిధ్యంగా ఉంది కాబట్టి నేనే నిర్మిస్తానని చెప్పా. తనకు అవసరమైన నటీనటులు, టెక్నీషియన్స్‌ని ఇచ్చా.
- హీరోగా కూల్‌గా ఉంటాను. నిర్మాతగానూ టెన్షన్ లేదు. నిర్మాతగా 'అ' సినిమా చూసినప్పుడు నటుడిగా నా తొలి సినిమా 'అష్టా చమ్మా' చూసిన ఫీలింగ్ కలిగింది. చాలా హ్యాపీ. అయితే 'నానీకి ప్రొడక్షన్ అవసరమా?' అంటారేమో అని చిన్న భయం. టాలీవుడ్‌కి 'అ' లాంటి సినిమాల అవసరం ఉంది. పైగా తెలుగు ప్రేక్షకులు ఇలాంటి కొత్త సినిమాలు కోరుకుంటున్నారు. అందుకే నాకు ప్రొడక్షన్ అవసరం.
- ఓవైపు హీరోగా 'కృష్ణార్జున యుద్ధం' సినిమాతో బిజీగా ఉన్నా. మరోవైపు 'అ' సినిమా పనుల్లో ఉండటంతో ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపా. సినిమా అంటే నాకు పిచ్చి. ఓ ఎగ్జైట్‌మెంట్. అందువల్లే నాకు నటన, ప్రొడక్షన్ కష్టం అనిపించలేదు. 'అ' చిత్రంతో నిర్మాతల కష్టాలేంటో పూర్తి స్థాయిలో తెలిసాయి.
- 'అ' కమర్షియల్ సినిమా కాదు. నాపై నమ్మకంతో సినిమా కొనే డిస్ట్రిబ్యూటర్లను ఎందుకు రిస్క్‌లో పడేయడం? సినిమాపై నాకు నమ్మకం ఉంది. ఆ రిస్క్ ఏదో నేనే పడదామనుకుని సొంతంగా రిలీజ్ చేస్తున్నా. తమిళ, మలయాళం భాషల్లో డబ్ చేసి విడుదల చేస్తున్నాం.
- మా 18 మంది కజిన్స్‌లో యూజ్‌లెస్ ఫెలో నేనే. అటువంటి నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది సినిమా. నా వద్ద ఉన్న ప్రతి రూపాయి సినిమా ఇచ్చిందే. ఆ డబ్బుని తిరిగి సినిమాపై పెట్టేందుకు నేను వెనకాడను.
- 'అ' సినిమా కమర్షియల్‌గా హిట్ సాధించకున్నా పర్లేదు. కానీ.. ఓ ఇరవై ఏళ్ల తర్వాత.. తెలుగులో వైవిధ్యమైన సినిమాలకు 'అ' సినిమాతోనే మార్పు ప్రారంభమైంది అంటే చాలు. మా లక్ష్యం నెరవేరినట్లే. వాల్‌పోస్టర్ సినిమా బ్యానర్లో కొత్త తరహా చిత్రాలే వస్తాయి. అందుకు రెండు మూడేళ్లు అయినా పట్టొచ్చు.
- నేనిప్పుడు ఈ స్థాయిలో ఉన్నానంటే నా దర్శక–నిర్మాతలే కారణం. సొంత బ్యానర్ పెట్టాను కదా. నా సినిమాలు నేనే చేసుకుంటానంటానేమో? అనుకుంటారు. నేనెప్పుడూ నటుణ్ణే. నా బ్యానర్‌లో నేనెప్పుడూ నటించను. 'అ' విషయంలో నేను నిర్మాతనే. కాజల్, నిత్య, రెజీనా, అవసరాల నటులే. మేమంతా ఫ్రెండ్స్ కదా అని రెమ్యునరేషన్ తగ్గించలేదు. డేట్స్‌ని బట్టి తీసుకున్నారు.
- ఏడాదికి మూడు సినిమాలతో బిజీ. నేను హీరోగా చేయడంతో పాటు నా పాత జాబ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నా. నా డైరెక్టర్లకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉంటున్నా. యాక్టర్‌గా నా పేరు వేయకున్నా పర్లేదు.. డెరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో నా పేరు వేయమని చెబుతుంటా (నవ్వుతూ).
- శేఖర్ కమ్ముల, వెంకీ కుడుముల దర్శకత్వంలో నేను సినిమాలు చేస్తున్నానన్నది అవాస్తవం. మేర్లపాక గాంధీతో 'కృష్ణార్జున యుద్ధం చేస్తున్నా'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నాగార్జునగారు, నేను చేయబోయే సినిమా పూజ ఈ నెల 24న ఉంటుంది. మార్చిలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. తర్వాత కిశోర్ తిరుమల, విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో సినిమాలు చేస్తా.

కన్ను కుట్టి

ప్రియా ప్రకాశ్ కేరళ కుట్టి.. తను కన్ను కొట్టి.. ఎంతోమందిని టెన్షన్‌లో పెట్టి అభిమానులతో చేయిస్తోంది వెట్టి

ఎవరీ ప్రియాప్రకాశ్ వారియర్. సమాజాన్ని ఉద్ధరించే పనేదైనా చేసిందా? పోనీ నలుగురికి ఉపయోగపడే పనేదైనా? పోనీ ఇద్దరికి.. ఊహూ.. ఒక్కరికి. అబ్బే లేదు. మరేం చేసింది అంటే.. జస్ట్ కన్ను కొట్టింది. అంతే... లక్షలాది మంది 'ఫ్లాట్'. సినిమా రిలీజ్‌కి ముందు టీజర్ వదులుతారు కదా? ఆ టీజర్‌లో రెండు కనుబొమలను పైకి లేపి, చిరునవ్వు నవ్వి, కన్నుకొట్టి... బాసూ.. ఓవర్‌నైట్ స్టార్ అవ్వడానికి ఇంత చేస్తే చాలు. ప్రియ చేసింది ఇంతే. అంతే.. నిన్న మొన్నటి వరకూ తనెవరో కేరళలో కూడా చాలామందికి తెలియదు. కానీ ఇప్పుడు దేశవ్యాప్తంగా ఫేమస్. ఇంత పాపులార్టీ తెచ్చుకున్నది కన్ను కొట్టినందుకు.. అందంగా కొట్టినందుకు.

సోషల్ మీడియాలో ఇప్పుడు ఈ మలయాళీ టీనేజ్ గర్ల్ ఫేమస్. ఆ మాత్రం చాలు ఈ అమ్మాయి యాక్ట్ చేసిన 'ఒరు అడార్ లవ్' సినిమా ఫేమస్ అయిపోవడానికి. టీజర్‌తోనే ఇంత సెన్సేషన్ అయింది కాబట్టి ఈసారి ఇంకో టీజర్ వదిలారు. ఇప్పుడు ప్రియా ఏం చేసిందో టీజర్ చూసినవారికి తెలిసే ఉంటుంది. అయినా చెబుతాం. దొండపండులాంటి పెదాల మీద రెండు వేళ్లు పెట్టుకుని 'మ్చ్' అంటూ బాయ్‌ఫ్రెండ్‌కి ఓ ముద్దు విసిరింది. అంతేనా.. ఆ రెండు వేళ్లను పెదాల మీద నుంచి తీసేసి, గన్నులా పెట్టి, కన్ను కొట్టి షూట్ చేసేట్లు సైగ చేస్తుంది. అంతే.. అక్కడ ఉన్నది తూటా కాకపోయినా సూటిగా గుండెల్లో గుచ్చుకున్నట్లు ఆ కుర్రాడు ఫీలయ్యాడు. చూసిన కుర్ర హృదయాల్లో డ్రీమ్ గర్ల్ అయి కూర్చుంది ప్రియ. ఈ టీజర్ తనను ఇంతగా పాపులర్ చేస్తుందని ప్రియ ఊహించలేదు. ''ఇంతమంది చూపిస్తున్న ప్రేమను ఎలా హ్యాండిల్ చేయాలో అర్థం కావడంలేదు. ఇది కలా? నిజమా?'' అనిపిస్తోంది అని ఆనందం వ్యక్తం చేస్తోంది.

ఇప్పుడు ప్రియాప్రకాశ్ తన ఇంట్లో తానే ఉండలేకపోతోంది. ఎందుకో తెలుసా? ఎప్పుడెప్పుడు ఈ బ్యూటీ బయటికొస్తుందా? అని ఎదురు చూస్తూ ఇంటి గేటు ముందు పహారా కాస్తున్నారట. అందుకే ప్రియాని ఆమె తల్లి ఇంట్లో నుంచి పంపించేశారు. అయ్యో.. మన సెలా వచ్చింది అనుకుంటున్నారా? మరేం లేదండి. మూడో కంటికి తెలియకుండా ప్రియాని హాస్టల్‌కి పంపించేశారు. అది లేడీస్ హాస్టల్ కాబట్టి నో ప్రాబ్లమ్. ఇంతకీ ప్రియాప్రకాశ్ ఏం చదువుకుంటోంది? బ్యాగ్రౌండ్ ఏంటి? అంటే..

ప్రియాప్రకాశ్ వారియర్ వయసు 18. ఊరు కేరళలోని త్రిశ్శూరు. అక్కడి విమలా కాలేజీలో బీకామ్ స్టూడెంట్. క్లాసికల్ డ్యాన్స్‌లో ట్రైనింగ్ తీసుకుంది. మోడలింగ్ అంటే మోజు. అందుకే అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మోడలింగ్‌లోకి ఎంటరైంది. పలువురు ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్స్ కోసం ర్యాంప్ వాక్ చేసింది. అప్పుడెవరూ ఊహించలేదు. ప్రియా ఓవర్‌నైట్ స్టార్ అవుతుందని. అన్నట్లు టీజర్స్‌లో ప్రియా కూర్చుని కనిపించింది. మరి.. నిలబడితే ఎంత ఎత్తు ఉంటుందంటే.. సుమారు 5 అడుగుల 4 అంగుళాలు. బరువు 50 కేజీలు. ఎత్తుకి తగ్గ బరువు అని చెప్పొచ్చు.

అబ్బాయిల గుండెల్లో సునామీ

ప్రియా ఫస్ట్ మూవీ 'ఒరు అడార్ లవ్' త్వరలో రిలీజ్ కానుంది. టీజర్ ఎఫెక్ట్‌తో మేం కొంటామంటే మేం కొంటామంటూ బయ్యర్లు క్యూలు కట్టారట. బిజినెస్ బ్రహ్మాండంగా జరుగుతోంది. రిలీజ్ తర్వాత టికెట్లు కూడా బ్రహ్మాండంగా తెగుతాయి. అన్నట్లు.. ఈ చిత్రాన్ని ఇతర భాషల్లో అనువదించి, విడుదల చేయాలనుకుంటున్నారు. చిన్నగా మొదలయ్యే చినుకు తుఫానుకి కారణమవుతుంది. అలాగే చిన్ని ఎక్స్‌ప్రెషన్ కుర్రకారు హృదయాల్లో సునామీ సృష్టించింది. మరోవైపు కొంతమంది హీరోయిన్ల గుండెల్లో అలజడి సృష్టించింది. ప్రియాప్రకాశ్ గట్టి పోటీ అవుతుందని ఇప్పటికే చాలామంది జోస్యం చెబుతున్నారు. ప్రియా.. వాట్‌యా? వాటీజ్ దిస్ యా? అలవోకగా కనురెప్ప మూసి.. యువత కనురెప్పలు మూతపడకుండా చేశావ్ యా.. యా.. యా..?

గుండె దిటవు చేసుకోండి

ప్రియాప్రకాశ్‌ను తొలిసారి చూసి ఇష్టపడిన అమర ప్రేమికుల్లారా.... 'లవ్ ఎట్ ఫస్ట్ టీజర్' రోమియోల్లారా... ప్రియా ప్రకాశ్ కోసం గుండెల్లో గుడి కట్టడానికి ముడి సరుకులు తెచ్చుకున్న యువకుల్లారా.... గుండె దిటవు చేసుకోండి. మీరు ఇష్టపడుతున్న ప్రియా రిలేషన్‌షిప్ స్టేటస్ సింగిల్ కాదట.

'స్పూఫ్' వీడియోల హల్‌చల్

ప్రియా కన్ను కొట్టిన వీడియో చూసి, తమ అభిమాన హీరోలు కన్ను కొట్టిన సీన్‌తో పోల్చి, రెంటినీ కలిపి ఓ వీడియోగా క్రియేట్ చేసి, అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఉదాహరణకు...
● 'ముత్తు' సినిమాలో రజనీకాంత్ సిగ్గుపడితూ కన్ను కొట్టే సీన్ ● 'అతడు' సినిమాలో కన్ను కొట్టే సీన్‌లో 'ఇలా కొట్టు..అలా పడి ఉంటారు' అని హీరోయిన్ త్రిషకు మహేశ్‌బాబు చెప్పే సీన్‌ను భలేగా ఎడిట్ చేశారు ● 'తెరీ' సినిమాలో హీరోయిన్‌ను చూసి తమిళ హీరో విజయ్ ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ ● 'ఏం మాయ చేసావే' తమిళ వెర్షన్ 'విన్నైత్తాండి వరువాయా' సినిమాలో త్రిషను ఫస్ట్ టైమ్ చూసినప్పుడు ఎక్స్‌ప్రెషన్స్ ● 'ప్రేమమ్' సినిమాలో నివిన్ పాలీ హీరోయిన్ సాయిపల్లవిని చూసి ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్.


● ప్రియా ప్రకాశ్ వారియర్

ఇది ఇప్పటి పాట కాదు



విశేషం ఏంటంటే.. 'ఒరు అడార్ లవ్' టీజర్ బ్యాగ్రౌండ్‌లో వినిపిస్తోన్న 'మాణిక్య మలరాయ పూవీ' పాట ఈ సినిమా కోసం ఫ్రెష్‌గా రాసింది కాదు. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం పి.యం జబ్బర్ రాసిన 'మాపిళ్ల..' అనే పాటకు స్టైలిష్ వెర్షన్... అదేనండి రీమిక్స్ అని కేరళ టాక్. అక్కడివారి మాటల ప్రకారం ఈ పాటకున్న చరిత్ర అంతా ఇంతా కాదని తెలుస్తోంది. మహమ్మద్ ప్రవక్త మొదటి భార్య ఖజీదా బీవీ గుణాలను వివరిస్తూ జబ్బర్ రాసిన ఈ పాట కేరళలో చాలా ఫేమస్. ఈ పాటను పెళ్లిళ్లు, ఇతర ముఖ్య ఫంక్షన్స్‌లో పాడుకుంటారట. అలా ఒరిజినల్ వెర్షన్ చాలా పాపులర్ అట.

- ఒకవైపు ఇంత సెన్సేషన్ క్రియేట్ చేస్తోన్న ప్రియాపై ప్రేమే కాదు ఈ పాటకు ఆగ్రహం కుడా వ్యక్తం చేస్తున్నారు కొందరు. పాట తమ మత మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉందంటూ హైదరాబాద్‌లో ఈ చిత్రదర్శకుడు ఒమర్ లులూపై పోలీసులకు ఫిర్యాదు చేశారు కొందరు యువకులు.

- 'ఒరు అడార్ లవ్' టీజర్ మాలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. స్టార్ హీరోల మూవీ టీజర్ వ్యూస్ రికార్డ్స్‌ను బ్రేక్ చేసింది. 24 గంటల్లో దగ్గర దగ్గర 50 లక్షల మంది చూశారు. గత ఏడాది చివర్లో విడుదలైన మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి 'మాస్టర్ పీస్' టీజర్ కూడా 24 గంటల్లో ఇన్ని వ్యూస్ దక్కించుకోలేదు. ఆ మాటకొస్తే మలయాళ టీజర్స్‌కి.. అది ఎంత పెద్ద స్టార్‌ది అయినా పది లక్షలు వ్యూస్ దక్కితే అది ఎక్కువ. అలాంటిది ఐదింతలు దక్కించుకుంది 'ఒరు అడార్ లవ్'. కన్ను కొట్టుడా? మజాకానా?



యువర్ హైనెస్



హైనెక్ వేసుకుంటే హైనెస్‌లా గొప్పగా ఉంటారు. మహారాణుల్లాగా ఉంటారు మీరూ ట్రై చేయండి..

ఫ్యాషన్

పెళ్లిళ్ల సీజన్‌లో ఒక్కోసారి ఒక్కో ట్రెండ్ చక్కర్లు కొడుతుంది. పట్టుచీరలు అనగానే బ్లౌజుపై మగ్గం వర్క్, మిర్రర్ వర్క్.. అంటూ రకరకాల ఎంబ్రాయిడరీలు గ్రాండ్‌గా హల్ చల్ చేస్తుంటాయి. అవేవీ లేకుండా సింపుల్‌గా హై నెక్‌తో ఇలా హైగా కనిపించవచ్చు.







ఒకటే ప్యాటర్న్

చీర రంగులోనే బ్లౌజ్ ప్యాటర్న్ ఉండేలా చూసుకోవాలి. దీనికి హై నెక్ పెట్టించాలి. చేతులకు అంచు వేయిస్తే చాలు. చెవులకు పెద్ద పెద్ద ఝుంకాలు, మెడలో ఒక చోకర్ హారం లేదంటే లాంగ్ హారం అదీ కాస్త వెడల్పుగా ఉండేది ధరిస్తే చాలు మహారాణి కళ వచ్చేస్తుంది.

పూర్తి కాంట్రాస్ట్

చీరకు పూర్తి కాంట్రాస్ట్ కలర్ ఫ్యాబ్రిక్ తీసుకొని హై నెక్‌తో డిజైన్ చేయించుకుంటే చాలు. వేరే ఎంబ్రాయిడరీ అవసరమే లేదు. చెవులకు పెద్ద పెద్ద హ్యాంగింగ్స్ లేదా బుట్టలు పెట్టేస్తే మెడలో ఏం ధరించకపోయినా గ్రేస్‌గా కనిపిస్తారు.

ఎరుపు రంగు

గంధం రంగు చీరలకు ఎరుపు రంగు బెనారస్ క్లాత్ లేదా రా సిల్క్ క్లాత్‌తో డిజైన్ చేసిన హైనెక్ బ్లౌజ్ వేసుకుంటే చాలు. మెడలో గ్రాండ్‌గా కనిపించే టెంపుల్ జువెల్రీ అలాగే చెవులకు పెద్ద పెద్ద బుట్టాలు అలంకరించుకుంటే వివాహ వేడుకలో గ్రాండ్‌గా వెలిగిపోతారు.

ఎంబ్రాయిడరీ

బ్లౌజ్ ప్లెయిన్‌గా ఉంటే ఏం బాగుంటుంది అంటారా! నిజమే ప్లెయిన్ పట్టు చీరల మీదకు ఎంత కాంట్రాస్ట్ ప్లెయిన్ బ్లౌజ్ ధరిస్తే అంత గ్రాండ్‌గా కనిపించకపోవచ్చు. అందుకని నెక్ ప్లేస్‌గా వెడల్పాటి హారం అమరినట్టుగా ఉండే వర్క్ చేయిస్తే సూపర్బ్‌గా కనిపిస్తారు.

ప్రింటెడ్ ఫ్యాబ్రిక్

పట్టు చీర అంచు రంగులో గ్రాండ్‌గా కనిపించేందుకు బెనారస్ పట్టు ఫ్యాబ్రిక్ బాగుంటుంది. అలాగే కలంకారీ ఫ్యాబ్రిక్ బాగా నప్పుతాయి.

ఆభరణాల అలంకరణ

హైనెక్ బ్లౌజ్‌లతో ధరిస్తే సింపుల్ లుక్ అనిపిస్తూ హై ఫై ఫ్యాషన్ జాబితాలో ఉన్నారన్న కితాబు పొందవచ్చు. హై నెక్ వల్ల ఆభరణాల అలంకరణ అవసరం ఉండదు. నేటి తరం అమ్మాయిలు కోరుకునే గొప్ప స్టైల్‌గా హై నెక్‌బ్లౌజ్ నిలిచిపోయింది.













నిర్వహణ
ఎన్.ఆర్.

పరి పరిశోధన

మధుమేహులకు శాకాహారంతో ఎక్కువ ప్రయోజనం?

ఆరోగ్యంగా ఉండేందుకు ఏది మేలన్న విషయంలో ఇప్పటికే చాలా చర్చలు ఉన్నాయిగానీ.. ఊబకాయంతో పాటు మధుమేహమున్న వారికి శాకాహారం మేలని అంటున్నారు శాస్త్రవేత్తలు. ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి విడుదల చేసే బీటా కణాలపై ఒక అధ్యయనం చేసి మరీ తాము ఈ విషయాన్ని తెలుసుకున్నామని హనా కాహ్లెలోవ్ అనే శాస్త్రవేత్త చెప్పారు. ఊబకాయం ఉండి.. మధుమేహ లక్షణాలు లేని కొంతమందిని రెండు గుంపులుగా విడగొట్టి ఒకరికి పండ్లు, కాయగూరలు, గింజధాన్యాలతో అతితక్కువ కొవ్వు గల ఆహారం అందించారు. రెండో గుంపులోని వారి ఆహారంలో ఎలాంటి మార్పు చేయలేదు. రెండు గుంపుల్లోని కార్యకర్తలు వ్యాయామం, తీసుకునే మందుల్లో ఎలాంటి మార్పులు చేయకుండా చూశారు. పదహారు వారాల తరువాత జరిపిన పరిశీలనలో శాకాహార ఆధారిత గుంపులోని వారి రక్తంలోని చక్కెరల మోతాదు గణనీయంగా తగ్గినట్లు తెలిసింది. మధుమేహ నివారణకు ఈ అధ్యయనం ఎంతో ఉపయోగపడుతుందని హనా తెలిపారు. శాకాహారం మధుమేహాన్ని నివారించడంతోపాటు వ్యాధి ఉన్నవారికీ మేలైన చికిత్సగా పనిచేస్తుందని గతంలోనూ ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేశాయి. అంతేకాకుండా బరువు, కొవ్వుల మోతాదు, రక్తపోటులను తగ్గించుకునేందుకు కూడా శాకాహారం మంచిదని ఈ అధ్యయనాల ద్వారా తెలిసింది.



* * *

కూల్‌డ్రింక్‌తో గర్భధారణ సమస్యలు?

చక్కెర అధికంగా ఉన్న కూల్‌డ్రింక్స్‌ను రోజూ తీసుకోవడం వల్ల మహిళల గర్భధారణ శక్తి తగ్గిపోతుందని బోస్టన్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ శాస్త్రవేత్తలు అంటున్నారు. మహిళలతో మాత్రమేనా ఈ సమస్య అంటే.. కానేకాదు ఇది మగవాళ్లకూ వర్తిస్తుందని.. రోజుకు ఒక కూల్‌డ్రింక్ తాగినా సరే.. తండ్రి అయ్యే అవకాశాలు తగ్గుతాయని వీరు అంటున్నారు. కాకపోతే ఈ అధ్యయనం అమెరికాలో జరిగింది కాబట్టి.. ఇతర ప్రాంతాల్లోనూ ఇదే రకమైన ఫలితాలు ఉంటాయన్న గ్యారెంటీ లేదు. అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు 21 – 45 ఏళ్ల మహిళలు, 1045 మంది పురుషులతో మాట్లాడి.. వివరాలు సేకరించారు. ఆరోగ్య వివరాలతోపాటు, జీవనశైలి వివరాలు, ఆహారం, కూల్‌డ్రింక్‌ల వివరాలు కూడా తీసుకున్నారు. ఆ తరువాత మహిళల నుంచి రెండు నెలలకు ఒకసారి కొన్ని వివరాలు సేకరిస్తూ వచ్చారు. గర్భధారణ జరిగేంతవరకూ ఈ ప్రక్రియ కొనసాగింది. పురుషులు, మహిళలు ఇద్దరి వివరాలు, గర్భధారణ సమయాలను పరిగణలోకి తీసుకున్న తరువాత ఇద్దరిలోనూ సంతానోత్పత్తి సామర్థ్యం 20 శాతం వరకూ తగ్గినట్లు స్పష్టమైంది. రోజుకు కనీసం ఒక్క కూల్‌డ్రింక్ తాగిన మహిళల్లో 25 శాతం తగ్గుదల ఉండగా.. పురుషుల్లో ఇది 33 శాతం వరకూ తగ్గినట్లు స్పష్టమైంది.



మళ్లీ చెప్పకుందాం! రీటోల్డ్ కథలు - 06

శుంఠలు పదివేలు





● ఇంద్రగంటి జానకీ బాల

'ఓరి శుంఠా' అని అనుకుంది.

రొప్పుతున్నాడు. రెచ్చుతున్నాడు. గోడకు చేయి ఆనించి ఎటో ముఖం పెట్టి నిలుచున్నాడు.

ఇలాంటి టైములో భలే వేగం వస్తుంది. చిన్న బ్యాగు తీసుకుంది. కొన్ని బట్టలు సర్దుకుంది. పసికందును ఒడిలో తీసుకుని తండ్రి వెంట ఇంటి నుంచి బయట పడింది.

ఆటో కుదుపులు ఇస్తుంటే ఆదమరిచి నిదురిస్తున్న పాపను గుండెలకు అదుముకుంటూ 'మెల్లగా అన్నా' అంది డ్రైవర్‌తో.

మళ్లీ పాప వైపు చూసింది.

మొండిఘటం. ఎంత కంగారు పెట్టింది.

ఆరునెలల క్రితం ఆ రోజు అతను ఆఫీసుకు వెళుతుంటే తనూ ఆఫీసుకు బయలు దేరుతుంటే సడన్‌గా ఏదో అయ్యింది. ఏమిటది... కడుపులో నుంచి ఏదో తన్నుకొస్తున్నట్టుగా... లోపలి నుంచి ఏదో బయట పడిపోతున్నట్టుగా. కళ్లు తిరుగుతున్నాయి. కింద నుంచి స్రావం.

అత్తగారు పరిగెత్తుకుంటూ వచ్చింది.

దగ్గరగా చిన్న క్లినిక్ ఉంటే ఆ డాక్టరమ్మ పరీక్షించి చూసి 'అబార్షన్' అంది.

'పెళ్లయిన మొదటి రెండుసార్లలో ఇలా అబార్షన్ అవడం కొంతమందిలో మామూలే. ఇక మీదట కడుపు నిలబడి మంచి పిల్లలు పుడతారు' అని చెప్పింది.

అది ఒక బాధ. ఆఫీసులో మాటలు పడాల్సి రావడం మరో బాధ.

'ఈ ఆడవాళ్లకు ఏం పని లేదు. పురుళ్లని ఒకసారి అబార్షన్లని మరోసారి హాయిగా సెలవులు దొబ్బుతుంటారు' అంటుంటారు కలీగ్స్.

ఆడవాళ్లందరూ అన్నిసార్లు సపోర్ట్‌గా ఉంటారని చెప్పలేము. బాగా పని చేసేవాళ్లకు ఆడవాళ్లైనా మగవాళ్లైనా శత్రువులే. వాళ్లూ వంత పాడతారు. సరే. వాళ్లంటే పరాయివాళ్లు... ఎవరోలే అని అనుకోదగ్గవాళ్లు.

ఇంటి మనిషి?

అరె... భార్యకు అబార్షన్ అయ్యిందే దగ్గర కూర్చుని నాలుగు సాంత్వనం మాటలు మాట్లాడదామే అని లేదు. తను ఆఫీసుకు వెళ్లలేదు కనుక ఆ జీతం డబ్బు ఎలా తెచ్చుకుందామా అని హడావిడి పడి తెచ్చుకున్నాడు. అప్పుడనే ఏముంది? ఒకటో తేదీ వస్తున్నదంటే ఏమిటో రైలు బండి తప్పిపోయేవాడిలాగా కంగారు కంగారుగా ఉంటాడు. ఆ డబ్బు తెచ్చివ్వాలి. అతను తీసుకోవాలి. అప్పుడే నిశ్చింత. అసలు తనను పెళ్లి చేసుకున్నాడా ఒకటో తేదీనా అని సందేహం.

ఒకటో తేదీనే అని ఇవాళ తేలి పోయింది.

ఇంట్లో పెద్ద గొడవ అయ్యింది. కారణం ఉద్యోగం నుంచి ఊస్టింగ్ ఆర్డర్ ఇచ్చారు.

పాప పుట్టి జీవితం సంతోషంగా ఉండబోతుంది అనుకుంటున్నప్పుడు ఈ దెబ్బ.

ఆఫీసును కూడా అనడానికి లేదు. అబార్షన్ అని అబద్ధం చెప్పి ఒకసారి, ఆ వెంటనే మెటర్నిటీ లీవ్ అని మరోసారి వరుసగా సెలవులు వాడుకొని ప్రభుత్వాన్ని చీట్ చేసిందంటూ కేసు పుటప్ చేసి ఊస్టింగ్ ఇప్పించారు. కలీగ్స్ హస్తం ఉంది ఇందులో.

కాని జరిగినదానిలో తప్పెవరిది?

ఆ రోజు వీధి చివర డాక్టరు చెప్పింది నిజమే అనుకున్నారు. నెల తర్వాత కూడా పిరియడ్స్ రాకపోతే ఈసారి కాస్త పెద్ద డాక్టర్ దగ్గరకు వెళితే ఆమె అన్ని పరీక్షలు చేసి అబార్షన్ జరగలేదని, ఒక్కోసారి ఎక్కువ బ్లీడింగ్ జరిగి అబార్షన్ అనిపిస్తుందని, కాని పిండం సేఫ్‌గా ఉండి ఎదిగి పిల్లలు పుడతారని చెప్పింది.

సంబరంలో మునిగి, ప్రెగ్నెన్సీని జాగ్రత్తగా చూసుకోవడంలో ఉండిపోయిందిగానీ ఆఫీసులో దెబ్బ పడుతుందని అనుకోలేదు.

తీరా ఊస్టింగ్ ఆర్డర్‌తో వచ్చేసరికి అతడు మండి పడుతున్నాడు.

'పెద్ద ఉద్యోగం చేయడానికి బయలుదేరుతారు. ఏమైనా అంటే పొడుచుకొస్తూ ఉంటుంది. ఏం నీకు రూల్స్ తెలియవా? ప్రెగ్నెన్సీ రీకన్ఫర్మ్ చేశాక ఇంతకు ముందు పెట్టిన అబార్షన్ లీవును వేరే లీవు కిందకో లాస్ ఆఫ్ పే కిందకో మార్చుకోవాలని నీకు తెలియదా?'

'నాకు తెలియలేదు. మీరూ ఎంప్లాయియే కదా. మీరు చెప్పొచ్చుగా'

'నాకిదే పట్టింది. నీ ముట్లు లెక్కబెట్టుకోవడమే నా పనా'

'మరి నా జీతం నోట్లు లెక్కబెట్టుకోవడం మీ పనా?'

చెంప ఛెళ్లుమంది. తండ్రి ఉన్నాడని కూడా చూడ లేదు.

'మావయ్యా. నేను యోగ్యుణ్ణి. లక్షమంది వచ్చారు చేసుకోవడానికి. కాని మీ అమ్మాయి ఎంప్లాయి అని చేసుకున్నాను. పెళ్లికి నా షరతు కూడా అదే. ఇప్పుడు వెర్రిమొఖం వేసుకుని ఉద్యోగం పోగొట్టుకుంది. ఆమెకు ఉద్యోగం ఉంటే సరి. ఎలా తెచ్చుకుంటుందో తెచ్చుకోమనండి. లేకుంటే నాకు అక్కర్లేదు' తెగేసి చెప్పాడు.

బిడ్డను తీసుకుని బయటపడింది.

పుట్టింటి ఆదరణ కూడా ఒకోసారి ముఖ్యమై పోతుంది. పాపను తల్లిదండ్రులకు అప్పజెప్పి తెల్లారి నుంచి కాలికి బలపం కట్టుకుని ఉద్యోగం కోసం తిరగడం మొదలుపెట్టింది. పై ఆఫీసర్లను కలిసి, అర్జీలు పెట్టి, తెలిసిన వారితో చెప్పించి... పెద్ద ప్రయాస. చివరకు శుభ వార్త అందింది. ఉద్యోగం ఇస్తారట. అయితే పాత అనుభవం అంతా నల్లిఫై చేసి కొత్త అపాయింట్‌మెంట్ ఇస్తారట. మంచిదే. ఏదో ఒకటి. ఉద్యోగం అయితే ఉందిగా.

మధ్యలో రెండు మూడుసార్లు అతడు వచ్చి చూసి వెళ్లాడు. రమ్మనలేదు. తాను వస్తాననలేదు.

ఇప్పుడు వచ్చాడు. ఇలాంటి సందర్భాల కోసమే పావుకిలో స్వీట్ పేకట్లు ఉంటాయి. అలాంటిది తెచ్చాడు.

ఆ స్వీటులోని స్వీటే పెట్టి, కొంచెం కారా ఇచ్చి తిన్నాక వీధి తలుపు చూపించింది.

'అదేమిటి?' అన్నాడు హతాశుడవుతూ.

'నీక్కావల్సింది పెళ్లాం కాదు. పాస్‌బుక్కు. నీ దోవ నువ్వు చూసుకో'

'బాగా ఆలోచించుకో'

'ఆలోచించుకున్నా. వెళ్లవోయ్'

వెళ్లిపోయాడు.

లేచి తల దువ్వుకుని స్థిరంగా తొణకనిదానియై లాయర్ దగ్గరకు బయలుదేరింది.

కథ ముగిసింది.

ఇంద్రగంటి జానకీబాల 'జీవన రాజకీయం' కథ ఇది.

ఆఫీసుల్లో చాలా రాజకీయాలు ఉంటాయి. కాని కుటుంబంలో అందునా భర్త దగ్గర రాజకీయం ఉంటే చాలా కష్టంగా అనిపిస్తుంది. జీవించడానికి సంపాదనలో ఆమె సాయాన్ని ఆశించవచ్చు. కాని ఆమెనొక రాబడి యంత్రంగా మార్చడానికి రాజకీయం చేస్తే సహించాల్సిన అవసరం లేదు. కల్లబొల్లి కబుర్లు చెప్పి భార్యను కొత్తగా చదివించేవాళ్లు, ఉన్న ఉద్యోగంలో ఉంచకుండా డిపార్ట్‌మెంటల్ టెస్టులు రాయించేవాళ్లు, ఏదో ఒక మాట చెప్పి మస్కట్ విమానం ఎక్కించేవాళ్లూ, ఉద్యోగం చేయలేనంటున్నా బలవంతంగా చేయించి సాధించేవాళ్లు, నెల తిరిగేసరికి డబ్బు తేని పక్షాన అల్పంగా చూసేవాళ్లు వీళ్లు భర్తలా? శుంఠలు.

పునః కథనం: **ఖదీర్**



స్క్రీన్ టెస్ట్



1 'అతడు' సినిమాలో మహేశ్‌బాబు తాతగా నాజర్ నటించారు. కానీ ఆ పాత్రకు మొదట అనుకొన్నది ఒకప్పటి టాలీవుడ్ టాప్ హీరోని. ఎవరా హీరో?
ఎ) అక్కినేని నాగేశ్వరరావు బి) శోభన్‌బాబు సి) కృష్ణ డి) కాంతారావు



10 యస్.యస్.రాజమౌళి తన కెరీర్‌లో ఒకే ఒక చిత్రానికి యాక్షన్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ సినిమా పేరేంటి?
ఎ) స్టూడెంట్ నం.1
బి) సై సి) మగధీర
డి) రాజన్న

18 నటుడు సూర్య ఆర్థికంగా లేనివారు కూడా చదువుకోవాలనే ఉద్దేశంతో స్థాపించిన సంస్థ పేరేంటి?
ఎ) అగరం ఫౌండేషన్ బి) హెల్ప్ ఫౌండేషన్
సి) ఏకం ఫౌండేషన్
డి) స్వామినాథన్ ఫౌండేషన్







8 హీరో నాగచైతన్య పక్కన హీరోయిన్‌గా మూడుసార్లు ఒక హీరోయిన్ మాత్రమే నటించారు. ఎవరా హీరోయిన్?
ఎ) తమన్నా బి) అమలాపాల్ సి) కాజల్ అగర్వాల్ డి) సమంత

14 నటుడు సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన 'బాడీగార్డ్' చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో రీమేక్ చేశారు? తెలుగులో నటించిన టాలీవుడ్ నటుడెవరో తెలుసా?
ఎ) చిరంజీవి
బి) వెంకటేశ్
సి) నాగార్జున
డి) బాలకృష్ణ

5 'దశావతారం' చిత్రంలో కమల్‌హాసన్ పది పాత్రలు పోషించిన సంగతి అందరికి తెలిసిందే. కానీ ఇందులో 7 పాత్రలకు డబ్బింగ్ చెప్పారు ఈ ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్. ఎవరతను?
ఎ) సాయికుమార్ బి) యస్పీ బాలసుబ్రమణ్యం
సి) శివాజీ డి) జీవీజీ రాజు

9 'పరేషానురా పరేషానురా' అంటూ 'ధృవ' చిత్రంలో రామ్‌చరణ్, రకుల్‌ప్రీత్ సింగ్ నటించారు. ఆ పాట రచయిత ఎవరో కనుక్కోండి?
ఎ) చంద్రబోస్
బి)'సిరివెన్నెల' సీతారామశాస్త్రి
సి) వరికుప్పల యాదగిరి
డి) రామజోగయ్య శాస్త్రి

19 కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన ఈ స్టిల్ ఏ సినిమాలోదో కనుక్కోండి?
ఎ) సాగర సంగమం
బి) స్వాతిముత్యం సి) సిరిసిరిమువ్వ
డి) శంకరాభరణం



3 'ఛమక్ ఛమక్ ఛం చుట్టుకో చుట్టుకో చాన్స్ దొరికెరో ఛయ్యా' అంటూ సాగే ఈ పాటను 'ఇంటెలిజెంట్' సినిమాలో రీమిక్స్ చేశారు యస్.యస్. తమన్. ఈ పాటకు ఒరిజినల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎవరో తెలుసా?
ఎ) ఇళయరాజా బి) కేవీ మహదేవన్
సి) రాజ్–కోటి డి) దేవా

నిర్వహణ
శివ మల్లాల

12 ఇంద్ర, ఖడ్గం, మన్మథుడు.. ఈ మూడు సినిమాలు 2000 సంవత్సరంలో విడుదలై సంచలన విజయాలు సాధించాయి. ఆ మూడు సినిమాల్లో హీరోయిన్ ఒక్కరే. ఎవరా బాలీవుడ్ భామ?
ఎ) మనీషా కొయిరాలా బి) సొనాలీ బింద్రే సి) నమ్రతా శిరోద్కర్ డి) టబు



16 'కళ్లు' అనే చిత్రానికి దర్శకత్వం వహించింది ప్రముఖ కెమెరామెన్? ఎవరతను? (చిన్న క్లూ అతను 'సిరివెన్నెల' చిత్రానికి కెమెరామెన్)
ఎ) వీయస్సార్ స్వామి
బి) ఛోటా. కె నాయుడు
సి) యం.వి. రఘు
డి) ఎస్. గోపాల్‌రెడ్డి

13 హీరోయిన్ శ్రీదేవి నటించిన 'మామ్' ఆమెకు ఎన్నో సినిమానో తెలుసా?
ఎ) 300 బి) 200 సి) 250 డి) 350



4 ఇప్పుడు డబ్బింగ్ సినిమాలు వారానికొకటి రిలీజవుతున్నాయి. మరి మొట్టమొదట రిలీజైన తొలి తెలుగు డబ్బింగ్ సినిమా పేరేంటో తెలుసా?
ఎ) ఆహుతి బి) ఆరంభం
సి) ఘర్షణ డి) దేవా

17 పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వస్తున్న కొత్త చిత్రంలో హీరో పేరేంటో తెలుసా?
ఎ) ఆకాశ్ బి) వరుణ్‌తేజ్
సి) సత్య డి) రోషన్

2 'ఒకడి లైఫ్ ఇంకొకడికి లైట్‌గానే ఉంటుంది. కానీ ఎవడి లైఫ్ వాడికి చాలా వెయిట్ ఉంటుంది' అనే డైలాగ్ రాసిన రచయిత ఎవరు?(చిన్న క్లూ... ఈ డైలాగ్ 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' సినిమాలోనిది)
ఎ) బుర్రా సాయిమాధవ్
బి) పరుచూరి బ్రదర్స్
సి) క్రాంతిమాధవ్ డి) రత్నంబాబు



7 'వీరబాహు సత్యధర్మ శివ శంకర రామ బాలు మహేంద్ర'... ఇది సుకుమార్ దర్శకత్వం వహించిన ఓ సినిమాలో హీరో పాత్ర పేరు. ఆ హీరో ఎవరో చెప్పకోండి చూద్దాం?
ఎ) అల్లు అర్జున్ బి) రామ్
సి) నాగచైతన్య డి) రాజ్‌తరుణ్

20 ఈ పై ఫొటోలోని బుడతడు ఇప్పుడు టాలీవుడ్‌లో సక్సెస్‌ఫుల్ హీరో. ఇతనెవరబ్బా? ఓ నిమిషం ఆలోచించండి?
ఎ) రామ్‌చరణ్
బి) సాయిధరమ్ తేజ్
సి) యన్టీఆర్
డి) వరుణ్‌తేజ్



15 శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'అనామిక' చిత్రంలో హీరోయిన్‌గా ఎవరు నటించారో గుర్తుందా?
ఎ) శ్రియ బి) అంజలా జవేరి సి) నయనతార డి) కమలినీ ముఖర్జీ



6 యస్.యం.యస్ (శివ మనసులో శ్రుతి) చిత్రం ద్వారా తెలుగు తెరకు హీరోగా పరిచయమయ్యారు సుధీర్‌బాబు. అదే చిత్రం ద్వారా తెలుగులో ఆరంగేట్రం చేసిన హీరోయిన్ ఎవరు?
ఎ) కేథరిన్ బి) రెజీనా సి) ప్రణీత డి) నిత్యామీనన్

11 ప్రముఖ నటి శ్రియ ఏ నాట్య విభాగంలో విద్యనభ్యసించారో తెలుసా?
ఎ) కూచిపూడి బి) భరతనాట్యం సి) కథక్ డి) కథక్కళి

సమాధానాలు
1) బి 2) ఎ 3) ఎ 4) ఎ
5) బి 6) బి 7) సి 8) డి 9) సి
10) డి 11) సి 12) బి 13) ఎ
14) బి 15) సి 16) సి 17) ఎ 18) ఎ 19) సి 19) సి
20) డి

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

ఆ శక్తి

వాళ్లను నాశనం చేస్తుంది

\- మోహన్‌బాబు



పృథ్వీ, రాజా రవీంద్ర, మోహన్‌బాబు, మదన్

''గాయత్రి' సినిమా రిలీజ్ అయిన వెంటనే ఇంటర్నెట్‌లో పెట్టారు. ఒక సైట్‌లో 2 లక్షల మంది, ఇంకో సైట్‌లో 75 వేల మంది చూశారని అమెరికా నుంచి మిత్రులు ఫోన్ చేసి చెప్పారు. సినిమా విడుదలైన రోజే పైరసీ సీడీలు వస్తుంటే ఏం చేయాలి? నిర్మాతగా హృదయంలో ఏడుస్తున్నాను. కళ్లలో నీళ్లు కూడా రావడంలేదు'' అని నటుడు మంచు మోహన్‌బాబు అన్నారు. మోహన్‌బాబు లీడ్ రోల్‌లో నటించి, నిర్మించిన సినిమా 'గాయత్రి'. మదన్ రామిగాని దర్శకత్వం వహించారు. విష్ణు, శ్రియ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా సక్సెస్ మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. మోహన్‌బాబు మాట్లాడుతూ– ''పైరసీ బారిన పడ్డ నాలాంటి నిర్మాతలు ఎంతో మంది ఉన్నారు. వాళ్లు బయటకు రాలేక, చెబితే వినేవాడు లేక ఉన్నారు. 42 ఏళ్ల సినిమా కెరీర్ ఉన్న నేను చెబితే కొంచెం అయినా చెవిన పడుతుందనే ఉద్దేశంతో మాట్లాడుతున్నా. 'గాయత్రి' కోసం తొమ్మిది నెలలు కష్టపడ్డాను. చేతికి, మోకాలికి సర్జరీ జరిగినా లెక్క చేయలేదు. దేవుడి దయవల్ల, ప్రేక్షకుల ప్రేమ వల్ల అన్నీ సంపాదించాను. నేను.. నా కుటుంబం... నా బిడ్డలు... ఓ నలుగురికి సాయం చేయగలుగుతున్నాం. 'అయ్యా.. పైరసీ చూసి మోహన్‌బాబుల్లారా.. దయచేసి చూడొద్దు'. మనందరం దేవుళ్లం. ఏదో ఓ శక్తి ఉందని నమ్ముతా. ఆ పైరసీ చూసేవాళ్లందర్నీ ఆ శక్తి నాశనం చేస్తుంది. ఎదుటివాడు చెడిపోవాలనుకుంటే మనమే చెడిపోతాం. పైరసీ చేసినవాళ్లు, దాన్ని చూసే వాళ్లు ఉంటే ఎక్కడికి పోతుంది దేశం. రిలీజ్ రోజే పైరసీ చేసింది థియేటర్ ఆపరేటరా? ఓనరా? ఇంకా ఎవరైనానా? ఇవన్నీ ఆ శివుడు.. సాయినాథుడికే ఎరుక. 'రౌడీ' సినిమా అప్పుడు 'విష్ణు ఎంత చక్కగా చేస్తున్నాడు'' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. డబ్బు ముఖ్యమా? పేరు ముఖ్యమా అంటే పేరే ముఖ్యం అంటాను నేను. ఏ తండ్రి అయినా బిడ్డల్ని చూసి పొందేది సంతోషం. యంగ్ శివాజీ పాత్రలో విష్ణుకి మంచి పేరు వచ్చింది. శ్రియ కూడా బాగా చేసింది. వీడియో పైరసీ చేసినవాళ్లను కూడా ఆ దేవుడు చల్లగా చూడాలి'' అన్నారు. మదన్ రామిగాని మాట్లాడుతూ– ''సినిమాకు మేము చేసిన పబ్లిసిటీ కంటే మౌత్ టాక్ చాలా ఎక్కువగా ఉంది. విజయవాడకు చెందిన నాటక పరిషత్ వాళ్లు 'గాయత్రి' సినిమా నటులకు డిక్షనరీలా ఉంటుంది అన్నారు. 'మోహన్‌బాబుకు వయసు ఐపోయిందా? ఆ ఎనర్జీ ఏంటి?'' అని రాయలసీమలో ఓ ఫ్రెండ్ అన్నాడు. ఈ సినిమాకి ఇవి రెండూ బెస్ట్ కాంప్లిమెంట్స్. మోహన్‌బాబుగారు హిట్స్.. ఫ్లాప్స్ పట్టించుకోరు. కథ నచ్చితే చేస్తారు. హాలీవుడ్ యాక్టర్ టామ్ క్రూజ్ ఏదో స్టంట్ చేస్తూ గాయపడ్డాడని ప్రపంచం మొత్తం మాట్లాడుతున్నారు. మోహన్‌బాబుగారు భుజం నొప్పితో వారం రోజులపాటు ఫైట్ సీన్‌లో పాల్గొన్నారు. వయసులో టామ్ క్రూజ్ కంటే మోహన్‌బాబుగారే పెద్ద. ఎందుకు మనం మనవాళ్ల గురించి గొప్పగా మాట్లాడుకోమో తెలియదు. పరాయి వాళ్ల గొప్పలే కనిపిస్తుంటాయి మనకు. మనకు ఎన్నో విషయాలు తెలుస్తాయి కానీ అప్లై చేయం. విల్ పవర్ ఉంటుంది కానీ వాడం. మోహన్‌బాబుగారు ఆ రెండూ చేస్తారు. మా కెరీర్‌లో 'గాయత్రి' ఒక మంచి మైలు రాయి. ఈ సినిమా గొప్పతనం మెల్లగా తెలుస్తుంది. సినిమాల్లో 24 క్రాఫ్ట్‌లే కానీ 25వ క్రాఫ్ట్ రావాలి.. అదే ఆత్మ పరిశీలన. ఈ సినిమాకు అది జరిగింది. ప్రతీ సీన్ ఒకటికి మూడు సార్లు ఆలోచించి తీశాము'' అన్నారు. ''భారతదేశంలో ఇద్దరి పరిస్థితి బాగోలేదు. ఒకరు రైతు, ఇంకొకరు నిర్మాత. సినిమా రాక ముందే రివ్యూలు వచ్చేస్తున్నాయి. రోజు గడవకముందే పైరసీ ప్రింట్‌లు వచ్చేస్తున్నాయి. ఇలాంటి దౌర్భాగ్య స్థితిలో ఉన్నాడు నిర్మాత'' అన్నారు డైలాగ్ రైటర్ డైమండ్ రత్నబాబు.

నేను ఏ పార్టీవాణ్ణి కాదు

'గాయత్రి' సినిమాలో కొన్ని డైలాగ్స్ వివాదంగా ఉన్నాయని.. ఓ పార్టీని ఉద్దేశించి ఆ డైలాగ్స్ మాట్లాడానని మాటలు విన్నాను. నేను ఏ పార్టీకీ చెందినవాణ్ణి కాదు. రోజూ పేపర్‌లో చూసి కొన్ని ఘట్టాలను సినిమాలో వాడాం. నేను రాజకీయాల గురించి త్వరలో మాట్లాడతాను. ఏ పార్టీకి ఓటు వేయాలో.. ఏ పార్టీకి వేస్తే నష్టపోతారో చెబుతాను.

వినోదాల సోడా



మల్లూరి హరిబాబు, సత్య సింధుజ, శ్రీనివాసమూర్తి, మానస్

మానస్, నిత్య నరేశ్, కారుణ్య హీరో హీరోయిన్స్‌గా మల్లూరి హరిబాబు దర్శకత్వంలో భువనగిరి సత్య సింధుజ నిర్మించిన చిత్రం 'సోడా గోలీసోడా'. ఈ సినిమా ఇవాళ విడుదల కానుంది. ఈ సందర్భంగా సత్య సింధుజ మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో వస్తున్న ఫస్ట్ సినిమా. కంప్లీట్ ఎంటర్‌టైనర్. మెసేజ్ ఓరియంటెడ్ మూవీ కాబట్టి ఆడియన్స్ ఆదరిస్తారని నమ్ముతున్నాం'' అన్నారు. ''కుటుంబం మొత్తం కలిసి చూడాలనే ఉద్దేశంతో ఈ సినిమా తీశాం. హీరో, హీరోయిన్ ఎంతో ఇష్టంతో కష్టపడి చేశారు. సినిమా రిలీజ్ అయ్యాక ప్రేక్షకుల సపోర్ట్ కావాలి. ఫ్రెండ్స్ మంచి సపోర్ట్ ఇచ్చారు'' అన్నారు హరిబాబు. మానస్ మాట్లాడుతూ – ''టీమ్ సపోర్ట్ ఉంటే సినిమా బాగా వస్తుందని ఈ సినిమాతో ప్రూవ్ అయింది. నన్ను హీరోగా సెలెక్ట్ చేసుకున్న దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు. ''మంచి సినిమాను ఆడియన్స్ ఆదరించాలని దర్శక–నిర్మాతలు సినిమా తీశారు. అందరూ కష్టపడి చేశారు. సినిమాలో మంచి రోల్ ఇచ్చిన దర్శకుడికి కృతజ్ఞతలు'' అన్నారు కృష్ణ భగవాన్. ఈ చిత్రానికి సహనిర్మాత: భువనగిరి శ్రీనివాసమూర్తి.

సీడ్ యాక్సెస్ రోడ్డు బాధితులకు నోటీసులు

60 రోజుల ముందు ఇవ్వాల్సిన నోటీసులు 5 రోజుల ముందు





1) రైతులకు నోటీసులు ఇస్తున్న రెవెన్యూ సిబ్బంది.
2) ఫిబ్రవరి 15న నోటీసులు ఇస్తూ, 20వ తేదీ సంతకం పెట్టిన అధికారి

తాడేపల్లి రూరల్(మంగళగిరి): రాజధాని అమరావతి నుంచి విజయవాడ–చెన్నై జాతీయ రహదారికి ఏర్పాటు చేసే సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణం కోసం తాడేపల్లి పట్టణ పరిధిలోని రైతులకు గురువారం రాత్రి రెవెన్యూ అధికారులు నోటీసులు అందచేశారు. ప్రభుత్వం భూసేకరణకు వెళ్లేముందు రైతులతో ఎస్ఐఏ సర్వే, నిపుణుల కమిటీ విచారణ చేయాల్సి ఉంది. అవి సక్రమంగా నిర్వహించకుండా రైతులకు నోటీసులు అందచేసే ప్రక్రియ చేపట్టింది. నిజానికి రైతులతో సమావేశం ఏర్పాటుచేసి 60 రోజుల ముందు ఈ నోటీసులు అందజేయాల్సి ఉంది. ఫిబ్రవరి 20న బాధిత రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తుండగా, 5 రోజుల ముందు నోటీసులు ఇవ్వడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పైగా ఈ నోటీసుల్లో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) ఫిబ్రవరి 20వ తేదీ అందచేసినట్టు సంతకం చేయగా, కింద స్థాయి రెవెన్యూ అధికారులు 12వ తేదీ, 14వ తేదీ అందినట్టు సంతకాలు చేశారు. రైతులకు ఎప్పుడు అందజేసేది తేదీ పొందుపర్చకుండా '' -02-2018'' అంటూ నమోదు చేశారు. రైతులకు అదేవిధంగా ఆ నోటీసులు అందజేశారు. అధికారులు ఇచ్చిన నోటీసుల్లోనే ఇన్ని మతలబులు ఉంటే ఇక రైతులకు ఎటువంటి న్యాయం చేస్తారో ప్రభుత్వానికే తెలియాలంటూ పలువురు రైతులు వాపోతున్నారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

సాక్షి, అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీలో నష్టాల పేరుతో ఏడాది క్రితం బస్సులను తగ్గించారని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) పేర్కొంది. దీంతో 300 మంది కండక్టర్లు, 650 మంది డ్రైవర్లను తొలగించారని, వీరిని వెంటనే విధుల్లోకి తీసుకుని రెగ్యులర్ చేయాలని ఈయూ రాష్ట్ర నేతలు వైవీ రావు, దామోదరరావులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

22న ఆర్ఎంల కార్యాలయాల ముట్టడి: ఎన్ఎంయూ

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించని కారణంగా ఈ నెల 22వ తేదీన 'చలో ఆర్ఎం'ల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య తెలిపారు. ఆర్టీసీ 12 రీజియన్లలో ఆర్ఎంల కార్యాలయాలను ముట్టడించాలని ఆయన పిలుపునిచ్చారు.

18న కడపలో ఓపీడీఆర్ రాష్ట్ర మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఓపీడీఆర్ ప్రతినిధులు

డాబా గార్డెన్స్ (విశాఖ దక్షిణ): ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) ఆంధ్రప్రదేశ్ శాఖ 17వ రాష్ట్ర మహాసభలను ఈ నెల 18వ తేదీన వైఎస్సార్ జిల్లా కడపలో నిర్వహించనున్నట్టు సంస్థ కేంద్ర కమిటీ అధ్యక్షుడు సి.భాస్కరరావు తెలిపారు. దళిత విముక్తి అధ్యక్షుడు సుర్ల వెంకటరమణ, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మితో కలసి ఆయన వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఈ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువలపై మనుతత్వ పూరిత హింసోన్మాద దాడులను తిప్పికొట్టడమే లక్ష్యంగా మహాసభలు జరుగుతాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్ధతుతో మనువాద శక్తుల దాడులు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరామమూర్తి, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి అన్నపూర్ణ, మురికివాడల నివాసితుల సంఘం ప్రతినిధి రవి, భారత నాస్తిక సమాజం ప్రతినిధి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై ఎడపాడి, పన్నీరు ఎదురుదాడి

ఏడాది పాలన పూర్తి చేసుకున్న పళనిస్వామి

సాక్షి, చెన్నై: కేంద్ర ప్రభుత్వంపై ఇప్పటి వరకు మెతక వైఖరి అవలంభించిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి, డిప్యూటీ సీఎం పన్నీరు సెల్వం ఎదురుదాడికి దిగారు. సీఎం పళనిస్వామి నేతృత్వంలో అన్నాడీఎంకే ప్రభుత్వం గురువారంతో ఏడాది పాలనను పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా జరిగిన అన్నాడీఎంకే సమావేశంలో ఢిల్లీతో ఇక ఢీకొట్టేనా అన్నట్లుగా పళని, పన్నీరు కీలక వ్యాఖ్యలు చేశారు. గతేడాది ఫిబ్రవరి 15న సీఎంగా పళనిస్వామి పగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి కేంద్రం అడుగులకు మడుగులు వత్తే పనిలో పడ్డ విషయం తెలిసిందే. గతంలో దివంగత ముఖ్యమంత్రి జయలలిత వ్యతిరేకించిన కేంద్ర పథకాలన్నింటినీ తమిళనాడులోకి ఆహ్వానించారు. అలాగే తనకు వ్యతిరేకంగా వ్యవహరించిన పన్నీరు సెల్వంను మళ్లీ అక్కున చేర్చుకుని డిప్యూటీ సీఎం పదవికి కట్టబెట్టారు. ఢిల్లీ దర్శకత్వంలో సీఎంగా పళని, డిప్యూటీ పన్నీరు అడుగులు వేస్తున్నారని విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారంతో పళని సీఎంగా ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అన్నాడీఎంకే అనుబంధ జయ పేరవై ఆధ్వర్యంలో సమాలోచన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం పళనిస్వామి మీడియాతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకే ప్రభుత్వం ఐదేళ్ల పాలనను పూర్తి చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పన్నీరు మాట్లాడుతూ.. రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడుకు నిధుల్లో కేంద్రం కోత పెడుతోందని మండిపడ్డారు. ఓ వైపు బకాయిలు, మరోవైపు కోత పెడుతూ ఇరకాటంలో పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

తిపటూరు జైలులో ఖైదీల విధ్వంసం

- మద్యం సేవించి ఇతర ఖైదీలపై దాడి
- జైలు ద్వారాలు మూసివేసి హల్‌చల్

తుమకూరు(కర్ణాటక): కర్ణాటకలోని తుమకూరు జిల్లా తిపటూరులోని జైలులో ఖైదీలు విధ్వంసం సృష్టించారు. మద్యం మత్తులో ఖైదీలు పరస్పరం దాడులు చేసుకోవడవంతో పాటు జైలు సిబ్బందిపై దుర్భాషలాడారు. ద్వారాలు మూసివేసి కట్టెలకు నిప్పంటించి జైలు బయటకు విసిరేసి అల్లకల్లోలం సృష్టించారు. దీంతో బుధవారం సాయంత్రం నుంచి గురువారం వేకువజాము వరకు జైలులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల పెరోల్‌పై బయటకు వచ్చిన హరీష్ అనే ఖైదీ బుధవారం సాయంత్రం తిరిగి జైలుకు వచ్చాడు. వెంట తెచ్చుకున్న మద్యాన్ని తాను తాగి ఏజాల్, సతీష్, రంగస్వామి అనే ఖైదీలకు కూడా పంచాడు. మద్యం మత్తులో వీరు రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఇతర ఖైదీలపై దాడులకు తెగబడ్డారు. ఖైదీలను జైలులో ఉన్న ముగ్గురు సిబ్బంది నిలువరించేందుకు ప్రయత్నించగా దుర్భాషలాడారు. దీంతో సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. పసిగట్టిన ఖైదీలు జైలు ద్వారాలను మూసివేశారు. ఎస్ఐ, సీఐలు జైలు వద్దకు చేరుకోని ద్వారాలు తెరవాలని సూచించినా ఖైదీలు ససేమిరా అన్నారు. జిల్లా ఎస్పీ దివ్యాగోపినాథ్ గురువారం తెల్లవారుజామున జైలు వద్దకు చేరుకొని పోలీసు బలగాలను మోహరింపజేశారు. తలుపులు తెరవాలని ఎస్పీ సూచించినా ఖైదీలు వినిపించుకోలేదు. న్యాయమూర్తి వచ్చి తమ సమస్యలు వినేవరకు తలుపులు తీసేది లేదని చెబుతూ కట్టెలకు నిప్పంటించి బయటకు విసిరివేశారు. దీంతో పోలీసులు అగ్నిమాపక సిబ్బందిని రప్పించి జైలు గోడలపైకి ఎక్కించి మంటలు అదుపు చేయించేందుకు యత్నించగా ఖైదీలు దాడులకు యత్నించారు. ఉదయం 8 గంటల సమయంలో జిల్లా న్యాయమూర్తి జైలు వద్దకు చేరుకోగా పోలీసులు బలవంతంగా తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లారు. అనంతరం న్యాయమూర్తి ఖైదీలతో చర్చించారు. తమకు భోజనం సక్రమంగా పెట్టడం లేదని, సరైన వసతులు కల్పించలేదని ఖైదీలు న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతామని న్యాయమూర్తి హామీ ఇవ్వడంతో ఖైదీలు శాంతించారు. అనంతరం అక్కడ ఘర్షణలో గాయపడిన హరీష్‌ను, మరొకరిని ఆస్పత్రికి తరలించారు.

సూది లేదు.. దూది దొరకదు!

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్జికల్ వస్తువులు, మందుల కొరత
- నెలన్నర నుంచి సరఫరా నిలిపివేత
- బడ్జెట్ అయిపోయిందంటున్న అధికారులు
- మెడికల్ దుకాణాల్లో కొనుక్కుంటున్న రోగులు
- బడ్జెట్‌లో రూ.60 కోట్లు కోత వేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఉచితంగా వైద్యం అందుతుందని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళితే రోగుల జేబులు ఖాళీ అవుతున్నాయి. సూదులు, దూది, బ్యాండేజీ వంటివి కూడా ఉండడం లేదు. అవన్నీ బయట మెడికల్ షాపుల నుంచి తెచ్చుకోండి, మా దగ్గర స్టాక్ అయిపోయింది అని ఆసుపత్రుల్లోని సిబ్బంది చెబుతున్నారు. సెలైన్ బాటిల్ పెట్టాలంటే అత్యవసరమైన సూదులు కూడా అయిపోయాయి. ప్రాథమి ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు నెలన్నరగా సర్జికల్ వస్తువుల సరఫరాను ప్రభుత్వం నిలిపివేసింది. జిల్లాకొకటి ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ (సీడీఎస్) నుంచే గ్రామీణ ఆస్పత్రులకు మందులు, ఇతరత్రా వస్తువులు సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ, సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లోనే అవన్నీ ఖాళీ అయ్యాయని చెబుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో రోగులు ప్రైవేట్ మెడికల్ దుకాణాల నుంచి దూది, సిరంజీలు కొనుక్కుంటున్నారు.

బడ్జెట్ అయిపోయింది

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఫార్మసిస్టులు మందుల కోసం సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లకు వెళితే... మీ బడ్జెట్ అయిపోయింది, ఇక ఇవ్వలేమని తేల్చిచెబుతున్నారు. ఒకవేళ కావాలంటే పీహెచ్‌సీ నుంచి డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు, అక్కడి నుంచి రాష్ట్ర మౌలిక వైద్య సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ)కు, తర్వాత సీడీఎస్‌కు ప్రతిపాదనలు రావాలట. ఇవన్నీ వచ్చేసరికి రెండు నెలలు పడుతుంది. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు నిత్యం వందలాది మంది రోగులు వస్తుంటారు. సర్జికల్ వస్తువులు, ఇతర మందులు లేక వీరంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

డ్రగ్ స్టోర్‌లకు తాళాలు

కొన్ని రకాల మందులు సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లలో ఉన్నాయి. కానీ, ఆ డ్రగ్ స్టోర్‌లకు తాళాలు వేశారని అక్కడి ఫార్మసిస్టులు వాపోతున్నారు. ఏపీఎంఎస్ఐడీసీకి చెందిన జనరల్ మేనేజర్ సీడీఎస్‌లను తన గుప్పిట్లో పెట్టుకుని, తాళాలు వేసుకున్నారని, తాము ఏదైనా అడిగితే మెమోలు, షోకాజ్ నోటీసులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనాలన్నా డబ్బుల్లేవు

సర్జికల్ వస్తువుల కోసం ప్రభుత్వం ప్రతిఏటా రూ.120 కోట్ల నిధులు కేటాయించేదని, ఈ ఏడాది రూ.60 కోట్లు మాత్రమే ఇచ్చిందని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు చెప్పారు. సర్కారు ఇచ్చిన అరకొర నిధులు ఆరు నెలలకే అయిపోయాయమని, ఇక తామేమీ చేయలేమని అన్నారు. ఇప్పుడు కొనాలన్నా డబ్బులు లేవని స్పష్టం చేశారు. నిధుల కొరత వల్లే కొనలేకపోయామని, అవసరమైతే లోకల్ పర్చేజ్ కింద ఆయా ఆసుపత్రులే కొనుక్కోవాలని సూచించారు.

సచివాలయం డిస్పెన్సరీలోనూ అదే దుస్థితి

ముఖ్యమంత్రి కార్యాలయానికి వంద అడుగుల దూరంలోని సచివాలయం డిస్పెన్సరీలోనే బ్యాండేజీ, కాటన్, సిరంజీలు నిండుకున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యమంత్రి, మంత్రులు, మంత్రుల కార్యదర్శులు, ఐఏఎస్‌లతోపాటు 2 వేల మందికి పైగా సచివాలయ సిబ్బందికి వైద్యం అందించే ఈ డిస్పెన్సరీలో సర్జికల్ వస్తువులు లేకపోవడం గమనార్హం. దూది, బ్యాండేజీ వంటివి తమ వద్ద లేవని గురువారం డిస్పెన్సరీ సిబ్బంది చెప్పారు.



బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి

'ప్రస్తుతం అందుబాటులో ఉన్న సర్జికల్ వస్తువులతోనే నెట్టుకొస్తున్నాం. కొన్ని ఆసుపత్రుల్లో ఇవి ఉన్నాయి. అక్కడి నుంచి ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నాం. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గిన మాట వాస్తవమే. అత్యవసరమైతే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డీఎస్) నిధులను వాడుకోవాలని చెప్పాం''

– డా.దుర్గాప్రసాద్, కమిషనర్, వైద్య విధాన పరిషత్

జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను తొలగించాలి

ఎమ్మెల్యే ముస్తఫా బైఠాయింపు • కలకలం రేపిన 'సాక్షి'కథనం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ రాజునాయుడును తక్షణమే విధుల నుంచి తొలగించి సమర్థుడైన వ్యక్తిని నియమించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా డిమాండ్ చేశారు. ఈమేరకు ముస్తఫా ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నేతలు గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ చాంబర్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. 'సాక్షి' ప్రధాన సంచికలో ఆ'పరేషాన్' శీర్షికతో ప్రచురితమైన కథనం తీవ్ర కలకలం రేపింది. డాక్టర్ రాజునాయుడు పదవీకాలం పూర్తయినా పదవీవిరమణ పెంపు జీవో తెచ్చుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయనకు పదవిపై ఉన్న శ్రద్ధ వైద్యసేవలపై లేదని విమర్శించారు. స్పెషల్ ఆఫీసర్ రఘునాథ్ ప్రారంభించిన మానవసేవ కార్యక్రమాన్ని డాక్టర్ రాజునాయుడు నిలిపివేయటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

సెల్‌ఫోన్ వెలుగులో ఆపరేషనా?

గత మూడేళ్లుగా 40 మంది సొంత సిబ్బంది, సొంత ఖర్చుతో ఆసుపత్రిలో పలు పనులు నిర్వహించినట్టు ఎమ్మెల్యే ముస్తఫా తెలిపారు. కేవలం రూ. 2 లక్షలతో ఆసుపత్రి మొత్తం విద్యుత్ దీపాలు వెలిగించవచ్చని, ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు లేక సెల్‌ఫోన్ వెలుగులో ఆపరేషన్ చేయడం దారుణమన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో స్థానిక ఎమ్మెల్యే అయిన తనను సభ్యుడిగా తీసుకోవాలన్నారు.

కోమాలో ఉన్న మా బిడ్డను కాపాడండి..

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తమ బిడ్డను జీజీహెచ్‌కు తరలిస్తే పట్టించుకోలేదంటూ విజయనగరం జిల్లా గంగనపాడుకు చెందిన చౌడవరపు శేఖర్ తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యులు అనురాధ, నాగరాజు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం 7 గంటలకు వస్తే 12 గంటల వరకు పట్టించుకోలేదని, దీంతో ఎన్నారై ఆసుపత్రికి వెళ్లామన్నారు. అక్కడి వైద్యులు రూ.40 వేలు తీసుకుని సాయంత్రం 4 గంటల వరకు వైద్యం చేశారన్నారు. అనంతరం చికిత్స ఖర్చులు భరించలేక తిరిగి జీజీహెచ్‌కు వచ్చామన్నారు. కోమాలో ఉన్న బాధితుడికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ముస్తఫా చికిత్స అందించాలని కోరటంతో డాక్టర్ రమేష్ క్యాజువాలిటీకి వెళ్లి శేఖర్ పరిస్థితిపై ఆరా తీశారు.



సూపరింటెండెంట్ చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్‌సీపీ నేతలు

ఎలుకలు కొరుక్కుతిన్నా పట్టించుకోలేదు

గుంటూరు జీజీహెచ్‌లో రెండేళ్ల క్రితం పసికందును ఎలుకలు కొరుక్కుతిన్నా పట్టించుకున్న నాథుడే లేరు. తక్షణమే ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– రావి వెంకటరమణ (వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు)

నేడు జీజీహెచ్‌కు మంత్రి కామినేని

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, గుంటూరు: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ శుక్రవారం ఉదయం గుంటూరు జీజీహెచ్ ఆస్పత్రిని సందర్శించనున్నారు. ఆ'పరేషాన్' శీర్షికన గురువారం 'సాక్షి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు పనిచేయకపోవడంతో సెల్‌ఫోన్ వెలుతురులో శస్త్రచికిత్స నిర్వహించటం, వైద్య పరికరాలు పనిచేయక ఆపరేషన్ మధ్యలోనే ఆపివేసి రోగిని తరలించడంపై సాక్షిలో వార్త రావటంతో దీనిపై విచారణకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ సుబ్బారావును నియమించారు.

ఆదేశాలతో సరి!

- ప్రభుత్వాసుపత్రుల్లో నిర్లక్ష్యపు ఘటనలపై మంత్రి తీరు
- కిందిస్థాయి సిబ్బందిపైనే చర్యలు
- ప్రైవేట్ సంస్థ చెప్పుచేతుల్లో నడుస్తున్న గుంటూరు పెద్దాసుపత్రి

సాక్షి, అమరావతి: వైద్య ఆరోగ్యశాఖలో నిర్లక్ష్యం వల్ల జరుగుతున్న ఘటనలపై చర్యలు తీసుకుంటామనడం, తర్వాత చిన్న ఉద్యోగులపై నెపం మోపి అసలు దోషులను తప్పించడం తరచూ జరిగే తంతు ఇదీ. ఘటన జరగ్గానే ఆ శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ విచారణకు ఆదేశిస్తారు. ఉన్నతాధికారులు, మంత్రి తప్పిదాలు లేవంటూ ఏ అటెండర్లో, స్టాఫ్ నర్సులనో బాధ్యులుగా పేర్కొంటూ నివేదికలు సిద్ధం చేయటం షరా మామూలే. ఇప్పుడు తాజాగా గుంటూరు ఆస్పత్రిలో సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో ఆపరేషన్ నిర్వహించిన ఘటనలోనూ విచారణకు ఆదేశించడం, చర్యలు తీసుకుంటానని మంత్రి చెప్పడంలో వింతేమీ లేదని శాఖకు చెందిన ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు.

నర్సులపై వేటు... సూపరింటెండెంట్‌కు పదోన్నతి

రెండేళ్ల క్రితం గుంటూరు సర్వజనాస్పత్రిలో ఎలుకలు కొరికి పసికందు మృతి చెందటం జాతీయ స్థాయిలో తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. చివరకు ఇద్దరు స్టాఫ్ నర్సులను బాధ్యులను చేసి సస్పెండ్ చేసి తప్పించుకున్నారు. పైగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు డీఎంఈగా పదోన్నతి ఇచ్చి పంపిన ఘనత మంత్రిదే. ఉన్నతాధికారులెవరిపైనా ఈగ కూడా వాలనివ్వలేదు.

ఎలుక పేరుతో రూ.50 లక్షలు!

ఎలుకల నిర్మూలన పేరుతో మరమ్మతుల కింద ఒక ఇంజనీరు రూ.50 లక్షలు తిన్నట్లు ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. నెల్లూరులో కడుపులో కత్తెరలు పెట్టి కుట్లువేసిన ఘటనలోనూ తూతూమంత్రంగా విచారణ జరిపారు. చిత్తూరు జిల్లా ఆస్పత్రిలోకి పాములు వచ్చిన ఘటనలో విచారణే జరపలేదు. కీటకాల నివారణ కాంట్రాక్టు పొందిన వ్యక్తిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

ప్రైవేట్ సంస్థ చేతికి గుంటూరు ఆస్పత్రి

భూరి విరాళమిచ్చిన ఓ ఫార్మాస్యూటికల్ సంస్థ చేతుల్లోకి గుంటూరు ఆస్పత్రికి వెళ్లిపోయింది. కళాశాల ప్రిన్సిపల్ రాజునాయుడు ఈ సంస్థకు అత్యంత సన్నిహితుడు. కొద్ది నెలల క్రితం డా.రాజునాయుడు రిటైర్ కావాల్సింది. అయితే ఆ ముందు రోజే సదరు సంస్థ ఒత్తిడి మేరకు వైద్యుల పదవీ విరమణ వయసు 63 ఏళ్లకు మార్చటం చర్చనీయాంశమైంది.

పత్తి కుంభకోణం విచారణాధికారిగా సారంగి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పత్తి కుంభకోణానికి సంబంధించి కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌గా సారంగి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆ కుంభకోణంపై విచారణ జరుపుతున్న లింగరాజు పాణిగ్రాహి డిసెంబరులో పదవీ విరమణ పొందారు. ఆ తరువాత కూడా ఆయన్నే ప్రభుత్వం విచారణాధికారిగా కొనసాగించింది. అయితే వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఆయన కొనసాగకపోవడంతో ఆయన స్థానంలో ఐఎఫ్ఎస్ అధికారి సారంగిని నియమించారు. 2014–15 సంవత్సరంలో సంచలనం సృష్టించిన రూ.400 కోట్ల కుంభకోణంలో మార్కెటింగ్ శాఖ అధికారులు, సిబ్బంది, సీసీఐ అధికారులు, సిబ్బంది పాత్ర ఉందని సీబీఐ, మార్కెటింగ్ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చాయి. వీటిని ఆధారంగా చేసుకుని సీసీఐ నలుగురు అధికారులను బదిలీ చేయగా, మార్కెటింగ్‌శాఖ 96 మంది ఉద్యోగులు, అధికారులకు చార్జి మెమోలు ఇచ్చిన విషయంవిదితమే.

కప్పం కట్టే ఇంజనీర్ కోసం!

- ఏసీబీకి చిక్కి మళ్లీ పోస్టింగ్ తెచ్చుకున్న అధికారి డిప్యుటేషన్‌పై కొనసాగింపు
- నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిదేళ్లుగా ఇతర శాఖలో విధులు

సాక్షి, అమరావతి: కప్పం చెల్లించేవారు తమవారైతే అధికార పార్టీ నేతలకు నిబంధనలు అడ్డొస్తాయా? గతంలో అవినీతి నిరోధక శాఖకు చిక్కి, టీడీపీ అధికారంలోకి వచ్చాక రాజకీయ పలుకుబడితో కేసుల నుంచి బయటపడ్డ ఓ ఇంజనీర్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల తరబడి డిప్యుటేషన్‌పై కొనసాగిస్తూ వాటాలు పంచుకుంటున్నారు. మంత్రి కామినేని శ్రీనివాస్ బంధువునని చెప్పుకుంటూ రాష్ట్ర మౌలికవైద్య సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)లో పనిచేస్తున్న డీఈ/ఈఈని అదే పోస్టులో కొనసాగించడానికి నిబంధనలు తుంగలోకి తొక్కారు. రోడ్లు భవనాల శాఖకు చెందిన ఈ ఇంజనీర్ గుంటూరు పెద్దాసుపత్రికి డిప్యుటేషన్‌పై వచ్చారు.

వాటాలు పంచుతున్నందునే..

ఒక శాఖకు చెందిన అధికారి మరోశాఖలో ఫారిన్ డిప్యుటేషన్‌పై ఐదేళ్లకు మించి పని చేయకూడదు. అలాంటిది ఆయన ఎనిమిదేళ్లుగా కొనసాగుతుండటం గమనార్హం. ఇప్పుడు మరోసారి కొనసాగించేందుకు గుంటూరు జిల్లాకు చెందిన రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యనేత, ఓ మంత్రి తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. గుంటూరు డివిజన్‌లో జరిగే సివిల్ పనుల్లో కమీషన్లు వసూళ్లు చేసి కప్పం కట్టే ఈ ఇంజనీర్‌ను ఎలా వదులుకుంటారని అదే శాఖకు చెందిన సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు. కొందరు నేతలు, అధికారులకు గుంటూరులో ఈ ఇంజనీరే ఇళ్లు కట్టించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. గుంటూరు డివిజన్‌లో రూ.120 కోట్ల పనులు జరిగాయని, అందులో కమీషన్లు దండుకున్న ఈ ఇంజనీర్ అందరికీ వాటాలు పంచారని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరు ఒకరు పేర్కొన్నారు.

డిసెంబర్ నాటికి ఏఐబీపీ ప్రాజెక్టులు పూర్తి

మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

సాక్షి, న్యూఢిల్లీ: సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ) కింద ఏపీలో ఎంపిక చేసిన ప్రాజెక్టులను డిసెంబర్‌లోపు పూర్తి చేస్తామని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ ప్రాజెక్టుల పురోగతిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గురువారం ఢిల్లీలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం అనంతరం మంత్రి దేవినేని మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుల పూర్తికి రూ.1,098 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలిపారు. వీటిని వీలైనంత త్వరగా ఆమోదించాలని కోరామన్నారు. గురువారం ఉదయం కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్ అధ్యక్షతన గోదావరి, కృష్ణా నదీ యాజమాన్యాల బోర్డుల సమావేశాన్ని నిర్వహించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధిని విభజన చట్టంలో పేర్కొన్న విధంగా నిర్ణయించాలని సమావేశంలో కోరినట్లు మంత్రి తెలిపారు. బోర్డు పరిధిని నోటిఫై చేస్తే నీటి కేటాయింపులకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు.

పెరగని డైట్ చార్జీలు

- అర్ధాకలిలో హాస్టల్ విద్యార్థులు
- ఫైనాన్స్‌లో ఫైల్ పెండింగ్
- 10నెలలు గడిచినా పట్టించుకోని ప్రభుత్వం



సాక్షి, అమరావతి: హాస్టల్ విద్యార్థుల డైట్ చార్జీలు పెంచడం లేదు. నిపుణుల కమిటీ డైట్ చార్జీలు పెంచుతూ ఇచ్చిన నివేదికను పది నెలలు గడిచినా ప్రభుత్వం అమలు చేయలేదు. మూడొంతుల మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ స్కూళ్ళలో చేర్పించి చదివిస్తుండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీల్లో నిరుపేదలైన వారు మాత్రమే ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పించి చదివిస్తున్నారు. కానీ ఆ పేద విద్యార్థులకు కడుపునిండా తిండి పెట్టడంతో ప్రభుత్వం విఫలమవుతోంది. ప్రాథమిక దశలో విద్యార్థులు ఎదుగుతున్న వయస్సులో ఉంటారు. వారి ఎదుగుదలకు సరిపోయే పౌష్టికాహారం తినాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లో చదువుకుంటున్న విద్యార్థుల కడుపులు మాడుస్తోంది. అర్ధాకలితో అలమటించేలా చేస్తున్నది.

రోజుకు రూ.25 మాత్రమే

రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబరులో సవరించిన మెస్ చార్జీల ప్రకారం మూడు నుంచి ఏడు తరగతులు చదువుతున్న వారికి నెలకు రూ. 750లు, 8నుంచి10 తరగతులు చదువుతున్న వారికి నెలకు రూ. 850లు మెస్ చార్జీలుగా ఇస్తోంది. అంటే 3నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థికి రోజుకు రూ. 25లు, 8 నుంచి 10 తరగతులు చదువుతున్న వారికి రోజుకు రూ. 28.33లు ఇస్తున్నది. ప్రస్తుతం బయట మెస్‌ల్లో భోజనం చేసినా పూటకు రూ. 60 నుంచి 80లు చెల్లించాలి. అంటే రోజుకు రూ. 180 నుంచి రూ. 240లు భోజనానికి ఖర్చు చేయాలి. ప్రభుత్వం ఇస్తున్న మెస్ చార్జీకి, బయట మార్కెట్లో ఉన్న ధరలకు పోలిస్తే నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. 3 నుంచి 7 తరగతులు చదువుతున్న వారికి రూ. 1000లు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న వారికి రూ. 1200లు, కాలేజీ విద్యార్థులకు రూ. 1500లు ఇవ్వాలని ప్రతిపాదించిన ఫైల్ పది నెలలుగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది.

మెనూ అమలు చేయలేక పోతున్న వార్డెన్‌లు

ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం పెట్టాలి. బయట రెండు ఇడ్లీ తింటే రూ. 25లు చెల్లించాలి. కానీ అదే మొత్తంతో రెండు పూటల అల్పాహారం, రెండు పూటల భోజనం పెట్టలేక వార్డెన్లు సతమతమవుతున్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అతి తక్కువ ధర పెట్టి కొనుగోలు చేయాలన్నా ఒక్క రోజుకు ఒక్కో విద్యార్థికి రూ. ఏడు వరకు ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. అయితే మెస్ చార్జీలు ఇస్తున్న ప్రకారం రూ. 3లతో సర్దుకోవాల్సి వస్తోంది. మరోవైపు ప్రభుత్వం ఇస్తున్న మెస్ చార్జీల్లో నుంచే రైస్‌తో పాటు గ్యాస్, సరుకుల రవాణా చార్జీలు, టిఫిన్ కోసం గ్రైండింగ్ చార్జీ (ఇడ్లీ పిండి) వంటివి చెల్లించాల్సి ఉంటుంది. మెయింటెనెన్స్ చార్జీలు కూడా ఇందులో నుంచే ఇవ్వాల్సి ఉంది. అంటే విద్యుత్ బల్బ్ కాలిపోయినా మెస్ చార్జీల్లో నుంచి కొనుగోలు చేయాల్సిందే. దీంతో వార్డెన్లు తూకం ప్రకారం భోజనం పెట్టాల్సి వస్తోంది. ఫలితంగా విద్యార్థులను అర్ధాకలితో మాడుతున్నారు. ప్రభుత్వం సత్వరం స్పందించి మెస్ ఛార్జీలు పెంచి తమ ఆకలి తీర్చాలని విద్యార్థులు కోరుకుంటున్నారు.

• తెలంగాణ

అది నరబలే..

హైదరాబాద్‌లోని ఉప్పల్ చిలుకానగర్ ఘటనలో వీడిన మిస్టరీ

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన నరబలి కేసులో చిక్కుముడి వీడింది. ఉప్పల్‌లోని చిలుకానగర్ ఇంటి యజమాని రాజశేఖర్, అతని భార్య శ్రీలత క్షుద్రపూజల పేరిట ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారని రాచకొండ పోలీసులు తేల్చారు. నరబలి ఇస్తే శ్రీలత ఆరోగ్యం మెరుగు పడుతుందని ఓ కోయదొర చెప్పిన మాటలతో వీరు ఈ దారుణానికి పాల్పడ్డారని వెల్లడించారు. క్షుద్రపూజలు చేసిన గదిలో లభించిన రక్తపు మరకలు, శిశువు తల భాగం నుంచి సేకరించిన డీఎన్ఏ నమూనాలతో సరిపోలడంతో ఈ కేసులో స్పష్టతకు వచ్చిన పోలీసులు.. రాజశేఖర్, అతని భార్య శ్రీలతను గురువారం అరెస్టు చేశారు. కేసు వివరాలను రాచకొండ కమిషనర్ మహేష్ భగవత్ మీడియాకు గురువారం వెల్లడించారు. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ భార్య శ్రీలత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎందరు వైద్యులను సంప్రదించినా మార్పురాలేదు. రెండేళ్ల క్రితం సమ్మక్క–సారక్క జాతరకు వెళ్లిన దంపతులు ఓ కోయదొరను ఆశ్రయించగా.. నరబలి ఇస్తే ఆమె ఆరోగ్యం కుదుటపడుతుందని అతడు తెలిపాడు. ఆ తర్వాత శ్రీలత ఆరోగ్యం కుదుటపడాలనే ఉద్దేశంతో పలువురు మంత్రగాళ్లను ఆశ్రయించినా.. పరిస్థితి మెరుగు పడకపోవడంతో నరబలికి సిద్ధమయ్యారు. జనవరి 31న రాత్రి బోయగూడలో రెక్కీ చేసిన రాజశేఖర్ మూడు నుంచి ఆరు నెలల వయసున్న ఆడ శిశువు విచక్షణాజ్ఞానం లేని తల్లిదండ్రుల వద్ద ఉన్నట్టు గుర్తించాడు. చంద్రగ్రహణం రోజున నరబలి ఇవ్వాలనే ఉద్దేశంతో ఫిబ్రవరి 1న తెల్లవారుజామున 12.45 గంటలకు ఇంటి నుంచి కత్తి, పాలిథీన్ బ్యాగ్‌లను తీసుకుని ఏపీ20టీవీ1646 కారులో బయల్దేరి 1.30 గంటలకు బోయిగూడ చేరుకున్నాడు. ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న చిన్నారిని అపహరించి పీర్జాదిగూడ ప్రతాపసింగారం మూసీ కాలువ వద్దకు తీసుకెళ్లి శిశువు గొంతు, మొండెంను కత్తితో నరికి వేరుచేశాడు. శిశువు మొండెం, కత్తిని మూసీలో పడేసి పాలథీన్ కవర్‌లో తలను తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. తర్వాత శిశువు తలను పెట్టి భార్యాభర్తలిద్దరూ నగ్నంగా క్షుద్రపూజలు చేశారు. శిశువు తలకు సూర్య కిరణాలు పడేలా ఇంటిపై తలనుంచి కిందికి వచ్చారు. వీరి ఇంటికి సమీపంలోనే ఉండే రాజశేఖర్ అత్తమ్మ వీరకొండ బాలలక్ష్మి శిశువు తలను చూసి భయంతో కేకలు వేసింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని శిశువు తలను గాంధీ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

● తెలంగాణ

మూసీపై ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే

సాక్షి, హైదరాబాద్: చారిత్రక మూసీ నదిపై ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించేందుకు వీలుగా సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని తెలంగాణ మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రవహిస్తున్న బాపూఘాట్–నల్లచెరువు(ఉప్పల్) మార్గంలో 40 కిలోమీటర్ల మేర ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించాలని, నదికి ఇరువైపులా తీరైన రహదారులను అభివృద్ధి చేయాలని సూచించారు. గురువారం మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో నది సుందరీకరణ, చెరువుల పరిరక్షణపై కేటీఆర్ సమీక్షించారు.

డ్రోన్ కెమెరాలతో సర్వే..: మూసీ నది మొత్తాన్ని డ్రోన్ కెమెరాలు, ఇతర అత్యాధునిక టెక్నాలజీతో సర్వే చేయాలని, ఇందుకయ్యే ఖర్చు, సాధ్యాసాధ్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని కేటీఆర్ ఆదేశించారు. మూసీ నది వెంట ప్రస్తుతం ఉన్న రోడ్లకు అనుబంధంగా రూపకల్పన చేస్తున్న బ్రిడ్జీల డిజైన్లు, నిర్మాణం నగర చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా ఉండాలన్నారు.



డ్రోన్లే కదా అని తీసిపారేస్తే.. క్షిపణులను తెగ్గోస్తాయి!

యుద్ధం మొదలైంది..
శత్రు సేనలు క్షిపణులు ఎక్కుపెడుతున్నాయి..
ఇటువైపు పక్షం మాత్రం నింపాదిగా ఉంది..
క్షిపణులు ఎక్కుపెట్టలేదు..
జస్ట్.. డ్రోన్లు ఎక్కుపెట్టింది..
వీడియో షూట్ కోసం కాదు..
శత్రు క్షిపణులను షూట్ చేయడానికి..!!

– సాక్షి, తెలంగాణ డెస్క్

ప్రస్తుతం పెళ్లిళ్లు.. మ్యాచుల్లో వీడియో షూటింగ్ కోసం.. పిజ్జాలను డెలివరీ చేయడం కోసం ఉపయోగిస్తున్న డ్రోన్లు.. భవిష్యత్తులో దేశం తరపున యుద్ధం చేయనున్నాయి! ఇందుకోసం అమెరికా క్షిపణి రక్షణ సంస్థ(ఎండీఏ) లో–పవర్ లేజర్ డెమాన్‌స్ట్రేటర్(ఎల్‌పీఎల్‌డీ) ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేకమైన లేజర్ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. ఈ లేజర్ వ్యవస్థతో కూడిన డ్రోన్లు.. లాంచింగ్ పాడ్ నుంచి క్షిపణులను ప్రయోగించకముందే వాటిపై లేజర్ కిరణాలను ప్రయోగించి.. నాశనం చేస్తాయట. 2019 కోసం తమకు రూ.63 వేల కోట్ల బడ్జెట్ కావాలంటూ అమెరికా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించిన ఎండీఏ.. అందులో భాగంగా ఎల్‌పీఎల్‌డీ ప్రాజెక్టు గురించి వివరించింది. లేజర్ టెక్నాలజీ కోసం రూ.420 కోట్లు ఖర్చు పెట్టనున్నట్లు తెలిపింది. ముఖ్యంగా ఉత్తర కొరియా నుంచి ప్రమాదం పెరుగుతున్న నేపథ్యంలో వీటి ఆవశ్యకతను తెలియజెప్పింది. ఒకవేళ క్షిపణిని ప్రయోగించినా.. దానిని దారిలోనే అడ్డుకుని.. నిర్వీర్యం చేసే శక్తిసామర్థ్యాలు దీని సొంతమట. 2020లో ఎల్‌పీఎల్‌డీని పరీక్షించనున్నారు. వివిధ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాల రక్షణకు కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని చెబుతున్న నిపుణులు.. ఎల్‌పీఎల్‌డీని ఒక విప్లవాత్మకమైన టెక్నాలజీగా పేర్కొంటున్నారు.

అక్రమ నిర్మాణాలపై ఏసీబీ దాడులు

- విజయవాడలో ఏకకాలంలో తనిఖీలు
- త్వరలో గుంటూరులో కూడా...

సాక్షి, అమరావతిబ్యూరో: విజయవాడలో అనుమతులు లేని భవన నిర్మాణాలపై గురువారం ఏసీబీ అధికారుల బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. అనుమతుల్లేకుండా ఇష్టానుసారం భవనాలు నిర్మిస్తుండటం విజయవాడలో తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో విజయవాడలో అక్రమ భవన నిర్మాణాలపై తనిఖీల కోసం ఏసీబీ డీజీ ఆర్.పి.ఠాకూర్ అయిదు ప్రత్యేక బృందాలు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించాయి. గాంధీనగర్, గవర్నర్‌పేట, ఇస్లాంపేట, భవానీపురంలలో పలు అపార్టుమెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో అక్రమాలు బయటపడ్డాయి. కొన్ని భవనాలకు అనుమతుల్లేకుండానే అంతస్తులు నిర్మించారు. మరికొన్నింటికీ సెల్లార్‌లో కూడా నిర్మాణాలు చేపట్టి విక్రయించారు. కొన్ని వాణిజ్య సముదాయాలు, అపార్టమెంట్లకు సెట్‌బ్యాక్ ఏరియా కూడా విడిచిపెట్టకుండా నిర్మాణాలు చేపట్టారు. మరో చోట రెండు భవనాలకు అనుమతి తీసుకుని ఒక్కటిగా నిర్మించేశారు. ఇంతగా బరితెగించి అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా విజయవాడ నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం అభ్యంతరం కూడా తెలపలేదని ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ దాడులు మరికొన్నిరోజులు కొనసాగుతాయని తెలుస్తోంది.

టీడీపీ అవినీతి ఖజానా

విజయవాడలో అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదు. అక్రమ భవన నిర్మాణాలు సాగిస్తున్న బిల్డర్ల నుంచి కొందరు టీడీపీ ప్రజాప్రతినిధులు భారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయంలోనే విజయవాడ మేయర్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు వర్గాలకు చెందిన కార్పొరేటర్ల మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కొందరు సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేశారు. దాంతో ఏసీబీ డీజీ ఆర్.పి.ఠాకూర్ ఆదేశాలతో చేపట్టిన తనిఖీల్లో అక్రమాలు వెలుగు చూశాయి. అలాగే గుంటూరులో కూడా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని ఏసీబీ అధికారులకు ఉప్పందింది. ఆరేళ్లగా నగర పాలక సంస్థ పాలకమండలి లేని గుంటూరులో ప్రత్యేక అధికారి పాలన సాగుతోంది. కానీ నగరానికి చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు అండతో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి.



గురువారం విజయవాడలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారుల బృందాలు

రైతు కంట్లో కమీషన్ కారం

- ఈ–నామ్ పద్ధతికి సహకరించని దిగుమతి వ్యాపారులు
- కమీషన్ రూపంలో అదనంగా వసూలు
- ఏడాదికి రూ.5 కోట్లకు పైగా నష్టపోతున్న రైతులు
- మార్చి తర్వాత వేటు వేస్తామంటున్న అధికారులు

సాక్షి, అమరావతి బ్యూరో



గుంటూరు మార్కెట్ యార్డులో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు గత ఏడాది ప్రవేశపెట్టిన ఈ–నామ్ పద్ధతి అమలుకు నోచుకోవడంలేదు. దీని ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేసిన మిర్చికి సంబంధించి చెల్లింపులు వ్యాపారులు ఆన్‌లైన్‌లో నేరుగా రైతుల అకౌంట్లలో జమ చేయాలి. దీన్ని వ్యతిరేకించిన వ్యాపారులు అప్పట్లో కొనుగోళ్లు నిలిపి వేసి గత డిసెంబర్ వరకు అనుమతి తెచ్చుకున్నారు. అయితే ఆ గడువు పూర్తయి నెలన్నర అవుతున్నా ఇప్పటికీ పాత పద్ధతిలోనే సాగిస్తున్నారు. ఈ–నామ్ పద్ధతిలో వ్యాపారులు రైతులనుంచి సరుకు కొనుగోలు చేసిన తరువాత రెండు శాతం కమీషన్ తీసుకొని, మిగిలిన సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. అయితే రైతులకు నగదు చెల్లిస్తూ కమీషన్ ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. రెండు శాతానికి బదులు నాలుగు శాతం వరకు వసూలు చేస్తున్నారు. గుంటూరు మార్కెట్ యార్డులో ఏడాదికి రూ.400 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోంది. ఈ లెక్కన రైతుల నుంచి రూ.5 కోట్లకు పైగా అదనంగా కమీషన్ రూపంలో అక్రమంగా వసూలు చేస్తున్నారు.

లైసెన్సుల రెన్యువల్ ఆపేస్తాం...

గుంటూరు మార్కెట్ యార్డులో ఈ–నామ్ పద్ధతిలోనే వ్యాపారం జరగాలని, దానికి అంతా సహకరించాలని ఇటీవల మార్కెట్ యార్డులో జరిగిన సమీక్ష సమావేశంలో మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్ కుమార్, యార్డు సెక్రటరీ శ్రీనివాసులు స్పష్టం చేశారు. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి సొమ్మును రైతుల అకౌంట్లలో జమచేయాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటివరకు దానిని వ్యాపారులు పాటించలేదని, మార్చి తర్వాత అలాంటి వ్యాపారుల లైసెన్సులు రెన్యువల్ చేయమని అధికారులు స్పష్టం చేశారు.

రైతులకు మేలు చేసేందుకు చర్యలు



గుంటూరు మార్కెట్ యార్డును మోడల్ మార్కెట్ యార్డుగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం. మిరపకాయల్లో తేమ, క్వాలిటీ, రంగు గుర్తించేందుకు వీలుగా మూడు ప్రత్యేక మిషన్లను తెప్పించాం. దళారుల వ్యవస్థను రూపుమాపేందుకు వీలుగా ఈ–నామ్ పద్ధతిని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

–శ్యామ్యూల్ ఆనంద్ కుమార్, మార్కెటింగ్ శాఖ కమిషనర్

ఏపీలో సినిమా రాజకీయం నడుస్తోంది...

బీజేపీ నేత సుదీష్ రాంబొట్ల విమర్శలు

సాక్షి, హైదరాబాద్: ఏపీలో సినిమా తరహా రాజకీయాలకు తెరలేచిందని బీజేపీ అధికార ప్రతినిధి సుదీష్ రాంబొట్ల పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ విషయంలో రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు చెప్పిన అంశాలను టీడీపీ నేతలు వాస్తవంగా ఒప్పుకున్నారని, ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చేందుకు కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐఐటీలో ప్రవేశాలు 2015–16 నుంచే ప్రారంభమయ్యాయని, ఎన్ఐటీ, ఐఐఎంలు సైతం ప్రారంభమైనట్లు చెప్పారు. రాజధాని అభివృద్ధికి రూ.2500 కోట్లు ఇస్తే ముష్టి అంటారా అంటూ తీవ్రంగా స్పందించారు. ఈ నిధులతో కోటి చదరపు అడుగుల నిర్మాణం చేపట్టొచ్చని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ డిజైన్లు ఖరారు చేయలేదని విమర్శించారు. పవన్‌కళ్యాణ్ సంగతేంటో... ఆయన ఫిలాసఫీ ఏమిటో ఎవరికీ అర్థం కాదన్నారు. తను అడిగే సమాచారం సమాచార హక్కు చట్టం ద్వారా పొందొచ్చని స్పష్టం చేశారు.

కాపు రిజర్వేషన్లను ఆమోదించవద్దు

రాష్ట్రపతికి బీసీ ఫెడరేషన్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో బీసీల హక్కులకు భంగం వాటిల్లే విధంగా కాపులకు బీసీ రిజర్వేషన్లు ఇచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆమోదించవద్దని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను బీసీ ఫెడరేషన్ నేతలు కోరారు. పుదుచ్చేరి మంత్రి మల్లాది కృష్ణారావు ఆధ్వర్యంలో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు తదితరులు గురువారం ఢిల్లీలో రాష్ట్రపతిని, కేంద్ర హోం మంత్రిని కలసి వినతిపత్రాన్ని ఇచ్చారు.

● తెలంగాణ

ఆజాద్ కేసు.. పోలీస్ శాఖలో వణుకు!

- ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై హత్య కేసు
- ప్రభుత్వ నిర్ణయమైతే పెద్దలకూ తప్పని తలనొప్పులు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆజాద్ అలియాస్ చెరుకూరి రాజ్‌కుమార్ ఎన్‌కౌంటర్ కేసు కీలక మలుపు తిరిగింది. ఆదిలాబాద్ జిల్లా కోర్టు గురువారం ఇచ్చిన తీర్పు సంచలనం రేపుతోంది. జూలై 1, 2010 న ఆదిలాబాద్ జిల్లా సార్కపల్లిలో ఆజాద్‌ను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసి హతమార్చినట్టు ఆయన భార్య అప్పట్లో కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. పోలీసులపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి విచారణ జరపాలని ఆమె డిమాండ్ చేశారు. దీనిపై ఏళ్లుగా విచారణ సాగగా పోలీసులపై హత్యానేరం అవసరంలేదని ఇటీవల కింది కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలను జిల్లా కోర్టు కొట్టివేస్తూ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 29 మందిని హత్యానేరం కింద విచారించాలని కింది కోర్టుకు సూచించింది. ఈ మేరకు సమన్లు జారీ చేసింది. తెలంగాణలో మొదటిసారిగా పోలీసులు హత్యానేరం ఎదుర్కోవాల్సి రావడంతో కలవరం మొదలైంది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న అప్పటి సీఐ రఘునాథ్, ఎస్ఐ ప్రవీణ్, ఏఎస్ఐ, ఏఆర్ఎస్ఐ, ఇతర ఆర్మ్‌డ్ పార్టీ సిబ్బందిపై హత్య కేసు విచారణ మొదలవడంతో పోలీసు శాఖ ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు తెలుస్తోంది.

ఎటు వెళ్లి.. ఎవరి మెడకు బిగిసేనో..?

మహారాష్ట్ర నుంచి ప్రాణాలతో పట్టుకొచ్చి ఆజాద్‌ను కాల్చి చంపారనే అభియోగం ఉంది. ఆజాద్‌తో ఉన్న జర్నలిస్టు హేమచంద్ర పాండేను సైతం పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఎన్‌కౌంటర్ సమయంలో ఆజాద్ ఒక్కడే ఎలా దొరికాడు? నిజంగా ఎదురుకాల్పుల్లో మృతి చెందాడా? పట్టుకొచ్చి కాల్చిచంపారా? అన్న వాటిపై పూర్తి వివరాలు బయటకు వస్తాయని సర్వత్రా భావిస్తున్నారు. ఎన్‌కౌంటర్ చేయాలన్న ఆదేశం ఎవరి నుంచి వచ్చింది? అప్పటి డీజీపీ ఎవరు? వారికి, ప్రభుత్వానికి ఈ ఎన్‌కౌంటర్ నిర్ణయంపైన చర్చ జరిగిందా? జరిగితే ఆదేశాలు వెలువరించింది ఎవరు? అన్న దానిపై ఇప్పుడు చర్చ సాగుతోంది. ఈ ఆదేశాలిచ్చిన ఉన్నతాధికారుల మెడకు కేసు ఉచ్చు బిగుస్తుందని చర్చ సాగుతోంది. మావోయిస్టు వ్యవహారాలను పర్యవేక్షించే స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో పెద్దలకు సైతం ఈ కేసులో షాక్ తప్పదని పౌరహక్కుల సంఘం అభిప్రాయపడింది.

ఆర్టీసీ పార్శిళ్లలో ప్రైవేట్ పెత్తనం!

- లాభాలొస్తున్న వ్యాపారాన్ని వదులుకున్న యాజమాన్యం
- ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ప్రైవేట్ సిబ్బంది
- 'గెలాక్స్' నిర్వాహకుల మధ్య విబేధాలు?

సాక్షి, అమరావతి



పేనుకు పెత్తనమిస్తే తలంతా కొరికిందనే సామెతను నిజం చేస్తూ ఆర్టీసీ పార్శిల్ సేవల్లో ప్రైవేట్ పెత్తనం ఎక్కువైంది. ఆర్టీసీ ద్వారా పార్శిల్ సేవలు బుక్ చేసుకుంటున్న వారికి ప్రైవేట్ సిబ్బంది చుక్కలు చూపుతున్నారు. పార్శిల్ సేవలకు నిర్ణీత రుసుము చెల్లించినా వినియోగదారుల నుంచి అధికంగా వసూళ్లకు తెగబడుతున్నారు. ఆర్టీసీ కార్గో సేవల్లో ఉద్దేశపూర్వకంగానే ఇలా వ్యవహరిస్తూ ప్రైవేట్ పార్శిల్ సంస్థల వ్యాపారానికి తోడ్పాటునందిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కమీషన్‌పై అప్పగించిన యాజమాన్యం

లాభాలు ఆర్జించే అవకాశం ఉన్న కార్గో వ్యాపారాన్ని ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకోకుండా వదిలేయడంతో సంస్థ నష్టాల బాట పడుతోంది. లాభాల బాటలో ఉన్న పార్శిల్ సేవలను యాజమాన్యం గతేడాది సెప్టెంబర్‌లో 'గెలాక్స్' సంస్థకు కట్టబెట్టింది. 4.95 శాతం కమీషన్ విధానంతో ఈ వ్యాపారాన్ని ప్రైవేటు చేతిలో పెట్టారు. అంటే రూ.కోటి వ్యాపారానికి ప్రైవేట్ సంస్థకు రూ.4.95 లక్షలు చెల్లించాలి.

ఆర్టీసీ కార్గో సేవలకు ఆదరణ

ఆర్టీసీ బస్సుల్లో పార్శిల్ వ్యాపారాన్ని ఏఎన్ఎల్ సంస్థ గతంలో 25 ఏళ్లపాటు నిర్వహించింది. ఏడాదికి రూ.9 కోట్లు చొప్పున ఆర్టీసీకి చెల్లించింది. టిక్కెట్ విక్రయాలు కాకుండా ఇతర మార్గాల్లో ఆదాయాన్ని ఆర్జిస్తే ఆర్టీసీ లాభాల బాట పడుతుందని సలహా కమిటీలు సూచించాయి. ఈ నేపథ్యంలో 2017 ఆగస్టులో ఏఎన్ఎల్‌ను తప్పించిన యాజమాన్యం ప్రయోగాత్మకంగా 100 వోల్వో బస్సుల్లో పార్శిల్ సేవలను ప్రారంభించింది. ఆగస్టులో అనూహ్యంగా రూ.13 కోట్ల ఆదాయం పార్శిల్ వ్యాపారం ద్వారా సంస్థకు సమకూరింది. అనంతరం ఆర్టీసీ 10,700 బస్సుల్లో పార్శిల్ సేవలు ఆరంభించడంతో ఆదాయం రూ.30 కోట్లకు చేరుకుంది.

సొంతంగా నిర్వహించినప్పుడే లాభాలు

ఆర్టీసీకి తగినంత సాంకేతిక పరిజ్ఞానం, సిబ్బంది ఉన్నప్పటికీ పార్శిల్ సేవలను ప్రైవేట్ సంస్థకు అప్పగించాలని నిర్ణయించటం వెనుక సంస్థలో ఇటీవలే పదవీ విరమణ చేసిన ఓ ఉన్నతాధికారి ఉన్నట్లు కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. మూడు నెల ల్లోగా పార్శిల్ వ్యాపారం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రతి డిపోలో పికప్ పాయింట్లు, సిబ్బందిని ఏర్పాటు చేసుకుని సాఫ్ట్‌వేర్ డెవలప్ చేయాలని 'గెలాక్స్'తో ఆర్టీసీ ఒప్పందం చేసుకుంది.

ఆర్టీసీ స్వయంగా పార్శిల్ వ్యాపారం నిర్వహించిన సమయంలో ప్రతి రోజూ రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వ్యాపారం జరిగేది. ప్రస్తుతం ప్రైవేట్ సంస్థకు అప్పగించటంతో రూ.25 లక్షలకు మించడం లేదు.

'గెలాక్స్'కు ఆర్టీసీ నోటీసులు?

పార్శిల్ వ్యాపారంపై ఆర్టీసీ పర్యవేక్షణ లేకుండా పోవడంతో వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని యాజమాన్యానికి ఫిర్యాదులు అందుతున్నాయి. మరోవైపు 'గెలాక్స్' సంస్థలో భాగస్వాముల మధ్య విబేధాలు తలెత్తటంతో పార్శిల్ వ్యాపారం నిర్వహించలేమని చేతులెత్తేసినట్లు పేరు వెల్లడించేందుకు నిరాకరించిన ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. సదరు సంస్థకు నోటీసులు ఇచ్చినట్లు 'సాక్షి'కి తెలిపారు.

నన్నయ్య వర్సిటీ ఆటోమేషన్ టెండర్లలో అక్రమాలు నిజమే

సాక్షి, అమరావతి: నన్నయ్య యూనివర్సిటీ టెండర్లలో అక్రమాలు నిజమేనని తేలింది. ఉన్నత విద్యామండలి డిప్యూటీ డైరెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాథమిక విచారణలో టెండర్లలో అక్రమాలు నిర్ధారణ అయ్యాయని మండలి కార్యదర్శి వరదరాజన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఆ నివేదికను, సిఫార్సులను ప్రభుత్వం ఆమోదిస్తూ ఆటోమేషన్ టెండర్లను రద్దుచేయాలని, కొత్తగా వర్సిటీ ఈసీ ఆమోదంతో నిబంధనల ప్రకారం టెండర్లను పిలవాలని ఆదేశించింది. టెండర్లలో నిబంధనలు భిన్నంగా వ్యవహరించాలని వీసీ ఒత్తిడి తెచ్చారని వర్సిటీ రిజిస్ట్రార్ ఫిర్యాదు చేయటం తెలిసిందే.


కేంద్ర మాజీ మంత్రి మృతిపై రోశయ్య సంతాపం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బులి రామయ్య మృతి పట్ల మాజీ గవర్నర్ రోశయ్య ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. పారిశ్రామిక వేత్తగా, కేంద్ర మంత్రిగా ప్రజలకు సేవలందించారని రోశయ్య గుర్తుచేశారు. మాజీ శాసనసభ్యుడు ఎంవీ కృష్ణారావు మృతి పట్ల కూడా రోశయ్య సంతాపం ప్రకటించారు.

తీరని తాగునీటి కష్టాలు

- ప్రభుత్వానికి పట్టని 7,896 కాలనీల విన్నపాలు
- రూ.242.23 కోట్లతో ప్రతిపాదనలు
- ఆర్థిక శాఖ వద్ద ఆగిపోయిన ఫైల్

సాక్షి, అమరావతి:



ఎస్సీ కాలనీల్లో ఏళ్ల తరబడి తాగునీటి కష్టాలు కొనసాగుతున్నాయి. జన్మభూమి సభల్లో ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం శూన్యం. కొన్ని చోట్ల ఒక్క చేతిపంపు పైనే ఆధారపడి అక్కడి వారు కాలం గడుపుతున్నారు. సీతాకాలంలోనే తాగునీటి ఇబ్బందులు కొనసాగుతున్నాయంటే వేసవిలో వీరి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రజల నుంచి అందిన విన్నపాల మేరకు 7,896 కాలనీల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించిన యంత్రాంగం రూ.242.23 కోట్లతో ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనలు ఇంత వరకు అనుమతికి నోచుకోలేదు. ఆ ఫైల్ ఆర్థిక శాఖ వద్ద ఉండిపోయినట్లు తెలుస్తోంది. అనుమతులు రాగానే పనులు మొదలుపెట్టగలమని అధికారులు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో బోర్లు వేసి ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా నీరందించాలి.

తాగునీటికి పడరాని పాట్లు

చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలం తూముంద్రుం పంచాయతీ పరిధిలోని తొప్పనపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం ప్రజలు పడరాని బాధలు పడుతున్నారు. అనేక సార్లు ఇక్కడి ప్రజలు ప్రభుత్వానికి అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎనిమిది సంవత్సరాల క్రితం కాంగ్రెస్ హయాంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ కట్టారు. దీనికి బోరువేసి ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చేందుకు ఇన్నేళ్ల నుంచి ప్రభుత్వాలకు చేతకాలేదు. ఈ విషయమై గత సంవత్సరం ఆగస్టులో దళిత మహిళలు నెత్తిన ఖాళీ బిందెలు పెట్టుకుని చిత్తూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అయినా స్పందన కరువు. జీడీ నెల్లూరు వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే కె నారాయణస్వామి ఈ విషయమై అనేకసార్లు కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందనలేదు. ఈ కాలనీలో ఉన్న 63 కుటుంబాల వారు ఉన్న ఒకే చేతి పంపుతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పేర్కొన్న రాష్ట్రంలోని 7,896 కాలనీలదీ ఇంచుమించుగా ఇదే పరిస్థితి నెలకొంది.

ముంచుకొస్తున్న ప్రళయాగ్ని!

పది కిలోమీటర్ల వెడల్పు..
అర కిలోమీటర్‌కుపైగా ఎత్తున్న సొరంగం..
టిక్..టిక్..టిక్‌మంటూ కాలం గడుస్తోంది..
ఉన్నట్టుండి అకస్మాత్తుగా.. కళ్లుమూసి తెరిచేలోగా...
సొరంగంలోని లావా కాస్తా ఒక్కపెట్టున పైకి ఎగజిమ్మింది...
ఏమిటిది?



ఇదేదో సస్పెన్స్ సినిమా కథ అనుకునేరు! అక్షరాలా వాస్తవం. సముద్రపు అడుగున వేల ఏళ్లపాటు నిద్రాణంగా ఉన్న ఓ అగ్నిపర్వతం క్రియాశీలకమైందని.. ముందస్తు హెచ్చరికల్లేకుండా ఎప్పుడైనా పేలిపోవచ్చునని చెబుతున్నారు జపాన్ శాస్త్రవేత్తలు. ఈ విపత్తుతో కనీసం 10 కోట్ల మంది ప్రాణాలకు ముప్పు ఉందని హెచ్చరిస్తున్నారు.

ఎక్కడది?

జపాన్ దక్షిణ ప్రాంతంలో కికాయి కాల్‌డెరా అనే పేరుతో ఓ అగ్నిపర్వతముంది. భూమ్మీద కనిపించేది కొంచెమే అయినా అడుగున భారీ సైజులో ఉంటుంది. 7,300 ఏళ్ల కింద బద్దలై లావా ఎగజిమ్మిందని.. ఫలితంగా అక్కడి జొమోన్ నాగరికత పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిందని చరిత్రకారుల అంచనా.

ఎలా తెలిసింది..?

జపాన్‌లోని కోబె విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఇటీవల ఈ అగ్నిపర్వత ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. ఫుకేమరూ అనే పరిశోధక నౌకతో అగ్నిపర్వత ప్రాంతానికి వెళ్లిన శాస్త్రవేత్తలు సముద్రపు అడుగుభాగంలో ఓ భారీ లావా గోపురాన్ని గుర్తించారు. ఈ గోపురం వేల ఏళ్లుగా పేరుకుపోయిన లావా పరిమాణం కొంచెం అటు ఇటుగా 32 ఘనపు కిలోమీటర్లు! అంటే 32 పక్కన 12 సున్నాలు పెడితే వచ్చే సంఖ్యలో ఉన్నన్ని లీటర్ల లావా అన్నమాట!

ఏం జరుగుతుంది..?

ఇది ఆషామాషీ సైజున్న అగ్నిపర్వతం కాదు. పైగా వేల ఏళ్లుగా నిద్రాణంగా ఉన్నది. గతంలో ఎగసిన లావా కాస్తా అగ్నిపర్వతంపై పేరుకుపోవడంతో లోపల లావా తీవ్రమైన ఒత్తిడితో పేరుకుపోతూ వస్తోంది. జపాన్ శాస్త్రవేత్తలు సేకరించిన నమూనాల్లో రయోలైట్స్ అనే ప్రత్యేకమైన రాళ్లు ఉన్నాయి. ఈ రాళ్లు అందులో లావా ఇంకా ఉందనేందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. లావా కనుక ఎగజిమ్మితే సల్ఫర్ డయాక్సైడ్‌తో కూడిన బూడిద కొన్ని కిలోమీటర్ల ఎత్తుకు చేరుతుంది. ఫలితంగా ధూళి మేఘాలు ఏర్పడి కొంతకాలం పాటు సూర్యుడి వెలుగు భూమిని చేరకుండా పోతుంది. దీంతో కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోతాయి. సముద్రపు అడుగున జరిగే ప్రక్రియ కాబట్టి సునామీ వచ్చి అమెరికా తీరాన్ని తాకుతుందని అంచనా. కికాయి అగ్నిపర్వతాన్ని మరింత అధ్యయనం చేయడం ద్వారా విస్ఫోటం జరిగే సమయాన్ని అంచనా వేసేందుకు జపాన్ శాస్త్రవేత్తలు యత్నిస్తున్నారు.

– సాక్షి, హైదరాబాద్

నిదర్శనాలేంటి?

కికాయి అగ్నిపర్వతంలోని లావా మళ్లీ క్రియాశీలమైందని శాస్త్రవేత్తలు వేసిన అంచనాలు నిజమే అనేందుకు ఇప్పటికే కొన్ని సూచనలు కనిపిస్తున్నాయి. రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతంలో చిన్న చిన్న అగ్నిపర్వతాలు పేలిపోతుండటమే కాకుండా.. ఊహించని రీతిలో వరుస భూకంపాలు వస్తున్నాయి. ఇండొనేసియా నుంచి మొదలుకుని ఫిలిప్పీన్స్, జపాన్, ఉత్తర, దక్షిణ అమెరికా పశ్చిమ తీరప్రాంతం మొత్తాన్ని రింగ్ ఆఫ్ ఫైర్ అంటారు. ప్రపంచంలోనే అత్యధిక అగ్నిపర్వతాలు ఉన్న ప్రాంతం ఇదే. టెక్టానిక్ ప్లేట్ల క్రియాశీలత కారణంగా ఇక్కడ భూకంపాలు ఎక్కువగా సంభవిస్తాయి. అమెరికా తీరంలోని సెయింట్ ఆండ్రియాస్ ఫాల్ట్ వద్ద కూడా ఓ భారీ భూకంపం ఎప్పుడైనా రావొచ్చని అంచనాలు చాలాకాలంగా ఉన్నాయి.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ).. 2018కి గాను ఎకనమిక్స్ అండ్ ట్రేడ్ పాలసీ, ఫైనాన్స్, జనరల్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజీ, ఐటీ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ అండ్ ఆపరేషన్స్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ (ఫుల్ టైమ్/పార్ట్ టైమ్) ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం (ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/దివ్యాంగ-50 శాతం) మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ఎంఫిల్/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులు అర్హులు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ ఏప్రిల్ 27, 2018. దరఖాస్తు రుసుం: రూ.2,500 (ఎస్సీ/ఎస్టీ-రూ.1,250). పూర్తి వివరాలకు వెబ్‌సైట్: http://tedu.iift.ac.in/iift/index.php

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ఎగ్జామ్ రివ్యూ..

గేట్-2018 విశ్లేషణ..

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్).. ఐఐటీ, ఎన్ఐటీ, ఇతర కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లలో.. ఎంటెక్/ఎంఈ, డైరెక్ట్ డాక్టోరల్ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. గేట్-2018 ఆన్‌లైన్ టెస్ట్ ఈ నెల 3, 4, 10, 11 తేదీల్లో జరిగింది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా దాదాపు పది లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. 65 ప్రశ్నలు 100 మార్కులకు పరీక్ష జరిగింది. గేట్-2018 నిర్వాహక సంస్థ ఐఐటీ గువాహటి అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లను గురువారం వెబ్‌సైట్లో పొందుపరచింది. గేట్ పరీక్షకు ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యే ముఖ్య బ్రాంచ్‌లకు సంబంధించి ఎగ్జామ్ రివ్యూతోపాటు గేట్ తర్వాత దశలో ఉన్నత విద్య, పీఎస్‌యూలలో ఉద్యోగ నియామకాల పరంగా అనుసరించాల్సిన విధానాలపై విశ్లేషణ.



మెకానికల్ ఇంజనీరింగ్

మెకానికల్ ఇంజనీరింగ్ ఆన్‌లైన్ టెస్ట్ ఫిబ్రవరి 3న రెండు సెషన్లలో జరిగింది. గతేడాదితో పోల్చితే న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నల సంఖ్య పెరిగింది. ఫ్లూయిడ్ మెకానిక్స్, మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్, ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్‌కు అధిక వెయిటేజీ లభించిందని చెప్పొచ్చు. జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి వచ్చిన ప్రశ్నలు సులువుగా ఉన్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. మరో స్లాట్‌లోనూ న్యూమరికల్ టైప్ ఆన్సర్ ప్రశ్నలు ఎక్కువగానే వచ్చాయి. ఈ స్లాట్‌లో మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ యూనిట్‌కు అధిక వెయిటేజీ లభించింది. ఇందులో వచ్చిన ప్రశ్నలు దీర్ఘ సమాధాన తరహాలో ఉండటంతో విద్యార్థులు కొంత ఇబ్బందికి గురయ్యారు. మొత్తంమీద కోర్ సబ్జెక్టుల పరంగా లాజికల్ నైపుణ్యాలు పొందిన అభ్యర్థులు సులువుగా సమాధానాలిచ్చే విధంగా మెకానికల్ పేపర్ ఉన్నట్లు సబ్జెక్టు నిపుణుల అభిప్రాయం. జనరల్ కేటగిరీలో కటాఫ్ స్కోర్ అంచనా 32-33 మార్కులు.

కంప్యూటర్ సైన్స్

ఫిబ్రవరి 4న ఒకే స్లాట్‌లో కంప్యూటర్ సైన్స్ పేపర్ పరీక్ష జరిగింది. న్యూమరికల్ ఎబిలిటీ, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల మధ్య సమతూకం కనిపించడం కొంత ఊరట కలిగించే అంశం. ప్రశ్నల్లో అధిక శాతం ఫండమెంటల్స్, కాన్సెప్ట్ ఆధారితంగా ఉండటంతో.. సబ్జెక్టుపై పూర్తిస్థాయి అవగాహన ఉన్న అభ్యర్థులు సరైన సమాధానాలు గుర్తించగలిగారని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రోగ్రామింగ్ అండ్ డేటా స్ట్రక్చర్స్, ఇంజనీరింగ్ మ్యాథ్స్, అల్గారిథమ్స్‌కు అధిక వెయిటేజీ లభించింది. ప్రశ్నల క్లిష్టత పరంగా కంప్యూటర్ నెట్‌వర్క్, డేటాబేసెస్, కంప్యూటర్ ఆర్గనైజేషన్ విభాగాల నుంచి వచ్చిన ప్రశ్నలు చాలా కష్టంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జనరల్ కేటగిరీలో కటాఫ్ స్కోర్ అంచనా.. 24-26 మార్కులు.

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ పేపర్ ఈ ఏడాది కొంత కఠినంగా ఉందంటున్నారు నిపుణులు. ఫిబ్రవరి 10న ఒకే స్లాట్‌లో నిర్వహించిన ఈసీ పేపర్‌లో కోర్ అంశాలకు ప్రాధాన్యం లభించింది.

ఎలక్ట్రానిక్ డివైజ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కమ్యూనికేషన్స్, అనలాగ్ సర్క్యూట్స్, ఎలక్ట్రోమ్యాగ్నటిక్ థియరీ అంశాలకు





అధిక వెయిటేజీ లభించింది. కోర్ అంశాల నుంచి వచ్చిన ప్రశ్నల్లో 60 శాతం ప్రశ్నలు సులభంగా.. 40 శాతం ప్రశ్నలు ఓ మోస్తరు నుంచి సాధారణ క్లిష్టత స్థాయిలో ఉన్నాయని సబ్జెక్టు నిపుణులు అంటున్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ పేపర్‌కు సంబంధించి జనరల్ కేటగిరీలో కటాఫ్ స్కోర్ అంచనా.. 25 మార్కులు.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

ఫిబ్రవరి 10న జరిగిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పేపర్‌లో ప్రశ్నలన్నీ కాన్సెప్టుల ఆధారంగా ఉన్నాయి. డైరెక్ట్ ప్రశ్నలు వచ్చాయి. పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ మెషీన్స్‌కు అధిక వెయిటేజీ లభించిందని చెప్పొచ్చు. క్లిష్టత స్థాయి కోణంలో ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, సిగ్నల్ అండ్ సిస్టమ్స్, కంట్రోల్ సిస్టమ్స్, పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ నుంచి వచ్చిన ప్రశ్నలు కఠినంగా ఉన్నాయి. ఓ మోస్తరు ప్రిపరేషన్‌తో పరీక్షకు హాజరైన అభ్యర్థులు 40 శాతం మార్కులు సాధించే అవకాశం ఉందని, బాగా ప్రిపేరైన అభ్యర్థులు 50 శాతం మార్కులు పొందేందుకు అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. జనరల్ కేటగిరీలో కటాఫ్ అంచనా.. 25 మార్కులు.

సివిల్ ఇంజనీరింగ్

సివిల్ ఇంజనీరింగ్ పరీక్ష రెండు స్లాట్లలో జరిగింది. ఫిబ్రవరి 11న ఆన్‌లైన్ టెస్ట్ పూర్తయింది. తొలి స్లాట్‌లో జియో టెక్నికల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ హైడ్రాలజీ అంశాలకు అధిక ప్రాధాన్యం లభించింది. ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్‌కు 12 శాతం వెయిటేజీ ఇవ్వడం గమనార్హం. రెండో స్లాట్‌లో జియో టెక్నికల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి వచ్చిన ప్రశ్నలు కష్టంగా ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఇతర విభాగాల నుంచి ప్రశ్నలు తేలిక, మధ్యస్థ కాఠిన్యతతో ఉన్నాయి. రెండో స్లాట్‌లో 60 శాతం మార్కులు పొందే అవకాశం ఉంది. జనరల్ కేటగిరీలో కటాఫ్ అంచనా.. 30 మార్కులు.

గేట్ తర్వాత ఏంటి?

ఉమ్మడి కౌన్సెలింగ్: గేట్ ద్వారా ఐఐటీల్లో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు.. ప్రతి ఐఐటీకి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు సంబంధించి ఆయా ఐఐటీలు ప్రవేశ ప్రకటనలు విడుదల చేస్తాయి. ఎన్ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులకు కామన్ కౌన్సెలింగ్ ఫర్ ఎంటెక్ (సీసీఎంటీ) పేరుతో ప్రత్యేకంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు పొందిన స్కోర్, అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఆన్‌లైన్లో సీట్ అలాట్‌మెంట్ జరుగుతుంది. ఐఐటీల్లో ప్రవేశం పొందాలంటే.. వెయ్యి పాయింట్ల స్కేల్‌లో జనరల్ కేటగిరీలో 700కు పైగా స్కోర్ సాధిస్తేనే అవకాశాలు మెరుగవుతాయి. ఎన్ఐటీల్లో 500 నుంచి 700 మధ్యలోపు స్కోర్‌తో సీటు ఆశించొచ్చు.

ప్రభుత్వరంగ సంస్థలు: గేట్ స్కోర్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్న సంగతి తెలిసిందే. కటాఫ్‌ల కోణంలో మహారత్న సంస్థల ఇంటర్వ్యూ కాల్ అందుకోవాలంటే.. 750కు పైగా స్కోర్ సాధించాల్సి ఉంటుంది. అకడమిక్‌గానూ నిర్దిష్ట పర్సంటేజీతో ఉత్తీర్ణత అనే నిబంధనను పీఎస్‌యూలు విధిస్తున్నాయి. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు బీటెక్‌లో కనీసం 60 శాతం మార్కులు రావాలి. ఇంటర్వ్యూ దశ కంటే ముందు గ్రూప్ డిస్కషన్ (జీడీ) కూడా నిర్వహిస్తున్నాయి.

గేట్-2017 పీఎస్‌యూ నియామకాల కటాఫ్ మార్కులు

గేట్-2017 స్కోర్ ఆధారంగా పీఎస్‌యూలలో ఉద్యోగాల భర్తీకి సంబంధించి బ్రాంచ్‌ల వారీగా జనరల్ కేటగిరీ కటాఫ్ వివరాలు..

పీఎస్‌యూ	మెకానికల్	సివిల్	ఎలక్ట్రికల్	ఎలక్ట్రానిక్స్	సీఎస్ఈ
హెచ్‌పీసీఎల్	68.45	70.04	58.64	73.05	--
ఎన్‌టీపీసీ	80.94	--	58.72	69.17	--
బీహెచ్ఈఎల్	64.67	--	73.67	74.67	--
ఎండీఎల్	79.54	--	59.58	--	--
పవర్‌గ్రిడ్	--	73.49	59.10	--	70.67
గెయిల్	63.33	--	72.67	--	--
బీహెచ్ఈఎల్	72.73	--	86.24	--	--
బీఈఎంఎల్	78.34	--	58.46	--	--

బులెటిన్ బోర్డ్

ఏపీ పోస్టల్ సర్కిల్‌లో 245 ఖాళీలు

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌లోని వివిధ పోస్టల్/ఆర్ఎంఎస్ డివిజన్లలో 245 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

- **పోస్టు-ఖాళీలు:** పోస్ట్‌మ్యాన్-234; మెయిల్ గార్డ్-11.
- **రీజియన్ల వారీ ఖాళీలు:** విజయవాడ-112 (పోస్ట్‌మ్యాన్-106+మెయిల్ గార్డ్-6); కర్నూలు-62 (పోస్ట్‌మ్యాన్-60+మెయిల్ గార్డ్-2); విశాఖపట్నం-71 (పోస్ట్‌మ్యాన్-68+మెయిల్ గార్డ్-3).
- **వేతనం:** రూ.21,700+ఇతర అలవెన్సులు.
- **అర్హతలు:** పదోతరగతి/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 2018, మార్చి 15 నాటికి 18-27 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష.
- **రాతపరీక్ష విధానం:** దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో పార్ట్-ఎలో జనరల్ నాలెడ్జ్ నుంచి 25, పార్ట్-బిలో మ్యాథమెటిక్స్ నుంచి 25, పార్ట్-సిలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి 25, తెలుగు లాంగ్వేజ్ నుంచి 25 చొప్పున మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో ఉంటాయి. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
- **రాతపరీక్ష కేంద్రాలు:** కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.
- **దరఖాస్తు రుసుం:** రూ.500 (అప్లికేషన్ ఫీజు-రూ.100+ఎగ్జామినేషన్ ఫీజు-రూ.400). ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఎగ్జామినేషన్ ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** మార్చి 15, 2018.
- **వెబ్‌సైట్:** appost.in, www.indiapost.gov.in

ఐవోసీఎల్ నార్తర్న్ రీజియన్‌లో 225 ఖాళీలు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) నార్తర్న్ రీజియన్.. ఢిల్లీ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌తోపాటు కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్‌లోని 225 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** ట్రేడ్ అప్రెంటీస్-148, టెక్నికల్ అప్రెంటీస్-77.
- **అప్రెంటీస్‌షిప్ వ్యవధి:** ఏడాది.
- **విభాగాలు:** ట్రేడ్‌లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, అకౌంటెంట్; టెక్నీషియన్‌లో మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్.
- **అర్హతలు:** ట్రేడ్ అప్రెంటీస్‌లోని అకౌంటెంట్ విభాగానికి కనీసం 50 శాతం (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-45 శాతం) మార్కులతో ఏదైనా డిగ్రీ, మిగిలిన విభాగాలకు పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ; టెక్నీషియన్ అప్రెంటీస్ పోస్టులకు సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా.
- **వయసు:** 2018, జనవరి 31 నాటికి 18-24 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ. దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 25, 2018.
- **వెబ్‌సైట్:** www.iocl.com

విజయానికి వారధి.. 'వర్తమానం'!

ఉద్యోగాల భర్తీకి సంబంధించిన పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే జనరల్ నాలెడ్జ్ (జీకే), కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించడం ముఖ్యం. దాదాపు ప్రతి పోటీ పరీక్షలోనూ ఈ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మొదలు స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), ఆర్ఆర్‌బీ, ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సంస్థలు, సబ్ ఇన్‌స్పెక్టర్స్, పోలీస్ కానిస్టేబుల్స్, టీఆర్‌టీ.. ఇలా వివిధ నియామక పరీక్షల్లో జీకే, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి. ఇంత ప్రాధాన్యమున్న ఈ విభాగాల్లో ఎక్కువ మార్కులు సాధించాలంటే ఏం చేయాలో చూద్దాం..



ఏ సబ్జెక్టుకు అయినా నిర్దేశిత సిలబస్ ఉంటుంది. కానీ.. జీకే, కరెంట్ అఫైర్స్‌కు మాత్రం కచ్చితమైన సిలబస్ ఉండదు. ఏ అంశం నుంచైనా ప్రశ్నలు రావచ్చు. కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలంటే రోజూ వార్తాపత్రికలను చదవాలి. ముఖ్యమైన అంశాలను నోట్ చేసుకోవాలి. తెలుగుతోపాటు ఒక ఇంగ్లిష్ డైలీని కూడా చదివితే కరెంట్ అఫైర్స్‌తోపాటు ఇంగ్లిష్‌పైనా పట్టు సాధించొచ్చు. పత్రికలను ప్రధానంగా పరీక్షల దృష్టితో చదవాలి. బ్యాంకు పరీక్షలకైతే ఆర్నెళ్లు, యూపీఎస్సీ, రాష్ట్ర పోటీ పరీక్షలకైతే ఏడాది పాటు జరిగిన వర్తమాన అంశాలను క్షుణ్నంగా చదవాలి. గత పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను సేకరించి ప్రశ్నల సరళి, క్లిష్టతను పరిశీలించాలి. గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక ప్రకారం ప్రిపరేషన్ కొనసాగించాలి.

భిన్న కోణాల్లో అధ్యయనం

కరెంట్ అఫైర్స్‌ను బిట్ల రూపంలో చదవొద్దు. అలా చదివితే త్వరగా మరిచిపోతాం. ఒక అంశం గురించి చదివినప్పుడు దాన్ని వివిధ కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు 2017కుగాను జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ప్రముఖ హిందీ రచయిత్రి కృష్ణ సోబతీకి ప్రకటించారు. ఈ అంశాన్ని ఎలా ప్రిపేరవాలో చూద్దాం..

జ్ఞానపీఠ్ అవార్డు మనదేశంలోని అత్యున్నత సాహితీ పురస్కారం. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లోని 22 భాషల్లో సాహిత్యరంగంలో కృషిచేసిన వారికి అందజేస్తారు. అవార్డు కింద రూ.11 లక్షల నగదు బహుమతిని, సరస్వతీదేవి కాంస్య విగ్రహాన్ని బహూకరిస్తారు. 1965లో తొలి జ్ఞానపీఠ్‌ను మలయాళం రచయిత జి.శంకర కురుప్‌నకు ప్రదానం చేశారు. ఇప్పటి వరకు ముగ్గురు తెలుగు రచయితలు ఈ అవార్డు అందుకున్నారు. వారు.. విశ్వనాథ సత్యనారాయణ (1970), సి.నారాయణరెడ్డి (1988), రావూరి భరద్వాజ (2012). కృష్ణ సోబతీ.. అవార్డుకు ఎంపికైన 8వ మహిళ, 11వ హిందీ రచయిత/రచయిత్రి. ఆమె జిందగీనామా, గుజరాత్ పాకిస్తాన్ సే గుజరాత్ హిందుస్తాన్, మిత్రో మర్‌జానీ తదితర పుస్తకాలు రచించారు. ఇలా.. ఒక అంశాన్ని వివిధ కోణాల నుంచి పరిశీలిస్తే ప్రశ్న ఏ విధంగా వచ్చినా సరైన సమాధానం గుర్తించొచ్చు. ఈ విధంగా కరెంట్ అఫైర్స్‌ను స్టాక్ జీకేతో అనుసంధానం చేస్తూ చదివితే తేలిగ్గా గుర్తుంటుంది.

బ్యాంక్ పరీక్షల కోసం..

బ్యాంక్ పీవో, క్లర్క్, ఆర్‌బీఐ, నాబార్డ్, ఇన్సూరెన్స్ సంస్థల పోటీ పరీక్షల్లో వర్తమాన అంశాలతోపాటు బ్యాంకింగ్ రంగం నుంచి కూడా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి ఈ ఉద్యోగాల కోసం ప్రిపేరయ్యే వారు బ్యాంకింగ్ అవేర్‌నెస్ విభాగాన్ని కూడా చదవాలి. రిజర్వ్ బ్యాంక్ తాజా పరపతి విధానం, ఇటీవల ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాలు, కమిటీలు-చైర్మన్లు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఇటీవలి కాలంలో జరిగిన పరిణామాలు, కొత్త ప్రైవేటు బ్యాంకులు, చెల్లింపు బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్, జన్‌ధన్ యోజన, పాలసీరేట్లు, ఏటీఎంలు, వైట్ లేబుల్ ఏటీఎంలు, బ్యాంకింగ్ పదజాలం, నో యువర్ కస్టమర్ విధానాలు, మనీ లాండరింగ్, క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు, కరెన్సీ, నాణేలు, ప్లాస్టిక్ కరెన్సీ, నాబార్డ్, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, స్టాక్ మార్కెట్లు తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

ఉదా:

- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రస్తుత చైర్మన్?
  1) అరుంధతీ భట్టాచార్య 2) శశిశంకర్
  3) రజనీష్ కుమార్ 4) పరమ్ షా
  సమాధానం: 3
- భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లిమిటెడ్ అనే సూక్ష్మరుణ సంస్థను ఏ బ్యాంకు కొనుగోలు చేసింది?
  1) బంధన్ 2) ఇండస్ ఇండ్
  3) కోటక్ మహీంద్రా 4) ఎస్ **సమాధానం: 2**

జాతీయ అంశాలు

దేశంలో చోటు చేసుకున్న ప్రధాన సంఘటనలపై దృష్టి సారించాలి. రాజకీయ సంఘటనలు, ప్రభుత్వ పథకాలు, కమిటీలు, కమిషన్లు, ఎన్నికలు, రాష్ట్రాల్లో జరిగిన ముఖ్య సంఘటనల్ని చదవాలి. తెలుగు రాష్ట్రాలు నిర్వహించే పరీక్షలకు హాజరయ్యేవారు ప్రాంతీయ అంశాలను కూడా తెలుసుకోవాలి.

ఉదా:

- దేశంలో తొలి అఖిల భారత ఆయుర్వేద సంస్థను ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్కడ ప్రారంభించారు?
  1) న్యూఢిల్లీ 2) జైపూర్ 3) చెన్నై 4) గాంధీనగర్
  సమాధానం: 1

అంతర్జాతీయ అంశాలు

వివిధ దేశాల్లో కొత్తగా అధికారంలోకి వచ్చిన నేతలు, అంతర్జాతీయ సదస్సులు, భారత ప్రధాని విదేశీ పర్యటనలు తదితర అంశాలను చదవాలి.

ఉదా:

- 2017, నవంబర్‌లో 12వ తూర్పు ఆసియా సదస్సు ఏ నగరంలో జరిగింది?
  1) నామ్‌ఫెన్ 2) మనీలా 3) నేపిటా 4) ద నాంగ్
  సమాధానం: 2

శాస్త్ర, సాంకేతిక అంశాలు

ఇటీవల జరిగిన అంతరిక్ష, రక్షణ, పర్యావరణ, ఆరోగ్య, ఇంధన, సమాచార, సాంకేతిక రంగాల సంఘటనలను తెలుసుకోవాలి. ఉపగ్రహాలు, వాహక నౌకలు, ఇటీవల పరీక్షించిన క్షిపణులు, ఆవిష్కరణలు, వివిధ తుపాన్లకు పెట్టిన పేర్లు, సంప్రదాయేతర ఇంధన వనరులు, సోలార్ మిషన్ తదితర అంశాలను చదవాలి.

- 2018, జనవరిలో ఆస్ట్రేలియా గ్రూప్‌లో సభ్యత్వం లభించిన 43వ దేశం?
  1) చైనా 2) భారత్ 3) పాకిస్తాన్ 4) దక్షిణాఫ్రికా
  సమాధానం: 2

ఆర్థిక అంశాలు

కేంద్ర బడ్జెట్, ఎకనామిక్ సర్వే, కొత్తగా ప్రకటించిన పథకాలు తదితరాల గురించి చదవాలి. 2011 జనాభా లెక్కలను క్షుణ్నంగా పరిశీలించాలి.

ఉదా:

- ఎవరి నేతృత్వంలో 15వ ఆర్థిక సంఘం ఏర్పాటైంది?
  1) బిబేక్ దేబ్రాయ్ 2) రమేష్‌చంద్
  3) అశోక్ లాహిరి 4) ఎన్.కె.సింగ్
  సమాధానం: 4
- 2017-18 భారత ఆర్థిక సర్వే ప్రకారం స్థిర మూలధరల వద్ద 2017-18లో స్థూల సమకూరిన విలువ (జీవీఏ) వృద్ధిరేటు అంచనా?
  1) 7.2 శాతం 2) 7.9 శాతం
  3) 6.6 శాతం 4) 6.1 శాతం
  సమాధానం: 4

క్రీడలు

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన క్రీడాంశాలను చదవాలి. ఇటీవల జరిగిన అండర్-19 క్రికెట్ ప్రపంచకప్, ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్, ఆస్ట్రేలియన్ ఓపెన్, రంజీ ట్రోఫీ టోర్నమెంట్, వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్, వరల్డ్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్, రెజ్లింగ్ చాంపియన్‌షిప్, హాకీ ఆసియా కప్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. విజేతలు, పతకాల సంఖ్య, క్రీడాకారులు వారి దేశాలు, ట్రోఫీలు, క్రీడాపదజాలం తదితరాలను తెలుసుకోవాలి.

ఉదా:

- 2022లో కామన్వెల్త్ క్రీడలు ఏ నగరంలో జరుగుతాయి.
  1) గ్లాస్గో 2) బర్మింగ్‌హామ్
  3) బ్రిస్బేన్ 4) గోల్డ్‌కోస్ట్
  సమాధానం: 2
- 2017, డిసెంబర్ 30న వరల్డ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌ను ఎవరు గెలుచుకున్నారు?
  1) విశ్వనాథన్ ఆనంద్ 2) సెర్గీ కర్జాకన్
  3) మాగ్నస్ కార్ల్‌సన్ 4) వ్లాదిమర్ క్రామ్నిక్
  సమాధానం: 3

వార్తల్లోని వ్యక్తులు - అవార్డులు

ఇటీవల చేపట్టిన నియామకాలు, ఎన్నిక, ఎంపిక, మరణాలు ముఖ్యమైనవి. జాతీయ అవార్డుల్లో.. పద్మ అవార్డులు, చలనచిత్ర పురస్కారాలు, క్రీడా పురస్కారాలు, సాహిత్య అవార్డులు; అంతర్జాతీయ అవార్డుల్లో.. నోబెల్ బహుమతులు, రామన్ మెగసెసే పురస్కారాలు, ఆస్కార్ అవార్డులు, ప్రపంచ ఆహార బహుమతి, బుకర్ ప్రైజ్ తదితరాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

- కింది వారిలో 2018 జనవరిలో ఎవరికి పద్మవిభూషణ్ ప్రకటించారు?
  1) పంకజ్ అద్వానీ 2) పి.పరమేశ్వరన్
  3) ఆర్.నాగస్వామి 4) వేద్ ప్రకాశ్ నందా
  సమాధానం: 2

స్టాక్ జీకే

రవాణా వ్యవస్థ, విమానాశ్రయాలు, సమాచార వ్యవస్థ, దేశ రక్షణ రంగం, క్షిపణి వ్యవస్థ, అంతరిక్ష పరిశోధనా సంస్థ, అణుశక్తి రంగం, జాతీయ పార్కులు, బయోస్పియర్ రిజర్వ్‌లు, అధ్యయన శాస్త్రాలు, ప్రముఖ దినోత్సవాలు, నినాదాలు, ఐక్యరాజ్యసమితి, దాని అనుబంధ సంస్థలు, ఐరాస ప్రకటించిన సంవత్సరాలు, దశాబ్దాలు, అంతర్జాతీయ సంస్థలు, వాటి ప్రధాన కార్యాలయాలు, అధిపతులు, దేశాలు-రాజధానులు-కరెన్సీలు, పార్లమెంట్లు తదితరాలపై దృష్టిసారించాలి.



ఎన్.విజయేందర్‌రెడ్డి
విజయేందర్ అకాడమీ
హైదరాబాద్.

సాక్షి బిజినెస్
శుక్రవారం 16-2-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
142 ▲	45 ▲
34,297	10,545

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,194	▲	51
డోజోన్స్	24,979	▲	86
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,235	▲	21
డాక్స్	12,346	▲	7
షాంఘై (14 ముగింపు)	3,199	▲	15
నికాయ్	21,465	▲	311

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.70	64.83
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.90	91.09
€	యూరో	ఎస్‌బీఐ	80.88	81.04
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.92	61.05
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.60	51.70
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.39	49.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.51	18.39
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.84	18.52
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.12	11.58



8,000 కోట్లు ఆవిరి

కరిగిపోయిన ఇన్వెస్టర్ల సంపద ● రెండు రోజుల్లో పీఎన్‌బీ షేరు 22% పతనం ● రూ. 31వేల కోట్లకు మార్కెట్ క్యాప్ డౌన్

న్యూఢిల్లీ: కుంభకోణంలో చిక్కుకున్న ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) షేర్ల పతనం కొనసాగుతోంది. వరుసగా రెండో రోజున పీఎన్‌బీ షేరు మరో 12 శాతం క్షీణించింది. బీఎస్ఈలో రూ. 128.35కి పడిపోయింది. స్కాం బైటపడిన బుధవారం నాడు షేరు సుమారు పది శాతం క్షీణించింది. దీంతో రెండు రోజుల వ్యవధిలోనే బ్యాంకు మార్కెట్ విలువ ఏకంగా రూ. 8,077 కోట్ల మేర కరిగిపోయినట్లయింది. ఇది పీఎన్‌బీ వార్షిక లాభానికి ఆరు రెట్లు పైగా కావడం గమనార్హం. షేరు రెండు రోజుల పతనంతో గురువారం పీఎన్‌బీ మార్కెట్ విలువ రూ. 31,132 కోట్లకు పడిపోయింది. మరోవైపు, పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు కూడా క్షీణించాయి. గురువారం బీఎస్ఈలో 4.30 శాతం తగ్గి రూ. 1,199 వద్ద క్లోజయ్యాయి. పీఎన్‌బీ నుంచి పొందిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ)ని అడ్డం పెట్టుకుని బిలియనీర్ నీరవ్ మోదీ .. బ్యాంకులను రూ. 11,400 కోట్ల మేర బురిడీ కొట్టించిన సంగతి తెలిసిందే. స్కాం బైటపడిన బుధవారం రోజున షేర్లలో అమ్మకాలతో ప్రభుత్వ రంగ బ్యాంకుల మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ. 20,000 కోట్ల మేర క్షీణించింది.

గీతాంజలి జెమ్స్‌కి కూడా సెగ..

నీరవ్ మోదీతో లింకులున్న కారణంగా గీతాంజలి జెమ్స్ సంస్థ షేర్లు కూడా భారీగా క్షీణిస్తున్నాయి. కుంభకోణం బైటపడిన అనంతరం గీతాంజలి జెమ్స్ షేర్లలో రెండు రోజులుగా అమ్మకాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సుమారు రూ. 130 కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద కరిగిపోయింది. ఫిబ్రవరి 12న దాదాపు రూ. 745 కోట్లుగా ఉన్న కంపెనీ మార్కెట్ విలువ గురువారం ఉదయం సెషన్లో రూ. 612 కోట్ల స్థాయికి పడిపోయింది. మొత్తం మీద గురువారం బీఎస్ఈలో కంపెనీ షేరు సుమారు 20 శాతం క్షీణించి రూ. 46.90 వద్ద క్లోజయ్యింది. నీరవ్ మోదీ మేనమామ మెహుల్ చోక్సీ.. గీతాంజలి జెమ్స్ ప్రమోటరుగా ఉన్నారు. కంగనా రనౌత్, సన్నీ లియోన్ వంటి బాలీవుడ్ స్టార్స్ దీనికి బ్రాండ్ అంబాసిడర్స్‌గా ఉన్నారు. రూ. 11,400 కోట్ల పీఎన్‌బీ కుంభకోణంలో గీతాంజలి జెమ్స్, జిన్ని, నక్షత్ర సంస్థల పాత్ర కూడా ఉందని ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే.



చోక్సీ, గీతాంజలి మార్కెట్ లావాదేవీలపై సెబీ కన్ను..

స్కాం దరిమిలా మెహుల్ చోక్సీ, గీతాంజలి జెమ్స్ సహా.. నీరవ్ మోదీతో సంబంధమున్న సంస్థలు, వ్యక్తుల స్టాక్ మార్కెట్ లావాదేవీలన్నింటిపైనా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ దృష్టి సారించింది. స్టాక్ ఎక్స్ఛేంజీలు, నియంత్రణ సంస్థలకు సక్రమంగా వెల్లడించకపోవడంతో పాటు ఈ వారం జరగాల్సిన బోర్డు మీటింగ్‌ను సరైన కారణాలేవీ చూపకుండా వాయిదా వేయడం తదితర అంశాలకు సంబంధించి చోక్సీ, ఆయనకు చెందిన గీతాంజలి జెమ్స్ వ్యవహారంపై సెబీ విచారణ జరుపుతోంది.

ఆగని బ్యాంకుల దోపిడీ

టెక్నాలజీ ఆధునికతను సంతరించుకుంటున్నా దేశ బ్యాంకింగ్ రంగంలో మాత్రం భారీ మోసాలు జరిగిపోతూనే ఉన్నాయి. వీటికి పగ్గాలు వేసి, ఇకపై అవి జరగకుండా నిరోధించే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే బ్యాంకు ఉద్యోగులు సైతం మోసపూరిత శక్తులతో చేతులు కలుపుతుండటం ఈ రంగానికి పెద్ద సమస్యగా మారిపోయింది. 2012 – 2016 మధ్య మోసాల కారణంగా ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.22,743 కోట్లు నష్టపోయినట్టు ఐఐఎం, బెంగళూరు అధ్యయనం చెబుతోంది. కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఇటీవలే పార్లమెంట్‌కు వెల్లడించిన గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2017 ఏప్రిల్ నుంచి డిసెంబర్ 21 నాటికి రూ.179 కోట్ల విలువైన 25,600 బ్యాంకింగ్ మోసాల కేసులు నమోదయ్యాయి.


బడా స్కామ్‌లు...



- 2011లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంకు, ఓరియెంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్, ఐడీబీఐ బ్యాంకుల్లో ఉద్యోగులు 10,000 ఖాతాలను కల్పితంగా సృష్టించారు. 150 కోట్ల విలువైన రుణాలను ఆయా ఖాతాల్లోకి బదిలీ చేసుకున్న విషయం వెలుగు చూసింది. సీబీఐ ఈ మోసాన్ని వెలుగులోకి తీసింది.
- 2014లో ముంబై పోలీసులు కొందరు ప్రభుత్వరంగ బ్యాంకుల ఉద్యోగులపై తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. రూ.700 కోట్ల మేర ఫిక్స్‌డ్ డిపాజిట్ల మోసానికి పాల్పడినట్టు అభియోగం.
- 2014లోనే ఎలక్ట్రోకెమ్ ఇండియా సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియాను రూ.436 కోట్ల మేర మోసం చేయగా, కోల్‌కతాకు చెందిన వ్యాపారి బిపిన్ వోహ్రా ఫోర్జింగ్ పత్రాలను ఇవ్వడం ద్వారా రూ.140 కోట్ల మేర రుణాలు తీసుకుని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు టోకరా వేశారు.
- ఇదే ఏడాది లంచాలు తీసుకుని రూ.8,000 కోట్ల మేర రుణాలను ఇచ్చిన స్కామ్‌లో సిండికేట్ బ్యాంకు నాటి చైర్మన్, ఎండీ పాత్ర వెలుగులోకి వచ్చింది.
- 2015లో జైన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ కంపెనీ ఉద్యోగులు రూ.212 కోట్ల విలువ మేర సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మోసానికి పాల్పడ్డారు.
- ఇదే ఏడాది పలు బ్యాంకుల ఉద్యోగులు రూ.6,000 కోట్ల మేర ఫారిన్ ఎక్స్ఛేంజ్‌ను మోసగించారు.
- 2016లో 386 మంది నకిలీ చెక్కులు, లెటర్ ఆఫ్ క్రెడిట్, ఎల్ఐసీ పాలసీలతో సిండికేట్ బ్యాంకును రూ.1,000 కోట్ల మేర ముంచారు.
- 2017లో యునైటెడ్ బ్రేవరీస్ చైర్మన్ విజయ్ మాల్యా, మరో పది మంది ఐడీబీఐ బ్యాంకుకు రూ.950 కోట్ల విలువైన రుణాలను చెల్లించనందుకు సీబీఐ చార్జ్‌షీటు సిద్ధం చేసింది.
- అలాగే, రూ. 1,161 కోట్ల ఉద్దేశపూర్వక నష్టానికి కారణమైనందుకు ఐదు ప్రభుత్వరంగ బ్యాంకులకు వ్యతిరేకంగా సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. డెక్కన్ క్రానికల్ హోల్డింగ్స్‌కు వ్యతిరేకంగా చార్జ్‌షీటు దాఖలు చేసింది.
- కోల్‌కతాకు చెందిన వ్యాపారవేత్త నీలేష్ పరేఖ్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. 20 బ్యాంకులకు నీలేష్ రూ.2,223 కోట్ల మేర నష్టం కలిగించారు.
- రెండు ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.290 కోట్ల మేర మోసం చేసిన కేసులో అభిజీత్ గ్రూపు ప్రమోటర్లు, కెనరా బ్యాంకు మాజీ డీజీఎంను సీబీఐ 2017లో అరెస్ట్ చేసింది.
- రూ.836 కోట్ల మోసం కేసులో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మాజీ జోనల్ హెడ్‌తోపాటు సూరత్‌కు చెందిన ప్రైవేటు లాజిస్టిక్స్ కంపెనీ డైరెక్టర్‌పై సీబీఐ కేసులు నమోదు చేసింది.
- 2018లో రూ.500 కోట్ల మోసం కేసులో ఆంధ్రాబ్యాంక్ మాజీ డైరెక్టర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేసింది. ఇందులో గుజరాత్‌కు చెందిన ఓ ఫార్మాస్యూటికల్ కంపెనీ పాత్ర కూడా ఉంది.

మాల్యాను మించిన నీరవ్ మోదీ

- గత ఆర్థిక సంవత్సరంలో రూ.14,706 కోట్ల టర్నోవర్
- రూ.582 కోట్ల లాభం
- పది దేశాల్లో కార్యకలాపాలు
- పాలిష్ పట్టిన వజ్రాలు, ఆభరణాల వ్యాపారం



బ్యాంకులకు దాదాపు రూ.10,000 కోట్లు టోకరావేసి బ్రిటన్ పారిపోయిన లిక్కర్‌కింగ్ విజయ్ మాల్యాను నీరవ్ మోదీ మించిపోయారు. వజ్రాభరణాల వ్యాపారిగా, గొప్ప డిజైనర్‌గా పేరు సంపాదించుకుని, పెద్ద వజ్రాభరణాల వ్యాపార సౌధం నిర్మించుకున్న నీరవ్ మోదీ తన సంస్థల ద్వారా బ్యాంకులను రూ.11,400కోట్ల మేర మోసగించారు. మాల్యా మాదిరే మోదీ కూడా భారత్‌ను వీడిపోయిన(గత నెలలో) తర్వాతే ఈ స్కామ్ బయటకు రావడం యాదృచ్ఛికం. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400 కోట్ల విలువైన మోసపూరిత లావాదేవీల్లో కీలక పాత్రధారి, వజ్రాల వ్యాపారి, డిజైనర్ నీరవ్ మోదీ పేరు ఇప్పుడు దేశవ్యాప్తంగా మార్మోగిపోతోంది. ఆభరణాల డిజైనర్‌గా మోదీ సంపన్నులకు, ప్రముఖులకు తెలిసిన వ్యక్తే. తాజా స్కామ్‌తో దేశ ప్రజలకు ఆయన పేరు తెలిసిపోయింది. మోదీ వ్యాపార సామ్రాజ్యాన్ని ఒక్కసారి పరిశీలించి చూస్తే... రిటైల్ దుకాణాల నెట్‌వర్క్‌తో పాటు 10 దేశాల్లో 26 సబ్సిడరీలు (అనుబంధ కంపెనీలు) ఆయన నిర్వహణలో ఉన్నాయి. సంపన్నుల కోసం ఆభరణాల డిజైనింగ్, తయారీ సేవలు అందిస్తుంటారు. ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ పబ్లిక్ లిమిటెడ్‌కు మోదీ ప్రమోటర్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా ఉన్నారు. ఇది ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ పబ్లిక్ లిమిటెడ్‌కు పేరెంట్ కంపెనీ. వ్యాపార విస్తరణ నిధుల సమీకరణ కోసం గత ఏడాది డిసెంబర్‌లో దీన్ని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చారు.

మూడు రకాల వ్యాపారాలు

మోదీ గ్రూపు సమగ్ర వజ్రాల తయారీలో ఉంది. ముడి వజ్రాలను కొనుగోలు చేసి పాలిష్డ్ స్టోన్స్‌గా, ఆభరణాలుగా తీర్చిదిద్ది విక్రయిస్తుంది. మూడు విభాగాల్లో మోదీ వ్యాపారం విస్తరించి ఉంది.

వజ్రాలు: ముడి, పాలిష్డ్ వజ్రాలు

ప్రైవేటు లేబుల్ ఆభరణాల తయారీ, పంపిణీ: మూడో పక్షానికి అన్‌బ్రాండెడ్ ఆభరణాలను తయారు చేసి ఇస్తుంది. కోరిన బ్రాండ్ లేబుల్‌తో అందిస్తుంది.

బ్రాండెడ్ ఆభరణాలు, రిటైల్: ఆభరణాలను తయారు చేసి నీరవ్ మోదీ బ్రాండ్ పేరుతో రిటైల్ దుకాణాల్లో విక్రయిస్తుంది.


టర్నోవర్: ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ 2016–17 ఆర్థిక సంవత్సరంలో రూ.14,706 కోట్ల వ్యాపారం చేసింది. ఇందులో నిర్వహణ ఆదాయం రూ.903 కోట్లు. పన్ను అనంతరం లాభం రూ.582 కోట్లు.

కంపెనీ విలువ: ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ గతేడాది విదేశీ మార్కెట్ల నుంచి నిధులు సమీకరించింది. ఒక్కో షేరును రూ.510.22కు కేటాయించింది. దీని ప్రకారం కంపెనీ మార్కెట్ విలువ రూ.6,908 కోట్లు. కంపెనీలో మోదీకి 90.17 శాతం వాటా ఉండగా, ప్రైవేటు కార్పొరేట్ బాడీల వద్ద 9.83 శాతం ఉంది.

బాధ్యత ఎవరిది?

పీఎన్‌బీ ఉద్యోగులు నీరవ్ మోదీ కంపెనీలకు అక్రమంగా లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ (ఎల్‌వోయూ)లు జారీ చేయడం, వీటిని ఆధారం చేసుకుని విదేశాల్లోని బ్యాంకు శాఖలు బయ్యర్స్ క్రెడిట్ (కొనుగోలు రుణాలు) ఇవ్వడం చేశాయి. వీటి విలువ సుమారు రూ.11,400 కోట్లు (1.77 బిలియన్ డాలర్లు) అని పీఎన్‌బీఐ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. అయితే, ఈ కేసులో ఇప్పుడు ఏంటి పరిష్కారం అన్న సందేహాలు రావచ్చు. మోదీ సంస్థలు పీఎన్‌బీకి బకాయి పడినంత చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. దీంతో పీఎన్‌బీ బయ్యర్స్ క్రెడిట్ ఇచ్చిన బ్యాంకులకు తిరిగి చెల్లింపులు చేస్తుంది. తనకు ఆరు నెలల సమయం ఇస్తే రూ.6,000 కోట్లు చెల్లిస్తానంటూ మోదీ ఇప్పటికే పీఎన్‌బీకి తెలిపినట్టు వార్తలు వెలువడ్డాయి. అయితే, మోదీ చెల్లించకపోతే?ఈ బాధ్యత ఎవరిది పీఎన్‌బీదా లేక ఎల్‌వోయూ ఆధారంగా రుణాలిచ్చిన బ్యాంకులదా...? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలి.

ఎల్‌వోయూ: ఎల్‌వోయూ అన్నది ఓ దేశీయ బ్యాంకు తన ఖాతాదారుని తరఫున అంతర్జాతీయ లావాదేవీ నిర్వహించేందుకు ఇచ్చే అంగీకార పత్రం. దీన్ని సాధారణంగా వాణిజ్య రుణ పత్రంగా ఉపయోగిస్తుంటారు. రుణం తీసుకోవాలనుకున్న వ్యక్తి స్థానిక బ్యాంకును సంప్రదించి విదేశీ బ్యాంకు లేదా భారత బ్యాంకుకు చెందిన విదేశీ శాఖ పేరిట ఎల్‌వోయూ జారీ చేయాలని కోరొచ్చు. ఆ ఎల్‌వోయూ ఆధారంగా విదేశాల్లోని బ్యాంకు శాఖ బయ్యర్స్ క్రెడిట్ (వాణిజ్య రుణం/కొనుగోలుకు రుణం)ను విడుదల చేస్తుంది. అప్పుడు ఆ మొత్తం స్థానిక బ్యాంకు నోస్ట్రో ఖాతాలో జమ అవుతుంది. నోస్ట్రో అకౌంట్ అన్నది ఫారిన్ కరెన్సీ బ్యాంకు అకౌంట్. అప్పుడు రుణ గ్రహీత ఈ మొత్తాన్ని తన అవసరాలకు వినియోగించుకోవచ్చు. సాధారణంగా ఆభరణాల కంపెనీలకు ఎల్‌వోయూపై ముడి వజ్రాల కొనుగోలు కోసం బ్యాంకులు స్వల్పకాలిక రుణాలు ఇస్తుంటాయి. ముడి వజ్రాన్ని సానబెట్టి దాన్ని తుది ఉత్పత్తిగా మార్చి ఎగుమతి చేసిన తర్వాత వచ్చే నిధులతో అంతర్జాతీయ బ్యాంకు శాఖకు చెల్లింపులు చేస్తాయి ఆభరణాల కంపెనీలు. ఒకవేళ రుణ గ్రహీత విదేశీ బ్యాంకు నుంచి తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైతే... ఆ మొత్తాన్ని చెల్లించాల్సిన బాధ్యత అతనికి ఎల్‌వోయూ జారీ చేసిన బ్యాంకుపైనే ఉంటుంది. చాలా కేసుల్లో ఖాతాదారులు 100 శాతం క్యాష్ మార్జిన్‌ను ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలో ఉంచితేనే బ్యాంకులు ఆ విలువకు సరిపడా ఎల్‌వోయూలను జారీ చేస్తుంటాయి. ఒకవేళ ఖాతాదారుడు చేతులెత్తేస్తే క్యాష్ మార్జిన్‌తో విదేశీ శాఖకు చెల్లింపులు చేస్తుంది.



పీఎన్‌బీపైనే బాధ్యత...: బ్యాంకర్ల అభిప్రాయం ప్రకారం '' సందిగ్ధత ఏమీ లేదు. వాస్తవ అంశాల ప్రకారం చూస్తే తుది బాధ్యత పీఎన్‌బీపైనే ఉంటుంది. పీఎన్‌బీ గ్యారంటీ ఆధారంగానే రుణం జారీ చేయడం జరిగింది. అంతేకాదు పీఎన్‌బీకి చెందిన నోస్ట్రో ఖాతా నుంచే ఆ రుణాన్ని పంపిణీ చేయడం కూడా జరిగింది'' అని పేర్కొన్నారు. పీఎన్‌బీ వాదన ఏమిటంటే విదేశీ బ్యాంకు శాఖలు ఆర్‌బీఐ మార్గదర్శకాలను సరిగా పట్టించుకోలేదని, నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణాన్ని తిరిగి 90 రోజుల్లోనే వసూలు చేసుకోవాల్సి ఉంటుందని పీఎన్‌బీ వాదన. మరి 2011 నుంచి ఎల్‌వోయూల ఆధారంగా రుణాల జారీ వ్యవహారం నడుస్తున్నట్టు పీఎన్‌బీ వెల్లడించిన నేపథ్యంలో ఇంత కాలం పాటు బయ్యర్స్ క్రెడిట్ ఇచ్చిన విదేశీ బ్యాంకు శాఖలు ఏం చేస్తున్నాయన్న సందేహం కూడా రాకమానదు.

గణాంకాలకు మారనున్న బేస్ ఇయర్!

- జీడీపీ, ఐఐపీ, రిటైల్ ద్రవ్యోల్బణం బేస్ ఇయర్‌గా ఇక 2017–18
- ప్రస్తుతం 2011–12



న్యూఢిల్లీ: స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ), పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ), రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలకు ప్రభుత్వం బేస్ ఇయర్‌ను మార్చనుంది. జీడీపీ, ఐఐపీ గణాంకాలకు బేస్ ఇయర్ 2017–18గా మార్చుతున్నట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ మంత్రి డీవీ సదానంద గౌడ ఇక్కడ జరిగిన ఒక సదస్సులో వెల్లడించారు. రిటైల్ ద్రవ్యోల్బణానికి బేస్ ఇయర్‌ను 2018గా మార్చుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ మూడు కీలక ఆర్థిక గణాంకాలకూ 2011–12 బేస్ ఇయర్‌గా ఉంది. ఆర్థిక వ్యవస్థ గణాంకాల్లో పారదర్శకత, స్పష్టత లక్ష్యంగా కేంద్రం బేస్ ఇయర్ మార్పు నిర్ణయం తీసుకుంటోందన్నారు. గణాంకాల వ్యవస్థ పటిష్టతకు మరిన్ని చర్యలు తీసుకుంటుందని కూడా పేర్కొన్నారు. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో గణాంకాల్లో స్పష్టత ఆవశ్యకత ఎంతో ఉంటుందని అన్నారు. 2018–19లో గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖకు కేంద్రం రూ.4,859 కోట్లను కేటాయించింది.

జనవరిలో టోకు ధరల ఉపశమనం!

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2018 జనవరిలో 2.84 శాతంగా నమోదయ్యింది. అంటే 2017 జనవరితో పోల్చితే 2018 జనవరిలో టోకు ధరలు 2.84 శాతం పెరిగాయన్నమాట. గడచిన ఆరు నెలల కాలంలో ఇంత తక్కువ స్థాయిలో ద్రవ్యోల్బణం నమోదు కావడం ఇదే తొలిసారి. అయితే కూరగాయల ధరలు మాత్రం టోకున సామాన్యునికి భారంగానే ఉన్నాయి. కాగా 2017 డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం 3.58 శాతం అయితే, జనవరిలో ఈ రేటు 4.26 శాతంగా ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం...

మూడు ప్రధాన విభాగాలూ వేర్వేరుగా...

- **ప్రైమరీ ఆర్టికల్స్:** ఫుడ్ ఆర్టికల్స్, నాన్–ఫుడ్ ఆర్టికల్స్‌తో కూడిన ఈ విభాగంలో ద్రవ్యోల్బణం వార్షిక ప్రాతిపదికన 2.37 శాతంగా ఉంది. ఇందులో ఫుడ్ ఆర్టికల్స్‌కు సంబంధించి ఈ రేటు 3 శాతంగా ఉంటే, నాన్–ఫుడ్ ఆర్టికల్స్‌లో మాత్రం ధరలు అసలు పెరక్కపోగా –1.23 శాతం తగ్గాయి.



- **ఫ్యూయెల్ అండ్ పవర్:** ద్రవ్యోల్బణం పెరుగుదల రేటు 4.08 శాతంగా ఉంది.
- **తయారీ:** మొత్తం సూచీలో దాదాపు 60 శాతం ఉన్న ఈ విభాగంలో రేటు 2.78 శాతంగా ఉంది.

ఉల్లి ధర... కన్నీరు!

డిసెంబర్ 2017లో 4.72 శాతంగా ఉన్న ఫుడ్ ఆర్టికల్స్ ద్రవ్యోల్బణం రేటు జనవరిలో 3 శాతానికి తగ్గింది. కూరగాయల ధరలు 56.46 శాతం (డిసెంబర్) నుంచి 40.77 శాతానికి తగ్గినా, ఇదీ సామాన్యునికి భారంగానే ఉంటుందన్నది గమనార్హం. ఇక ఉల్లి ధర జనవరిలో ఏకంగా 194 శాతం పెరిగింది. పప్పు దినుసుల ధరలు 30.43 శాతం తగ్గాయి. గోధుమల ధరలు 6.94 శాతం తగ్గగా, తృణ ధాన్యాల ధరలు 1.98 శాతం తగ్గాయి. ప్రొటీన్ ఆధారిత గుడ్లు, మాంసం, చేపల ధరలు 0.37 శాతం తగ్గితే, పండ్ల ధరలు 8 శాతం పైగా పెరిగాయి. ఈ వారం ప్రారంభంలో ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం– జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే.

ఎగుమతులు పెరిగినా... వాణిజ్యలోటు భారం!

- జనవరిలో ఎగుమతుల వృద్ధి 9%
- మూడేళ్ల గరిష్టానికి వాణిజ్యలోటు

న్యూఢిల్లీ: భారత్ ఎగుమతులు 2018 జనవరిలో (2017 జనవరితో పోల్చి) 9 శాతం పెరిగాయి. విలువ రూపంలో రూ.24.38 కోట్లుగా నమోదయ్యింది. ఇక ఇదే నెలలో దిగుమతులు 26.1 శాతం పెరిగాయి. విలువ రూపంలో 40.68 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. దీనితో ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్య లోటు 16.3 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గడచిన మూడేళ్లలో ఈ స్థాయిలో వాణిజ్యలోటు పెరుగుదల ఇదే తొలిసారి. గురువారం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల్లో ముఖ్యాంశాలు...

- క్రూడ్ ఆయిల్ మొత్తం దిగుమతుల వ్యయంలో భారాన్ని పెంచింది.
- రసాయనాలు (33%), ఇంజనీరింగ్ ఉత్పత్తులు (15.77%), పెట్రోలియం ప్రొడక్టుల (40%) ఎగుమతులు గణనీయంగా పెరిగాయి.



- అయితే రెడీమేడ్ దుస్తుల ఎగుమతుల్లో వృద్ధి లేకపోగా 8.38 శాతం క్షీణించాయి. విలువ రూపంలో 1.39 బిలియన్ డాలర్లు.
- పసిడి దిగుమతులు 22 శాతం తగ్గి 1.59 డాలర్లుగా నమోదయ్యాయి.
- చమురు దిగుమతులు 42.64 శాతం, చమురుయేతర దిగుమతులు 20.49 శాతం పెరిగాయి. విలువ రూపంలో వరుసగా 11.65 బిలియన్ డాలర్లు, 29 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

ఏప్రిల్ నుంచి జనవరి వరకూ...

2017 ఏప్రిల్ నుంచి 2018 జనవరి మధ్య కాలంలో ఎగుమతులు 11.75 శాతం ఎగశాయి. విలువ రూపంలో 247.80 బిలియన్ డాలర్లు. ఇక ఇదే కాలంలో దిగుమతులలు 22.21 శాతం పెరిగాయి. దిగుమతుల విలువ 379 బిలియన్ డాలర్లు. అంటే వాణిజ్యలోటు 131.15 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

డిసెంబర్‌లో 'సేవల' విభాగం...

కాగా 2017 డిసెంబర్‌లో సేవల ఎగుమతుల విలువ 16 బిలియన్ డాలర్లుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు వెల్లడించాయి. ఈ విభాగంలో దిగుమతుల విలువ 10 బిలియన్ డాలర్లుగా ఉంది. సేవల వాణిజ్య లోటు 6 బిలియన్ డాలర్లు.

2020కి భారత్ ఆన్‌లైన్ కొనుగోళ్లు @ 10,000 కోట్ల డాలర్లు

బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, గూగుల్ సంయుక్త నివేదిక

వినియోగదారులు ఆన్‌లైన్‌లో జరిపే కొనుగోళ్ల విలువ 2020 నాటికి 2.5 రెట్లు పెరిగి దాదాపు 10,000 కోట్ల డాలర్లకు చేరొచ్చని అంచనా. ఈ–కామర్స్, ట్రావెల్ అండ్ హోటల్, ఫైనాన్షియల్ సర్వీసెస్, డిజిటల్ మీడియా రంగాల్లోని వృద్ధి దీనికి దోహదపడుతుంది. ఈ విషయాలు బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, గూగుల్ సంయుక్త నివేదికలో వెల్లడయ్యాయి. నివేదికలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే..

- భారతీయులు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో జరిపే కొనుగోళ్ల విలువ దాదాపు 4,000 కోట్ల డాలర్లుగా ఉంది.
- ఈ–కామర్స్ విభాగంలో అప్పరెల్ అండ్ యాక్సెసరీస్, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, డ్యూరబుల్స్, ఫుడ్ అండ్ గ్రాసరీ వంటి ఉత్పత్తులపై కస్టమర్ల వ్యయాలు 2020 నాటికి ప్రస్తుతమున్న 18 బిలియన్ డాలర్ల నుంచి 40–45 బిలియన్ డాలర్లకు చేరొచ్చు. అలాగే ట్రావెల్ అండ్ హోటల్ వ్యయాలు 11 బిలియన్ డాలర్ల నుంచి 20 బిలియన్ డాలర్లకు, ఫైనాన్షియల్ సర్వీసెస్ వ్యయాలు 12 బిలియన్ డాలర్ల నుంచి 30 బిలియన్ డాలర్లకు, డిజిటల్ మీడియా వ్యయాలు 200 మిలియన్ డాలర్ల నుంచి 570 మిలియన్ డాలర్లకు పెరగొచ్చు.
- అందుబాటు ధరల్లోని స్మార్ట్‌ఫోన్స్, చౌక డేటా ప్లాన్స్, స్థానిక భాషలో ఎక్కువ కంటెంట్ అందుబాటులోకి రావడం వంటి పలు అంశాల కారణంగా ఆన్‌లైన్ యూజర్ల సంఖ్య గత నాలుగేళ్లలో దాదాపు 2 రెట్లు పెరిగి ప్రస్తుతం 43 కోట్లకు చేరింది.
- నాన్–టైర్ 1 పట్టణాల్లోని కొత్త యూజర్లు, మహిళలు సహా 35 ఏళ్లకుపైన వయసున్న షాపర్లు ఆన్‌లైన్ కొనుగోళ్ల వృద్ధికి బాగా దోహదపడనున్నారు.
- 2020 నాటికి మహిళా షాపర్ల సంఖ్య 2.5 రెట్లు పెరగనుంది.
- మౌలిక సదుపాయాల మెరుగుదల వల్ల మెట్రో నగరాలే కాకుండా పట్టణాల నుంచి కూడా ఆన్‌లైన్ షాపింగ్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరగనుంది.
- ఏదేమైనప్పటికీ అమెరికా, చైనాలతో పోలిస్తే భారత్‌లో డిజిటల్ లావాదేవీల సంఖ్య తక్కువగానే ఉంది.



- భారత్‌లో ఐదుగురు ఇంటర్నెట్ యూజర్లలో ఒకరు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసి ప్రొడక్టులను కొనుగోలు చేస్తున్నారు. ఆరుగురిలో ఒకరు ఆన్‌లైన్‌లో ట్రావెల్ బుకింగ్స్ చేసుకుంటున్నారు. దాదాపు 75–80 శాతం మంది ఇంటర్నెట్ యూజర్లు ఇప్పటికీ ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు చేయడం లేదు. ఆఫర్లు, డిస్కౌంట్లు వంటి వాటితో యూజర్లను కొనుగోలు మార్గంలోకి ఆకర్షించొచ్చు.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
-- --	-- --	-- --	-- --	రూ.3,600	3,800 (హెచ్‌ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--

అక్కడ పన్ను కోత.. ఇక్కడ మార్కెట్లకు వాత

- అమెరికాలో కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు
- ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు
- ద్రవ్యోల్బణ ఒత్తిడులు
- ఈ ఏడాది స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకులే..!
- 15వ ఆర్థిక సంఘం చైర్మన్ అంచనాలు

న్యూఢిల్లీ:

అమెరికా కార్పొరేట్ పన్ను కోత భారత స్టాక్ మార్కెట్‌పై బాగానే ప్రభావం చూపుతుందని 15వ ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్.కె. సింగ్ వ్యాఖ్యానించారు. ప్రతికూల ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. మన స్టాక్ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు 2,300 కోట్ల డాలర్లుగా ఉన్నాయని తెలిపారు. అమెరికాలో పన్ను కోతల ప్రభావంతో ఈ పెట్టుబడుల్లో స్వల్ప భాగం వెనక్కి వెళ్లిపోయినా, మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం ఉంటుందని వివరించారు. ఇప్పటికే ఆ ప్రభావాన్ని మనం చూస్తున్నామని తెలిపారు.

అనిశ్చితి అధికమే..!

ఈ ఏడాది స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులకు, అనిశ్చితి చోటు చేసుకోవచ్చని ఎన్.కె. సింగ్ అంచనా వేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ పరిణామాల వల్ల అనిశ్చితి చోటు చేసుకోవచ్చని వివరించారు. ఇక్కడ జరిగిన యస్ బ్యాంక్ యాన్యువల్ ఎకనామిక్ కాన్‌క్లేవ్‌లో ఆయన మాట్లాడారు. తొలి, అత్యంత కీలకమైన అంతర్జాతీయ అనిశ్చితి అమెరికా కార్పొరేట్ పన్ను కోతేనని వివరించారు. కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 శాతం నుంచి 21 శాతానికి అమెరికా తగ్గించిందని, ఫలితంగా అమెరికా కంపెనీల లాభదాయకత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ దృష్ట్యా అమెరికా కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడానికి ఎఫ్‌పీఐలు భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకుంటారని వివరించారు. ఇక రెండో విదేశీ ప్రభావం... అంతంతమాత్రంగానే ఉన్న ఎగుమతులని తెలిపారు. ఎగుమతులు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నా, ముడి చమురు ధరల్లో ఒడిదుడుకుల కారణంగా మన కరెంట్ అకౌంట్‌లోటుపై ప్రభావం బాగానే ఉంటుందని వివరించారు. కనీస మద్దతు ధర పెరగడం వల్ల ద్రవ్యోల్బణ ఒత్తిడులు కూడా అధికమవుతాయని పేర్కొన్నారు.

స్వతంత్రమైన ద్రవ్య మండలిని ఏర్పాటు చేయాల్సిన అవసరముందని తెలిపారు. ఇప్పటికే ఇలాంటి ద్రవ్య మండలి 44 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఈ అనిశ్చితిని తట్టుకునేలా చర్యలు తీసుకోగలదని ఆయన భరోసా ఇచ్చారు. ఆర్థికాంశాల్లో మన దేశం స్థిరత్వం సాధిస్తోందని చెప్పారు. గతంతో పోల్చితే ఇప్పుడు పరిస్థితులు బాగా మెరుగయ్యాయని, మనం ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఆశావహంగా ఉండొచ్చని ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమావేశంలో నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ కూడా మాట్లాడారు. మైనింగ్, పెట్రోలియమ్, నేచురల్ గ్యాస్, నిర్మాణ రంగాల్లో మరిన్ని సంస్కరణలు రావలసిన అవసరముందని అమితాబ్ కాంత్ చెప్పారు. ద్రవ్య, ఆర్థిక విధానాల కన్నా స్థూల మూలధన కల్పనపై దృష్టి పెట్టాల్సి ఉందని సూచించారు. స్థూల మూలధన కల్పన 36 శాతం నుంచి 26 శాతానికి పడిపోయిందని, దానిని మళ్లీ 36 శాతానికి పెంచాల్సి ఉందని వివరించారు.

గృహ రుణ రేటును తగ్గించిన ఇండియన్ బ్యాంక్!

ఇండియన్ బ్యాంక్ గృహ రుణ రేటును 8.25 శాతానికి తగ్గించింది. ఇది పరిశ్రమలో అతి తక్కువ గృహ రుణ వడ్డీరేటని బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎటువంటి పరిమితులూ లేకుండా, ఎంత మొత్తం గృహ రుణానికైనా తగ్గింపు రేటు వర్తిస్తుందని తెలిపింది. 30 సంవత్సరాల రుణ కాలానికి లక్షకు నెలకు రూ.751 చొప్పున ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుందని వివరించింది. పండుగల సీజన్‌ను పురస్కరించుకుని ప్రాసెసింగ్ ఫీజు, రీపేమెంట్ చార్జీలను సైతం మినహాయిస్తున్నట్లు జోనల్ మేనేజర్ ఆర్ మనోహర్ బ్యాంక్ ప్రకటనలో పేర్కొన్నారు. 24 గంటల్లో రుణ మంజూరీలకు కూడా బ్యాంక్ బ్రాంచీలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు.

ప్రైస్ వాటర్‌హౌస్ ఆడిటింగ్ మరో ఏడాది పొడిగింపు

ముంబై: ఆడిటింగ్ కార్యకలాపాలు నిర్వహించకుండా ప్రైస్ వాటర్‌హౌస్ సంస్థపై సెబీ విధించిన ఆదేశాలపై స్టే ఇవ్వడానికి సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ నిరాకరించింది. అయితే పీడబ్ల్యూ, ఈ కంపెనీ నెట్‌వర్క్ సంస్థలకు ప్రస్తుతమున్న క్లయింట్లకు ఆడిట్ సేవలను వచ్చే ఏడాది మార్చి వరకూ కొనసాగించవచ్చని వెసులుబాటునిచ్చింది. ఆడిట్ సేవలను ఈ ఏడాది మార్చి వరకే కొనసాగించాలన్న గత నెల 19 నాటి ఉత్తర్వులను శాట్ తాజాగా సవరించింది. ఆడిట్ సేవలందించే కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగించింది. సత్యం కుంభకోణం విషయమై ప్రైస్ వాటర్‌హౌస్‌పై సెబీ నిషేధం విధించిన సంగతి తెలిపింది.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- స్వల్ప కాలానికి ఈ షేర్లలోనే ర్యాలీ!
- రెండున్నర వారాల గరిష్టానికి పసిడి
- ఈ మూడు షేర్లు రేసుగుర్రాలు..
- పీఎన్‌బీ స్కామ్.. జువెలరీ షేర్ల పతనం
- ఈ కంపెనీల డివిడెండ్ ఆకర్షణీయం
- జెట్ ఎయిర్‌వేస్ నేలచూపులు

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..

WWW.SAKSHIBUSINESS.COM

SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

ఈవీల తయారీతో లబ్ధి పొందండి..

వాహన కంపెనీలకు గడ్కరీ పిలుపు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా భారత్‌లో అందుబాటు ధరల్లో నాణ్యమైన ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ)ను తయారు చేసి ప్రతిఫలం పొందండని వాహన కంపెనీలకు పిలుపునిచ్చారు. 'ఇక్కడ ఎలక్ట్రిక్ వెహికల్స్ తయారీని ప్రారంభించడానికి ఇది సరైన సమయం. ఎవరైతే వచ్చి ముందుగా ఉత్పత్తిని ప్రారంభిస్తారో వారు కచ్చితంగా విజేతలుగా నిలుస్తారు. ఎవరైతే వ్యయాలపై దృష్టి కేంద్రీకరిస్తారో వారు వెనుకనే నిలిచిపోతారు' అని పేర్కొన్నారు. ఆయన నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్‌తో కలిసి నీతి ఆయోగ్ కార్యాలయంలో రెండు ఎలక్ట్రిక్ వెహికల్స్ చార్జింగ్ స్టేషన్లను (ఫాస్ట్, స్లో) ప్రారంభించారు. గడ్కరీ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈవీ విభాగంలో అధిక పోటీ అవసరమని, అప్పుడే ధరలు దిగివస్తాయని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. 'మనం వార్షికంగా రూ.7 లక్షల కోట్ల విలువైన క్రూడ్ చమురును దిగుమతి చేసుకుంటున్నాం. ఇది ఆర్థిక వ్యవస్థకు ముప్పు. మరొకవైపు కాలుష్యాన్ని కూడా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాం. అందుకే ఎలక్ట్రిక్ మొబిలిటీకి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా వల్ల వాహన ధరలు కచ్చితంగా దిగివస్తాయి' అని వివరించారు. బయో ఫ్యూయెల్, ఇథనాల్, మిథనాల్, ఎలక్ట్రిక్ వెహికల్స్ వల్ల కాలుష్యం తగ్గుతుందన్నారు. ఎలక్ట్రిక్, బయో ఫ్యూయెల్ వెహికల్స్‌పై కేవలం 12 శాతం మాత్రమే జీఎస్‌టీ విధించామని పేర్కొన్నారు. వరి గడ్డి, గోధుమ గడ్డి, పురపాలక వ్యర్థాల నుంచి రెండో జనరేషన్ ఇథనాల్ తయారీ ప్రతిపాదన కేబినెట్ వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు.

ఫుజిట్సు జనరల్ నూతన ఏసీల శ్రేణి

రెండేళ్లలో 5 శాతం వాటా లక్ష్యం ● ఏపీలో 2–3 ఏళ్లలో ప్లాంటు!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీమియం ఎయిర్ కండీషనర్ల తయారీ కంపెనీ ఫుజిట్సు జనరల్ నూతన శ్రేణి మోడళ్లను గురువారమిక్కడ ప్రవేశపెట్టింది. మొత్తం 26 రకాల జనరల్‌బ్రాండ్ ఏసీ మోడళ్లను అందుబాటులోకి తెచ్చింది. ధరల శ్రేణి రూ.25,200 నుంచి మొదలై రూ.1,52,250 వరకు ఉంది. భారత్‌లో సూపర్ ప్రీమియం బ్రాండ్‌లో తమ కంపెనీ మాత్రమే పోటీపడుతోందని ఫుజిట్సు జనరల్ సంయుక్త భాగస్వామ్య కంపెనీ ఈజీపీఎల్ సీఈవో ఎం.ఇజాజుద్దీన్ ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. జనరల్ బ్రాండ్‌కు దేశీయంగా 4 శాతం వాటా ఉందన్నారు. '2017లో దేశవ్యాప్తంగా వివిధ కంపెనీల ఏసీలు 60 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. పరిశ్రమ 15–20 శాతం వార్షిక వృద్ధి నమోదు చేస్తోంది. రెండేళ్లలో జనరల్ వాటా 5%కి చేరుతుందన్న విశ్వాసం ఉంది' అని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్లాంటు..: ఫుజిట్సు జనరల్ భారత్‌లో ఏసీల తయారీ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఆంధ్రప్రదేశ్ లేదా తెలంగాణలో ఈ ప్లాంటు రానుంది. ప్రధాన విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉన్నందున నౌకాశ్రయం ఉన్న ఆంధ్రప్రదేశ్ వైపు కంపెనీ మొగ్గు చూపుతోంది. మొత్తంగా 2–3 ఏళ్లలో ఈ యూనిట్ సాకారం అవుతుంది. ప్లాంటు కోసం సుమారు రూ.1,260 కోట్లు వ్యయం చేస్తామని ఫుజిట్సు జనరల్ ప్రెసిడెంట్ ఎట్సురో సైటో వెల్లడించారు. భారత్‌తోపాటు ఇతర దేశాలకు ఇక్కడి నుంచి ఏసీలను ఎగుమతి చేస్తామని చెప్పారు. మాతృ సంస్థ అమ్మకాల్లో 10 శాతం వాటాతో భారత్ తొలి స్థానంలో ఉందన్నారు.



నూతన మోడళ్ల ఆవిష్కరణ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు

1.3 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయిన ఆస్టర్ ఐపీఓ

న్యూఢిల్లీ: ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్ ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) 1.33 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది. ఈ నెల 12న ప్రారంభమైన ఈ ఐపీఓ గురువారం ముగిసింది. రూ.180–190 ప్రైస్‌బాండ్‌తో వచ్చిన ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.980 కోట్లు సమీకరించనుంది. ఈ కంపెనీ షేర్ ఈ నెల 26న స్టాక్ మార్కెట్లో లిస్టయ్యే అవకాశాలున్నాయి.

ఎంఎస్ఆర్ లాభం రూ.కోటి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిసెంబర్ త్రైమాసికంలో ఎంఎస్ఆర్ ఇండియా నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 33 శాతం పెరిగి ఒక కోటి రూపాయలు నమోదు చేసింది. టర్నోవరు రూ.23 కోట్ల నుంచి రూ.50 కోట్లకు ఎగసింది. ఏప్రిల్–డిసెంబర్‌లో రూ.108 కోట్ల టర్నోవరుపై రూ.2.2 కోట్ల నికరలాభం ఆర్జించింది. డాక్టర్ కాపర్ ఉత్పాదన అమ్మకాల మూలంగానే ఈ స్థాయిలో వృద్ధి సాధ్యమైందని కంపెనీ తెలిపింది.

ల్యాంకో నష్టం రూ.426 కోట్లు..

డిసెంబర్ క్వార్టరులో ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ నష్టాలు క్రితంతో పోలిస్తే రూ.388 కోట్ల నుంచి రూ.426 కోట్లకు చేరాయి. టర్నోవరు రూ.238 కోట్ల నుంచి రూ.17.8 కోట్లకు పడిపోయింది.

ప్రపంచ మార్కెట్ల అండ

142 పాయింట్ల లాభంతో 34,297కు సెన్సెక్స్



ఒడిదుడుకులమయంగా సాగిన గురువారం నాటి ట్రేడింగ్‌లో స్టాక్ మార్కెట్ చివరకు లాభాల్లో ముగిసింది. అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా ఉండడం, ద్రవ్యోల్బణ గణాంకాలు ప్రోత్సాహకరంగా ఉండటం, ఇటీవల పతనం కారణంగా ఆకర్షణీయ ధరల్లో షేర్లు లభ్యం కావడంతో కొనుగోళ్లు జరగడం సానుకూల ప్రభావం చూపించాయి. అయితే పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కామ్ కారణంగా బ్యాంక్ షేర్ల నష్టాలు కొనసాగడంతో ఆరంభ లాభాలు తగ్గాయి. సెన్సెక్స్ 142 పాయింట్లు లాభపడి 34,297 పాయింట్ల వద్ద, నిఫ్టీ 45 పాయింట్ల లాభంతో 10,546 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 379 పాయింట్లు, నిఫ్టీ 117 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.

లాభాల్లో ప్రపంచ మార్కెట్లు

అమెరికాలో ద్రవ్యోల్బణం 2.1 శాతానికి ఎగసినా, వినియోగదారుల అమ్మకాల గణాంకాలు బలహీనంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ట్రేడయ్యాయి. మన దగ్గర జనవరి నెల టోకు ధరల ద్రవ్యోల్బణం ఆరు నెలల కనిష్ట స్థాయి, 2.84 శాతానికి దిగివచ్చింది. కొన్ని బ్లూ చిప్ కంపెనీల క్యూ3 ఫలితాలు అంచనాలను మించడంతో కొనుగోళ్లు జరిగాయి.

జ్యుయలరీ షేర్లు పతనం

పీఎన్‌బీ స్కామ్ నేపథ్యంలో కొన్ని పెద్ద జ్యుయలరీ కంపెనీలు–గీతాంజలి, జిన్ని, నక్షత్రలపై దృష్టి సారిస్తున్నామని సీబీఐ ఉన్నతాధికారొకరు బుధవారమే వెల్లడించారు. దీంతో గీతాంజలి జెమ్స్ షేర్ 20 శాతం పతనమై, ఏడాది కనిష్ట స్థాయి రూ.46.90కు పడిపోయింది. . దీంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.140 కోట్లు తగ్గి రూ.556 కోట్లకు పడిపోయింది. ఇతర జ్యుయలరీ షేర్లు–టీబీజడ్, రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్, పీసీ జ్యుయలర్, తంగమలై జ్యుయలరీ, తదితర షేర్లు 5 శాతం వరకూ నష్టపోయాయి.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,725	▲	365
బంగారం (99.5, 10గ్రా)	30,575	▲	365
వెండి (కిలో)	38,655	▲	470
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	29,250	▲	360
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,710	▲	380
బంగారం (22 క్యారెట్లు)	29,250	▲	360
వెండి (కిలో)	41,800	▲	500
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,450	▲	300
బంగారం (22 క్యారెట్లు)	29,000	▲	150
వెండి (కిలో)	40,000	▲	500
విశాఖపట్నం			
బంగారం(24 క్యారెట్లు)	31,909	▲	769
బంగారం (22 క్యారెట్లు)	29,250	▲	290
వెండి (కిలో)	41,000	▲	1,100
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,600	▲	300
బంగారం (22 క్యారెట్లు)	29,400	▲	500
వెండి(కిలో)	39,800	▲	600
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,630	▲	390
బంగారం (22 క్యారెట్లు)	29,250	▲	360
వెండి (కిలో)	39,800	▲	500

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	60.63 (రాత్రి 11.00కు)	$60.60 (బుధవారం ముగింపు)
బ్రెంట్	63.91 (రాత్రి 11.00కు)	$64.36 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 16-2-2018

విశాఖ	400–00
చిత్తూరు	408–00
వరంగల్	393–00
ముంబై	435–00
చెన్నై	415–00
విజయవాడ	395–00
గోదావరి	395–00
నమక్కల్	395–00
15-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	391–00
రిటైల్ (ఒక గుడ్డు)	4.50
బెంగళూరు	400–00
ఢిల్లీ	440–00
కోల్‌కతా	432–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు

[illegible]

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

[illegible]

A B C D / E F G H / I J K L / M N O P / R S T U / V W X Z

[illegible]

బీఎస్ఈలో ఎస్ఎమ్ఈ షేర్స్

[illegible]

ప్రాక్టికల్స్‌లో వైద్యవిద్యార్థుల కాపీయింగ్

కర్నూలులో 9 మంది విద్యార్థుల డిటెన్షన్

కర్నూలు(హాస్పిటల్)/లబ్బీపేట(విజయవాడ తూర్పు): కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రాక్టికల్ పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడుతున్న తొమ్మిది మంది వైద్యవిద్యార్థులపై డిటెన్షన్ వేటు పడింది. ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గురువారం జనరల్ మెడిసిన్ విభాగంలో ఫైనలియర్ విద్యార్థులు తొమ్మిది మంది కాపీయింగ్‌కు పాల్పడుతుండగా ఎగ్జామినర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వసంతరావు పట్టుకున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జీఎస్ రామప్రసాద్ విషయాన్ని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కాపీయింగ్‌కు పాల్పడిన తొమ్మిది మంది విద్యార్థులపై డిటెన్షన్ వేటు వేసినట్లు సమాచారం.

ఎగ్జామినర్స్ రాక ఆగిపోయిన ప్రాక్టికల్స్

విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్, సర్జరీ విభాగాల్లో నిర్వహించాల్సిన ప్రాక్టికల్ పరీక్షలు ఎగ్జామినర్స్ రాకపోవడంతో 2 రోజులుగా నిలిచిపోయాయి. సిద్ధార్థ వైద్య కళాశాల ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, గైనకాలజీలో ఎగ్జామినర్స్ హాజరై ప్రాక్టికల్స్ నిర్వహిస్తుండగా, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాలకు సంబంధించి ఎగ్జామినర్స్ గైర్హాజరు కావడంతో ప్రాక్టికల్స్ నిలిచిపోయాయి. ప్రాక్టికల్స్ కోసం అన్ని ఏర్పాట్లు చేసి ఎదురు చూస్తున్న సమయంలో ఎగ్జామినర్స్ రాకపోవడంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గొంతులో మందుబిళ్ల అడ్డుపడి బాలుడి మృతి

గుంటూరు జిల్లాలో ఘటన



బెల్లంకొండ(పెదకూరపాడు): జ్వరం తగ్గడానికి వేసిన మందుబిళ్ల గొంతులో అడ్డుపడటంతో ఊపిరాడక మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం కందిపాడు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తిరుమళ్ల పైడిరాజు, మారమ్మల కుమారుడు సారరాజు (3) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం డాక్టరు ఇచ్చిన మాత్రలను మింగించే క్రమంలో జ్వరం బిళ్ల సారరాజు నోట్లో వేసి, మంచినీరు పోసినా ఎంత సేపటికీ మాత్ర కిందకి జారకపోవడంతో ఊపిరాడలేదు. గుర్తించిన కుటుంబ సభ్యులు సారరాజును బెల్లంకొండలో ఓ ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. బాలుడిని పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్టు తెలిపాడు.

బెజవాడలో వైభవంగా రథోత్సవం



విజయవాడలో కనుల పండువగా స్వామివారి రథోత్సవం

అమరావతిలోనూ వేడుకగా ఉత్సవం
శ్రీకాళహస్తిలో వైభవంగా కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ)/ అమరావతి/శ్రీకాళహస్తి/శ్రీశైలం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం విజయవాడ, అమరావతిలో రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. విజయవాడ వన్‌టౌన్‌లోని కెనాల్‌రోడ్డులో కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. కనకదుర్గమ్మ ఆలయం నుంచి గంగాపార్వతీ సమేత దుర్గామల్లేశ్వరస్వామి వార్లను, భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం) నుంచి మల్లేశ్వరస్వామి, భద్రకాళీ సమేత వీరభద్ర స్వామిని, శ్రీ వసంత మల్లికార్జునస్వామి వార్ల ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేశారు. మేళతాళాలు, వేదమంత్రోచ్చారణల మధ్య రథోత్సవం అత్యద్భుతంగా సాగింది. మరోవైపు అమరావతి క్షేత్రంలోని శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దివ్యరథోత్సవాన్ని గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. అమరావతి, ధరణికోట గ్రామాలకు చెందిన చింకా, ఆలపాటి, కోనూరు వారి వంశస్థులు తమ గుర్రాలకు రంగులు వేసి ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు.



శ్రీకాళహస్తిలో స్వామి,అమ్మవార్ల ఊరేగింపు



అమరావతి వీధుల్లో జరిగిన రథోత్సవంలో అశేష భక్తజనం

శ్రీకాళహస్తిలో: శ్రీకాళహస్తిలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని అధికార నందిపై, అమ్మవారిని కామధేనువు వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వామి వారు గజవాహనంపై, అమ్మవారు సింహావాహనంపై పట్టణంలోని పెండ్లి మండపానికి చేరుకున్నారు. తర్వాత వివాహమహోత్సవాన్ని నిర్వహించారు. అదే సమయంలో పలువురు వధు, వరులు వివాహాలు చేసుకున్నారు. శుక్రవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సభాపతి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ 2.90 కోట్లు

శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి వార్ల ఉభయ దేవాలయాల్లో బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. రూ.2,90,74,904 వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో జరిగిన ఈ హుండీ లెక్కింపులో అధికారులు, సిబ్బంది, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

తేలకుండానే ముగిసింది

- జల వివాదాలపై తెలుగు రాష్ట్రాలతో కేంద్రం చర్చలు విఫలం
- కృష్ణా బోర్డు పరిధిని నిర్ణయించడంపై ఇరు రాష్ట్రాల మధ్య కుదర ఏకాభిప్రాయం
- అనుమతి లేకుండా ప్రాజెక్టులు కడుతున్నారని వాదోపవాదాలు

సాక్షి, అమరావతి: తెలుగు రాష్ట్రాల నీటి పంచాయితీ ఎటూ తేలకుండానే ముగిసింది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఉమ్మడి ప్రాజెక్టులను తమ పరిధిలోకి తేవాలన్న బోర్డు ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం సమర్థించగా తెలంగాణ సర్కార్ వ్యతిరేకించింది. పట్టిసీమ, పోలవరం ప్రాజెక్టుల ద్వారా తరలిస్తున్న నీటికి బదులుగా కృష్ణా జలాల్లో తమకు అదనంగా 90 టీఎంసీలు వాటా ఇవ్వాలన్న తెలంగాణ డిమాండ్‌ను ఏపీ తోసిపుచ్చింది. ఈ అంశాన్ని తేల్చే అధికారం గోదావరి ట్రిబ్యునల్‌కే ఉందని మరోసారి స్పష్టం చేసింది. దీంతో నీటి వాటాల లెక్కలు తేలేవరకూ కృష్ణా బోర్డు పరిధిని నిర్ణయించరాదని తెలంగాణ పట్టుబట్టింది. రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలను కేంద్రం అసంపూర్తిగా ముగించింది. కృష్ణా, గోదావరి బోర్డుల ఛైర్మన్‌లతో జల వివాదాలపై ఇప్పటికే చర్చించిన కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి యూపీ సింగ్ గురువారం ఢిల్లీలో ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ కార్యదర్శులు, ఈఎన్‌సీలు శశిభూషణ్ కుమార్, ఎస్కే జోషి, వెంకటేశ్వరరావు, మురళీధర్ తదితరులతో సమావేశమయ్యారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు బోర్డు పరిధిలో లేనందున నీటి విడుదల, వినియోగంపై లెక్కలు తేల్చలేకపోతున్నామని అధికారులు పేర్కొన్నారు. వివాదాలకు తెర దించాలంటే ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా బోర్డు పరిధిలోకి తేవాలని ప్రతిపాదించారు. దీనికి అభ్యంతరం తెలిపిన తెలంగాణ.. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేయకుండా బోర్డు పరిధిని ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించింది. ఉమ్మడి రాష్ట్రానికి ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల్లో పరీవాహకం, ఆయకట్టు ప్రాతిపదికన తమకు 575 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ కోరడంపై ఏపీ అభ్యంతరం తెలిపింది. చిన్న నీటి పారుదల విభాగంలో నీటిని వినియోగిస్తున్నందున తెలంగాణకు కేటాయించిన 299 టీఎంసీల్లో కోత వేయాలని ఏపీ సర్కార్ కోరింది. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మంజీర, దేవాదుల ద్వారా తెలంగాణ సర్కార్ గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తోందని, ఆ మేరకు కృష్ణా జలాల్లో తమకు అదనపు వాటా కేటాయించాలని ఏపీ కోరింది. కేంద్ర కార్యదర్శి యూపీ సింగ్ జోక్యం చేసుకుంటూ ఈ అంశాలపై నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చాక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

అనుమతి లేని ప్రాజెక్టులపై రచ్చ

బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి, డిండి, మిషన్ భగీరథ, తుమ్మిళ్ల, భక్త రామదాస ఎత్తిపోతల పథకాల వల్ల తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఏపీ సర్కారు కేంద్రానికి ఫిర్యాదు చేసింది. గోదావరి పరీవాహక ప్రాంతంలో ప్రాజెక్టుల రీ డిజైనింగ్ పేరుతో కాళేశ్వరం, తుపాకులగూడెం, సీతారామ ప్రాజెక్టులను తెలంగాణ చేపట్టిందని.. వాటి డీపీఆర్‌లు తెప్పించుకుని చర్యలు తీసుకోవాలని కోరింది. దీనిపై తెలంగాణ సర్కార్ అభ్యంతరం తెలిపింది. ఆ ప్రాజెక్టులన్నీ ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టినవేనని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు లేకుండా పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతలను కొత్తగా చేపట్టిందని, చింతలపూడి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచిందని తెలంగాణ ఫిర్యాదు చేసింది. కృష్ణా నదిపై గురు రాఘవేంద్ర, ముచ్చుమర్రి, పులికనుమ ప్రాజెక్టులను ఏపీ సర్కార్ చేపట్టిందని.. వాటిపై చర్యలు తీసుకోవాలని కోరింది. పోలవరంలో అంతర్భాగంగానే పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతలను చేపట్టామని, మిగతావన్నీ ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులేనని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ప్రభావిత ప్రాంతాలు, తలెత్తే సమస్యలపై అధ్యయనం జరపాలని తెలంగాణ కోరింది.

తక్షణమే టెలీమెట్రీ వ్యవస్థ..

ఆర్డీఎస్ ఆధునికీకరణకు ఏపీ సర్కార్ సహకరించకపోవటంతో తమ వాటా జలాలు అందడం లేదని, తుంగభద్ర బోర్డును కృష్ణా బోర్డు పరిధిలోకి తేవాలన్న తెలంగాణ ప్రతిపాదనను ఏపీ సర్కారు తోసిపుచ్చింది. తెలంగాణ చేపట్టిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం వల్ల కేసీ కెనాల్ ఆయకట్టుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. జల వివాదాలపై ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో కేంద్రం స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించలేదు. కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిపై ఎటూ తేల్చని కేంద్రం.. నదీ జలాల వినియోగం లెక్కలను తేల్చేందుకు టెలీమెట్రీ వ్యవస్థను అమలు చేయాలని ఆదేశించింది.

మళ్లీ తెరపైకి అపెక్స్ కౌన్సిల్!

తెలుగు రాష్ట్రాల మధ్య నాలుగేళ్లుగా నెలకొన్న జల వివాదాలకు తెర దించేందుకు మళ్లీ అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించేందుకు కేంద్రం సిద్ధమైంది. అపెక్స్ కౌన్సిల్ అజెండా రూపొందించాలని ఇప్పటికే ఇరు బోర్డులకు ఆదేశాలు జారీ చేసింది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల అనుకూలతను బట్టి ఈ నెలాఖరులోగానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించే అవకాశాలు అధికంగా ఉన్నట్లు కృష్ణా బోర్డు వర్గాలు వెల్లడించాయి. నదుల అనుసంధానంపై ఈ నెల 20న హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాలతో కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్ సమావేశం నిర్వహించనున్నారు. ఆ తర్వాత తెలుగు రాష్ట్రాల నీటిపారుదల శాఖల మంత్రులతో కేంద్ర మంత్రి మరోసారి సంప్రదింపులు నిర్వహించే అవకాశం ఉంది. అనంతరం అపెక్స్ కౌన్సిల్ భేటీ జరగనుంది.

చిన్న ఆవుకు చిట్టి దూడ



అతి చిన్న కాసర్‌గడ్ ఆవు, దూడ

కైకలూరు: రాష్ట్రంలో అతి చిన్న ఆవుకు 16.5 అంగుళాల దూడ జన్మించింది.గురువారం కృష్ణాజిల్లా కైకలూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన పశుపోషకుడు అల్లూరి శ్యాంప్రసాద్ ఇంటి వద్ద ఈ అరుదైన ఘటన చోటు చేసుకుంది. రెండేళ్ల క్రితం కేరళ నుంచి కాసర్‌గడ్ జాతికి చెందిన ఆవును రైతు శ్యాంప్రసాద్ కొనుగోలు చేశాడు. ఆ ఆవుకు రెండు దూడలు పుట్టి చనిపోయాయి. మూడో విడత పుట్టిన దూడ ఆరోగ్యంగా ఉన్నట్టు ప్రముఖ వెటర్నరి సర్జన్ ప్రతాప్ తెలపారు. గతేడాది గిన్నిస్‌బుక్ రికార్డు కోసం ఈ ఆవు ఎత్తును పంపామన్నారు. 29 అంగుళాలతో అతి చిన్న ఆవుగా రెండో స్థానంలో నిలిచిందన్నారు. కేరళకు చెందిన వేచూర్ ఆవు 28.5 అంగుళాలతో మొదటి స్థానం సాధించిందన్నారు.

మాకు పదవులు ముఖ్యం కాదు

ప్రత్యేక హోదానే ప్రధానం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే రోజా



మహిళా సదస్సుకు వెళ్లే బస్సులకు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే ఆర్‌కె రోజా

ఏఎస్‌పేట (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక హోదా సాధించడం తప్ప పదవులు ముఖ్యం కాదని ఆ పార్టీ నగరి ఎమ్మెల్యే, రాష్ట్ర మహిళా నాయకురాలు ఆర్‌కె రోజా అన్నారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో భాగంగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాపురం మండలం రేణమాలలో గురువారం మహిళా ఆత్మీయ సదస్సులో పాల్గొనేందుకు వెళ్తూ ఆమె ఏఎస్‌పేట మండలం హసనాపురం కూడలి వద్ద మహిళా సదస్సుకు బయల్దేరే బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రోజా మీడియాతో మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు తనపై ఉన్న కేసులను ఎదుర్కోలేక ఓటుకు కోట్లు కేసులో కేంద్రంతో రాజీ పడ్డారన్నారు. ఐదుమార్లు ఎన్నికల్లో ఓడిపోయిన మంత్రి సోమిరెడ్డి దొడ్డిదారిన ఎమ్మెల్సీ, మంత్రి అయ్యారని.. చంద్రబాబుకు భజన చేస్తూ వాస్తవాలను విమర్శిస్తున్నారని రోజా అన్నారు.

రిజర్వేషన్లు అమలుచేసి నిజాయితీ నిరూపించుకో

సీఎం చంద్రబాబుకు
కాపు ఉద్యమనేత ముద్రగడ లేఖ



కిర్లంపూడి (జగ్గంపేట): కాపులకు చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లు అమలు చేస్తానన్న హామీని తక్షణమే అమలు చేసి మీ నిజాయతీని నిరూపించుకోవాలని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం సీఎం చంద్రబాబుకు గురువారం లేఖ రాశారు. 'కాపు రిజర్వేషన్లపై గురువారం వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలు అనేక సందేహాలకు తావిస్తున్నాయి. కేంద్రం లేవనెత్తిన అభ్యంతరాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత మీదే, 1910 నుంచి ఇప్పటి వరకు అనేక పర్యాయాలు రిజర్వేషన్లు పొంది, తొలగింపునకు గురై ఎంతో నష్టపోయాము' అని లేఖలో పేర్కొన్నారు. రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయకుండా మమ్మల్ని మోసగించేస్తే తగు విధంగా స్పందిస్తామన్నారు.

కాపులకు తీరని ద్రోహం చేస్తున్న చంద్రబాబు

- భవిష్యత్తులో కూడా రిజర్వేషన్లు రాకుండా కుట్ర
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి ధ్వజం



కాకినాడ: చిత్తశుద్ధిలేని చంద్రబాబు సర్కార్ నిర్ణయాల వల్ల కాపులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన తూర్పు గోదావరి జిల్లా కాకినాడ రూరల్‌లోని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ మంజునాథ కమిషన్ నివేదిక రాకుండానే హడావుడిగా శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం వల్ల ప్రాథమిక స్థాయిలోనే ఈ అంశాన్ని కేంద్ర సిబ్బంది శిక్షణ వ్యవహారాల శాఖ (డీపీవోటీ) తప్పుబట్టే పరిస్థితి కల్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నివేదికలో పసలేదని డీపీవోటీ పేర్కొనడాన్ని చూస్తే ఈ అంశంపై టీడీపీ సర్కార్ విధానం బయటపడుతోందన్నారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇచ్చే అవకాశం లేదని, గతంలోనే న్యాయస్థానాలు స్పష్టం చేసిన నేపథ్యంలో షెడ్యూల్ 9లో చేర్చి రిజర్వేషన్లు కల్పిస్తామంటూ చంద్రబాబు సర్కార్ కాపులను మభ్యపెట్టే ప్రయత్నం చేసిందని విమర్శించారు. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ప్రధాన మంత్రిస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన 9వ షెడ్యూల్‌పై ఒక్కసారైనా మోదీతో చర్చించారా? అని అంబటి ప్రశ్నించారు. అనేకసార్లు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టిన చంద్రబాబు కాపులను బీసీల్లో చేర్చే అంశాన్ని కేంద్రంతోగానీ, పీఎంతో గానీ ఒక్కసారి కూడా ప్రస్తావించిన దాఖలాలు కానరాలేదన్నారు. శాసనసభలో తీర్మానం చేసి ఈ అంశాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో పడేసిన చందంగా వ్యవహరించారని ఆయన మండిపడ్డారు. చంద్రబాబుకు కాపులను మభ్యపెట్టి వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలన్న దురాలోచన మాత్రమే కనిపిస్తోందన్నారు.

బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు కట్టుబడి ఉన్నారా?

▶ మొదటి పేజీ తరువాయి

మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనం విచారించింది. తొలుత ఒడిశా తరపున సీనియర్ న్యాయవాది గోపాల సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. ''బచావత్ అవార్డులో భాగంగా కుదిరిన ఒప్పందం మేరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరగడం లేదు. 36 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహ సామర్థ్యానికి మించి ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారు. దీనివల్ల ముంపు ప్రాంతం పెరుగుతుంది. ఒడిశాలోని మల్కన్‌గిరి తదితర ప్రాంతాలు ముంపు బారిన పడతాయి. పోలవరం ప్రాజెక్టుకు ఎగువన ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం ద్వారా వరద ప్రవాహ ఒత్తిడిని తగ్గించవచ్చని అవార్డు పేర్కొంది. కానీ, వీటన్నింటి ఉల్లంఘన జరుగుతోంది. అవార్డులోని అన్ని ఒప్పందాలు అమలవ్వాలి'' అని పేర్కొన్నారు.

న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ స్పందిస్తూ... ''రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశ ప్రతిపాదన ఏమైంది'' అని ప్రశ్నించారు. ''ఇది ఇంకా సాధ్యపడలేదు'' అని కేంద్రప్రభుత్వం తరపున న్యాయవాది ఖాద్రీ తెలిపారు. గోపాల సుబ్రహ్మణ్యం స్పందిస్తూ.. ''మేం ఇప్పటికీ అడుగుతూనే ఉన్నాం. కేంద్రం ఈ విషయంలో స్పందించి సమావేశం ఏర్పాటు చేయాలి. మా అభ్యంతరం అంతా గిరిజనులు ముంపునకు గురవుతారన్నదే'' అని పేర్కొన్నారు. న్యాయమూర్తి స్పందిస్త... ''వివాదంతో సంబంధం ఉన్న ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమై పరిష్కరించుకునేందుకు వీలుంది కదా.. అసాధ్యమైతే కాదు కదా'' అని పేర్కొన్నారు. గోపాల సుబ్రహ్మణ్యం బదులిస్తూ.. ''అసాధ్యమేమీ కాదు. అవార్డులో ప్రస్తావించిన డిజైన్, విధివిధానాలు అమలవ్వాలన్నదే మా ప్రార్థన'' అని తెలిపారు.

పర్యావరణ అనుమతులపై అభ్యంతరాలు

అవార్డుకు అందరూ కట్టుబడి ఉన్నారా? అంటూ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ ప్రశ్నించగా అందరూ కట్టుబడి ఉన్నామని తెలిపారు. అయితే, దీనిపై రాతపూర్వకంగా మార్చి 31లోగా అఫిడవిట్ సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. పోలవరానికి జాతీయ ప్రాజెక్టు హోదాను కట్టబెట్టడంపై ఒడిశా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసింది. దీనిపై తమ వైఖరిని తెలిపేందుకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ కోరగా అందుకు ధర్మాసనం అంగీకరించింది. ఇక ప్రాజెక్టుకు తొలి దశ పర్యావరణ అనుమతులు నిబంధనలకు అనుగుణంగా లేవని, దీనిపై స్టే ఇవ్వాలని మరొక అభ్యర్థనను ఒడిశా ప్రభుత్వం దాఖలు చేయగా, ప్రధాన పిటిషన్‌తో కలిపి దీనిపై విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఏప్రిల్ 17వ తేదీకి వాయిదా వేసింది. విచారణకు తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కృష్ణమూర్తి స్వామి, అదనపు అడ్వొకేట్ జనరల్ రామచంద్రరావు, ఆంధ్రప్రదేశ్ తరపున సీనియర్ న్యాయవాది ఏకే గంగూలీ, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాసరావు హాజరయ్యారు.

'రాష్ట్రాభివృద్ధి నిధుల్లో 90% కేంద్రానివే'

కొవ్వూరు: రాష్ట్రాభివృద్ధికి వెచ్చిస్తున్న నిధుల్లో 90 శాతం కేంద్ర ప్రభుత్వమే అందిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం పదిశాతం నిధులు పెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపించారు. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో వెల్లడించాలని ఆయన కోరారు. దేశ సమగ్రతను కాపాడాల్సిన ఎంపీలు పార్లమెంటు వేదికగా దక్షిణ భారతదేశంగా విడిపోతామని ప్రకటించారని, ఇది తెలుగుదేశం పార్టీ అభిప్రాయమో, ఎంపీ మాగంటి మురళీమోహన్ అభిప్రాయమో వెల్లడించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ రాజీనామాలపై విమర్శలు విడ్డూరం: సీపీఐ

తిరుపతి కల్చరల్ : ప్రత్యేక హోదా కోసం వచ్చే ఏప్రిల్‌లో ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు రాజీనామా చేస్తారని ఆ పార్టీ ప్రకటిస్తే.. అది రాజకీయ నాటకమంటూ టీడీపీ నేతలు స్పందించడం విడ్డూరమని, అసలు టీడీపీ ఏం చేస్తుందో స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. తిరుపతిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.



ససెక్స్ తరఫున బరిలో ఇషాంత్

ఐపీఎల్‌లో అవకాశం లభించని భారత సీనియర్ పేస్ బౌలర్ ఇషాంత్ శర్మ అదే సమయంలో ఇంగ్లండ్ కౌంటీల్లో ఆడేందుకు సిద్ధమయ్యాడు. ససెక్స్ జట్టు తరఫున దాదాపు రెండు నెలల పాటు ఆడేందుకు ఒప్పందం చేసుకున్న ఇషాంత్ కనీసం ఐదు కౌంటీ మ్యాచ్‌లలో బరిలోకి దిగే అవకాశం ఉంది. 81 టెస్టు మ్యాచ్‌ల అపార అంతర్జాతీయ అనుభవం ఉన్న పేస్ బౌలర్ తమ జట్టుతో చేరనుండటంపై ససెక్స్ హెడ్ కోచ్ జాసన్ గిలెస్పీ సంతోషం వ్యక్తం చేశాడు. వచ్చే ఆగస్టులో భారత జట్టు ఇంగ్లండ్‌లో ఐదు టెస్టులు ఆడనున్న నేపథ్యంలో ఇషాంత్ తొలిసారి కౌంటీల్లో ఆడటం టీమిండియాకు ప్రయోజనం చేకూర్చవచ్చు. ఇప్పటికే పుజారా కూడా కొత్త సీజన్‌లో యార్క్‌షైర్ తరఫున ఆడటం ఖాయమైంది.



మరో గెలుపుపై గురి

నేడు మహిళల రెండో టి20

ఈస్ట్ లండన్: దక్షిణాఫ్రికాతో తొలి టి20లో రికార్డు ఛేదనతో అదరగొట్టిన భారత మహిళల జట్టు శుక్రవారం ఇక్కడ రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. మిథాలీ రాజ్, వేద కృష్ణమూర్తిలతో పాటు కొత్తమ్మాయి జెమీమా రోడ్రిగ్స్ కూడా రాణించడంతో మొదటి మ్యాచ్‌లో మన జట్టు ఏడు వికెట్లతో ప్రత్యర్థిని చిత్తుచేసింది. ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–0తో భారత్ ముందంజ వేస్తుంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, ఓపెనర్ స్మృతి మంధాన కూడా సత్తా చాటితే భారత్‌కు తిరుగుండదు. ఆఫ్ స్పిన్నర్ అనూజ పాటిల్ గత మ్యాచ్‌లో పొదుపైన బౌలింగ్‌తో రెండు వికెట్లు పడగొట్టింది. ఆతిథ్య దక్షిణాఫ్రికా ఎక్కువగా కెప్టెన్ నికెర్క్ పైనే ఆధారపడుతోంది. ఫీల్డింగ్, బౌలింగ్‌లో మెరుగైతే తప్ప భారత్‌ను ఓడించలేని పరిస్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో టీమిండియాకే ఈ మ్యాచ్‌లో విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

సమర్థులైన లెగ్‌స్పిన్నర్లు లేకపోవడమే...

న్యూఢిల్లీ: సొంతగడ్డపై వన్డేల్లో దక్షిణాఫ్రికా సిరీస్ పరాజయానికి ప్రధాన కారణం ఆ జట్టు లెగ్‌స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోలేకపోవడమే. చహల్, కుల్దీప్ కలిసి 30 వికెట్లతో సఫారీల పని పట్టారు. తమ ఆటగాళ్ల ఈ బలహీనత గురించి దిగ్గజ ఆటగాడు జాక్ కలిస్ విశ్లేషించాడు. తమ దేశంలో సమర్థులైన లెగ్‌స్పిన్నర్లు లేకపోవడమే అందుకు కారణమని తేల్చాడు. ‘మా దేశంలో మేటి లెగ్‌స్పిన్నర్లెవరు లేరు. పైగా దేశవాళీ టోర్నీల్లోనూ అలాంటి సత్తాగల స్పిన్నర్లను ఎదుర్కోలేదు. దీంతో అంతర్జాతీయ స్థాయిలో మణికట్టు స్పిన్నర్లు ఎదురైతే మా బ్యాట్స్‌మెన్ తేలిపోతున్నారు’ అని అన్నాడు. యువ ఆటగాళ్లు అనుభవంతోనే ఈ వైఫల్యాలను అధిగమిస్తారని చెప్పాడు.

ఆఖరి పంచ్ అదరాలి!

సెంచూరియన్

భారత్‌కు పాతికేళ్లుగా అందని ద్రాక్షలా ఉన్న సిరీస్ విజయం అయిదో వన్డేతో సాకారమైంది. పనిలో పనిగా రెండు జట్లలో ఐసీసీ వన్డే నంబర్ వన్ ర్యాంక్ ఎవరిదో తేలిపోయింది. అయినా... చివరి మ్యాచ్‌లోనూ గెలిచి ఆధిపత్యాన్ని మరింత బలంగా చాటాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు స్వదేశంలో ఎన్నడూ లేనంతటి పరాభవాన్ని ఎదుర్కొన్న దక్షిణాఫ్రికా పరువు దక్కించుకునేందుకైనా విజయం సాధించాలని ఆశిస్తోంది. తద్వారా గణాంకాల్లో ఓటమి అంతరాన్ని తగ్గించుకుని... మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌కు ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని కోరుకుంటోంది. అయితే... పరిస్థితులన్నీ ఆ జట్టుకు ప్రతికూలంగానే ఉన్నాయి. పైగా ఇదే వేదికపై రెండో వన్డేలో ఘోరంగా ఓడిపోయింది. ఈ సమీకరణాల రీత్యా చూస్తే ప్రత్యర్థిని నిలువరించాలంటే ఆ జట్టు అద్భుత ప్రదర్శన చేయాల్సిందే.

అయిదు లేదా అంతకంటే ఎక్కువ వన్డేల సిరీస్‌లో దక్షిణాఫ్రికాను వారి సొంతగడ్డపై ఓడించిన రెండో జట్టు భారత్ మాత్రమే.
...ఈ వన్డే సిరీస్‌లో టీమిండియా సాధించిన ఘనతకు ఇదో నిదర్శనం.
మూడు టెస్టులతో పాటు అయిదు వన్డేలు కలిపి ప్రొటీస్ తరఫున నమోదైనది ఒకే ఒక్క సెంచరీ. మన ఆటగాళ్లు చేసినవి అయిదు.
...రెండు జట్ల ప్రదర్శన మధ్య ఉన్న తేడాకు, భారత బ్యాట్స్‌మెన్ జోరుకు ఇదో సాక్ష్యం.
ఈ ద్వైపాక్షిక సిరీస్‌లో సఫారీల బ్యాటింగ్ సగటు 22.65. బౌలింగ్ సగటు 50.2. స్వదేశంలో వారికిదే దారుణ ప్రదర్శన.
...ప్రస్తుతం ప్రత్యర్థిపై భారత్ ఆధిపత్యం ఏ విధంగా ఉందో చెప్పేందుకు ఇదో ఉదాహరణ.
...ఈ నేపథ్యంలో ఇప్పటికే సిరీస్ చేజిక్కించుకున్న కోహ్లి సేన చివరిదైన ఆరో వన్డేకు సమరోత్సాహంతో ఉంది. అన్ని రంగాల్లో బలంగా ఉన్న మన జట్టు మరోసారి దక్షిణాఫ్రికా పని పట్టేందుకు సిద్ధమవుతోంది.

సెంచూరియన్‌లో నేడు చివరి వన్డే

- పట్టు కొనసాగిస్తామంటున్న కోహ్లి సేన
- పరువు నిలుపుకొనేందుకు ఆతిథ్య జట్టు పోరాటం



డివిలియర్స్

కోహ్లి

సా.గం. 4.30 నుంచి సోనీ-టెన్ 1, 3లలో ప్రత్యక్ష ప్రసారం

మార్పులతో భారత్!

రిజర్వ్ బెంచ్ బలాన్ని పరీక్షిస్తామని, అయినా పట్టు విడవకుండా ఆడి సిరీస్‌ను 5–1తో ముగించడమే లక్ష్యమని కెప్టెన్ విరాట్ కోహ్లి స్పష్టంగా ప్రకటించాడు. దీనిప్రకారం శుక్రవారం ఆరో వన్డేకు భారత్ మార్పులతో బరిలో దిగే అవకాశం ఉంది. లంక పర్యటన నుంచి మూడు ఫార్మాట్లలోనూ ఆడుతూ అలసిపోయిన పేసర్లు భువనేశ్వర్, బుమ్రాలకు విశ్రాంతినిచ్చి మహ్మద్ షమీ, శార్దూల్ ఠాకూర్‌లను తుది జట్టులోకి తీసుకోవచ్చు. షమీ మూడేళ్లుగా ఆడింది మూడు వన్డేలే. శార్దూల్‌ది రెండు వన్డేల అనుభవమే. ఇద్దరు ప్రధాన పేసర్లను ఒకేసారి తప్పించడం ఇబ్బందని భావిస్తే మాత్రం ఒక్కరినే మార్చే ఆలోచన చేయొచ్చు. కుల్దీప్ స్థానంలో అక్షర్ పటేల్‌ను ఎంచుకోవచ్చు. బ్యాటింగ్‌లో మిడిలార్డర్ నుంచి ఇప్పటివరకు ఒక్కటే అర్ధశతకం (తొలి వన్డేలో రహానే) నమోదైంది. శ్రేయస్ అయ్యర్ మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. టాపార్డర్‌లో ఎవరో ఒకరు 35 ఓవర్లపైగా క్రీజులో ఉంటుండటంతో 4–7 స్థానాల మధ్య ఎవరూ రాణించకున్నా ప్రభావం కనిపించలేదు. అయినప్పటికీ భవిష్యత్ అవసరాల దృష్ట్యా జట్టు యాజమాన్యం మిడిలార్డర్‌ను పరీక్షించే యోచనలో ఉంది. ఈ లెక్కల్లో మనీశ్‌పాండే, దినేశ్ కార్తీక్‌లలో ఎవరివైపు మొగ్గుచూపుతారు..? ఇద్దరినీ ఆడిస్తారా...? అన్నది చూడాలి. కోహ్లినే విశ్రాంతి తీసుకుంటాడని ఊహాగానాలు వస్తున్నా ఆచరణలోకి వస్తేగాని వాటిని విశ్వసించలేం.

సఫారీలకు అంతా సవాలే...

వచ్చే నెలలో ఆస్ట్రేలియా సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని టి20 సిరీస్‌కు సఫారీ జట్టు ప్రధాన బౌలింగ్ బలగాన్నంతటికీ విశ్రాంతినిచ్చింది. దీంతో మోర్కెల్, రబడ, ఇన్‌గిడి, తాహిర్‌లు ఈ వన్డేలోనైనా తమ ముద్ర చూపాల్సి ఉంది. ఫామ్‌లో ఉన్న భారత టాపార్డర్‌ను వీరు ఎంత తొందరగా పెవిలియన్‌కు పంపితే ఆ మేరకు జట్టు విజయావకాశాలు పెరుగుతాయి. ఓపెనర్లు కెప్టెన్ మార్క్‌రమ్, ఆపద్బాంధవుడు ఆమ్లా ఫర్వాలేకున్నా... డుమిని, డివిలియర్స్, మిల్లర్ గెలిపించే ఇన్నింగ్స్‌లు ఆడలేకపోతున్నారు. అయిదో వన్డేలో డుమిని, ఏబీ కీలక సమయంలో విఫలమయ్యారు. వీరిలో ఇద్దరైనా భారీ స్కోర్లు చేస్తే చివర్లో మిల్లర్, ఫెలూక్వాయో స్కోరు పెంచేందుకు వీలుంటుంది. సెంచూరియన్ పిచ్ స్పిన్నర్లకు సహకరిస్తుంది కాబట్టి షమ్సీతో పాటు తాహిర్‌నూ ఆడించవచ్చు. పేస్ ఆల్‌రౌండర్ మోరిస్‌ను తీసుకోదలిస్తే గత మ్యాచ్ తుది జట్టులోని ఒకరిని పక్కనపెడతారు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్‌శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి (కెప్టెన్), రహానే/మనీశ్‌పాండే, అయ్యర్/దినేశ్ కార్తీక్, ధోని, పాండ్యా, కుల్దీప్/అక్షర్, చహల్, షమీ, బుమ్రా/శార్దూల్.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), ఆమ్లా, డుమిని, డివిలియర్స్, మిల్లర్, క్లాసెన్, ఫెలూక్వాయో/మోరిస్, తాహిర్, షమ్సీ, రబడ, మోర్కెల్.

పిచ్, వాతావరణం

సెంచూరియన్ పిచ్ భారత్‌లోని పిచ్‌ల తరహాలో ఉంటుంది. రెండో వన్డేలో 8 వికెట్లు నేలకూల్చి చహల్, కుల్దీప్ ఆతిథ్య జట్టును 118 పరుగులకే పరిమితం చేసిందిక్కడే. శుక్రవారం వర్షం కురిసే అవకాశం ఉంది. మైదానంలో మంచి డ్రైనేజీ వ్యవస్థ ఉండటంతో మ్యాచ్‌కు ఎటువంటి ఇబ్బంది తలెత్తకపోవచ్చు.



భారత జట్టు కెప్టెన్లు మన్‌ప్రీత్ సింగ్, రాణి రాంపాల్‌లతో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

జాతీయ హాకీ జట్టు... అండగా రాష్ట్ర ప్రభుత్వం

భారత హాకీకి ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించనున్న ఒడిశా

న్యూఢిల్లీ: ప్రముఖ కంపెనీలు, వ్యాపార దిగ్గజ సంస్థలు క్రీడల జట్లకు స్పాన్సర్లుగా వ్యవహరించడం సర్వసాధారణం. కానీ ఓ రాష్ట్ర ప్రభుత్వం ఆ పనిచేస్తే అది గొప్ప విశేషం. ఆనవాయితీకి భిన్నంగా ఒడిశా సర్కారు జాతీయ క్రీడ హాకీకి అండగా నిలిచేందుకు ముందుకొచ్చింది. వచ్చే ఐదేళ్ల పాటు ఒడిశా ప్రభుత్వం భారత పురుషుల, మహిళల హాకీ జట్లకు స్పాన్సర్‌షిప్ అందించనుంది. భారత క్రీడల చరిత్రలో ఓ రాష్ట్ర ప్రభుత్వం స్పాన్సర్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి. గురువారం ఇక్కడ ఘనంగా నిర్వహించిన వేడుకలో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో పాటు భారత పురుషులు, మహిళా జట్ల సభ్యులు, అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్), ఐఓఏ అధ్యక్షుడు కూడా అయిన నరీందర్ బాత్రా, ఐఓఏ కార్యదర్శి రాజీవ్ మెహతా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సీఎం మాట్లాడుతూ ‘మా రాష్ట్రంలో హాకీ ఆట కాదు... ఆటకంటే ఎక్కువే. ఇది మా జీవితంలో భాగమైపోయింది. ఇక్కడి మారుమూల గిరిజన ప్రాంతాల్లో కూడా చిన్నారులు బంతి, కర్రల సాయంతో హాకీని ఆడతారు. దిలీప్ టిర్కీ, ఇగ్నేస్ టిర్కీ, లాజరస్ బార్లాలాంటి మేటి ఆటగాళ్లు ఒడిశా నుంచే వచ్చారు. ఇప్పుడు ఈ క్రీడ ఉన్నతి కోసం మేం పాటుపడతాం. హాకీ ఇండియా (హెచ్‌ఐ)తో కలిసి పనిచేస్తాం. ఇది భారత హాకీకి ఒడిశా ప్రభుత్వం ఇచ్చే కానుక’ అని అన్నారు. 2014 చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇచ్చిన భువనేశ్వర్‌లో ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16 వరకు ప్రపంచ కప్ టోర్నీ జరగనుండటం విశేషం.

శ్రీలంక మెరుపు విజయం

తొలి టి20లో బంగ్లాదేశ్ ఓటమి

మిర్పూర్: శ్రీలంక జట్టు విజయలక్ష్యం 194...అయితే అసాధారణంగా ఆడిన ఆ జట్టు కేవలం 16.4 ఓవర్లలోనే దీనిని అందుకొని సంచలన విజయం సాధించింది. గురువారం పరుగుల వరద పారిన తొలి టి20 మ్యాచ్‌లో లంక 6 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముష్ఫికర్ రహీమ్ (44 బంతుల్లో 66 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), సౌమ్య సర్కార్ (32 బంతుల్లో 51; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), మహ్ముదుల్లా (31 బంతుల్లో 43; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) చెలరేగి ఆడారు. అనంతరం శ్రీలంక 4 వికెట్లకు 194 పరుగులు చేసింది. ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ కుషాల్ మెండిస్ (27 బంతుల్లో 53; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడి అర్ధ సెంచరీ సాధించగా... షనక (24 బంతుల్లో 42 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సర్లు), తిసార పెరీరా (18 బంతుల్లో 39 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), గుణతిలక (15 బంతుల్లో 30; 6 ఫోర్లు) దూకుడైన బ్యాటింగ్‌తో జట్టును గెలిపించారు.



పెరీరా
షనక

చివరి వన్డే కూడా గెలుస్తాం!

సునీల్ గావస్కర్

దక్షిణాఫ్రికా పర్యటనకు బయల్దేరినప్పుడు ఈసారి భారత జట్టు మూడు ఫార్మాట్‌లలో సిరీస్ విజయాలతో తిరిగి వస్తుందని అందరూ భావించారు. కానీ అది సాధ్యపడలేదు. తొలి రెండు టెస్ట్‌ల్లో మంచి పోరాటం చేసినప్పటికీ నాలుగో ఇన్నింగ్స్ బ్యాటింగ్ వైఫల్యాలతో రెండు టెస్టులూ చేజారాయి. దీంతో సిరీస్ కోల్పోవాల్సి వచ్చింది. మూడో టెస్ట్‌లో కఠినమైన పిచ్‌పై మన బౌలర్లు పేస్, బౌన్స్ ఉపయోగించుకొని కచ్చితత్వంతో బంతులు వేసి ప్రత్యర్థి ఆటకట్టించారు.

ఈ ఏడాది ఇంగ్లండ్ పర్యటన రూపంలో భారత్‌కు మరో కఠిన సవాల్ ఎదురుకానుంది. కానీ... ఆ పర్యటన వన్డే సిరీస్‌తో ప్రారంభమవుతుంది. తొలి టెస్టు ఆడే సమయానికి కోహ్లి సేన ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టి దాదాపు నెల గడుస్తుంది. పరిస్థితులపై ఓ అవగాహన ఏర్పడటానికి ఆ సమయం చాలా ఉపయోగపడనుంది. చివరి టెస్టు విజయం భారత జట్టుపై చాలా ప్రభావం చూపింది. ఆ గెలుపు ఇచ్చిన ఉత్సాహంతో మనవాళ్లు వన్డేల్లో అదరగొడుతున్నారు. ప్రతీ మ్యాచ్‌లో టాప్ 3 బ్యాట్స్‌మెన్ 30 ఓవర్ల వరకు బ్యాటింగ్ చేస్తూ ఆకట్టుకుంటున్నారు. 118 పరుగులు మాత్రమే చేయాల్సిన రెండో వన్డేలో మినహా ఆ ముగ్గురూ సెంచరీలు సాధించారు.

ఈ విజయాల్లో లెగ్ స్పిన్నర్ల పాత్ర మరువలేనిది. చహల్, కుల్దీప్‌ల బౌలింగ్ సఫారీలకు కొరుకుడు పడటంలేదు. సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లాడినప్పటికీ వీరి స్పిన్‌పై ఓ అవగాహనకు రాలేకపోతున్నారు. కుల్దీప్ ఇప్పటికే టెస్టుల్లోనూ తానెంతటి ప్రమాదకారో నిరూపించుకున్నాడు. బుమ్రా పరిమిత ఓవర్ల నుంచి ఐదు రోజుల ఫార్మాట్‌కు మారినా తన ప్రభావం చూపించాడు. ఇక చహల్ వంతు. అతనూ టెస్టుల్లో రాణిస్తాడనటంలో సందేహం లేదు. మణికట్టు స్పిన్ బౌలర్లలో ఉన్న గొప్పతనం ఏమిటంటే వారికి పిచ్‌నుంచి సహకారంలాంటిది అవసరం లేదు. భారత జట్టు తాజా ప్రదర్శన నాకు అమితానందాన్ని కలిగిస్తోంది. చివరి వన్డేలోనూ టీమిండియా విజయం సాధిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఫైనల్లో విష్ణువర్ధన్ జోడీ

చెన్నై: హైదరాబాద్ ఆటగాడు విష్ణువర్ధన్ చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీ డబుల్స్‌లో తుది పోరుకు అర్హత సంపాదించాడు. శ్రీరామ్ బాలాజీతో జతకట్టిన విష్ణు సెమీస్‌లో 6-3, 7-5తో సాకేత్ మైనేని (భారత్)- లుకా మార్గరొలి (స్విట్జర్లాండ్) ద్వయంపై గెలుపొందాడు. ఫైనల్లో విష్ణు-శ్రీరామ్ జంట సెమ్ లకెల్(టర్కీ)-పెట్రోవిచ్ (సెర్బియా) జోడీతో తలపడుతుంది. సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ఆటగాడు యూకీ బాంబ్రీ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 111 ర్యాంకర్ యూకీ 5-7, 6-2, 6-4తో యసుటక ఉచియమ (జపాన్)పై నెగ్గాడు. సెమీస్‌లో అతను మూడో సీడ్ డకీ లీ (కొరియా)తో ఢీకొంటాడు.

శ్యామ్ కుమార్‌కు స్వర్ణం

- మరో నలుగురికి పసిడి పతకాలు
- ఆసియా క్రీడల టెస్టు ఈవెంట్ బాక్సింగ్

జకార్తా: తెలుగుతేజం కాకర శ్యామ్ కుమార్ మళ్లీ తన పంచ్ పవర్‌తో అదరగొట్టాడు. ఆసియా క్రీడల టెస్టు ఈవెంట్‌లో ఈ ఆంధ్ర ప్రదేశ్ బాక్సర్ బంగారు పతకం సాధించాడు. ఈ పోటీల్లో మరో నలుగురు భారత బాక్సర్లు కూడా పసిడి పతకాలు నెగ్గారు. మూడు సార్లు కింగ్స్ కప్‌లో విజేతగా నిలిచిన శ్యామ్ కుమార్ 49 కేజీల ఫైనల్లో 4–1తో మరియో బ్లాసియస్ కలి (ఇండోనేసియా)పై గెలుపొందాడు. ఇతనితో పాటు మనీశ్ కౌశిక్, షేక్ సల్మాన్ అన్వర్, ఆశిష్, మహిళల ఈవెంట్‌లో పవిత్ర బంగారు పతకాలు సాధించారు. 52 కేజీల ఫైనల్లో సల్మాన్ అన్వర్ 5–0తో ఫిలిప్పీన్స్‌కు చెందిన రోజెన్ లాడన్‌ను ఓడించగా, 64 కేజీల విభాగంలో ఆశిష్ 5–0తో సుగెర్ రే ఒకానా (ఇండోనేసియా)పై గెలుపొందాడు. 60 కేజీల ఈవెంట్‌లో మనీశ్ కౌశిక్ 5–0తో రెంటారో కిముర (జపాన్)పై నెగ్గాడు. మహిళల 60 కేజీల తుదిపోరులో పవిత్ర 5–0తో నిలవన్ టెచసుప్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించింది. మరో మహిళా బాక్సర్ శశి చోప్రా (57 కేజీలు) కాంస్యంతో సరిపెట్టుకుంది.



‘సుదామ ప్రీమియర్ లీగ్’కు గుర్తింపు లేదు

న్యూఢిల్లీ: ‘సుదామ ప్రీమియర్ లీగ్’ క్రికెట్ టోర్నీకి గుర్తింపు లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రసార్ పేరు గల ఎన్జీఓ నిర్వహిస్తున్న ఈ లీగ్... ఇటీవలే క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్, డీడీసీఏ సీనియర్ సెలక్షన్ కమిటీ అధ్యక్షుడు అతుల్ వాసన్‌ల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభమైంది. అయితే ఈ లీగ్‌లో పాల్గొనేందుకు తమ ఆటగాళ్లను అనుమతించరాదని అనుబంధ సంఘాలను బోర్డు హెచ్చరించింది. గతంలోనూ ఇండియన్ జూనియర్ ప్రీమియర్ లీగ్ (ఐజేపీఎల్), రజ్వాడా ప్రీమియర్ లీగ్‌లకు ఇలాగే గుర్తింపు లేదని బీసీసీఐ ప్రకటించింది. ‘సుదామ ప్రీమియర్ లీగ్‌కు ఎలాంటి అనుమతి లేదు. మీ పరిధిలోని క్రీడాకారులను ఈ లీగ్‌లో పాల్గొనకుండా చర్యలు తీసుకోండి’ అని బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి తన పరిధిలోని అన్ని అనుబంధ సంఘాలకు లేఖలు రాశారు.

బాగా ఆడినా తప్పించారు



జట్టులో స్థానం కోల్పోవడంపై రైనా

న్యూఢిల్లీ: బాగా ఆడినప్పటికీ జాతీయ జట్టులో చోటు కోల్పోవడం తనను బాధించిందని భారత క్రికెటర్ సురేశ్ రైనా గుర్తు చేసుకున్నాడు. యో–యో టెస్టులో అర్హత సాధించి ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో జరిగే టి20 సిరీస్‌కు ఎంపికవడంతో తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నాడు. జట్టుకు దూరమైన ఇన్నాళ్ల కాలంలో భారత్‌కు ఆడాలనే కోరిక మనసులో మరింత బలంగా నాటుకుందని వివరించాడు. ‘జట్టులో చోటు సాధించేందుకు చాలా కృషి చేశా. సాధ్యమైనంత కాలం భారత్‌కు ఆడుతూనే ఉంటా. నాలో ఇంకా చాలా ఆట మిగిలి ఉంది. 2019 వన్డే ప్రపంచకప్ కూడా ఆడాలని కోరుకుంటున్నా. ఇంగ్లండ్‌లో నాకు మంచి రికార్డు ఉంది. దక్షిణాఫ్రికాతో టి20ల్లో బాగా ఆడతాననే నమ్మకముంది’ అని రైనా ఆశాభావం వ్యక్తం చేశాడు. 31 ఏళ్ల సురేశ్ రైనా గత ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో భారత్ తరఫున ఆడాడు.

బేరానికి బెజవాడ రైల్వే స్టేషన్

సాక్షి, అమరావతి

బెజవాడ రైల్వే స్టేషన్ బేరానికి ప్రైవేటు కంపెనీలు 'టెండర్' పెట్టాయి. లీజు గడువు 45 ఏళ్లు కాదు.. 99 ఏళ్లకు పొడిగిస్తేనే టెండర్లలో పాల్గొంటామని దక్షిణ మధ్య రైల్వేకు తేల్చి చెప్పాయి. దీంతో ప్రైవేటు కంపెనీల డిమాండ్ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు రైల్వే బోర్డుకు తాజాగా నివేదిక పంపించారు. ఇది రైల్వేస్టేషన్లను ప్రైవేటుకు కట్టబెట్టడమేనని రైల్వే యూనియన్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ రైల్వే స్టేషన్‌కు పరిసరాలు, ఫ్లాట్ ఫాంలు అన్నీ కలిపి దాదాపు 22 ఎకరాలకు పైగా స్థలం ఉంది. రూ.195 కోట్లు విలువగా బెజవాడ స్టేషన్‌ను నిర్ధారించి, ఇందులో ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రైవేటు కంపెనీలకు 45 ఏళ్ల పాటు లీజుకు అప్పగించాలని గత ఏడాది ప్రతిపాదించింది. 99 ఏళ్ల పాటు లీజుకు అయితే టెండర్లలో పాల్గొంటామని కంపెనీలు స్పష్టం చేశాయి.

45 ఏళ్లపాటు లీజుకు టెండర్లు

రైల్వేల్లో ప్రైవేటు పెట్టుబడులు ఆహ్వానించేందుకు గాను



రైల్వే మంత్రిత్వ శాఖ గతేడాది ప్రారంభంలో స్టేషన్ రీ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌పీ) కార్యక్రమాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్లను ప్రైవేటుకు అప్పగించడం ద్వారా నాన్ టిక్కెట్ రెవెన్యూ కింద రూ.లక్ష కోట్లు ఆర్జించేందుకు ప్రణాళికలు రూపొందించారు. దేశం మొత్తంలో 23 స్టేషన్లు ఎంపిక చేసిన రైల్వే శాఖ.. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సికింద్రాబాద్, విజయవాడ రైల్వే స్టేషన్లు రీ డెవలప్‌మెంట్ కింద ప్రైవేటు కంపెనీలకు అప్పగించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్‌లో కమర్షియల్ స్థలంతో పాటు రైల్వేకు చెందిన ఖాళీ స్థలాలను 45 ఏళ్ల పాటు ప్రైవేటుకు లీజుకు అప్పగిస్తారు. వీటిలో ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించేలా ప్రైవేటు కంపెనీలు నిర్మాణాలు చేపట్టాలి. రైల్వే స్టేషన్‌లోనే మల్టీప్లెక్స్ థియేటర్లు, హోటళ్లు, పార్కింగ్ ప్రదేశాలు, అధునాతన స్కానర్లు తదితరాలతో పాటు రైల్వే స్టేషన్‌ను ఓ ఐకానిక్ భవంతిలా తీర్చిదిద్దాలి. గతేడాది స్విస్ ఛాలెంజ్‌లో విజయవాడ రైల్వే స్టేషన్‌ను ప్రైవేటు కంపెనీలకు అప్పగించేందుకు టెండర్లు పిలిచారు. ప్రైవేటు కంపెనీలకు అప్పగించినందుకు గాను రైల్వేకు 45 ఏళ్ల పాటు లీజు విధానంలో మొత్తం రూ.195 కోట్లు చెల్లించాలి. లీజు గడువు ముగిసిన తర్వాత అభివృద్ధి చేసిన స్టేషన్‌ను తిరిగి రైల్వేకు అప్పగించాలి.

99 ఏళ్ల లీజు కావాలంటున్న కంపెనీలు

విజయవాడ రైల్వే స్టేషన్‌ను రీ డెవలప్‌మెంట్ చేసేందుకు గాను గత ఏడాది స్విస్ ఛాలెంజ్ విధానంలో రైల్వే శాఖ టెండర్లు పిలిచింది. అయితే ఈ టెండర్లలో పాల్గొనేందుకు ప్రైవేటు కంపెనీలు ముందుకు రాలేదు. 45 ఏళ్ల పాటు లీజుకు కుదరదని, 99 ఏళ్ల పాటు లీజుకు అయితే టెండర్లలో పాల్గొంటామని ప్రీ బిడ్డింగ్ సమావేశంలో స్పష్టం చేశాయి. ఇదే విషయాన్ని విజయవాడ డివిజన్ రైల్వే ఉన్నతాధికారులు రైల్వే బోర్డుకు నివేదిక పంపించారు. రాష్ట్రంలోని ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు కంపెనీలు 33 ఏళ్ల పాటు లీజుకు అంగీకరించి బీవోటీ విధానంలో బస్టాండ్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే స్థలాల అభివృద్ధి కోసం 99 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని కోరడం సమంజసం కాదని రైల్వే ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై రైల్వే బోర్డు ఏ విధంగా స్పందిస్తుందో చూడాల్సిందే. మరోవైపు చారిత్రాత్మక స్టేషన్‌గా, ఉత్తర, దక్షిణ భారతావనులను కలిపే జంక్షన్‌గా ఉన్న విజయవాడ రైల్వే స్టేషన్‌ను ప్రైవేటుకు అప్పగించడాన్ని రైల్వే యూనియన్ నేతలు వ్యతిరేకిస్తున్నారు.

1888 విజయవాడ రైల్వే స్టేషన్ నిర్మాణం జరిగిన సంవత్సరం

250 విజయవాడ మీదుగా రోజు రాకపోకలు సాగించే రైళ్లు

రూ. **70** లక్షలు రోజుకు ఆదాయం | లక్ష (సుమారు) రోజుకు ప్రయాణికుల ట్రాఫిక్

భవనాల నిర్మాణ స్థలం: **3** ఎకరాలు

7.87 ఎకరాలు విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద రిజర్వ్ స్థలం | **8.81** ఎకరాలు ఫ్లాట్ ఫాంలు విస్తరించిన స్థలం

సర్కులేటింగ్ ఏరియా: **1.90** ఎకరాలు

ప్రైవేటుకు అప్పగించేందుకు రైల్వేశాఖ నిర్ణయించిన వ్యయం: రూ. **195** కోట్లు

ఢిల్లీ నుంచి తిరుపతికి స్పైస్‌జెట్ సర్వీసులు

ఈ నెల 20 నుంచి ప్రారంభం

సాక్షి, న్యూఢిల్లీ: దేశీయ విమానయాన దిగ్గజం స్పైస్‌జెట్ ఢిల్లీ నుంచి తిరుపతికి ప్రతిరోజు విమానాలు నడపనుంది. ఫిబ్రవరి 20 నుంచి ఈ విమాన సేవ ప్రారంభమవుతుంది.స్పైస్‌జెట్ సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ విమానసేవ కోసం టికెట్ల బుకింగ్‌ను ఇప్పటికే ప్రారంభించింది. చార్జీలు రూ:3738 నుంచి మొదలవుతాయని ట్విటర్‌లో తెలిపింది.

రాజమహేంద్రవరం-బెంగళూరు రాత్రి సర్వీసు ప్రారంభం

మధురపూడి (రాజానగరం): స్పైస్‌జెట్ విమానయాన సంస్థ రాజమహేంద్రవరం నుంచి బెంగళూరుకు రాత్రి విమాన సర్వీసులను ప్రారంభించింది. ఈ విమానం బెంగళూర్ నుంచి గురువారం రాత్రి 8.30 గంటలకు చేరింది. తిరిగి బెంగళూర్‌కు రాత్రి 8.50 గంటలకు బయలుదేరింది. దీంతో రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి వివిధ నగరాలకు నడిచే విమాన సర్వీసుల సంఖ్య 10కి చేరింది.

నేడు హైదరాబాద్‌లో జేఎఫ్‌సీ సమావేశం

సాక్షి, అమరావతి: హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో శుక్ర, శనివారాల్లో జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ సమావేశాలు జరుగుతాయని జనసేన ఉపాధ్యక్షుడు బి.మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, కొణతాల రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు (కాంగ్రెస్), పీసీసీ కార్యదర్శి జంగా గౌతమ్, మాజీ ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ నాగేశ్వరరావు, ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు తదితరులు ఈ సమావేశానికి హాజరవుతారని వెల్లడించారు. అంతకుముందు జేఎఫ్‌సీ సమావేశాలకు మద్దతు ఇవ్వాలని కోరుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గురువారం పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డికి ఫోన్ చేశారు.

భాగస్వామ్య సదస్సుపై సీఎం సమీక్ష

కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

సాక్షి, అమరావతి: రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా సత్వరం అనుమతులు, మౌలిక వసతులు కల్పిస్తున్న తీరును రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి తెలియచేసి విశాఖ భాగస్వామ్య సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. కియా కార్ల నుంచి ఫాక్స్‌కాన్ సెల్‌ఫోన్ల వరకూ రాష్ట్రంలో తయారవుతున్న వివిధ ఉత్పత్తులను సదస్సులో ప్రదర్శించాలన్నారు. ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సుపై ముఖ్యమంత్రి గురువారం సమీక్షించారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సదస్సును ప్రారంభిస్తారని చెప్పారు. పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని చెప్పారు. బంగ్లాదేశ్, కెనడా, జపాన్, జోర్డాన్, మయన్మార్, మారిషస్, మొరాకో, సింగపూర్, శ్రీలంక, టాంజానియా, థాయ్‌ల్యాండ్, యూఏఈ, జాంబియాకు చెందిన మంత్రులు వస్తున్నారని, 36 దేశాలకు చెందిన పారిశ్రామిక, వాణిజ్య ప్రముఖులు సదస్సుకు హాజరవుతారని వివరించారు. తొలిరోజు ఉదయం 10 గంటల నుంచి భాగస్వామ్య సదస్సులో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. చివరి రోజు కార్యక్రమానికి సింగపూర్ మంత్రి ఈశ్వరన్, యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు బారోనెస్ సందీప్ వర్మ అతిథులుగా రానున్నారని, అదే రోజు స్పెషల్ ప్లీనరీలో ప్యానలిస్టుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు పండిట్ రవిశంకర్ పాల్గొంటారన్నారు.

150 ఎకరాల్లో టెక్స్‌టైల్స్ గార్మెంట్ యూనిట్

చిత్తూరు జిల్లాలో 150 ఎకరాల్లో రూ.400 కోట్లతో నెలకొల్పే అరవింద్ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంటింగ్ యూనిట్‌కు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు సమావేశంలో ఆమోదం తెలిపారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో బోర్డు సమావేశం జరిగింది. టెక్స్‌టైల్ యూనిట్ ద్వారా ఏటా రూ.1000 కోట్ల దాకా ఎగుమతులు చేసే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. అనంతపురం జిల్లా పాలసముద్రంలో రెండెకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్లతో సాయిదివ్య అపెరల్స్ అండ్ ఫ్యాషన్స్ పరిశ్రమకు ఆమోదం తెలిపారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో నాచు కార్పొరేషన్ స్టీల్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ డీఐ పైప్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు అంగీకారం తెలిపారు.

పవన్ మనోడే

- జాగ్రత్తగా మాట్లాడండి... విమర్శలు చేయొద్దు
- టీడీపీ నేతల సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టండి
- రాష్ట్రానికిచ్చిన నిధులపై కేంద్రం శ్వేతపత్రం విడుదల చేయాలి



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: జనసేన నేత పవన్ కల్యాణ్ చేస్తున్న పోరాటంలో అర్థం ఉందని, అతడి విషయంలో జాగ్రత్తగా మాట్లాడాలని సీఎం చంద్రబాబు మంత్రులు, టీడీపీ నాయకులకు సూచించారు. పవన్ మనోడేనని, అతడు ఏర్పాటు చేసిన జేఏసీ వల్ల టీడీపీకి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. చంద్రబాబు గురువారం ఉండవల్లిలోని తన నివాసం వద్ద గ్రీవెన్స్ భవనంలో మంత్రులు, తెలుగుదేశం నేతలతో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. జిల్లాల నుంచి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం పలు అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు.

పవన్ డిమాండ్లను పట్టించుకోవద్దు

పవన్ కల్యాణ్ అతడికి తోచిన విధంగా జేఏసీ పెట్టి ముందుకు వెళుతున్నాడని, మనకు వ్యతిరేకంగా లేడని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్లు చేసినా పట్టించుకోవాల్సిన అవసరం లేదని సీఎం చెప్పినట్లు తెలిసింది. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని పవన్ అంటున్నాడని, దానిపై సున్నితంగా స్పందించాలని, ఎవరూ అతిగా పోవొద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం తరపున లెక్కలిచ్చేందుకు అభ్యంతరం లేదని, కానీ శ్వేతపత్రం బీజేపీ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. పవన్ తన జేఏసీలో కాంగ్రెస్ పార్టీని కలుపుకోవడం వల్ల ఉపయోగం లేదని బాబు చెప్పారు. రాష్ట్రాన్ని విభజించిన పార్టీని కలుపుకుని ఏం సాధిస్తారని ప్రశ్నించారు.

నా పేరుతో భూములు, ఇళ్లు లేవు

తాను కేంద్ర ప్రభుత్వానికి భయపడడం లేదని, కేసులంటే తనకు లెక్కలేదని చంద్రబాబు చెప్పారు. తాను దేశంలోనే అత్యంత సంపన్నుడైన ముఖ్యమంత్రిననే వార్తలపై ఆయన స్పందిస్తూ... తన పేరుతో ఎలాంటి భూములు, ఇళ్లు లేవని పేర్కొన్నారు. మొదటిసారి సీఎం అయిన వెంటనే తన షేర్లన్నీ కుటుంబ సభ్యులకు ఇచ్చేశానని చెప్పారు. కేసులను ప్రస్తావిస్తూ ప్రతిపక్షాలు తనపై విమర్శలు చేస్తున్నా పార్టీ నేతలు తిప్పికొట్టలేకపోతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై గట్టిగా జవాబివ్వాలన్నారు.

అందుకే ప్యాకేజీకి ఒప్పుకున్నాం

త్వరలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని, రెండు, మూడు రోజుల్లో దీనిపై చర్చిద్దామని సీఎం చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాల మాదిరిగానే ఏపీకి కేటాయింపులు జరిపారని, దీనిపై పోరాటం కొనసాగించాల్సి ఉందని తెలిపారు. అదే సమయంలో కేంద్రంతో గొడవలు పెట్టుకునే ఆలోచన తనకు లేదన్నారు. ప్రత్యేక హోదా కంటే ఎక్కువ ప్రయోజనాలు ప్యాకేజీ రూపంలో ఇస్తామంటేనే ఒప్పుకున్నామనే విషయాన్ని ప్రజలకు చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీల రాజీనామాల అంశంపై గట్టిగా స్పందించాలని, ఎదురుదాడి చేయాలని టీడీపీ నేతలకు చంద్రబాబు సూచించారు. వైఎస్సార్‌సీపీ బీజేపీకి దగ్గరవుతోందని అన్నారు. ఎన్నికల తర్వాత బీజేపీకి మద్దతిచ్చేలా వారి మధ్య ఒప్పందం కుదిరినట్టు ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని సమావేశంలో చంద్రబాబు చదివి వినిపించారు. కాపు రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రాన్ని ఒప్పిస్తామన్నారు.

గ్రామీణుల తలసరి ఆదాయం పెరిగేలా బడ్జెట్

అధికారులకు ఆర్థిక మంత్రి యనమల సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ ప్రజల తలసరి ఆదాయం పెరిగేలా బడ్జెట్ రూపొందించాలని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అధికారులకు సూచించారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో గురువారం వివిధ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలని, అందుకు వ్యవసాయం అనుబంధ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పరిశ్రమల స్థాపనతో ఉపాధి అవకాశాలు మెరుగుపడి గ్రామీణ ప్రజల ఆదాయం పెరగాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి కేంద్రం నుంచి వచ్చే నిధులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వ వాటాకు అన్ని శాఖలు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వ్యవసాయానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. మార్కెటింగ్, పశుసంవర్ధక, సహకార శాఖల మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు రూ.500 కోట్లతో ఒక నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పట్టణ గృహ నిర్మాణం పథకం, అమరావతి మెట్రో రైలు ప్రాజెక్ట్ వంటి 41 ప్రాజెక్టులు ఉన్నందున తమ శాఖకు అదనపు నిధులు కేటాయించాలన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.